'నా అక్కలూ.. చెల్లెళ్లు..తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 18 | సంచిక: 249

SUNDAY Special | ఆదివారం 30-11-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

నేడు తొలి వన్డే

భారత్, దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు రాంచీలో తొలి మ్యాచ్ జరుగుతుంది. భారత జట్టుకు రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా కొంత విరామం తర్వాత రోహిత్, కోహ్లి సొంతగడ్డపై వన్డే ఆడుతున్నారు -12లో

భారత్ ఘన విజయం

జూనియర్ వరల్డ్ కప్ హాకీ టోర్నీలో ఒమన్‌పై భారత్ 17–0 గోల్స్ తేడాతో భారీ విజయాన్ని అందుకుంది. దిల్ రాజ్ సింగ్ ఒక్కడే నాలుగు గోల్స్ కొట్టాడు. తర్వాతి మ్యాచ్‌లో మంగళవారం స్విట్జర్లాండ్‌తో భారత్ తలపడుతుంది. -12లో

ఎయిర్‌బస్ 'ఏ320'పై సౌరదాడి

ఏ320 మోడల్ విమానంపై సోలార్ రేడియేషన్ దాడితో ఈ విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపింది.

వివరాలు 6లో ▸

ఓ ఇంటి వాడైన అల్బనీస్

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ (62) ఓ ఇంటి వాడయ్యారు. తన చిరకాల భాగస్వామి జోడీ హేడెన్‌ను పెళ్లాడారు.

వివరాలు 6లో ▸

2047 నాటికి సూపర్ పవర్‌గా..

మన దేశం 2047 నాటికి సూపర్ పవర్‌గా మారుతుందని ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ చెప్పారు.

వివరాలు 6లో ▸

6 కులాలకు ఎస్టీ హోదా

అస్సాంలో ఆరు ప్రధాన కులాలకు ఎస్టీ హోదా కల్పించాలంటూ మంత్రుల బృందం నివేదికను అసెంబ్లీకి సమర్పించింది.

వివరాలు 6లో ▸

మైరా.. మైహూనా!

అభివృద్ధి మాటున భూ దోపిడీ.. డొల్ల కంపెనీకి పెద్దపీట

నెలలు నిండని కంపెనీలకు రూ.వందల కోట్ల విలువైన భూములు

- మూలధనం రూ.లక్షల్లో.. ప్రాజెక్టుల పెట్టుబడి రూ.వందల కోట్లలో..
- ఐదు నెలల 'మైరా బే వ్యూ రిసార్ట్స్'కు విశాఖ, మచిలీపట్నంలో భూములు
- విశాఖలో రూ.600-750 కోట్ల విలువైన 15 ఎకరాల భూమి..
- మచిలీపట్నంలో రూ.60-100 కోట్ల విలువైన భూమి 20 ఎకరాలు ధారాదత్తం
- కేవలం 20 రోజుల వ్యవధిలో ఏకంగా 35 ఎకరాలు కేటాయించిన చంద్రబాబు ప్రభుత్వం
- రూ.15 లక్షల మూలధన పెట్టుబడితో వచ్చిన సంస్థ రూ.413.44 కోట్లు పెట్టుబడి పెడుతుందని డీపీఆర్
- తెర వెనుక చక్రం తిప్పిన ప్రభుత్వ పెద్దలు, బినామీలు.. ఆనక మీకింత-మాకింత

2లో

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

TOURISM - Grant of Land and incentives to M/s Maira Bayview Resorts for Development of Maira Bayview Resorts & Convention Centre at Kothavalasa, Visakhapatnam as per the provisions of Andhra Pradesh Tourism Policy 2024 -2029 - Orders - Issued.

YOUTH ADVANCEMENT, TOURISM AND CULTURE (TOURISM) DEPARTMENT

G.O.MS.No. 39 | Dated: 21-10-2025

Read the following:

4. Government, after careful consideration of the recommendations of the State Investment Promotion Board (SIPB) in its meeting held on 8.10.2025 and keeping in view the provisions of Andhra Pradesh Tourism Policy 2024-2029, hereby grant the following incentives to M/s Maira Bay View Resorts for Development of 'Maira Bayview Resorts & Convention Centre' at Kothavalasa, Visakhapatnam:-

a) Allotment of 15.00 acres land in Sy.no.102/2, 103, Kothavalasa (V), Bheemunipatnam (M), Visakhapatnam District, in accordance with the Land Allotment Policy, as the proposed project is a combination of a resort and convention centre.

మైరాకు విశాఖలోని కొత్తవలసలో 15 ఎకరాల భూమిని కేటాయిస్తూ అక్టోబర్ 21న ప్రభుత్వం ఇచ్చిన జీవో



రూ.15 లక్షల మూలధనంతో మే 5న మైరా సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలుపుతున్న ఆర్‌వోసీ

కర్ణాటక వెళ్లి తెచ్చుకున్నా..

"నాకు 3 ఎకరాల పొలం ఉంది. ఏటా రబీలో పప్పు శనగ సాగు చేస్తున్నా. ఈ ఏడాది అదును దాటినా ప్రభుత్వం శనగ విత్తనం అందించలేదు. దీంతో గత్యంతరం లేక కర్ణాటక వెళ్లి క్వింటా రూ.6,400 చొప్పున కొనుగోలు చేశా. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టి శనగ వేశా. స్వయానా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నియోజకవర్గంలోనే ఈ దుస్థితి నెలకొంది.

- వెంకట్ రెడ్డి, వజ్రకరూర్, అనంతపురం జిల్లా

సబ్సిడీ విత్తనానికి మంగళం

గత్యంతరం లేక 70% మంది రైతులు డీలర్ల నుంచి కొనుగోలు

నాణ్యమైన విత్తనాలు దొరక్క నానా అగచాట్లు

- శనగ విత్తనంపై సబ్సిడీ 40 నుంచి 25 శాతానికి కుదింపు
- కేటాయింపులు తగ్గిస్తూ పంపిణీ నుంచి తప్పించుకునే ఎత్తుగడలో బాబు సర్కారు
- సబ్సిడీ విత్తన సరఫరాలో కోతలపై రైతుల మండిపాటు.. ఇప్పటికే అటకెక్కిన నాన్ సబ్సిడీ విత్తన సరఫరా
- వైఎస్ జగన్ హయాంలో ఆర్బీకేల ద్వారా సర్టిఫైడ్ విత్తనాల సరఫరాతో రైతన్నలకు నిశ్చింత

2లో

న్యూస్‌రీల్

పెళ్లి రోజే.. చివరి రోజు

పెళ్లి రోజును మంత్రాలయంలో జరుపుకుందామని కుటుంబసభ్యులతో కలిసి కారులో బయలుదేరిన భార్యాభర్తలు.. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వారితో పాటు మరో ముగ్గురు కుటుంబ సభ్యులు కూడా మరణించారు.

5లో

శ్రీలంకలో దిత్వా విధ్వంసం

శ్రీలంకలో దిత్వా తుపాను తీవ్ర విధ్వంసం సృష్టించింది. తుపాను సంబంధిత ఘటనల్లో దాదాపు 153 మంది మృతి చెందగా.. 191 మంది గల్లంతయ్యారు.

6లో

'దిత్వా' వాన గండం

అన్నదాతల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న తుపాను

- మొంథా తుపాను పీడకల మరవక ముందే..
- మరో ముప్పుతో రైతుల్లో ఆందోళన
- 30–40 శాతం దాటని కోతలు.. నూర్పిళ్లలో మరో 15 శాతం మేర
- 10 శాతం కూడా దాటని కొనుగోళ్లు. మద్దతు ధర దక్కక రైతుల అగచాట్లు
- రాయలసీమలో రబీ పంటలపై తుపాను ప్రభావం..
- ఇంకా అందని మొంథా తుపాను సాయం
- సీజన్ మొత్తం రైతులకు కంటిమీద కునుకు కరువు
- 18 నెలల్లో 16 సార్లు వైపరీత్యాలను ఎదుర్కొన్న రైతులు
- రూ.వెయ్యి కోట్లకుపైగా పెట్టుబడి రాయితీ కోసం ఎదురుచూపులు

3లో

వణికిస్తున్న తుపాను

- 3 రోజుల పాటు రాయలసీమ, నెల్లూరుకు భారీ వర్ష సూచన..
- తిరుపతి, నెల్లూరులో అతి భారీ వర్షాలు
- వాతావరణ శాఖ వెల్లడి

3లో

గ్రానైట్ పరిశ్రమల తిరుగుబాటు

- రాయల్టీ, జీఎస్టీ బాదుడుతో చంద్రబాబు సర్కారుపై నిరసన గళం
- బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వేమవరం జంక్షన్ వద్ద ఆందోళన
- అధిక పన్నులతో వ్యాపారాన్ని కుదేలు చేసిందంటూ మండిపాటు
- చంద్రబాబు ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందంటూ ఫైర్
- పన్నుల భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్.. మంత్రి గొట్టిపాటి నియోజకవర్గంలోని పరిశ్రమల యజమానుల ఆందోళన
- హద్దు మీరితే చర్యలు: గ్రానైట్ సంఘ ప్రతినిధులకు డీఎస్పీ హెచ్చరిక

10లో

ఏఎంఆర్ చెక్‌పోస్టును ధ్వంసం చేస్తున్న గ్రానైట్ కార్మికులు, యజమానులు

తీవ్రంగా గాయపడిన హెడ్‌కానిస్టేబుల్ ఆదినారాయణ

పోలీసులపై దాడికి తెగబడిన నిందితులు

- పోతిరెడ్డిపాళెంలో పెంచలయ్య హత్య కేసు నిందితులను చుట్టుముట్టిన పోలీసులు
- కత్తులతో దాడి చేసిన ఓ నిందితుడు.. హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు
- ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు.. నిందితుడికి గాయాలు
- మిగిలిన వారు పరారీ

10లో

విజయానంద్

సాయిప్రసాద్

మరో 3 నెలలు సీఎస్‌గా విజయానంద్

- పదవీ కాలం పొడిగించాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం
- ఆ తదుపరి సీఎస్‌గా జి.సాయిప్రసాద్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

2లో

హైదరాబాద్‌లో ఎకరం రూ.151 కోట్లకు అమ్మితే నేను వైజాగ్‌లో 99 పైసలకే ఇస్తున్నాను. ఇప్పుడు చెప్పండి తమ్ముళ్లూ మనది ప్రజాప్రభుత్వమా? కాదా?

గంజాయి డాన్.. టీడీపీ మహిళ

- నెల్లూరు రూరల్ అడ్డాగా నెలకు రూ.కోట్లలో అక్రమ వ్యాపారం.. స్థానిక ప్రజాప్రతినిధికి రూ.50 లక్షల చొప్పున ముడుపులు?
- టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అండతో ఎదిగిన అరవ కామాక్షి.. గతంలో జీవిత ఖైదీ శ్రీకాంత్ పెరోల్‌లోనూ ఎమ్మెల్యే పాత్ర
- సీపీఎం నేత పెంచలయ్య హత్యలో నిందితులు టీడీపీ కార్యకర్తలే.. ఎమ్మెల్యే అండ చూసుకునే.. వెంటాడి మరీ దారుణ హత్య

10లో

టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డితో కామాక్షి (ఫైల్)

నామక'రణం'..

కలిసి ఉండటానికి కారణాలు అవసరం లేదు కానీ, విడిపోవడానికి చాలా వెతుక్కోవచ్చు. తమ పిల్లాడికి పేరు పెట్టే విషయంలో ఏకాభిప్రాయం లేక చైనాలో ఓ జంట విడాకుల కోసం కోర్టుకెక్కింది. షాంఘైలోని పుడాంగ్ న్యూ ఏరియాలో ఓ జంటకు 2023లో వివాహమైంది. మరుసటి ఏడాది బాబుకు జన్మనిచ్చారు. అయితే, ఆ పిల్లాడి నామకరణం పెద్ద రణంగా మారింది. నేను చెప్పిన పేరే పెట్టాలని ఇరువురూ పట్టుబట్టారు. చివరకు కలిసి ఉండలేం అని కోర్టుకెక్కారు. కేసు పూర్వాపరాలు చూసిన న్యాయమూర్తి ఆశ్చర్యపోయారు. బాబుకు ఏడాది వయసు దాటినా ఇంకా జనన ధ్రువీకరణ పత్రం లేకపోవడం, పేరు పెట్టకపోవడం వల్ల టీకాలు వేయడానికీ కుదరకపోవడం మైనర్ హక్కుల ఉలంఘనే అని హెచ్చరించారు. భావోద్వేగ సంఘర్షణలలో పిల్లలను బేరసారాలుగా ఉపయోగించకూడదని మందలించారు. నిర్దిష్ట కాలవ్యవధిలోగా పేరు పెట్టే విషయంలో ఏకాభిప్రాయానికి రావాల్సిందేనని చెప్పారు. ఈ కేసు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. పేరులో ఏముంది అని అంటారు.. కానీ ఎంత ఉందో చూశారా?

పేరు మారిస్తే.. ఫేట్ మారుద్ది!

ఇది కూడా పేరు తెచ్చిన ప్రాబ్లమే. అక్కడ పిల్లాడి పేరు అయితే, ఇక్కడ భార్య పేరు.. అంతే తేడా. ఓ వ్యక్తి తన భార్య పేరును ఫోన్ కాంటాక్ట్ లిస్ట్‌లో 'చబ్బీ'అని అర్థం వచ్చేలా సేవ్ చేసినందుకు ఆమె విడాకులు తీసుకుంది. తుర్కియేలోని ఉసక్ నగరానికి చెందిన భార్యాభర్తల మధ్య ఈ పేరు పంచాయితీ వచ్చింది. భర్త ఆమె పేరును తన ఫోన్‌లో 'టొంబెక్'అని సేవ్ చేసుకున్నాడు. దానికి వారి భాషలో చబ్బీ అని అర్థం. ఇది చూసిన ఆమె భర్తపై తీవ్రంగా మండిపడి విడాకుల కోసం కోర్టుకెళ్లింది. తన పేరు అలా పెట్టుకోవడం తీవ్ర అవమానకరమని, ఇక అతడితో కలిసి ఉండే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. వారికి విడాకులు ఇవ్వడంతోపాటు ఆమె మానసిక క్షోభకు పరిహారం చెల్లించాలని అతడిని ఆదేశిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొందరు ఈ నిర్ణయాన్ని సమర్థించగా.. మరికొందరు చబ్బీ అని ముద్దుగా పెట్టుకున్నాడేమో అని జాలిపడ్డారు. చూశారా.. పేరులో ఎంతుందో? భర్తలూ.. జర భద్రం మరి..!

పెట్స్ తెచ్చిన పెటాకులు..

అక్కడ పిల్లాడి పేరు విషయంలో ఏకాభిప్రాయం లేక ఆ జంట విడాకులకు వెళ్లగా.. ఇక్కడ తమ పెంపుడు జంతువుల మధ్య సయోధ్య లేకపోవడం వల్ల మరో జంట విడిపోవాలని నిర్ణయించుకుంది. భోపాల్‌కు చెందిన ఓ యువతీయువకుడు జంతు ప్రేమికులు. అదే వారిద్దరినీ తొలుత స్నేహితులుగా.. ఆపై భార్యాభర్తలుగా మారేలా చేసింది. చివరకు అదే వారిద్దరూ విడిపోవాలనుకోవడానికీ కారణమైంది. భర్త దగ్గర కుక్క ఉంది.. భార్య పిల్లిని పెంచుకుంటోంది. ఆ రెండింటినీ కలపడానికి వారు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో తాము కూడా విడిపోవాలని నిర్ణయించుకున్నారు. కుక్క తన పిల్లిపై చాలాసార్లు దాడి చేసిందని ఆమె ఆరోపించగా.. ఆ పిల్లి ఇంట్లో అక్వేరియంపై పదేపదే తిరగడం చాలా ఆందోళనకు గురిచేసిందని అతడు పేర్కొన్నాడు. కుటుంబ పెద్దలు రంగంలోకి దిగినా.. వైద్యులు కౌన్సెలింగ్ చేసినా ఇరువురి తీరూ మారలేదు. ముందే అనుకున్నాం కదా.. విడిపోవడానికి కారణాలు కోకొల్లలు అని..!

పడుకునే ఉండు.. ప్రైజ్ మనీ పట్టు..

పనేమీ చేయకుండా రోజు మొత్తం అలా పడుకునే ఉండు అంటే.. వావ్, ఇలాంటి ఫెసిలిటీ ఉండాలే కానీ చెలరేగిపోతా అంటారా? ఇటీవల చైనాలో ఇలాంటి పోటీయే పెట్టారు. పరుపుపై ఎవరు ఎక్కువ సేపు పడుకుంటారో వారే విజేత. పరుపు మీద అటూ ఇటూ దొర్లొచ్చు.. పుస్తకాలు చదవొచ్చు.. సెల్‌ఫోన్ చూడొచ్చు.. ఏదైనా చేయొచ్చు.. కానీ పైకి లేవకూడదు. చివరకు ప్రకృతి పిలిచినా సరే.. అలా ఉండాల్సిందే. మొత్తం 240 మంది పోటీలో పాల్గొనగా.. తొలి 24 గంటల్లో 186 మంది ఎలిమినేట్ అయ్యారు. 33 గంటల 9 నిమిషాల తర్వాత ముగ్గురే మిగిలారు. తర్వాత రెండు నిమిషాలకే ఒకరు.. 20 నిమిషాల తర్వాత మరొకరు మా వల్ల కాదు అని లేచి వెళ్లిపోగా.. 33 గంటల 35 నిమిషాల పాటు అలా పడుకున్న వ్యక్తి విజేతగా నిలిచాడు. ఈయన కాస్త ముందు చూపున్న వ్యక్తి. అందుకే పరుపుపైకి వెళ్లే ముందే డైపర్ వేసుకున్నాడు. అంతే.. 3వేల యువాన్ల ప్రైజ్ మనీ పట్టేశాడు. అనుకుంటాం కానీ, రెస్ట్ తీసుకోవడం కూడా ఓ ఆర్టే..!

- సాక్షి సెంట్రల్ డెస్క్

క్లుప్తంగా...

మరో మూడు నెలలు సీఎస్‌గా విజయానంద్

- పదవీకాలం పొడిగించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కేంద్రం ఆమోదం
- ఆ తదుపరి సీఎస్‌గా జి.సాయిప్రసాద్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.విజయానంద్ మరో మూడు నెలలు కొనసాగనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని కేంద్రం ఆమోదించింది. వాస్తవానికి విజయానంద్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ సీఎం చంద్రబాబు మరో మూడు నెలలపాటు ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు పదవీకాలాన్ని పొడిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయానంద్ ఫిబ్రవరి 28న పదవీ విరమణ చేయనున్నారని పేర్కొన్నారు.

తదుపరి సీఎస్‌గా సాయిప్రసాద్

అలాగే ప్రస్తుతం జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌గా పని చేస్తున్న జి.సాయిప్రసాద్‌ను మార్చి 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ముఖ్యమంత్రి నియమించినట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. సాయిప్రసాద్ మే నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. సాయిప్రసాద్ పదవీకాలాన్ని కూడా మరో 3 నెలలు పొడిగించాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి కోరే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రకటనలు, పర్యటనలు కాదు.. ధాన్యం కొనండి

ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మద్దతు ధరకు కొనాలని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. వరి సాగయ్యే ప్రాంతాల్లో కోత మిషన్లు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొంథా తుపాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. తేమ శాతం 22 వరకు ఉన్నా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తూ.. మంత్రులు పర్యటనలు చేస్తూ రైతులను మాయ మాటలతో మురిపిస్తున్నారని మండిపడ్డారు. పర్యటనలు కాదు... పంట కొనాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో పంట కొనుగోలుకు రైతు సేవా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బంది ముందుకు రావడం లేదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంచులు కూడా లేవన్నారు. రవాణా, కాటా, కూలీ ఖర్చులు రైతులే భరించాలని చెబుతున్నారని, గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు.

చంద్రబాబూ.. నేల విడిచి సాము చేయకు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య



సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు నేల విడిచి సాము చేయటం మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య హితవుపలికారు. రాజధాని విషయంలో చంద్రబాబు వైఖరిని తప్పుబడుతూ ఈశ్వరయ్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రూ.లక్ష కోట్లు అప్పు చేసి నిర్మిస్తే అమరావతి అప్పుల రాజధానే అవుతుందని, దానిని ప్రజా రాజధానిగా చెప్పుకోలేమని పేర్కొన్నారు.

మైరా.. మై హూనా!

ఐదు నెలల 'మైరా బే వ్యూ రిసార్ట్స్'కు విశాఖ, మచిలీపట్నంలో భూములు

సాక్షి, అమరావతి: పర్యాటకాభివృద్ధి మాటున చంద్రబాబు సర్కారు అప్పనంగా భూ దోపిడీకి పాల్పడుతోంది. అత్యంత ఖరీదైన ప్రాంతాలు, పారిశ్రామికవాడలు, పోర్టులకు సమీపంలోని భూములను కొల్లగొట్టేందుకు భారీ కుట్ర నెరపుతోంది. డొల్ల కంపెనీలను తెరపైకి తీసుకొచ్చి పెట్టుబడుల పేరుతో తీర ప్రాంతాల్లో ఖరీదైన భూములను దోచేస్తోంది. కేవలం ఆరు నెలల క్రితం పెట్టిన ఓ కంపెనీకి రెండు వేర్వేరు ప్రాంతాల్లో 35 ఎకరాల భూములు కేటాయించింది. దీని విలువ ఏకంగా రూ.660 కోట్ల నుంచి రూ.850 కోట్లుగా ఉంది. ఆతిథ్య రంగంలో సుదీర్ఘ అనుభవం కలిగిన సంస్థలకు సైతం వీలు పడని పెట్టుబడులను.. డొల్ల కంపెనీలను అడ్డుపెట్టుకుని డీపీఆర్‌లు చూపిస్తూ భూ కుంభకోణానికి తెరతీస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక పెట్టుబడులను ప్రోత్సహించే పేరుతో కనీస మూలధన పెట్టుబడి లేని సంస్థలు రూ.వందల కోట్ల పెట్టుబడి పెడతామంటూ ముందుకొస్తే వాటికి ఖరీదైన భూములు అప్పగించేస్తోంది. 'మైరా బే వ్యూ రిసార్ట్స్ ప్రైవేటు లిమిటెడ్' అనే సంస్థ 2025 మే 5న రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్(ఆర్‌వోసీ)లో నమోదైంది. ఆ కంపెనీ చిరునామా విశాఖలోనే ఉంది. అయితే, సదరు కంపెనీ మూలధన పెట్టుబడిగా రూ.15 లక్షలు మాత్రమే చూపించింది. ఈ కంపెనీ నమోదైన ఐదు నెలల్లోనే రూ.255.91 కోట్లతో విశాఖలో రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామంటూ ముందుకొచ్చింది. ఆ వెంటనే ప్రభుత్వం విశాఖలోని కొత్తవలసలో 15 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఈ ఏడాది అక్టోబర్ 21న ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి విశాఖ తీర ప్రాంతంలో ఎకరా భూమి సగటు విలువ రూ.40కోట్ల నుంచి రూ.50కోట్లకు పైగా పలుకుతోంది. ఈ లెక్కన సుమారు రూ.600కోట్ల నుంచి రూ.750 కోట్లకుపైగా విలువైన భూమిని ఇచ్చేసింది. అంతటితో ఆగకుండా అదే కంపెనీ మచిలీపట్నంలో రూ.157.53 కోట్లతో అమ్యూజ్‌మెంట్ పార్కుతో కూడిన రిసార్టు కడతామంటే.. వెనువెంటనే ఈ నెల 13న తాళ్లపాలెంలో రూ.60 కోట్ల నుంచి రూ.100 కోట్ల విలువైన మరో 20 ఎకరాలను కేటాయించింది. ఇక్కడ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బృహత్తరంగా తలపెట్టిన పోర్టు నిర్మాణంతో మచిలీపట్నం రూపురేఖలు మారుతున్నాయి. ప్రస్తుతం అక్కడ భూమి మార్కెట్ రేటు ఎకరం రూ.3–5 కోట్లకుపైగా ఉంది. అంటే, రూ.60 కోట్ల నుంచి రూ.100 కోట్లు విలువైన భూములను అప్పనంగా ఈ కంపెనీకి అప్పగించేస్తోంది. వాస్తవానికి మచిలీపట్నం తీరంలో పోర్టు వచ్చిన తర్వాత భూముల విలువ పెరిగింది. పోర్టు సేవలు పూర్తిగా అందుబాటులోకి వస్తే అక్కడి భూములు అమూల్యంగా మారతాయి. ఇంతటి విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల మాటున చంద్రబాబు సర్కార్ మింగేస్తోంది.

GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

TOURISM - Allotment of Land and grant of incentives to M/s Maira Bayview Resorts for Development of Large Amusement Park cum Resorts at Tallapalem, Machilipatnam, Krishna District as per the provisions of Andhra Pradesh Tourism Policy 2024 -2029 - Orders - Issued.

YOUTH ADVANCEMENT, TOURISM AND CULTURE (TOURISM) DEPARTMENT

G.O.MS.No. 43 — Dated: 13-11-2025

Read the following:

1. G.O.Ms.No.17, YAT&C (T) Department, Dt:10.12.2024.
2. G.O.Ms.No.1, YAT&C(T) Department, Dt:11.03.2025.
3. G.O.Ms.No.26, YAT&C(T) Dept., Dt:25.08.2025.
4. Proposal of M/s Maira Bayview Resorts.
5. Minutes of SIPB meeting held on Dt:7.11.2025 received from I&C (P&I) Dept., Lr.No.2624402/2024/P&I, Dt:08.11.2025.

4. Government, after careful consideration of the recommendations of the State Investment Promotion Board (SIPB) in its meeting held on 7.11.2025 and keeping in view the provisions of Andhra Pradesh Tourism Policy 2024-2029, hereby grant the following incentives to M/s Maira Bayview Resorts for Development of Large Amusement Park cum Resorts at Tallapalem, Machilipatnam, Krishna District:-

a) To allot the 20.00 acres land parcel in Sy.No.556/2 of Tallapalem Village, Machilipatnam Mandal, Krishna District for development of Large Amusement Park cum Resort with MAIRA Brand, subject to the preparation of a layout plan clearly demarcating the proposed land parcel and ensuring appropriate beach frontage access to the remaining land parcel.

b) Exact alignment of the land parcel will be decided based on the survey done by APTA in consultation with the district administration.

మచిలీపట్నంలోని తాళ్లపాలెంలో మైరా రిసార్ట్స్‌కు భూమి కేటాయిస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన జీవో

రూ.15 లక్షల సంస్థ రూ.413.44 కోట్ల పెట్టుబడి!

'మైరా బే వ్యూ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' నమోదు సమయంలో మూల ధన పెట్టుబడి కేవలం రూ.15 లక్షలు మాత్రమే. అలాంటి సంస్థ ఆరు నెలలు తిరగకుండా ఒకచోట రూ.255.91 కోట్లు, మరొకచోట రూ.157.53 కోట్లు కలిపి రూ.413.44 కోట్లు పెట్టుబడి పెట్టే స్థాయికి వచ్చేసింది. దీన్నిబట్టి ఇక్కడ ఈ సంస్థను కేవలం భూములు కాజేసేందుకు మాత్రమే తెరపైకి తెచ్చినట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఇలాంటి కంపెనీని అడ్డుపెట్టుకుని రూ.660 కోట్ల నుంచి రూ.850 కోట్ల విలువైన భూములను కారుచౌకగా లీజు పేరుతో ఏకంగా 99 ఏళ్లపాటు తమ చేతుల్లో పెట్టుకునేందుకు ప్రభుత్వ పెద్దలు పన్నిన పన్నాగంగా అర్థమవుతోంది. వాస్తవానికి ఈ కంపెనీ ఐదుగురు డైరెక్టర్లతో ఏర్పాటైంది. ఇందులో ఒక వ్యక్తి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ కంపెనీతో కలిసి ఆతిథ్య రంగంలో పని చేస్తున్నారు. అయితే, సదరు కంపెనీ రెండేళ్ల కిందట నమోదవ్వగా ఇప్పటి వరకు 'మినిస్టర్ ఆఫ్ కార్పొరేట్ ఎఫైర్స్'(ఎంసీఏ)కు తమ ఆర్థిక లావాదేవీల వివరాలను సమర్పించలేదు. పైగా ప్రతి కార్పొరేట్ సంస్థ/ప్రైవేటు సంస్థకు క్రెడిట్ రేటింగ్ చాలా కీలకం. ఆ క్రెడిట్ రేటింగ్‌పై ఆధారపడే సంస్థ పనితీరును అంచనా వేస్తారు. అలాంటిది ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహిస్తున్న ఫర్మ్ ఒక సంస్థ నుంచి క్రెడిట్ రేటింగ్‌ను విత్‌డ్రా చేసుకుని మరో సంస్థ ద్వారా తీసుకోవడం సందేహాలను కలిగిస్తోంది. ఆ క్రెడిట్ రేటింగ్ ఇచ్చిన సంస్థ కూడా ఉత్తమమైన క్రెడిట్ రేటింగ్ ఇచ్చే సంస్థల జాబితాలో లేకపోవడం గమనార్హం. పైగా ఈ ఫర్మ్‌కు రూ.50కోట్లకుపైగా బ్యాంకు రుణాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఇలాంటి సంస్థల్లోని వ్యక్తులు కొత్తగా కంపెనీలు పెడితే పాలకులు చెప్పారని పర్యాటకశాఖ రూ.వందల కోట్ల విలువైన భూములను కళ్లు మూసుకుని అప్పగించేస్తోంది.

డొల్ల ప్రాజెక్టులకు భూ సంతర్పణ

చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా విలువైన భూములపై కన్నేసింది. పరిశ్రమలు, పర్యాటకం పేరుతో నచ్చినోళ్లకు కావాల్సినంత కట్టబెట్టేస్తోంది. విశాఖలో భూముల కేటాయింపుల వెనుక ఓ కీలక నేత చకచకా పావులు కదిపినట్లు సమాచారం. మచిలీపట్నంలో ఎప్పటి నుంచో భూములపై మనసు పడ్డ ఓ మంత్రి ఇదే అదునుగా ఈ సంస్థను అడ్డుపెట్టుకుని భూములు పొందేందుకు ప్రణాళిక వేసినట్టు తెలిసింది. మొత్తానికి రాష్ట్రంలో ఎక్కడ ఏ సంస్థకు ప్రభుత్వ భూములు కేటాయించినా, దాని వెనుక ప్రభుత్వ పెద్దలు, బినామీలు ఉండటం సర్వసాధారణమైంది. ముఖ్యంగా పర్యాటక శాఖలోని ఓ కన్సల్‌టెంట్ సంస్థ ఇలాంటి డొల్ల ప్రాజెక్టులను తీసుకురావడంలో కీలకంగా వ్యవహరిస్తోంది. సదరు సంస్థ ప్రభుత్వ పెద్దల సూచన మేరకు.. ప్రభుత్వం భూములు కేటాయించేలా కంపెనీలకు లేని అర్హతలతో డీపీఆర్ రూపొందించి భారీగా ముడుపులు మూట కట్టుకుంటున్నట్టు బహిరంగ విమర్శలున్నాయి. మొత్తంగా భూములు పొందిన సంస్థ.. ప్రభుత్వ పెద్దలు.. మీకింత–మాకింత అని పంచుకోవడమేనని పర్యాటక శాఖలో అధికారవర్గాల మధ్య చర్చ నడుస్తోంది.

సబ్సిడీ విత్తనానికి మంగళం

కేటాయింపులు తగ్గిస్తూ పంపిణీ నుంచి తప్పించుకునే ఎత్తుగడలో బాబు సర్కారు

సాక్షి, అమరావతి: అదునులో పెట్టుబడి సాయం అందించలేదు.. అన్నదాతా సుఖీభవ పేరుతో వంచన.. ఉచిత పంటల బీమా ఎగరగొట్టారు.. ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే ఉండదు.. మద్దతు ధర ధ్యాసే పట్టదు.. కనీసం ఎరువులూ కరువే..! ఇలా అన్ని రకాలుగా అన్నదాతల నడ్డి విరిచిన చంద్రబాబు సర్కారు సబ్సిడీ విత్తనాలను కూడా సకాలంలో పంపిణీ చేయకుండా మంగళం పాడేందుకు కుట్రలు చేస్తోంది. ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి ప్రీమియం భారాన్ని రైతుల నెత్తిన మోపినట్లుగానే విత్తన సబ్సిడీ భారాన్ని సైతం రైతన్నలపైనే మోపుతోంది. గత మూడు సీజన్‌లలో సబ్సిడీ విత్తన కేటాయింపులను కుదించి రాయితీలో కోతలు విధించడమే దీనికి నిదర్శనం. అదునుకు విత్తనాలు సరఫరా చేయకుండా రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించేలా పురిగొల్పుతోంది. తద్వారా సబ్సిడీ విత్తన సరఫరా బాధ్యత నుంచి తప్పించుకునేందుకు ఎత్తుగడలు వేస్తోంది. ఇప్పటికే నాన్ సబ్సిడీ విత్తన సరఫరాను అటకెక్కించింది.

పథకం ప్రకారం సబ్సిడీ విత్తనంలో కోతలు..

రాష్ట్రంలో వ్యవసాయ పంటల సాధారణ విస్తీర్ణం ఖరీఫ్‌లో 77.87 లక్షల ఎకరాలు కాగా, రబీలో 53.80 లక్షల ఎకరాలు ఉంటుంది. గత ప్రభుత్వం



లో ఖరీఫ్–2023లో 6.85 లక్షల క్వింటాళ్లు, రబీ 2023–24లో 3.98 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని సరఫరా చేయగా, దాదాపు రూ.365 కోట్లు సబ్సిడీ కింద ఖర్చు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాల నుంచి వచ్చిన ఇండెంట్ ఆధారంగా రూ.310 కోట్లతో 10.48 లక్షల క్వింటాళ్ల విత్తన సరఫరాకు ఏర్పాట్లు చేసింది. అయితే జూన్‌లో పగ్గాలు చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం కోతల మీద కోతలు పెట్టి రూ.268 కోట్ల సబ్సిడీతో 7.87 లక్షల క్వింటాళ్ల విత్తనం మాత్రమే సరఫరా చేసింది. గడిచిన ఖరీఫ్ 2025 సీజన్‌లో రూ.165.96 కోట్ల సబ్సిడీతో 5.24 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని మాత్రమే సరఫరా చేయగలిగారు. గడిచిన 18 నెలల్లో 16 సార్లు వైపరీత్యాలు సంభవించాయి. వరదలు, అధిక వర్షాలు, తుపానుల బారిన పడి లక్షలాది ఎకరాలు ముంపునకు గురై పంటలు దెబ్బతిన్నాయి. ఇలాంటి సందర్భాలు తలెత్తినప్పుడు గత ప్రభుత్వం కంటింజెన్సీ ప్లాన్ కింద 80 శాతం సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసి ఆదుకుంది. చంద్రబాబు సర్కారు మాత్రం ఒక్క క్వింటా విత్తనం కూడా కంటింజెన్సీ ప్లాన్ కింద సరఫరా చేసిన పాపాన పోలేదు.

అదునులో అందక అగచాట్లు

రబీలో వరి తర్వాత ఎక్కువగా 10.92 లక్షల ఎకరాల్లో శనగ పంట సాగవుతుంది. 90 శాతానికిపైగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లోనే శనగ సాగు చేస్తున్నారు. రబీ సీజన్ అక్టోబర్ 1 నుంచి ప్రారంభమవుతుంది. ముందస్తు రబీకి వెళ్లే రైతులు అక్టోబర్ మొదటి వారంలోనే విత్తుకుంటారు. గత ప్రభుత్వంలో సాగు లక్ష్యాలకు అనుగుణంగా సీజన్‌కు ముందుగానే విత్తన పంపిణీకి ఏర్పాట్లు చేసేవారు. సెప్టెంబర్ 25 నుంచి రైతుల వివరాలు నమోదు చేసి అక్టోబర్ 1 నుంచి శనగ విత్తనం, సెప్టెంబర్ 15 నుంచి వరి సహా ఇతర విత్తనాలను సరఫరా చేసేవారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం అక్టోబర్ మూడో వారం వరకు శనగ విత్తన టెండర్లు ఖరారు చేయలేదు. ఏటా అక్టోబర్ 1న సబ్సిడీ విత్తన పంపిణీ మొదలు కావాల్సి ఉండగా ఈసారి నవంబర్ 1న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

సబ్సిడీలోనూ కోతలు.. రవాణా చార్జీల భారం

వైఎస్సార్‌సీపీ హయాంలో 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనం సరఫరా చేయగా, రాయితీని ప్రస్తుతం 25 శాతానికి కుదించారు. అయినప్పటికీ కొనుగోలు చేద్దామంటే ఆర్బీకేల్లో ఎక్కడా విత్తనాలు లేవు. రాయలసీమ జిల్లాల్లో 60 శాతానికి పైగా ఆర్బీకేల్లో విత్తనాలు దొరకని దుస్థితి నెలకొంది. చేసేది లేక రైతులు దూరప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సిన అగత్యం ఏర్పడింది. దీంతో రవాణా చార్జీలు తడిసి మోపెడవుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికే 60–70 శాతం మంది రైతులు ప్రైవేటుగా డీలర్ల నుంచి కొనుగోలు చేశారు. మార్కెట్‌లో దొరికే విత్తనాల్లో నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది.

సగం కూడా సిద్ధం చేయకుండా..!

రబీ 2024–25 సీజన్‌లో 3.85 లక్షల క్వింటాళ్ల విత్తనం కోసం జిల్లాల నుంచి ఇండెంట్ రాగా, అతికష్టమ్మీద కేవలం 1.76 లక్షల క్వింటాళ్లను మాత్రమే సరఫరా చేయగలిగారు. ప్రస్తుత రబీ సీజన్‌లో సబ్సిడీ విత్తనాన్ని కుదించి రూ.74.05 కోట్ల సబ్సిడీ 2.83 లక్షల క్వింటాళ్ల విత్తనం సరఫరాకు ప్రతిపాదించారు. ఏటా రబీకి సిద్ధం చేసే విత్తనంలో దాదాపు 2 లక్షల క్వింటాళ్లకు పైగా శనగ విత్తనాన్ని అందుబాటులో ఉంచాలి. కాగా ఈ ఏడాది 1.50 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనం సరఫరాకు యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేయగా సబ్సిడీ కోతలతో చివరికి 73 వేల క్వింటాళ్లు మాత్రమే సిద్ధం చేశారు. అయితే అప్పటికే రైతులు అధిక ధరలకు బయట కొనుగోలు చేశారు.

జగన్ హయాంలో నాణ్యతకు భరోసా..

వైఎస్సార్‌సీపీ హయాంలో రెండు సీజన్లలో కలిపి ఏటా సగటున 11 లక్షల క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను సరఫరా చేశారు. ఇందుకోసం ఏటా రూ.400 కోట్ల వరకు బడ్జెట్‌లో కేటాయించారు. సీఎం స్థాయిలోనే సమీక్షించి విత్తన సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సీజన్‌కు ముందే రైతుల వివరాలను నమోదు చేసి సబ్సిడీపై ఆర్బీకేల ద్వారా గ్రామ స్థాయిలోనే విత్తనాలను పంపిణీ చేశారు. ప్రైవేటు కంపెనీల నుంచి సమీకరించిన విత్తన నిల్వలను వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌లలో ర్యాండమ్‌గా పరీక్షించి సర్టిఫై చేసిన తర్వాత ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచేవారు. తద్వారా విత్తనాల నాణ్యతకు భరోసా లభించేది. ఐదేళ్లలో రూ.1,380.14 కోట్ల రాయితీతో 76.10 లక్షల మంది రైతులకు 55.27 లక్షల క్వింటాళ్ల సర్టిఫైడ్ సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. వరి, అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, పచ్చిరొట్టతోపాటు పత్తి, మిరప లాంటి నాన్ సబ్సిడీ విత్తనాలనూ ఆర్బీకేల ద్వారా అందించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ల నిర్వహణకు నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారు.

వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణ సంస్థకు గ్రహణం

రాష్ట్రంలో విత్తన పరీక్ష నెట్‌వర్క్‌ని బలోపేతం చేయడమే లక్ష్యంగా దేశంలోనే తొలి రాష్ట్రస్థాయి విత్తన జీన్స్ బ్యాంక్ ఏర్పాటుకు వైఎస్ జగన్ హయాంలో శ్రీకారం చుట్టారు. గన్నవరం వద్ద 8 ఎకరాల్లో రూ.40 కోట్లతో చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణా సంస్థ నిర్మాణ పనులను చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేసింది. ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే గ్రో అవుట్ టెస్ట్ ఫామ్, సీడ్ టెస్టింగ్ ల్యాబ్, గ్రీన్‌హౌస్, సీడ్ ప్రాసెసింగ్, కోల్డ్ స్టోరేజ్ అందుబాటులోకి వచ్చేవి. రైతు శిక్షణ కోసం ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్, హాస్టల్ ఏర్పాటయ్యేవి. అలాగే నంద్యాల మెగా సీడ్ పార్కుకు ఈ ప్రభుత్వం పైసా విదల్చలేదు. గ్రామీణ విత్తనోత్పత్తి పథకాన్నీ నిర్వీర్యం చేస్తున్నారు. విత్తనోత్పత్తిలో భాగస్వాములవుతున్న రైతులకు చెల్లించాల్సిన బకాయిలూ ఎగ్గొట్టారు.

టీడీపీ నేతల సిఫార్సు ఉన్నవారికే..

రబీలో మినుము, పెసర సాగు చేశా. స్థానిక టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే ఆర్బీకేల్లో విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. దీంతో అదును దాటుతుండటంతో చేసేది లేక కిలో రూ.130 చొప్పున మినుములు, కేజీ రూ.110 చొప్పున పెసర విత్తనాలను తెనాలి, గుంటూరు వెళ్లి తెచ్చుకున్నా. రవాణా ఖర్చులతో అదనపు భారం పడింది. విత్తనం కోసం ఎకరాకు రూ.5 వేలు పెట్టుబడి అయ్యింది. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదు. ఆర్బీకేల ద్వారా సీజన్‌కు ముందుగానే అందుబాటులో ఉంచి పార్టీలకతీతంగా రైతులకు ఇచ్చేవారు.

– వి.రామిరెడ్డి, వెంగపల్లి, హనుమంతునిపాడు మండలం, ప్రకాశం జిల్లా

ఈ దుస్థితి ఎన్నడూ చూడలేదు

నేను 20 ఏళ్లుగా శనగ సాగు చేస్తున్నా. ఈ ప్రభుత్వం రాయితీని 40 నుంచి 25 శాతానికి కుదించేసింది. దీనికంటే బయట మార్కెట్‌లోనే తక్కువ రేటుకు దొరుకుతున్నాయి. సబ్సిడీ తగ్గించడంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

– జెట్టి శ్రీనివాసరావు, ముప్పాళ్ల, నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా

'దిత్వా' వాన గండం

నేటి రాత్రి నుంచి భారీ వర్ష సూచన

అన్నదాతల గుండెల్లో గుబులు

సాక్షి, అమరావతి: దిత్వా తుపాను అన్నదాత గుండెల్లో గుబులు రేపుతోంది. మొంథా తుపానుతో వాటిల్లిన నష్టం నుంచి ఇంకా తేరుకోకముందే మరో తుపాను వల్ల ముప్పు ముంచుకొస్తుండడం రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఆదివారం రాత్రికి చెన్నై సమీపంలో తీరం దాటి దిత్వా తుపాను ఆ తర్వాత వాయుగుండంగా మారి ఏపీలోకి ప్రవేశిస్తుందని, ఈ ప్రభావం రాష్ట్రమంతా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

మద్దతు ధర దక్కక రైతుల అగచాట్లు

ప్రభుత్వ నిర్వాకంతో రైతుల కష్టం దళారుల పాలవుతోంది. ఉల్లి, టమాటా, మొక్కజొన్న, శనగ, అరటి, సజ్జ, చివరికి ధాన్యానికి కూడా మద్దతు ధర దక్కని పరిస్థితి నెలకొంది. అయినా ప్రభుత్వం తమకేమీ పట్టనట్టుగానే ఉంది. అధిక తేమ శాతం వంకతో మోకాలడ్డడంతో కోసింది కోసినట్టుగా దళారులకు అయినకాడికి ధాన్యం రైతులు అమ్ముకోవల్సిన దుస్థితి ఏర్పడింది. ఖరీఫ్ కోతలు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఇప్పటి వరకు 10 శాతానికి మించి ధాన్యం కొనుగోళ్లు జరగలేదు. రైతు సేవా కేంద్రాల్లో చాలినన్ని సంచులూ అందుబాటులో లేవు. రవాణా, కాటా, కూలీ ఖర్చులు రైతులే భరించాలని ఆర్ఎస్‌కే సిబ్బంది చెబుతుండడంతో రైతులకు తలకు మించిన భారమవుతోంది. ఈ ఖర్చులన్నీ భరించలేక అయిన కాడకి తెగనమ్ముకుంటున్నారు. కనీస మద్దతు ధర ప్రకారం 75 కేజీల బస్తాకు రూ.1792 దక్కాల్సి ఉండగా, తేమ శాతాన్ని సాకుగా చూపి దళారులు, మిల్లర్లు బస్తాకు రూ.1300 నుంచి రూ.1450కు మించి ఇవ్వడం లేదు. ఇప్పుడు దిత్వా తుపాను హెచ్చరికల ప్రభావంతో ఒక్కసారిగా మారిన వాతావరణం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

30 నుంచి 40 శాతం దాటని కోతలు

గోదావరి డెల్టా కింద 40 శాతం, కృష్ణా డెల్టా పరిధిలో 30 శాతంలోపు పంట కోతలు పూర్తయ్యాయి. మరో 15 శాతం పంట నూర్పిళ్ల మీద ఉంది. ఇటీవల విరుచుకుపడిన మొంథా తుపాను దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. పత్తి, మొక్కజొన్న పంటలతో పాటు ధాన్యం దిగుబడులూ తగ్గనున్నాయని అంచనా. మొంథా కారణంగా 20 శాతానికి పైగా తేమ శాతం నమోదవుతోంది. కోసిన పంటను కనీసం నాలుగైదు రోజుల పాటు ఆరబెడితే కానీ తేమ తగ్గే అవకాశం కన్పించడం లేదు. ఇదే వంకతో గడిచిన రెండ్రోజులుగా ప్రైవేటు వ్యాపారులు సైతం ధాన్యం కొనేందుకు ముందుకు రావడం లేదు. కోత దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. కోతలు ప్రారంభమవడంతో కూలీల కొరత తీవ్రంగా ఉంది. రెట్టింపు కూలీ చెల్లించి మరీ వరి నూర్పిళ్లు, ధాన్యం భద్రపర్చు కోవడం పంటి పనులు చేయిస్తున్నారు. కోసిన పంటను కుప్పలుగా వేసి భద్ర పరుస్తున్నారు. చాలాచోట్ల పొలాల్లోనే పనలపైనే ఉంచారు. కోసిన ధాన్యాన్ని తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై ఆరబెడుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తానన్న టార్పాలిన్ల జాడ కన్పించక పోవడంతో అద్దెలకు టార్పాలిన్లు తెచ్చుకొని పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఎకరం పంటను 3 రోజుల పాటు ఆరబెట్టుకునేందుకు రూ.వెయ్యి నుంచి 2 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. దిత్వా హెచ్చరికల నేపథ్యంలో మారుతున్న వాతావరణ పరిస్థితులతో తేమ శాతం మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క రాయలసీమలో రబీ పంటలపై దిత్వా తుపాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సీజన్ ఆరంభం నుంచి కష్టాలేకష్టాలు

ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఓ వైపు వరుస వైపరీత్యాలు, మరొక వైపు ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులను తీవ్ర నష్టాల పాల్జేస్తోంది. ఆగస్టు ఏడో తేదీ వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, ఆ తర్వాత అధిక వర్షాలతో పాటు వరదలు, తుపానులు వెంటాడుతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో రాయలసీమలో లక్షలాది ఎకరాల్లో పంటలు బీడువారి పోయాయి. గతేడాది ఇదే సమయంలో ఫెంగల్ తుపాను దెబ్బతీయగా, ఈసారి అధిక వర్షాలతోపాటు మొంథా దెబ్బతీసింది. ఫలితంగా దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అడ్డగోలుగా కోతలతో అంచనాలను కుదించి చివరకు 4.27 లక్షల ఎకరాల్లోనే పంట నష్టం జరిగినట్టుగా లెక్కతేల్చారు. దాంట్లో 4.11 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, 16 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలకు మాత్రమే నష్టం వాటిల్లినట్టు ప్రకటించారు. తొలుత ఇన్‌పుట్‌సబ్సిడీ రూ.869 కోట్లని చెప్పి, చివరకు రూ.390 కోట్లకు కుదించారు. ఈ మొత్తాన్ని అన్నదాత సుఖీభవతో కలిపి ఇస్తామని నమ్మబలికారు. గడిచిన 18 నెలల్లో సంభవించిన కరువుతో పాటు వివిధ రకాల వైపరీత్యాలకు సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు కూడా కలుపుకుంటే దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. మొంథా తుపానుకు సంబంధించిన ఇన్‌పుట్‌సబ్సిడీతో పాటు పెండింగ్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో కూడా చెప్పలేని దుస్థితిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందని రైతులు మండిపడుతున్నారు.

వణికిస్తున్న 'దిత్వా' తుపాను

3 రోజుల పాటు రాయలసీమ, నెల్లూరుకు భారీ వర్ష సూచన

సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో కొనసాగుతున్న 'దిత్వా' తుపాను రాష్ట్రాన్ని వణికిస్తోంది. బంగాళాఖాతంలో గంటకి 8 కిలోమీటర్ల వేగంతో కదులుతూ శనివారం జాఫ్నాకు 80 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 280, చెన్నైకి 380 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది శనివారం రాత్రికి తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణాంధ్ర తీరాలకు దగ్గరగా వస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం ఉదయానికి తమిళనాడుకు 25 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై సముద్రంలోనే బలహీనపడుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి మూడు రోజుల పాటు రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అనేకచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని.. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ఆది, సోమవారాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

దిత్వా తుపానుపై అప్రమత్తం

రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: దిత్వా తుపానుపై అప్రమత్తంగా ఉండాలని సీఎస్ కె.విజయానంద్ శనివారం అధికారులను ఆదేశించారు.ఈ అంశంపై ఆయన చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్య సాయి, నెల్లూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం వరకు మత్స్యకారులు సముద్రంలోనికి చేపల వేటకు వెళ్లకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్టీజీఎస్ ద్వారా తుపాను సమాచారాన్ని ఎస్ఎంఎస్ లు ద్వారా తెలియజేయాలని చెప్పారు. అవసరమైతే ప్రజలను సహాయక శిబిరాలకు తరలించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీ రావు, భారత వాతావరణ కేంద్రం డైరెక్టర్ స్టెల్లా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

డాక్టర్ నరేంద్రరెడ్డికి టైమ్స్ హెల్త్ ఎక్స్‌లెన్స్ అవార్డు

అవార్డు అందుకుంటున్న బూసిరెడ్డి నరేంద్రరెడ్డి

లబ్బీపేట (విజయవాడతూర్పు): మోకీలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో రోబోటిక్ వినియోగం ద్వారా విశేష ప్రతిభ కనబరిచిన విజయవాడ, గుంటూరుల్లోని సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డికి టైమ్స్ హెల్త్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

వైకుంఠరావుకు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వైకుంఠరావు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రకాశానికి చెందిన మానవతావాది వై.వైకుంఠరావు(ప్రకుంఠం)కు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు–2025 లభించింది. ఢిల్లీలో శనివారం ఆయన ఈ అవార్డును న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రాందాస్ అథవాలే చేతుల మీదుగా అందుకున్నారు. రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని దేశంలో స్వేచ్ఛ, సమానత్వం కోసం పాటుపడే వారికి కేంద్రం అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన వైకుంఠరావును..అంబేడ్కర్ గ్లోబల్ ఫౌండేషన్ నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు కేంద్రం ఎంపిక చేసింది. 'గాస్పెల్ మినిస్ట్రీస్' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా వైకుంఠం అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రాకడవారి వృద్ధాశ్రమం నెలకొల్పి అనాథలైన వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

హనుమంత రాయుడు (ఫైల్)

కుందుర్పి:అనంతపురం జిల్లా కుందుర్పిలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కుందుర్పికి చెందిన చాకలి హనుమంతరాయుడు (52) శనివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి దూలానికి ఉరి వేసుకున్నాడు. ఇతనికి ఉన్న 4 ఎకరాల పొలంలో మామిడి పంటను సాగు చేశాడు. చంద్రబాబు ప్రభుత్వ విధానాల కారణంగా పంటకు సరైన ధర రాలేదు. మామిడి పంట పెట్టుబడులు, కుటుంబ పోషణకు ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో ఇంటిని తాకట్టు పెట్టి కుందుర్పి కెనరా బ్యాంక్‌లో రూ.5 లక్షల రుణం తీసుకున్నాడు. నెలవారీ కంతులు కట్టలేక, అప్పులు తీర్చే మార్గం తెలియక మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడికి భార్య అంజినమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

10 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

సాక్షి, అమరావతి: పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 10 మంది డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు ఇస్తూ సీఎస్ కె.విజయానంద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్‌లు పొందిన వారిలో బి.గాయత్రీదేవి, టి.పద్మావతి, కె.శ్రీధర్‌రెడ్డి, కె.లలిత, బి.కె.వెంకటేశులు, ఎస్.విజయలక్ష్మి,కె.రాజగోపాలరావు, రాధిక, ఎం.లావణ్య, కె.సుధాకర్ ఉన్నారు.

దిగుబడిలో 'గెల'చి.. ధర లేక ఓడి..

బాబు సర్కారు నిర్వాకంతో అరటి రైతు కడుపుమంట

ఆరుగాలం కష్టాల సాగు చేసి.. గెలిచిన అరటి రైతు.. చివరకు చంద్రబాబు ప్రభుత్వ నిర్వాకం వల్ల ఓడిపోయాడు. ధర లేక.. తీవ్ర కలత చెందాడు. తుదకు కడుపుమండి.. పండించిన పంటను జేసీబీతో తొలగించి నిప్పుపెట్టి కాల్చివేశాడు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం ముదిగల్లుకు చెందిన రైతు కలిగిరి శేఖర్‌రెడ్డి 2.10 ఎకరాల్లో అరటి సాగు చేశాడు. పెట్టుబడులకు రూ.2.50 లక్షలు వెచ్చించాడు. ఇటీవల పండించిన పంటలో నాలుగు టన్నుల అరటిని మార్కెట్‌కు తరలిస్తే కిలో కేవలం రూ.3 పలికింది. దీంతో కడుపుమండిన శేఖర్‌రెడ్డి తనకున్న 2.10 ఎకరాల్లోని పంటను జేసీబీకి గంటకు రూ.వెయ్యి బాడుగ చెల్లించి మరీ పూర్తిగా తొలగించాడు. అరటి గెలలను తన స్వహస్తాలతోనే నిప్పుపెట్టి కాల్చివేశాడు. ఇలాంటి గడ్డు పరిస్థితి ఇంతకుముందెన్నడూ చూడలేదని కన్నీటిపర్యంతమయ్యాడు.

– కళ్యాణదుర్గం

రైతులకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుపోటు

అడుగడుగునా వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

- రైతులకు మద్దతు ధర, గన్నీ బ్యాగులు, లారీలు.. అన్నింటికీ కొరతే
- రోడ్లపైనే ధాన్యం.. ఇప్పటికి కొనుగోలు చేసింది 7 లక్షల మెట్రిక్ టన్నులే..
- తుపాను హెచ్చరికలను సైతం పట్టించుకోకుండా సర్కారు మొద్దునిద్ర
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్‌బాబు ధ్వజం

సాక్షి, అమరావతి: 'రైతులకు అండగా నిలిచి ఆదుకోవాల్సిన చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అడుగడుగునా వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోంది. రైతులకు వెన్నుపోటు పొడుస్తోంది' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు ప్రతి దశలోనూ అండగా నిలిచారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఆర్బీకేలను నిర్వీర్యం చేసి రైతులను గాలికొదిలేశారు. యూరియా, విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించారు. అయినా కష్టపడి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు లేరు. మద్దతు ధర కరువైంది. 75 కిలోల బస్తాకు మద్దతు ధర రూ.1,777 దక్కాల్సి ఉంటే.. రైతుకు సగటున రూ.1,200 కూడా లభించడం లేదు. కనీసం రైతులకు గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదు. ధాన్యం రవాణా కోసం లారీల కొరత.. ఇలా ప్రతి దశలోనూ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి చంద్రబాబు ప్రభుత్వ అసమర్థతే కారణం.' అని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

బాధ్యతను విస్మరించిన చంద్రబాబు

'ఒకవైపు మొంథా తుపాను వల్ల పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎకరాకు కోత ఖర్చులు అదనంగా రూ.10వేల వరకు పెరిగాయి. ఈ తరుణంలో రైతులకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాల్సిన బాధ్యతను సీఎం చంద్రబాబు విస్మరించారు. మరోవైపు వరి అన్నం తింటే షుగర్ వస్తుంది.. క్యాన్సర్ వస్తుంది... అని ఆయన ప్రచారం చేస్తూ రైతుల వెన్నువిరిచేందుకు ప్రయత్నిస్తున్నారు.' అని అశోక్‌బాబు ధ్వజమెత్తారు.

తేమ శాతం పేరుతో టీడీపీ నాయకుల దోపిడీ

'ప్రస్తుతం తేమ 17 శాతం కంటే ఎక్కువ ఉంటే ఒక శాతానికి రెండు కిలోలు చొప్పున అదనంగా ధాన్యం సమర్పించుకోవాల్సి వస్తోంది. అందుకు రైతులు అంగీకరిస్తేనే ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారు. ముఖ్యంగా ఎవరి దగ్గర ధాన్యం కొనాలి, ఎంత కొనాలి అనేది టీడీపీ నాయకులే నిర్ణయిస్తున్నారు. తేమ శాతం పేరుతో టీడీపీ నాయకులు ధాన్యం దోపిడీకి పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ధాన్యం అయితే తేమ ఎక్కువగా ఉందని తక్కువ ధరకు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. రాష్ట్రంలో 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇప్పటి వరకు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే ప్రభుత్వం కొనుగోలు చేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. రైతులు పండించిన ధాన్యమంతా రోడ్లపైనే ఎండబెట్టుకుంటున్నారు. మరోసారి తుపాను వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఇవన్నీ తెలిసి కూడా చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోంది.' అని అశోక్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్పీకర్ అనుచరుల భూ దోపిడీ

సమగ్ర విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ డిమాండ్

నర్సీపట్నం: నర్సీపట్నం నియోజకవర్గం, మాకవరపాలెం మండలం, రాచపల్లి రెవెన్యూ పరిధిలో భారీ అక్రమ భూదందాకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుచరులు, మండల స్థాయి నాయకులైన ఇరువురు టీడీపీ సర్పంచ్‌లు స్కెచ్ వేశారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విమర్శించారు. క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 'రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నంబరులోని 400 ఎకరాలను, అలాగే దీనికి ఆనుకుని ఉన్న అటవీ భూముల దోపిడీకి శెట్టిపాలెం, భీమబోయినపాలెం సర్పంచ్‌లు అల్లునాయుడు, నంద కిషోర్ తెరలేపారు. వాస్తవానికి రాచపల్లి, రామన్నపాలెం, జి.కోడూరు, జి.వెంకటాపురం రైతుల సాగులో ఉన్న ఈ భూమిని పరిశ్రమల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాసిత రైతుల జాబితాలో టీడీపీ సర్పంచ్‌లు తమ స్వగ్రామాలకు చెందిన తమ బినామీలను, అలాగే బంధువులను చేర్పించి దాదాపు రూ.3.5 కోట్ల మేర పరిహారం సొమ్ము కాజేసేందుకు స్కెచ్ వేశారు. ఈ వ్యవహారంలో బినామీలను పక్కన పెట్టి నిజమైన రైతులకు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలి. మరోవైపు 400 ఎకరాలకు అనుకుని ఉన్న అటవీ భూమిలో 85 ఎకరాలకు పట్టాలు పొందేందుకు ఇరువురు నాయకులు వ్యూహ రచన చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు అండదండలతోపాటు ఆర్డీవో వీవీ రమణ సహకారంతో సాగుతున్న ఈ అక్రమాల పర్వంపై సమగ్ర విచారణ జరిపించాలి' అని ఆయన డిమాండ్ చేశారు.

కేజీహెచ్‌లో అగ్ని ప్రమాదం

43 మంది గుండె జబ్బు రోగులు ఉక్కిరిబిక్కిరి

మహారాణిపేట: కేజీహెచ్ కార్డియాలజీ విభాగం వార్డులోని ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్ రూమ్‌లో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏసీ, రెండు కంప్యూటర్లు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతయ్యాయి. వార్డు అంతటా పొగ అలుముకోవడంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే వార్డులో ఉన్న 43 మంది గుండె జబ్బు రోగులను గైనిక్ వార్డుకు తరలించారు. అగ్ని మాపక సిబ్బంది చాలా సేపు ప్రయత్నించి మంటలను అదుపులోకి తెచ్చారు.

దట్టమైన పొగతో నిండిన కార్డియాలజీ వార్డు

రాష్ట్రంలో 3 ప్రాంతాల అభివృద్ధికి ప్రాంతీయ జోన్లు

- రాజధానిలో రైతుల లేఅవుట్ల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం
- మీడియాతో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇందుకోసం మూడు ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని అమరావతి రైతులు తనను అర్థం చేసుకున్నారని, త్వరలోనే వారి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. రాజధాని రైతులంతా ఒకే గొడుగు కిందకు రావాలని, అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కింద అంతా ఒకే జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదించి అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపుపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రితో మాట్లాడానని, చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారని తెలిపారు. రాజధానిలో రెండో దశ భూ సమీకరణ గురించి రైతులకు వివరించామని, వాటివల్ల వచ్చే ఉపయోగాలను చెప్పామని తెలిపారు. రాజధాని అంశాలపై ఏర్పాటైన త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతుందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల లేఅవుట్లకు అనుమతులు ఇచ్చే విషయంలో ఏర్పడిన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. వివిధ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలుంటాయని అన్నారు.

పగలు బోధన.. రాత్రి కాపలా!

- ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యాసంస్థల్లో పార్ట్‌టైమ్, సీఆర్టీ, అవుట్‌సోర్సింగ్, గెస్ట్ ఫ్యాకల్టీల అవస్థలు
- చాలీచాలని వేతనాలతో శ్రమదోపిడీ
- సకాలంలో వేతనాలు అందక సతమతం



సాక్షి, అమరావతి: పగటి వేళ తరగతి గదుల్లో టీచర్లుగా విద్యాబోధన.. రాత్రివేళ స్కూల్, హాస్టల్ బయట వాచ్‌మెన్లుగా కాపలా.. వేతనాలు సకాలంలో ఇవ్వరు.. సమస్యలతో సతమవుతూనే విధులు నిర్వర్తించాల్సిందే.. ఇది రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, విద్యాసంస్థల్లో టీచర్ల దుస్థితి. చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ విద్యాలయాల్లో పనిచేసే పార్ట్ టైమ్, కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ), గెస్ట్ ఫ్యాకల్టీ, అవుట్ సోర్సింగ్ టీచర్ల పరిస్థితి దుర్భరంగా మారింది. సమాన పనికి సమాన వేతనం అనే సుప్రీంకోర్టు ఆదేశాలు వీరికి అమలు కావు. రెగ్యులర్ టీచర్లకు సుమారు రూ.60 వేల నుంచి లక్షకు పైగా ఉంటే.. వీరు మాత్రం రూ.18వేల నుంచి రూ.27,500 వేతనంతో నెట్టుకొస్తున్నారు. పేరుకే పార్ట్‌టైమ్ విధులు అని ఉత్తర్వుల్లో పేర్కొన్నప్పటికీ వారితో ఫుల్‌టైమ్ పని చేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నారు. టీచర్లను బోధనేతర పనులకు వాడకూడదనే నిబంధనను తుంగలోకి తొక్కి వీరితో ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బోధన చేయించి రాత్రివేళ వాచ్‌మెన్ విధుల్లో పెడుతున్నారు.

బీసీ హాస్టల్స్‌లో ఇష్టారాజ్యం

బీసీ హాస్టల్స్, విద్యాసంస్థల నిర్వహణలో అంతా ఇష్టారాజ్యంగా సాగుతోంది. నిబంధనలు పాటించేది లేదు. గతంలో ఇచ్చిన ఆదేశాలను లెక్క చేసేదిలేదు. మాకు తోచింది చేస్తాం. మేం అనుకున్నదే అమలు చేస్తాం అనే రీతిలో సాగుతోంది. మంత్రి నుంచి అధికారుల వరకు ఎవరికి తోచినట్టు వారు ఇష్టారాజ్యంగా చేయడంతో మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని గురుకులాలు అస్తవ్యస్తంగా మారాయి. ఇటీవల డిప్యుటేషన్ల దందా పెద్దఎత్తున సాగింది. నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ స్కూల్స్ (గురుకులాలు)లో ఒక్క ప్రిన్సిపల్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగి ఉంటారు. మిగిలిన టీచింగ్ స్టాఫ్ అంతా కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకోవాల్సి ఉంటుంది. ఆ పోస్టుల్లో కాంట్రాక్ట్ టీచర్ల నియామకం లేకపోవడంతో గెస్ట్ టీచర్లతో నడిపిస్తున్నారు. ఆ పోస్టుల్లో సైతం రెగ్యులర్ టీచర్లకు పోస్టింగ్ ఇవ్వకుండా అడ్డగోలుగా డిప్యుటేషన్లు ఇవ్వడం అనేక అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్రంలోని 109 బీసీ గురుకులాల్లో 1,253 గెస్ట్ ఫ్యాకల్టీ (టీచర్లు) 8–10 ఏళ్లనుంచి సేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారికి పగలు బోధనతోపాటు రాత్రి భద్రత పేరుతో బోధనేతర పనులను, వాచ్‌మెన్ విధులను కూడా అప్పగించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కాంట్రాక్ట్ పోస్టుల్లో పనిచేస్తున్న గెస్ట్ టీచర్లను పొమ్మనకుండా పొగబెట్టినట్టు నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ టీచింగ్‌కు డిప్యుటేషన్లు ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. కేవలం రూ.24వేల వేతనానికి పనిచేస్తున్న గెస్ట్ టీచర్లు రెండు, మూడు జిల్లాలు దాటి వెళ్లలేక ఉద్యోగాలు వదులుకుంటున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలు, గురుకులాల్లో రెండో శనివారం సెలవు ఉంది. ఒక్క బీసీ గురుకులాల్లో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రెండో శనివారం కూడా పనిచేయాలని ఆ సంస్థ కార్యదర్శి ఉత్తర్వులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది.

గిరిజన టీచర్ల వేదన వినేదెవరు!

ఇక రాష్ట్రంలో 191 గిరిజన గురుకుల విద్యాసంస్థల్లో 10–18 ఏళ్లుగా సేవలందిస్తున్న 1,143 మంది అవుట్‌సోర్సింగ్ టీచర్ల వేదనను చంద్రబాబు సర్కారు పట్టించుకోవడం లేదు. డీఎస్సీలో వీరంతా పోస్టులు కోల్పోవడంతో సర్దుబాటు చేస్తామంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఇదే సమయంలో వారికి రెండు నెలల వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ఎస్సీ గురుకులాల్లో వేతన వెతలు

మరోవైపు సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల్లోని టీచర్లను వేతన వెతలు వెంటాడుతున్నాయి. ఎస్సీ గురుకులాల్లో 1,500 మంది పార్ట్‌టైమ్ టీచర్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. 750 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్టీ)కు రెండు నెలల వేతనాలు రాలేదు. అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడు కనిపించడం లేదు.

మీరుఅసలైన **ఆంధ్ర స్టైల్ పచ్చళ్లు** చేస్తారా?

కొత్తగాఎదుగుతున్న మా కంపెనీకి
ఇంటి స్టైల్‌లో, సంప్రదాయ పద్ధతిలోచేసే
ఆంధ్ర పచ్చళ్లురెసిపీ తెలిసినవారు కావాలి.

మీకు పచ్చళ్లు తయారు చేసిన అనుభవం ఉంటే
Call or Whatsapp :
9187062454
మీకు తగిన మంచి బహుమతి అందజేస్తాము.

నిందలకు భయపడకండి.
దూషణలకు దిగులు చెందకండి.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.దశమి సా.4.03 వరకు తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.8.59 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ఉ.7.06 నుండి 8.36 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.52 నుండి 4.34 వరకు, **అమృత ఘడియలు:** సా.4.20 నుండి 5.54 వరకు, **శుక్రమూఢమి ప్రారంభం.**

సూర్యోదయం : 6.16
సూర్యాస్తమయం : 5.20
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

డి.కె. శివకుమార్ (కర్ణాటక డిప్యూటీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

అప్పు తీసుకునేటప్పుడు బాగానే ఉంటారు. తిరిగి ఇచ్చేయవలసి వచ్చినప్పుడే బాధపడి పోతుంటారు!

సిద్ధరామయ్య నాకు సీఎం సీటు బాకీ. “ఫస్ట్ హాఫ్‌లో నేను సీఎంగా ఉంటాను. సెకండ్ హాఫ్‌లో మీరు సీఎంగా ఉండండి” అని నన్ను నమ్మించి సీఎం అయ్యారు సిద్ధరామయ్య. ఫస్ట్ హాఫ్ అయిపోయింది. నవంబర్ 20న ఆయన నా బాకీ తీర్చేయాలి. తీర్చలేదు! మాట మీద నిలబడని మనుషుల వల్లే రాజకీయాల్లో ఈ లంచ్ మీట్‌లు, సర్దుబాటు బ్రేక్‌ఫాస్ట్‌లు!

“సిద్ధరామయ్య గారూ... మాట తప్పటం మన కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే లేదు” అన్నాను, అలాగైనా హై కమాండ్ గుర్తొచ్చి, ఆ భయంతో నైనా నా అప్పు తీర్చేస్తారని!

“నేను మీకు ఏ మాటా ఇవ్వలేదు శివకుమార్. ఇచ్చానని మీరనుకుంటే సరిపోదు. పత్రం ఏది? సాక్షులు ఏరి? ఉంటే చూపించండి” అన్నారు!

అప్పును ఎగ్గొట్టే ఉద్దేశం ఉన్న వారి జార్గాన్ ఎలా ఉంటుందో సరిగ్గా అలానే మాట్లాడుతున్నారు సిద్ధరామయ్య! “దిక్కున్న చోట చెప్పుకో...” అనే మాటొక్కటే అనటం లేదు. ఇద్దరి దిక్కూ హై కమాండే కాబట్టి.



నవంబర్ 20 దాటి పది రోజులైంది! సిద్ధరామయ్య సీఎం సీట్లోంచి లేవటం లేదు. “ఒకరు చెబితే లేవను. హై కమాండ్ మాటే నాకు ఫైనల్” అంటున్నారు.

“అవును. హై కమాండ్ మాటే మా నాయకుడికి ఫైనల్” అని పరమేశ్వర, సతీశ్ జార్కిహోలీ, మహదేవప్ప, వెంకటేశ్, కె.ఎన్. రాజన్న అంటున్నారు.

సిద్ధరామయ్యకే కాదు, నాకూ హై కమాండ్ మాటే ఫైనల్. కానీ హై కమాండే ఏ మాటా ఫైనల్ చేసి చెప్పటం లేదు.

శుక్రవారం హఠాత్తుగా ఢిల్లీ నుండి ఖర్గే ఫోన్! “శనివారం బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఒకటి పెట్టుకుని వాళ్లలో వాళ్లనే తేల్చుకోమనండి” అని సోనియాజీ అంటున్నారని!

నచ్చని మనుషులతో కలిసి, నవ్వుతూ బ్రేక్‌ఫాస్ట్ చెయ్యడం రాజకీయాల్లో మాత్రమే ఉంటుందేమో! అనిష్టంగానే శనివారం ఉదయం సిద్ధరామయ్య ఇంటికి బ్రేక్‌ఫాస్ట్‌కి వెళ్లాను. టేబుల్‌కి ఒక ఒంపులో ఇద్దరం పక్క పక్కన కూర్చొనేలా ముందే ఏర్పాట్లు చేయించి నట్లున్నారు ఆయన!

“తినండి శివకుమార్! మీకు ఇష్టమని ఇడ్లీ తెప్పించాను” అన్నారు, నవ్వుతూ.

“ఇడ్లీ మాత్రమే కాదు సిద్ధరామయ్య గారూ... నాకు మసాలా దోసె, ఉప్మా, కేసరి బాత్ కూడా ఇష్టమే” అన్నాను.

“వాటికి టైమ్ పడుతుందని ఇడ్లీ తెప్పించాను శివకుమార్. టైమ్ పట్టేవాటి కోసం వెయిట్ చేయాల్సిందే కదా” అన్నారు నవ్వుతూ! హై కమాండ్ నుంచి హామీ లభించిన అల్లరితనమేదో ఆయన నవ్వులో కనిపిస్తోంది.

ఇడ్లీ తిని బయటికి వచ్చేశాను. అరగంట పైగా మాట్లాడుకున్నాం. సీటు కావాలని నేను అడగలేదు. సీటు ఇస్తానని ఆయనా అనలేదు. “నాకూ పనుంది” అని ఆయనా లేచారు.

బ్రేక్‌ఫాస్ట్ అయ్యాక నేరుగా వెళ్లి శ్రీ నిర్మలానందనాథ స్వామీజీని కలిశాను. “డిసెంబర్ 8 నుండి శాసన సభ సమావేశాలు స్వామీజీ. ఉప ముఖ్యమంత్రిగా ఆ సమావేశాలకు హాజరవటం నాకు ఇష్టం లేదు. ఏం చేయమంటారు?” అని అడిగాను.

స్వామీజీ చిద్విలాసంగా చూశారు.

“నీ అభీష్టం ఒక విధంగా నెరవేరకుంటే, ఇంకో విధంగా నెరవేర్చుకో నాయనా” అన్నారు. సమావేశాలు ప్రారంభం అయ్యేలోపు నువ్వు ముఖ్యమంత్రివి కాలేకపోతే, ఉప ముఖ్యమంత్రిగా కూడా ఉండొద్దు అని ప్రబోధించారు! తిరుగులేని బాణం.

స్వామీజీ దగ్గర సెలవు తీసుకుని, నాగమంగళలోని ఆదిచుంచనగిరి మహాసంస్థాన మఠం నుంచి తిరిగి వస్తుంటే, దారిలో... బైడ్డిలోని కగినెలె కనకగిరి పీఠంలో శ్రీ నిరంజనానందపురి స్వామీజీని దర్శించుకుని వస్తూ సిద్ధరామయ్య కనిపించారు!

అవినీతి పునాదులపై అమరావతి



జనతంత్రం

వర్ధెల్లి మురళి



‘‘అమరావతిలో 25 బ్యాంకులను ప్రారంభిస్తున్నారు. బాగానే ఉన్నది కానీ... వాటిని ఉపయోగించుకోవడానికి అంతమంది అక్కడున్నారా?’’ ఈ అపశకునం పలికిన వ్యక్తి ప్రతిపక్షి కాదు. అధికార పక్షానికి పరమభక్తుడు. చంద్రబాబుకు నిత్యం స్తోత్ర పారాయణం చేసే ఎల్లో మీడియా వంశీకుడు. నిజమే కదా, ఎవరున్నారక్కడ? 29 గ్రామాల్లో 33 వేల ఎకరాల భూములిచ్చి జీవనాధారం కోల్పోయి, ప్రభుత్వం ఇస్తానన్న ప్లాట్ల కోసం ఎదురుచూస్తున్న త్యాగరాజుల కుటుంబాలు తప్ప! సర్కారిచ్చే ప్లాట్లు అమ్ముకుంటే గదా వారికి బ్యాంకులతో పని. ఆ భూములపై ఆధారపడి పొట్టబోసుకున్న వ్యవసాయ కూలీ కుటుంబాలు ఇప్పుడు ఎక్కడున్నాయో? భూసేకరణ ఫలితంగా సుమారు లక్ష కుటుంబాలు భుక్తిని కోల్పోయిన ఇచ్చోటనే నిన్న (శుక్రవారం) అమరావతి ఆర్థిక నగరానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు.

ఎన్డీఏ కూటమిలో చంద్రబాబు ముఖ్య భాగస్వామి కావటం మూలాన ఆయనకు ఆనందం కలిగించే విధంగానే కేంద్ర మంత్రి మాట్లాడారు. హైదరాబాదులో ఆయన స్థాపించిన ఆర్థిక నగరం ఎంతో అభివృద్ధి చెందిందనీ, ఇది కూడా అలాగే అభివృద్ధి సాధించాలనీ ఆమె ఆకాంక్షించారు. హైదరాబాదులో ‘ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్’కి 2004 నవంబర్‌లో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత దాని ఉజ్జ్వల ప్రస్థానం ప్రారంభమైంది. ‘క్రెడిట్ చౌర్యం’ అనేది బాబు బలహీనత. ఆ బలహీనతలో భాగంగా ఐటీ విప్లవం దగ్గర నుంచి హైదరాబాద్ నిర్మాణం దాకా అనేక చరిత్రాత్మక ఘట్టాలు ఆయన ఖాతాలో చేరిపోతుంటాయి. అసలైన సమాచారం కంటే నకిలీ సమాచారమే ఎక్కువగా అందుబాటులో ఉన్నందువల్ల కేంద్ర మంత్రి కూడా పొరపాటు పడి ఉండవచ్చు.

బౌద్ధ తాత్వికుడు, రసాయన శాస్త్ర పితామహుడైన ఆచార్య నాగార్జునుని పేరును కూడా నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఈ ప్రాంతం వాడైన నాగార్జునుని గురించి టిబెట్ విద్యార్థులకు కూడా తెలుసన్న సంగతిని తాను అక్కడికి వెళ్లినప్పుడు గమనించానని ఆమె చెప్పారు. దేవతల రాజధానయిన అమరావతిని అల నుంచి ఇలకు దించిన అపర భగీరథుడి గురించి కూడా ప్రపంచ ప్రజలకు తెలుసని ఆమె చెప్పకపోవడం గొప్ప ఉపశమనాన్ని కలిగించింది. ఎందుకంటే గతంలో ‘స్కిల్ కుంభకోణం’ కేసులో చంద్రబాబు అరెస్టయినప్పుడు 55 దేశాల్లోని ప్రజలు వీధుల్లోకి వచ్చి హాహాకారాలు చేశారని ఎల్లో మీడియా ప్రచారంలో పెట్టిన సంగతి తెలిసిందే. ఆ ప్రచారం ప్రభావం అంతో ఇంతో ఉంటుందేమోననే అనుమానం సహజం.

అట్టి దేవతల రాజధాని అమరావతికి ఇప్పుడున్న 54 వేల ఎకరాలు సరిపోవని, అర్జెంటుగా ఇంకో 20 వేల పైచిలుకు ఎకరాల భూముల సమీకరణకు సర్కార్ సైరన్ మోగించింది. ఇంతటితో ఆగదట! ఇంకో పాతిక వేల ఎకరాల కోసం మూడో రౌండ్ సమీకరణ కూడా సిద్ధంగా ఉన్నదని విశ్వసనీయ సమాచారం. ఏతావతా రాజధాని పేరుతో లక్ష ఎకరాల సారవంతమైన పంట భూమికి సర్కార్ టెండర్ పెట్టింది. ఇప్పుడీ లక్ష ఎకరాల్లో నివసించడానికి లక్షల సంఖ్యలో నర నారీ జన సందోహం ఎక్కడ నుంచి వెల్లువెత్తి రావాలి? ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే వారు లేదా ప్రైవేటు కంపెనీలు వస్తే వాటిలో పని చేసేవారు అక్కడ నివాసం ఏర్పాటు చేసుకునే పరిస్థితులు ఉంటాయా? రియల్ ఎస్టేట్ మోడల్‌లో కార్పొరేట్ రాజధాని నిర్మాణాన్ని ప్రారంభించిన తర్వాత అద్దెలు గాని, అమ్మకాలు గాని మధ్యతరగతి సాధారణ ప్రజలకు అందుబాటులో ఉంటాయా? పేద ప్రజలు, మధ్యతరగతి ప్రజల పిల్లలు చదువుకోవడానికి ఎన్ని పాఠశాలలు, ఎన్ని కళాశాలలు పెట్టబోతున్నారు? ప్రైవేట్ విద్యాసంస్థలకు భూ పందేరాలు చేయడం తప్ప, ప్రభుత్వ విద్యాసంస్థలను ఇప్పటివరకు ఎందుకు ప్రకటించలేదు? వగైరా ప్రశ్నలు సహజంగానే పుట్టుకొస్తాయి. విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి అన్ని వసతులున్న పట్టణ ప్రాంతాలు చేరువలో ఉండగా అమరావతిలోనే ప్రజలు నివాసం ఏర్పాటు చేసుకోవడానికి ఎంతకాలం పడుతుందో చెప్పడం కష్టం.

నాలుగొందల ముప్పయ్యేళ్ల కిందట గోల్కొండ రాజైన ఖులీ కుతుబ్‌షా హైదరాబాద్ నగర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ సందర్భంగా దైవాన్ని ప్రార్థిస్తూ ‘‘సముద్రాన్ని చేపలతో నింపినట్టు ఈ నగరం కూడా ప్రజలతో నిండి ఉండేట్టు ఆశీర్వదించమ’’ని అర్థించాడు. తాను మహారాజు గనుక ఆదేశాలు జారీ చేసినంత మాత్రాన ప్రజలు నివసించబోరనీ, సరైన ఉపాధి, నివాసయోగ్య పరిస్థితులు ఏర్పడితేనే నగరం అభివృద్ధి చెందుతుందనీ గ్రహింపు ఉన్నవాడు కనుకే అటువంటి పరిస్థితులను కల్పించాలని అల్లాను అభ్యర్థించాడు. అప్పటికే గోల్కొండ అంతర్జాతీయ వజ్రాల వ్యాపారానికి కేంద్రమైనప్పటికీ దైవం పైనే ఖులీ భారం వేశాడు. ఏ నగరం అభివృద్ధి చెందాలన్నా అటువంటి నివాసయోగ్య పరిస్థితులు, ఉపాధి అవకాశాలు ముఖ్యం.

గాంధీనగర్‌ను గుజరాత్ రాజధానిగా నిర్మించి 50 ఏళ్లు దాటినా అది ఇప్పటికీ అహ్మదాబాద్ నీడలోంచి బయటకు రాలేదు. మహానగరంగా మారలేదు. భువనేశ్వర్ ఇప్పటికీ కటక్ కొంగు పట్టుకునే నడుస్తున్నది. నయా రాయ్‌పూర్ కథ కూడా అంతే! మలేసియా రాజధానిగా ప్రణాళికాబద్ధంగా నిర్మించిన ‘పుత్రజయ’ ఇప్పటికీ కౌలాలంపూర్‌కు అనుబంధ నగరమే. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ‘గ్రోత్ ఇంజన్’ వంటి నగరాన్ని అభివృద్ధి చేయాలనుకోవడం వేరు, అది రాజధాని నగరమే కావాలనుకోవడం వేరని నిపుణులు చెబుతున్నారు. ‘గ్రోత్ ఇంజన్’గా అభివృద్ధి చెందడానికి మానవ సంకల్పంతో పాటు కొన్ని సహజమైన అనుకూలతలు కూడా ఆ నగరానికి ఒనగూడి ఉండాలి. అటువంటి అనుకూలతలు అమరావతితో పోల్చితే విశాఖపట్నానికి దండిగా ఉన్నాయనే అభిప్రాయం ఉన్నది. విశాఖను ‘గ్రోత్ ఇంజన్’గా మార్చుకొని, అమరావతిని పాలనా రాజధానిగా కొనసాగించాలంటే లక్ష ఎకరాల భూమి, లక్షల కోట్ల రూపాయల అప్పు అవసరం లేదు.

ఒక రాష్ట్రానికి గాని, దేశానికి గాని అభివృద్ధి ప్రణాళికలను రచించే ముందు ఆ ప్రాంత బలాబలాలను గమనంలోకి తీసుకుంటారు. ఆ లెక్కన ఆంధ్రప్రదేశ్‌కున్న సహజ బలాల్లో మూడు ముఖ్యమైనవి – ఒకటి సముద్రతీరం, రెండు వ్యవసాయ రంగమయితే, మూడోది బహుళ పట్టణ వ్యవస్థ. దేశంలోని మరే రాష్ట్రంలో లేని విధంగా 15 ప్రగతిశీలమైన పట్టణాలు ఏపీలో ఉన్నాయి. అభివృద్ధిని వికేంద్రీకరించి, దృష్టి పెడితే విశాఖ, విజయవాడ, గుంటూరు నగరాలకుతోడు మరో 10 పట్టణాలు ఒక్కోటి పది లక్షల జనాభాకు ఉపాధినీ, ఆశ్రయాన్నీ ఇవ్వగలవు. అమరావతి కోసం ఇప్పుడు సేకరించిన భూమే రాజధాని అవసరాలకు సమృద్ధిగా సరిపోతుంది. మరింత భూసేకరణ, మరింత రుణ సేకరణ వంటి వృథా ప్రయాసలు తప్పుతాయి. పట్టణీకరణ నిపుణులు చెబుతున్న మాటలివి. ప్రతిపక్షాల విమర్శలు కావు.

రాజధాని అప్పులు కాకుండా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల కోట్ల పైచిలుకు అప్పులు చేసింది. రాజధాని కోసం 40 వేల కోట్లు చేశారు. మొదటి దశలోని 53 వేల ఎకరాలను దృష్టిలో పెట్టుకొని రాజధానికి 77 వేల కోట్లు కావాలని చంద్రబాబు స్వయంగా అన్నారు. ఇప్పుడిది లక్ష ఎకరాలకు మారింది. ఇంకెంత కావాలి? కేవలం రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనకే ఎకరాకు రెండు కోట్ల చొప్పున లక్ష ఎకరాలకు రెండు లక్షల కోట్లు అవసరమవుతాయని నిర్మాణ రంగం నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, ఇతర అవసరాల కోసం ఇంకో లక్ష కోట్లు. మొత్తం మూడు లక్షల కోట్ల అప్పును ఎక్కడ తెస్తారు? దానిని ఎవరి నెత్తిన రుద్దుతారు? రాజధానితో సంబంధం లేకుండా ఏడాదిన్నరలోనే రెండు లక్షల కోట్లు దాటిన మిగతా అప్పు ఐదేళ్లలో ఎంత కావాలి? ఈ భారమంతా ఎవరు మోయాలి? ప్రజలే కదా! అమరావతిని రాజధానిగా కొనసాగిస్తూనే, సింగిల్ గ్రోత్ ఇంజన్ మోడల్ (విశాఖ), మల్టిపుల్ గ్రోత్ ఇంజన్ల మోడల్ (డజన్ నగరాలు) వంటి ప్రత్యామ్నాయాలు ఉండగా, లక్ష ఎకరాలు, మూడు లక్షల కోట్లు, పర్యావరణ సమస్యలు వంటి ఎన్నో రిస్కులతో కూడిన బాటలోనే పయనించాలని ఎందుకు ఉబలాటపడుతున్నారో కనిపెట్టడం కష్టసాధ్యం కాదు.

నదులు ఉప్పొంగి నగరాలను ముంచెత్తిన వార్తలు విన్నాము. కానీ నగరంలోంచి నీళ్లను నదిలోకి ఎత్తిపోసే విడ్డూరాన్ని మనం కేవలం అమరావతిలోనే చూస్తున్నామని ఒక నిపుణుడు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. నదులకైనా, వాగులు వంకలకైనా వాటి సహజ ప్రవాహ గతి వాటికి ఉంటుంది. కృత్రిమంగా దారి మళ్లింపు ప్రయత్నాలు ఎన్ని చేసినా ప్రకృతి ఉగ్రరూపం దాల్చినప్పుడు వాటి సహజ మార్గాలను వెతుక్కుంటూ, బీభత్సాన్ని సృష్టిస్తాయి. ఇటువంటి ఉదాహరణలు ఎన్నో చూస్తున్నాము. కొండవీటి వాగు కృష్ణలో కలిసే సహజ మార్గంలో మహానగర నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. దాని వరద నీటి ఎత్తిపోత అనే రిస్కును తలకెత్తుకోవడానికి కారణం నిధుల ఎత్తిపోత అనే మహద్భాగ్య అవకాశమేనని వస్తున్న విమర్శలను కాదనగలరా?

రాజధాని నగరంలో నిర్మాణాలకు చదరపు అడుగుకు తొమ్మిది వేల నుంచి పదివేల దాకా ఖర్చు చేస్తున్నారు. ఎంత వైభవోపేతంగా కట్టినా నాలుగున్నర వేలు దాటదని నిర్మాణ రంగంవాళ్ళు అభిప్రాయపడుతున్నారు. ఆరు వరుసల జాతీయ రహదారులను నిర్మించడానికి ‘నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా’ కిలోమీటర్‌కు 25 కోట్లు ఖర్చు పెడుతున్నదట! మన అమరావతిలో దాన్ని 53 కోట్లుగా డిసైడ్ చేశారు. ఇటువంటి అవినీతి వ్యవహారాల మీద ‘సాక్షి’ మీడియాలో సవివరంగా కథనాలు వచ్చినా, నిపుణులు ఎందరో సోషల్ మీడియా వేదికపై గొంతు విప్పినా ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన లేదు. అంటే, అందులో ఖండించడానికి ఏమీ లేదని అర్థం చేసుకోవాలి. ఈ లెక్కన ప్రభుత్వం అప్పులు తెచ్చి రాజధాని కోసం మూడు లక్షల కోట్లు ఖర్చుపెడితే అందులో సగభాగం కైంకర్యాలకే సరిపోతుందన్నమాట! బలమైన ఆధారాలు, అనుమానాలతో వస్తున్న ఈ విమర్శకు ప్రభుత్వం ముఖం చాటేస్తున్నది కనుకనే పెద్ద ఎత్తున అవినీతి జరుగు తున్నదని జనం నమ్ముతున్నారు.

పాలక కూటమి కార్యకర్తలు, ఛోటానేతలు కూడా రాజధాని అవినీతిని నమ్ముతున్నారు. అందువల్లనే క్షేత్రస్థాయిలో వారు చెలరేగిపోతున్నారు. ‘‘మంత్రిగారి కొడుక్కి నీ మీద మనసైంది. రా వచ్చెయ్’’మంటూ ఒంటరి మహిళలకు మంత్రిగార్ల పీఏలు బరితెగించి బెదిరింపు కాల్స్ చేస్తున్నారు. ఛోటామోటా నాయకులు నిరుపేద హాస్టల్ బాలికలను నిర్జన ప్రదేశాలకు లాక్కెళ్తున్నారు. ‘‘నీ ఉద్యోగం మాకు కావాలి, నువ్వు రాజీనామా చేసెయ్’’ అంటూ బలహీనవర్గాల చిరు మహిళా ఉద్యోగులను జుట్టు పట్టి ఈడ్చుకుంటూ కీచక పర్వాలను సృష్టిస్తున్నారు. ఇసుక మాఫియా, రేషన్ బియ్యం మాఫియా, పేకాట మాఫియా చెలరేగిపోతున్నాయంటూ ఒక పోలీస్ హోమ్ గార్డ్ నిస్సహాయ ఆవేదనతో ఎస్పీకి పంపిన సెల్ఫీ వీడియో సంచలనంగా మారింది. విధి నిర్వహణ కోసం అక్రమార్కుల ఆచూకీ తీస్తే లారీలతో తొక్కి చంపుతామన్నారట! తన పై అధికారులు కూడా ఈ మాఫియా ముఠాలకు భయపడుతున్నారని ఆ హోంగార్డు ఆవేదన వెలిబుచ్చారు. ఇది రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి.

ఇక సాధారణ పరిపాలనను చాప చుట్టేశారు. ‘ఓన్లీ అమరావతి’! ఇదే సర్కారు వారి తిరుమంత్రం! గిట్టుబాటు ధరల్లేక, రవాణా ఖర్చులు కూడా రాని దుస్థితిలో పంట పొలాలను దున్నేస్తున్న రైతుల కన్నీటి గాథలు అన్ని ప్రాంతాల్లోనూ వినిపిస్తున్నాయి. ధాన్యం సేకరణ మాట అటుంచి దాచుకునేందుకు గోనె సంచుల్ని కూడా అందివ్వలేని జుగుప్సాకరమైన పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం ఉన్నది. మార్కెట్లో ఏ పంటకూ మద్దతు ధర దక్కని దారుణమైన పరిస్థితి ఏర్పడింది. ఒక్క వ్యవసాయ రంగమే కాదు, అన్ని రంగాల్లోనూ ప్రభుత్వ యంత్రాంగం నిస్తేజంగా మారింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో జన జీవితం గాలిలో దీపం. కోనసీమ కొబ్బరికి తెలంగాణ వాళ్ల దిష్టి పెట్టారని డిప్యూటీ సీఎం వ్యాఖ్యానించారట! ఇక ఆ రైతాంగం ఆయనకు సమస్యల గురించి ఏం చెప్పుకుంటారు? ఇప్పుడు తమ పాలనా వైఫల్యాలపై ముఖ్యమంత్రి ఏం చెబుతారో? న్యూయార్క్, లండన్ నగరాలు మన అమరావతికి దిష్టి పెట్టాయని ఆయన అనకుండా ఉండుగాక!

vardhelli1959@gmail.com

రాజధాని నగరంలో నిర్మాణాలకు చదరపు అడుగుకు తొమ్మిది వేల నుంచి పదివేల దాకా ఖర్చు చేస్తున్నారు. ఎంత వైభవోపేతంగా కట్టినా నాలుగున్నర వేలు దాటదని నిర్మాణ రంగంవాళ్ళు అభిప్రాయపడు తున్నారు. ఆరు వరుసల జాతీయ రహదారులను నిర్మించడానికి ‘నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా’ కిలో మీటర్‌కు 25 కోట్లు ఖర్చు పెడుతున్నదట! మన అమరావతిలో దాన్ని 53 కోట్లుగా డిసైడ్ చేశారు. ఇటువంటి అవినీతి వ్యవహారాల మీద ‘సాక్షి’ మీడియాలో సవివరంగా కథ నాలు వచ్చినా, నిపుణులు ఎందరో సోషల్ మీడియా వేదికపై గొంతు విప్పినా ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన లేదు. అంటే, అందులో ఖండించడానికి ఏమీ లేదని అర్థం చేసు కోవాలి. ఈ లెక్కన ప్రభుత్వం అప్పులు తెచ్చి రాజధాని కోసం మూడు లక్షల కోట్లు ఖర్చుపెడితే అందులో సగభాగం కైంకర్యాలకే సరిపోతుందన్నమాట! బలమైన ఆధారాలు, అనుమానాలతో వస్తున్న ఈ విమర్శకు ప్రభుత్వం ముఖం చాటేస్తున్నది కనుకనే పెద్ద ఎత్తున అవినీతి జరుగు తున్నదని జనం నమ్ముతున్నారు.

అందరికీ ఆహార భద్రత ఓ ఎండమావేనా!

అభిప్రాయం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

దేశాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో మొదటిది ఆహార భద్రత. ప్రపంచ ఆహార భద్రత సూచీ ప్రకారం 2022 నాటికి 113 ప్రధాన దేశాలలో భారత్ 68వ స్థానం పొందగా 2024 నాటికి, అంటే రెండేళ్ల తర్వాత 127 ప్రధాన దేశాలలో 105వ స్థానానికి దిగజారింది. దేశ జనాభాలో ఆకలితో బాధపడుతున్న వారి సంఖ్య 22 కోట్లుగా అంచనా వేస్తుండగా, అందులో అధిక శాతం మంది వ్యవసాయం వృత్తిగా చేసుకొన్న రైతులు, రైతు కూలీల కుటుంబాల వారే. దేశ జనాభాకు తిండి గింజల్ని పండిస్తున్న రైతాంగమే కడుపు నిండా తిండికి నోచుకోకపోవడం అన్నది జీర్ణించుకోలేని చేదు వాస్తవం.

ఇతర రంగాలతో పోలిస్తే వ్యవసాయ రంగంలో ఆదాయాలు పెరగడం లేదు. జాతీయ శాంపుల్ సర్వే ప్రకారం 1960–2020 మధ్య వ్యవసాయ రంగంలో నికరాదాయం 4 రెట్లు మాత్రమే పెరిగింది. ఇదే సమయంలో పారిశ్రామిక నికరాదాయం 75 రెట్లు పెరిగింది. 2004లో ఒక వ్యవసాయ రంగ శ్రామికుడి ఉత్పాదకత రూ. 11,964 ఉండగా, పారిశ్రామిక రంగ కార్మికుడి ఉత్పాదకత రూ. 66,323గా ఉన్నట్లు తేలింది. అంటే ఇతర రంగాల్లో పనిచేసే కార్మికులకు వ్యవసాయదారుల కంటే ఎక్కువ ఆదాయం వస్తోందన్నమాట! ఈ కారణంగానే కార్మికులు, కూలీలు వ్యవసాయ రంగాన్ని వీడి పెద్ద సంఖ్యలో ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు.

ప్రతీ ఏటా సాగు ఖర్చులు నిరంతరంగా పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏటేటా 14 ప్రధాన పంటలకు కొంతమేర కనీస మద్దతు ధరల్ని పెంచుతున్న మాట నిజమే గానీ, ఆ పెరిగే మొత్తం రైతు కుటుంబ, సాగు ఖర్చులను పూడ్చలేక పోతున్నాయి.

హరిత విప్లవం స్ఫూర్తిగా...

దేశంలో 1950 దశకం చివర్లో వచ్చిన ‘హరిత విప్లవం’ కారణంగా వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగాయి. హరిత విప్లవం నాటి సమయంలో దేశంలోని పలు రాష్ట్రాలు వ్యవసాయ, భూ సంస్కరణలను ప్రవేశ పెట్టి విజయవంతంగా అమలు చేశాయి. అధిక దిగుబడి సామర్థ్యం గల వంగడాలను ప్రవేశపెట్టాయి. బంజరు భూములు సాగులోకి వచ్చాయి. సేంద్రియ ఎరువులతో పాటు రసాయన ఎరువుల ఉపయోగం మొదలైంది. యంత్రాల వినియోగం కూడా రావడంతో సకాలంలో వ్యవసాయ పనులు పూర్తికావడం సాధ్యమైంది. గోధుమ, వరి, నూనె గింజలు, పప్పు ధాన్యాలు పుష్కలంగా పండి వాటి ఉత్పత్తి సాలీనా 7 శాతం చొప్పున పెరిగింది. దాంతో,

◆ ప్రజలందరికీ ఆహార భద్రత చేకూరాలంటే ముందుగా రైతులకు ఆదాయ భద్రత కలగాలి. రైతుల ఆదాయం పెరగాలంటే వ్యవసాయ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెరగాలి, మౌలిక సదుపాయాలు, గిడ్డంగుల సౌకర్యం మెరుగుపడాలి.

ప్రజల అవసరాలకు పోను కొంతమేర ఎగుమతులు చేసే స్థాయికి దేశం చేరింది. ఇప్పుడు దేశంలో సాగు భూములు క్రమంగా కుంచించుకు పోతున్నాయి. వ్యవసాయ యోగ్యమైన భూముల్ని పారిశ్రామిక వాడలుగా, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చేయటం గత దశాబ్ద కాలంగా ఎక్కువైంది.

హరిత విప్లవమే కాదు... 1980–90 మధ్యకాలంలో పాల ఉత్పత్తిని పెంచడానికి పలు చర్యలు చేపట్టి శ్వేత విప్లవాన్ని సాధ్యం చేశారు. చేపలు, రొయ్యల ఉత్పత్తుల తలసరి లభ్యతను పెంచి నీలి విప్లవాన్నీ, అలాగే నూనె గింజల ఉత్పత్తిలో అనూహ్య వృద్ధిని సాధించి ‘బ్రౌన్ రివల్యూషన్’ను సాధించిన ఘనత మనది. అయితే ‘అన్నపు రాశులు ఒకచోట.. ఆకలి దప్పులు మరొక చోట’ అన్నట్లుగా తలసరి ఆహార ధాన్యాల లభ్యత పెరిగినప్పటికీ దేశాన్ని ఆకలి రహిత భారత్‌గా తీర్చిదిద్దలేక పోవడం లోపమే!

ప్రజలందరికీ ఆహార భద్రత ఉండాలంటే ఏడాది పొడవునా వారికి ఉపాధి, మెరుగైన ఆదాయం లభించాలి. అరకొరగా తీసుకొనే ఆహారంలో తగినన్ని పోషకాలు లేకపోవడంతో వారు అనేక వ్యాధులకు గురవుతున్నారు. ఆహార భద్రతకు తోడుగా పోషకాహార భద్రత కల్పించాలంటే, ప్రజల ఆహార అలవాట్లను మార్చాలి. ఇటీవలి కాలంలో పాతకాలపు ఆహారపు అలవాట్లకు మెజారిటీ ప్రజలు మొగ్గుచూపుతున్నారు. అంటే, వరి అన్నానికి ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలైన, జొన్న, సజ్జ, రాగులు, ఊదలు, కొర్రలు వంటివాటిని ఎక్కువగా తీసుకొంటున్నారు. అందుకే ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేసే బియ్యం, గోధుమలతో పాటు చిరు ధాన్యాలను కూడా తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాలి.

ప్రజలందరికీ ఆహార భద్రత చేకూరాలంటే ముందుగా రైతులకు ఆదాయ భద్రత కలగాలి. రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది గానీ అది ఆచరణలో అరకొరగానే అమలు జరుగుతోంది. రైతుల ఆదాయం పెరగాలంటే వ్యవసాయరంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెరగాలి, మౌలిక సదుపాయాలు, గిడ్డంగుల సౌకర్యం మెరుగుపడాలి. వ్యవసాయ దిగుమతులు తగ్గాలి. సాగు వ్యయాన్ని దృష్టిలో పెట్టుకొని కనీస మద్దతు ధరలను నిర్ణయించాలి. ఆహార భద్రత అనే అంశం రైతాంగం ఆదాయ భద్రతతో ముడిపడి ఉందనే వాస్తవాన్ని గ్రహించనంత వరకూ, ఆ దిశగా చర్యలు చేపట్టనంత వరకూ అందరికీ ఆహార భద్రత అన్నది ఓ ఎండమావిగానే మిగిలిపోతుంది.

వ్యాసకర్త మాజీ కేంద్ర మంత్రి, శాసన మండలి సభ్యులు

శిఖరాయమాన రచన

ఆధునిక దృక్పథాన్ని తన రచనలన్నిటి ద్వారా అందించిన రచయితగా గురజాడ ఈనాటికీ తన ప్రాసంగికతను నిలుపుకొన్నారు. ఆయన తాను పుట్టిన బ్రాహ్మణవర్గం గురించే రాశారనే విమర్శ ఉంది. ఇది సరికాదు. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా, ఆ కుటుంబాల్లోని స్త్రీల దయనీయ స్థితిపై సహానుభూతిని చూపటం గురజాడకు సహజమైన పరిణామం. అతి బాల్య వివాహాలూ, నిర్బంధ వైధవ్యాలూ, అతి కఠినమైన నైతిక చట్రాలూ, ఆర్థిక పరాధీనతలతో నలిగిపోతున్న ఆ స్త్రీలకు మద్దతుగా నిలవటాన్ని తన ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది ఆయన సాహిత్యం. ముఖ్యంగా ‘కన్యాశుల్కం’.

గురజాడ 1862 సెప్టెంబర్ 21న అనకాపల్లి జిల్లా, యలమంచిలి సమీపంలోని రాయవరం గ్రామంలో జన్మించారు. ఆయన 1892లో రాసిన ‘కన్యాశుల్కం’ నిర్దిష్టమైన ఒక చారిత్రక దశలోని ఒక వర్గపు జీవితాన్ని నిశితమైన విమర్శతో, విశాలమైన క్యాన్వాస్‌పై చిత్రించిన రచనగా ప్రాచుర్యం పొందింది. ఇందులో గురజాడ దృక్పథానికి ప్రాతినిధ్యం వహించి నవి పీడితులైన స్త్రీల పాత్రలే తప్ప, పురుష పాత్రలు కావు. చివరికి, గౌరవనీయుడిగా కొంత ఆధిక్యత పొందిన సౌజన్యారావు సైతం మధురవాణి చేతిలో పరాజయం పొందినవారే.



గురజాడ

గురజాడ రచనల్లోని కమలిని, కన్యక, పూర్ణమ్మ, నాంచారమ్మ, వెంకమ్మ, మీనాక్షి, బుచ్చమ్మ లాంటి స్త్రీ పాత్రలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పితృస్వామిక ఆధిపత్యాన్ని నిరసించినవే. గురజాడ సాహిత్యం మొత్తాన్నీ వెదికి చూసినా ఏ ఒక్క స్త్రీ పాత్ర మీద గానీ, పీడిత కులాల పాత్రపై గానీ చిన్నచూపు కనబడదు. ‘స్త్రీల కన్నీటి గాథలకు ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవటం కూడా ఓ ప్రధాన కారణమే’ అని గుర్తించిన గురజాడ, పీడిత కులాల జీవితాల్లో కూడా ఆ సమస్య కున్న ప్రాధాన్యాన్ని గమనించారు. ఆర్థిక స్వావలంబనను కల్పించే ఆధునిక విద్యను వారందరికీ అందించాలని ఆశించారు.

1915 నవంబర్ 30న తుది శ్వాస విడిచిన ఆయన రచనలు చిరస్మరణీయాలు. కులం, మతం, పితృస్వామ్యం, ఆర్థిక అంతరాలు... కొనసాగినంత కాలం గురజాడ పేర్కొన్న ఆధునిక, ప్రజాస్వామిక దృక్పథపు అవసరం ఉంది.

– నందిరాజు రాధాకృష్ణ | సీనియర్ జర్నలిస్ట్

(నేడు గురజాడ 110వ వర్ధంతి)

గణపతి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆశీర్వచన మండపంలో పండితులు వీరికి వేద ఆశీర్వచనం చేసి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

ఇక నుంచి ఆన్‌లైన్‌లో మహానందీశ్వరుడి సేవలు

మహానంది: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహానందీశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఆన్‌లైన్ ద్వారా సేవలు, వసతి గృహాలు, దర్శనం టికెట్లు బుకింగ్ చేసుకునే విధానాన్ని కల్పించినట్లు ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భక్తులు https://www.aptemples.org వెబ్‌సైట్ ద్వారా టికెట్ నమోదు చేసుకోవచ్చన్నారు. నమోదు చేసుకున్న భక్తుల ఆధార్ కార్డు, ఇతర వివరాలు స్థానిక కౌంటర్‌లో పరిశీలించి భక్తులను దర్శనానికి అనుమతిస్తారన్నారు. స్వామి అమ్మవారి దర్శనం సేవలు, ప్రసాదాలు, వసతి గృహాలకు ఆన్‌లైన్ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు.

4న తిరుమలలో దీపోత్సవం

తిరుమల: శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 4న సాలకట్ల కార్తీక పర్వదీపోత్సవాన్ని క్షేత్ర సాంప్రదాయానుసారం టీటీడీ నిర్వహించనుంది. కార్తీక పౌర్ణమి నాడు శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తి అయిన తరువాత ఈ దీపోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాయంత్రం నేతి ఒత్తులతో దీపాలను వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలో శ్రీవారికి హారతి ఇస్తారు. ఆ తర్వాత గర్భాలయంలో అఖండం, కులశేఖర పడి, తదితర స్థలాల వద్ద, ధ్వజస్తంభం, బలి పీఠం, క్షేత్ర పాలకుల సన్నిధి, తిరుమలరాయ మండపం, పూల బావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామి ఆలయం, స్వామి పుష్కరిణి వద్ద దీపాలను ఏర్పాటు చేస్తారు. ఈ కారణంగా డిసెంబర్ 4న సహస్రదీపాలంకరణ సేవను, పౌర్ణమి గరుడ సేవను టీటీడీ రద్దు చేసింది.

కొబ్బరికి మూ'ధాం'

శుక్ర మౌఢ్యమి ప్రభావంతో మందగించిన కొబ్బరి ఎగుమతులు

అంబాజీపేట మార్కెట్‌లో ధర పతనం

వెయ్యి కాయల ధర రూ.13,500 నుంచి రూ.14 వేలే

నాలుగు రోజుల్లో మరో రూ.2,500 వరకూ తగ్గుదల

కోనసీమలో పచ్చికొబ్బరి రాశులు

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరికి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. మూడు నెలల క్రితం ధర ఎంత వేగంగా పెరిగిందో.. ఇప్పుడు అంతకంటే వేగంగా పతనమవుతోంది. కార్తీక మాసం పూర్తవడంతో ఉత్తరాదికి కొబ్బరి ఎగుమతులు తగ్గాయి. ఫలితంగా ధర పడిపోయింది. రెండున్నర నెలల పాటు ఉండే శుక్ర మౌఢ్యమి మొదలవుతుండటంతో ఎగుమతులు మరింత క్షీణించి.. ధర మరింత పతనమైంది. రాష్ట్ర మార్కెట్‌కు దిక్సూచిగా నిలిచే అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌లో వెయ్యి పచ్చికాయల ధర రూ.13,500 నుంచి రూ.14 వేలు మాత్రమే పలుకుతోంది. రెండు నెలల క్రితం పచ్చి కొబ్బరి వెయ్యి కాయల ధర రూ.28 వేల వరకూ ఉండేది. గత నెలలో రూ.23 వేలకు పడిపోయింది. నాలుగు రోజుల క్రితం వెయ్యి కాయల ధర రూ.16 వేలకు తగ్గిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా రూ.13,500కు పతనమైంది. నాలుగు రోజుల్లో రూ.2,500 వరకూ ధర తగ్గిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ఎగుమతులు 20లోపు లారీలే

దీపావళి, కార్తీక మాసం పూర్తవడం, తమిళనాడు, కేరళల్లో దిగుబడులు పెరగడంతో రాష్ట్రంలో పండిన కొబ్బరికి డిమాండ్ తగ్గింది. దీంతోపాటు శుక్ర మౌఢ్యమి కారణంగా ధరలు మరింత పడిపోయాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు కూడా గణనీయంగా తగ్గుతున్నాయి. రోజుకు 20 లారీలలోపు పచ్చి కొబ్బరి ఎగుమతి మాత్రమే జరుగుతోందని వ్యాపారులు వాపోతున్నారు. ఈ ప్రభావం మార్కెట్‌పై పడుతోందని వారు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర పరిహారం అందాలి

హైకోర్టు న్యాయమూర్తులు

జస్టిస్ రవినాథ్ తిల్హారీ

జస్టిస్ బీఎస్ భానుమతి

మంగళగిరి టౌన్: రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర పరిహారం అందించడం అన్ని వ్యవస్థల బాధ్యత అని ఏపీ జ్యుడీషియల్ అకాడమీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ప్రెసిడెంట్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ సూచించారు. గుంటూరు జిల్లా కాజ గ్రామంలో ఉన్న ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో శనివారం మోటారు వాహన చట్టంపై వర్క్‌షాప్ నిర్వహించారు. దీనికి విచ్చేసిన జస్టిస్ తిల్హారీ మాట్లాడుతూ మోటారు వాహన చట్టం పటిష్టంగా అమలు పరచాలన్నారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యులు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి మాట్లాడుతూ చట్టం అమలులో పోలీసులు వ్యవహరించాల్సిన తీరు, బీమా కంపెనీల క్లయిమ్‌ల పరిష్కారంసహా పలు అంశాలను వివరించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరిహరనాథ శర్మ మాట్లాడుతూ ఆచరణాత్మక సవాళ్లు, ప్రత్యామ్నాయ పరిష్కార ప్రక్రియల గురించి తెలిపారు.

బతికున్నా... ఆధార్‌లో చంపేశారు



వెబ్‌సైట్ నుంచి ఆధార్ కార్డును తొలగించినట్లు చూపిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) గంగన్న

'నేను బతికే ఉన్నా చనిపోయానని నా ఆధార్ కార్డును అధికారులు తొలగించారు' అని వైఎస్సార్ కడప జిల్లా టి.చదిపిరాళ్లకు చెందిన మొటిమెర చిన్న గంగన్న ఆవేదన వ్యక్తం చేశాడు. దీని గురించి అధికారులను అడిగితే హైదరాబాద్, ఢిల్లీ వెళ్లి సరి చేసుకోవాలని చెబుతున్నారని చెప్పాడు. ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, ఉన్నతాధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని కోరాడు. – కమలాపురం

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిగా శ్రీగిరికి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి క్యూ లైన్లలో బారులు తీరారు. ఈ నేపథ్యంలో శివనామ స్మరణతో శ్రీశైలం మారుమోగింది. – శ్రీశైలం టెంపుల్

పెళ్లి రోజే.. చివరి రోజు

కర్నూలు జిల్లా కోటేకల్ వద్ద రెండు కార్లు ఢీ.. ఐదుగురు మృత్యువాత

మంత్రాలయం దర్శనానికి వెళ్తుండగా ఘటన

మృతులంతా కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన ఒకే కుటుంబ సభ్యులు

మృతులు వెంకటేషప్ప, సతీష్‌కుమార్, మీనాక్షి, రిత్విక్, బనిత్‌గౌడ్ (ఫైల్)

ప్రమాదానికి గురైన ఫార్చ్యునర్, కారు

ఎమ్మిగనూరు రూరల్/ఎమ్మిగనూరు టౌన్: పెళ్లి రోజును మంత్రాలయంలో జరుపుకుందామని కుటుంబసభ్యులతో కలిసి కారులో బయలుదేరిన భార్యాభర్తలు.. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వారితో పాటు మరో ముగ్గురు కుటుంబసభ్యులు కూడా దుర్మరణం చెందారు. ఈ ఘటన కర్నూలు జిల్లా కోటేకల్ గ్రామం కొండ మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. కర్ణాటకలోని కోలార్ జిల్లా చిక్కహోసహళ్లి, బంగరుపేటకు చెందిన మీనాక్షి(32), సతీష్‌కుమార్ (34) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. తమ పెళ్లి రోజును శనివారం కర్నూలు జిల్లా మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో జరుపుకోవాలనుకున్నారు. కుమారుడు రుత్విక్(4), మీనాక్షి తండ్రి వెంకటేషప్ప(76), తల్లి గంగమ్మ, అన్న కుమారుడు బనిత్(5), స్నేహితుడు చేతన్‌తో కలిసి శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారులో బయలుదేరారు. అదే సమయంలో విజయనగరానికి చెందిన అశోక్, జాహ్నవి, రాధిక హైదరాబాద్ నుంచి ఆదోనికి ఫార్చ్యునర్ కారులో వస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 5.30 గంటల ప్రాంతంలో ఎమ్మిగనూరు మండలం కోటేకల్ కొండల వద్దకు వచ్చేసరికి స్విఫ్ట్‌కారు నడుపుతున్న చేతన్ నిద్ర మత్తు, పొగమంచు వల్ల ఎదురుగా వస్తున్న ఫార్చ్యునర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సతీష్, మీనాక్షి దంపతులతో పాటు కుమారుడు రుత్విక్, బనిత్‌గౌడ్, వెంకటేషప్ప అక్కడికక్కడే మరణించారు. చేతన్, గంగమ్మలకు తీవ్రగాయాలయ్యాయి. ఫార్చ్యునర్‌లో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చేతన్, గంగమ్మను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనాస్థలిని డీఐజీ కోయ ప్రవీణ్, అడ్మిన్ ఎస్పీ ఉసేన్ పీరా, డీఎస్పీ ఎంఎన్ భార్గవి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహసీల్దార్ శేష ఫణి పరిశీలించారు. మృతుల బంధువులను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రకోట రాజీవ్‌రెడ్డి, జగన్ పరామర్శించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ భార్గవి తెలిపారు.

ఎమ్మిగనూరు రోడ్డు ప్రమాదంపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్ వద్ద రెండు కార్లు ఢీకొని.. ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. బాధితులను ఉదారంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

థమ్సప్ బాటిల్‌లో బొద్దింక!

డోన్ టౌన్: నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన ఇంద్ర కిషోర్ అనే యువకుడు కాలనీలోని ఒక దుకాణంలో కొనుగోలు చేసిన థమ్సప్ బాటిల్లో బొద్దింక కనిపించింది. ఇందుకు సంబంధించిన వీడియో శనివారం వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అవుతోంది. కూల్ డ్రింక్ కంపెనీ కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం తగదని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ విషయంపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపారు.

సీ.ఎస్.ఐ.ఆర్-జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ
ఉప్పల్ రోడ్, హైదరాబాద్, తెలంగాణ - 500007

వాక్-ఇన్ ఇంటర్వ్యూ ప్రకటన సంఖ్య PA - 09/2025

సీ.ఎస్.ఐ.ఆర్-ఎన్.జీ.ఆర్.ఐ, హైదరాబాద్ మాస్టర్స్ డిగ్రీ లో జియోఫిజిక్స్ / అప్లైడ్ జియోఫిజిక్స్ / మెరైన్ జియోఫిజిక్స్ / ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్ / జియోఫిజికల్ టెక్నాలజీ / జియోసైన్సెస్ / జియాలజీ / అప్లైడ్ జియాలజీ / మెరైన్ జియాలజీ / ఎర్త్ సైన్సెస్ / భూకంప ఇంజనీరింగ్ / ఇంజనీరింగ్ సీస్మాలజీ / తత్సమానం మొదలైన వాటిలో విద్యార్హతలు కలిగిన ప్రాజెక్ట్ సిబ్బంది పోస్టుల కొరకు 11డిసెంబర్ 2025 తేదీన వాక్-ఇన్-ఇంటర్వ్యూలను నిర్వహిస్తోంది.

మరిన్ని వివరాల కోసం మా వెబ్‌సైట్ www.ngri.res.in ని సందర్శించండి.

సం/-
కంట్రోలర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్

CSIR-INDIAN INSTITUTE OF CHEMICAL TECHNOLOGY
Uppal Road, Tarnaka, Hyderabad – 500 007
Telangana State, India https://www.iict.res.in

Advertisement No. 05/2025 **Dated: 29.11.2025**

Date of Commencement of Online Application : 01.12.2025 at 09:00 A.M. onwards
Last date for receipt/submission of Online Application : 30.12.2025 at 11:59 P.M.

"CSIR strives to have a workforce which reflects gender balance and women candidates are encouraged to apply"

CSIR-Indian Institute of Chemical Technology, Hyderabad (CSIR-IICT) is a Premier Research Institute under the aegis of Council of Scientific & Industrial Research (CSIR), an autonomous body under Ministry of Science & Technology, Government of India. CSIR-IICT is a multi-disciplinary Institute with proven strengths in Organic Chemistry (drugs, agrochemicals and industrial organics), Inorganic & Physical Chemistry including Catalysis, Lipid Science & Technology, Organic Coatings & Polymers, Chemical Biology, Chemical Engineering and Design Engineering.

CSIR-IICT invites **ONLINE APPLICATIONS** from Indian Nationals only for filling up of the following posts, as per details given below:

Designation	No. of posts & Reservations	Pay Level (As per 7th CPC)	Total Emoluments (As per 7th CPC)	Upper Age Limit not exceeding (as on the last date of submission of online application as mentioned in the Advt.)
TECHNICIAN (1)	Total No. of Posts : 10* UR-06# SC-02 OBC- 01 EWS - 01	Level – 2	Rs.39,545/- ** p.m. approx.. (inclusive of Basic Pay, DA, HRA, TA etc.)	28*** years

*Out of 10 posts, 1 post reserved for Ex-Serviceman.
#Out of 6 UR posts, 2 posts reserved for PwBD [PwBD (OH) -01, PwBD (VH) -01]
**Total Emoluments means approximate total emoluments on minimum pay of the level including House Rent Allowance in Class 'X' City.
*** **Please see S.No.3 of General Information & Conditions for age relaxation.**
For further details please visit our website https://www.iict.res.in/CAREERS and apply through online by filling the application form available there. The detailed advertisement, terms & conditions and instructions to the candidates are available on the website.

Sd/-
Controller of Administration

కళ్యాణదుర్గంలో పరువు హత్య!

ప్రేమించిన పాపానికి యువకుడిని హత్య చేసేలా ప్రోత్సహించిన టీడీపీ నేతలు

హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరణ!

పథకం ప్రకారమే చంపేశారంటున్న మృతుడి తల్లిదండ్రులు

ఆనంద్ (ఫైల్)

కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పరువు హత్య జరిగింది. తమ అమ్మాయిని ప్రేమించాడన్న కోపంతో ప్రస్తుతం రాష్ట్రంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ కులానికి చెందిన వారు బోయ (వాల్మీకి) సామాజిక వర్గానికి చెందిన యువకుడిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఇటీవల జరిగిన ఈ ఘటన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని బ్రహ్మసముద్రం మండలం యనకల్లు గ్రామానికి చెందిన బోయ ఆనంద్(21), బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. ఈ విషయం తెలియడంతో యువతి తరపు బంధువులు ఆనంద్‌ను, అతని కుటుంబ సభ్యులను చెప్పులతో కొట్టారు. దీంతో తమ కుమారుడి బతకనీయరని భయపడిన ఆనంద్ తల్లిదండ్రులు అతడిని ఉపాధి కోసం బెంగళూరుకు పంపించేశారు.

యువతికి వేరే పెళ్లి చేసినా..!: అనంతరం యువతికి వేరే పెళ్లి చేశారు. అయితే తాను ఆనంద్‌ను ప్రేమించానని ఆమె భర్తతో చెప్పడంతో ఆ భర్త ఆమెకు విడాకులు ఇచ్చేశాడు. ఆ తర్వాత యువతికి మళ్లీ పెళ్లి చేసేందుకు ఆమె కుటుంబ సభ్యులు సిద్ధపడ్డారు. ఈ నేపథ్యంలో యువతి ఆనంద్‌కు వీడియో కాల్ చేసి పురుగు మందు బాటిల్ చూపించి ''నువ్వు రాకపోతే చనిపోతా'' అని బెదిరించింది. దీంతో భయపడిన ఆనంద్ ఈ నెల 20న బెంగళూరు నుంచి కళ్యాణదుర్గం వచ్చాడు. మరుసటి రోజు (21న) అతను పురుగు మందు తాగినట్టు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటికి పూర్తి వివరాలు తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

టీడీపీ నేతల ఒత్తిళ్లు: బోయ ఆనంద్ మృతికి టీడీపీ నేతల ఒత్తిళ్లే కారణమని ప్రాథమికంగా నిర్ధారణైంది. అతని సెల్ ఫోన్‌లో మెసేజ్‌లు, ఆడియో, వీడియో రికార్డింగ్ ఉండటంతో.. తమ కుమారుడిది ఆత్మహత్య కాదని, ఇది ముమ్మాటికే హత్యేనని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. యువతి తరపు బంధువులు పథకం ప్రకారం బెంగళూరు నుంచి ఆనంద్‌ను రప్పించి ఆతర్వాత బలవంతంగా కొట్టి పురుగుల మందు తాగించారని ఆరోపిస్తున్నారు.

హత్యకాదు.. ఆత్మహత్యే: ఇదిలా ఉంటే ఆనంద్‌ది ఆత్మహత్యేనని, అతను వారం రోజుల క్రితం బలవన్మరణానికి పాల్పడ్డాడని డీఎస్పీ రవిబాబు తెలిపారు. డీఎస్పీ శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ఆనంద్‌ను హత్య చేశారనేందుకు ఎలాంటి ఆధారాలూ లేవన్నారు.

మాకు సంబంధం లేదు: ఆనంద్ మృతితో తమకు సంబంధం లేదని బెళుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన యువతి తల్లి తెలిపారు. శనివారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆనందే తమ కుమార్తె వెంటపడి వేధించాడని, ఆమె మొదటి భర్తకు లేనిపోనివి చెప్పి విడాకులు ఇచ్చేలా చేశాడని తెలిపారు. ఇప్పుడు మరో సంబంధం కుదిరితే మళ్లీ తమ కుమార్తెను బెదిరించాడని, తమ అమ్మాయి ఒప్పుకోక పోవడంతో ఆనంద్ ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని వెల్లడించారు. అంతేకానీ అతని మరణానికి తమకు సంబంధం లేదని వివరించారు.

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

బోయ ఆనంద్‌ది ముమ్మాటికీ పరువు హత్యే. అగ్రకుల యువతిని ప్రేమించాడనే కారణంతోనే హత్య చేశారు. బతుకు తెరువు కోసం బోయ ఆనంద్ బెంగళూరుకు వెళ్లినా.. అతన్ని స్వగ్రామానికి పిలిపించి హత్య చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ కరువైంది.దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ తలారి రంగయ్య, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త

61 శాతం భారత్ భూకంప జోన్‌లోకి..

దేశ చరిత్రలోనే తొలిసారి | పెను ప్రమాదానికి సూచికే! | అత్యంత డేంజర్ జోన్‌లో హిమాలయాలు

ప్రపంచంలో పలు దేశాలను అల్లాడించిన భూకంపాలు త్వరలో భారత్‌పైకీ విరుచుకుపడే ప్రమాదం పొంచి ఉన్నట్టు కనిపిస్తోంది. దేశంలో ఏకంగా 61 శాతం ప్రాంతం సాధారణం నుంచి ప్రమాదకర భూకంప రిస్కు పరిధిలోకి చేరడమే ఇందుకు కారణం. కేంద్ర ప్రభుత్వానికి చెందిన బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) కొత్తగా సవరించిన భూకంప డిజైన్ కోడ్ ఈ ప్రమాదకర వాస్తవాన్ని వెల్లడించింది. అంతేకాదు, పొంచి ఉన్న భూకంప ప్రమాద తీవ్రతను తెలియజెప్పేందుకు కొత్తగా 'అత్యంత ఎక్కువ రిస్కు'జోన్ కేటగిరీని కూడా చేర్చింది. మొత్తం హిమాలయ ప్రాంతమంతటినీ జోన్–6గా పేర్కొన్న ఈ కేటగిరీలోకి చేర్చడం మరింత ఆందోళన పడాల్సిన అంశం!

ఇప్పుడేం మారింది?

హిమాలయాలు గతంలో 4, 5 జోన్ల పరిధిలో ఉండేవి. ఆ ప్రాంతమంతా నిజానికి ఒకే టెక్టానిక్ పలకపై ఉన్నా భూకంప రిస్కు తీవ్రతలో తేడా ఆధారంగా అప్పట్లో అలా విభజన చేశారు. అయితే ఆ క్రమంలో భూ లోతుల్లోని పొడవాటి అగాధపు ప్రాంతాలతో పొంచి ఉన్న ముప్పును సరిగా మదింపు చేయడంలో విఫలమైనట్టు సైంటిస్టులే అంగీకరిస్తున్నారు. ముఖ్యంగా మధ్య హిమాలయ ప్రాంతాల్లో పలు అత్యధిక భూకంప రిస్కున్న పలు భూభాగాలు ఈ తప్పిదం వల్ల సాధారణ రిస్కున్నవిగా పరిగణన పొందుతూ వచ్చాయి. దాన్నిప్పుడు సరిచేసినట్టు బీఐఎస్ వెల్లడించింది. నిజానికి మధ్య హిమాలయ ప్రాంతాల్లో గత రెండు దశాబ్దాల్లో భూకంపం జాడలు కూడా కన్పించలేదు. అంత మాత్రాన అక్కడ అంతా సజావుగా ఉన్నట్టు అసలే కాదని బీఐఎస్ పేర్కొంది.

ఎందుకిలా డేంజర్ జోన్‌లోకి?

హిమాలయాలు ప్రపంచంలోనే అత్యంత చురుగ్గా ఢీకొట్టే టెక్టానిక్ పలకల సరిహద్దులపై ఉన్నాయి. మరోలా చెప్పాలంటే ఎప్పుడైనా బద్దలయ్యే అవకాశమున్న మందుపాతరపై ఉన్నాయన్నమాట. ఇండియన్ టెక్టానిక్ ప్లేట్ నిరంతరం యురేషియన్ ప్లేట్‌లోకి చొచ్చుకుపోతూ వస్తోంది. ఫలితంగా ఏటా కనీసం 5 సెంటీమీటర్ల మేరకు అందులోకి చొరబడుతూ వెళ్తోంది. రెండు ప్లేట్లు ఢీకొంటున్న కారణంగానే అక్కడ భూ ఉపరితలం పైపైకి పెరుగుతూ వస్తోంది. హిమాలయాల ఆవిర్భావానికి మూలకారణం కూడా ఇదే. ఎవరెస్టుతో పాటు ప్రపంచంలోకెల్లా పలు పర్వత శిఖరాలు హిమాలయాల్లోనే ఉండేందుకూ ఇదే కారణం. కనుక అవి చల్లగా కన్పించేది కేవలం పైకి మాత్రమే. ఈ టెక్టానిక్ ఒత్తిడి మూలంగా హిమాలయ గర్భమంతా నిత్యం అలజడిమయంగానే ఉంటూ ఉంటుంది. టెక్టానిక్ పలకల పరస్పర తాకిడి భూ కేంద్రంపైనా విపరీతమైన ఒత్తిడికి కారణమవుతోంది. ఆ ఒత్తిడి ఎప్పుడో ఓసారి హఠాత్తుగా విడుదలవుతుంటుంది. అది కాస్తా అత్యంత శక్తిమంతమైన భూకంపాల రూపంలో పైకి ఎగదన్నుకొస్తుంది. ఇది చాలదన్నట్టు భూమ్మీద అత్యంత అస్థిరమైన పర్వత ప్రాంతం హిమాలయాలే. వయసుపరంగా అన్ని పర్వతాల కంటే చిన్నవి కూడా. దాంతో హిమాలయాల్లోని రాళ్లు తదితరాలు నిత్యం అటూఇటూ మంద్రస్థాయిలో కదలాడుతూనే ఉంటాయి. అందుకే ఇక్కడ గనక భూకంపం సంభవిస్తే అతి అత్యంత ప్రాణాంతకమే అవుతుంది.



అంతా అక్కడే!

మెయిన్ బౌండరీ, మెయిన్ సెంట్రల్, మెయిన్ ఫ్రంటల్... ఇలా భూ కేంద్రంలోని ప్రధాన ఫాల్ట్ సిస్టమ్స్ (భారీ రంధ్రాలని చెప్పుకోవచ్చు)లో అతి పెద్దవన్నీ హిమాలయాల కిందే కేంద్రీకృతమై ఉన్నాయి. అంతేగాక పలు భూకంప విరామ ప్రాంతాలు (కొన్ని శతాబ్దాలుగా అసలు భూకంపమే రానివి) కూడా హిమాలయాల్లోనే ఎక్కువగా ఉన్నట్టు సైంటిస్టులు తేల్చారు. అలాంటి ప్రాంతాల్లో భారీ భూకంపానికి ఎప్పుడైనా ఆస్కారం పుష్కలంగా ఉంటుందట. కర్ణుని చావుకు మాదిరిగా ఇన్ని కారణాలు కలగలిసి హిమాలయాలను ప్రపంచంలోకెల్లా భూకంప రిస్కు అత్యంత ఎక్కువగా ఉన్న ప్రాంతాల జాబితాలోకి చేర్చేశాయి. హిమాలయాల్లోని డెహ్రాడూన్, మొహందో తో పాటు మొత్తం ఉత్తరాఖండ్ అంతా తాజాగా భూకంప డేంజర్ జోన్లోకి వచ్చింది. అక్కడ జనాభా నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతుండటమే ఇందుకు ప్రధాన కారణంగా మారింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఓ ఇంటి వాడైన అల్బనీస్

- పదవిలో ఉండగా పెళ్లి చేసుకున్న ఆస్ట్రేలియా మొదటి ప్రధానిగా రికార్డు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్(62) ఓ ఇంటి వాడయ్యారు. తన చిరకాల భాగస్వామి జోడీ హేడెన్(46)ను వివాహమాడారు. రాజధాని కాన్‌బెర్రాలోని అధికార నివాసంలో రహస్యంగా కొద్ది మంది కుటుంబసభ్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీరిద్దరు ఒక్కటయ్యారు. 124 ఏళ్ల ఆస్ట్రేలియా ఫెడరల్ ప్రభుత్వ చరిత్రలో పదవిలో ఉండగా పెళ్లి చేసుకున్న మొట్టమొదటి ప్రధానిగా అల్బనీస్ చరిత్ర నెలకొల్పడం విశేషం. ప్రముఖ హాలీవుడ్ నటుడు రస్సెల్ క్రోతోపాటు కేబినెట్ సహచరులు తదితర 60 మంది వరకు కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ పెళ్లి గురించి మీడియాకు తెలియనివ్వలేదు. 'మా ప్రేమను, భవిష్యత్ జీవితాన్ని కుటుంబం, అత్యంత సన్నిహితులతో కలిసి గడపాలనే మా నిబద్ధతను తెలియజేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది'అని అనంతరం నూతన జంట ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, అల్బనీస్‌కు మొదటి వివాహం ద్వారా కలిగిన కుమారుడు ఉన్నాడు. ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న హేడెన్‌తో అల్బనీస్‌కు 2020లో ఓ డిన్నర్ సందర్భంగా పరిచయం ఏర్పడింది. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, హేడెన్ దంపతులకు భారత ప్రధాని మోదీ శనివారం ఎక్స్‌లో వివాహ శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు.

భద్రతా వ్యవస్థపై విస్తృత చర్చ

డీజీపీలు, ఐజీపీల సదస్సులో నేడు ప్రసంగించనున్న మోదీ

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో శనివారం అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీపీల వార్షిక సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం వహించారు. దేశ భద్రతా వ్యవస్థపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించినట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ సదస్సు గోప్యంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. దేశ భద్రత విషయంలో అత్యుత్తమ విధానాలు, నూతన పద్ధతులను పంచుకోవడానికి పోలీసు అధికారుల సదస్సు ఒక ఉత్తమమైన వేదిక అని పేర్కొన్నారు. ప్రధాని మోదీ శుక్రవారం రాత్రి రాయ్‌పూర్‌కి చేరుకున్నారు. శనివారం ఉదయం సదస్సుకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఐబీ చీఫ్ తపన్‌కుమార్ డేకా, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే డీజీపీలు, ఐజీపీల సదస్సును కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం ప్రారంభించిన సంగతి తెలిసిందే. దేశంలో నక్సలిజం, తీవ్రవాదం, ఉగ్రవాదం వంటి సమస్యలకు నరేంద్ర మోదీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తోందని ఆయన అన్నారు. ఆదివారం సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారు.

ఎయిర్‌బస్ 'ఏ320'పై సౌరదాడి

వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలని ఆదేశం

- భారత్‌లో 338 విమానాలకు గాను 270 విమానాల్లో ప్రక్రియ పూర్తి
- ఆలస్యంగా నడిచిన పలు విమానాలు.. నాలుగు ఫ్లయిట్లు రద్దు
- నేడు సాయంత్రం కల్లా సాఫ్ట్‌వేర్ అప్‌గ్రెడేషన్ పూర్తి

న్యూఢిల్లీ: ప్రఖ్యాత ఎయిర్‌బస్ సంస్థ తయారు చేసిన ఏ320 మోడల్ విమానంపై సోలార్ రేడియేషన్ దాడి చేయడం, తద్వారా సాంకేతిక సమస్య తలెత్తడం ప్రపంచవ్యాప్తంగా ఇదే మోడల్ విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎయిర్‌బస్ సంస్థ సూచన మేరకు భారత్‌లోని విమానయాన సంస్థలు ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయడం శనివారం ప్రారంభించాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు ఏ320 విమానాలను ఉపయోగిస్తున్నాయి. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) సమాచారం ప్రకారం.. దేశంలో 338 ఏ320 మోడల్ విమానాలు ఉండగా, 270 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పూర్తయ్యింది. అయితే, ఈ ప్రక్రియ కారణంగా వందలాది ఏ320 విమానాలు 60 నుంచి 90 నిమిషాలపాటు ఆలస్యంగా నడిచాయి. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన నాలుగు విమానాలు రద్దయ్యాయి. ఆదివారం సాయంత్రం 6 గంటలకల్లా అన్ని విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పూర్తవుతుందని, తర్వాత విమానాలు యథాతథంగా రాకపోకలు సాగిస్తాయని చెబుతున్నారు. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, ముంబై, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతా విమానాశ్రయాల్లో ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నారు.

ప్రపంచమంతటా ప్రభావం

ప్రపంచవ్యాప్తంగా 8,100 వరకు ఏ320 మోడల్ విమానాలు ఉపయోగంలో ఉన్నాయి. ఇందులో దాదాపు 6,000 విమానాలకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అవసరమని గుర్తించారు. కొన్నింటికి హార్డ్‌వేర్ కూడా మార్చాల్సి ఉందని అంటున్నారు. ఎయిర్‌బస్ సూచన మేరకు సంబంధిత విమానయాన సంస్థలు అదే పనిలో నిమగ్నమయ్యాయి. శుక్రవారం, శనివారం ప్రపంచమంతటా ఏ320 విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చాలావరకు విమానాలు రద్దయ్యాయి. కొన్ని ఆలస్యంగా నడిచాయి. వారాంతంలోనే ఈ సమస్య తలెత్తడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దాదాపు 5,000 విమానాల్లో సాఫ్ట్‌వేర్ అప్‌గ్రెడేషన్ పూర్తయ్యిందని, అవి తిరిగి కార్యకలాపాలు సాగిస్తున్నాయని, సాధారణ పరిస్థితి నెలకొందని ఎయిర్ బస్ ప్రతినిధులు చెప్పారు. మిగిలిన విమానాల్లో సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయడానికి చర్యలు చేపట్టామని తెలిపారు.

అసలేం జరిగింది?

అక్టోబర్ 30న మెక్సికో నుంచి అమెరికాలోని న్యూజెర్సీకి బయలుదేరిన జెట్‌బ్లూ ఎయిర్‌బస్ ఏ320 విమానంలో సాంకేతిక సమస్య ఏర్పడింది. విమానం ప్రయాణిస్తున్న ఎత్తు హఠాత్తుగా తగ్గిపోయింది. ఏడు సెకండ్ల వ్యవధిలో విమానం 100 అడుగుల మేర వేగంగా కిందికి దిగింది. దాంతో 15 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని దారి మళ్లించి, అమెరికాలో ఫ్లోరిడా తీరంలోని తంపా ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా దించారు. సోలార్ రేడియేషన్ కారణంగా విమానంలో ఎలివేటర్, ఎలిరాన్ కంప్యూటర్(ఈఎల్ఏసీ) వ్యవస్థలో మార్పులు వచ్చినట్లు గుర్తించారు. అందుకే విమానం హఠాత్తుగా కిందికి దిగినట్లు తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏ320 మోడల్ విమానాల్లో ఇలాంటి సమస్యే ఉత్పన్నమయ్యే అవకాశం ఉండడంతో తక్షణమే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోవాలని ఎయిర్‌బస్ సంస్థ శుక్రవారం సూచించింది. లేకపోతే ఫ్లైట్ కంట్రోల్‌కు సంబంధించిన డేటా సోలార్ రేడియేషన్ వల్ల తారుమారయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. దీనిపై డీజీసీఏ వెంటనే స్పందించింది. భారత విమానయాన సంస్థలకు శనివారం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఎయిర్‌బస్ సంస్థ నెదర్లాండ్స్‌లో రిజిస్టర్ అయ్యింది. కానీ, ప్రధాన కార్యాలయం ఫ్రాన్స్‌లో ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద విమానాల తయారీ సంస్థ. ఏ320 అనేది ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడవుతున్న విమానం.

ఢిల్లీలో పేలుళ్ల కేసు.. నిందితులకు 10 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటన కేసులో ముగ్గురు వైద్యులతోపాటు ఒక బోధకుడికి కోర్టు శనివారం 10 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. వీరిలో ముజమ్మిల్ గనీ, అదీల్ రాథర్, షహీనా సయీద్ అనే ముగ్గురు వైద్యులతోపాటు మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్ వాగే ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి ఎన్ఐఏ ఇప్పటి వరకు ఏడుగురిని అరెస్ట్ చేసింది.

ఉగ్ర కుట్రలోకి మహిళలు

వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్‌లోకి మహిళలను ఎంపిక చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు డాక్టర్ షహీన్ షహీద్ తెలిపిందని ఎన్ఐఏ శనివారం వెల్లడించింది. అల్–ఫలాహ్‌లో మాజీ ఫార్మకాలజిస్ట్ అయిన ఆమె క్యాంపస్‌లో ఉన్నప్పుడు వినియోగించిన గదిలో ఎన్ఐఏ అధికారులు జరిపిన సోదాల్లో రూ.18.5 లక్షల నగదుతోపాటు బంగారం బిస్కెట్లు, ఫారిన్ కరెన్సీ లభించాయని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా అధికారులు ఈమెను గురువారం అల్–ఫలాహ్ కాలేజీ క్యాంపస్‌కు తీసుకెళ్లారు. మెడికల్ వార్డు, క్లాస్ రూం, ఆమె క్యాబిన్‌లను చూపించి, ఆమె అక్కడ ఏం చేసేది? ఎవరితో కాంటాక్టులో ఉండేది? వంటి వివరాలను రాబట్టారు.

అణచివేత ఉన్నచోట జిహాద్ తప్పదు

మైనార్టీల హక్కులను న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం నిరాకరిస్తున్నాయి

- ప్రభుత్వ ఒత్తిడి మేరకే న్యాయ వ్యవస్థ పనిచేస్తోంది
- జిహాద్‌కు వక్రభాష్యాలు చెబుతున్నారు
- జమియత్ ఉలేమా–ఇ–హింద్ అధ్యక్షుడు మదానీ వివాదాస్పద వ్యాఖ్యలు

మదానీ

న్యూఢిల్లీ: జమియత్ ఉలేమా–ఇ–హింద్ అధ్యక్షుడు మహమూద్ మదానీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అణచివేత ఉన్నచోట జిహాద్ తప్పదని తేల్చిచెప్పారు. మైనార్టీల హక్కులను న్యాయ వ్యవస్థ, ప్రభుత్వం నిరాకరిస్తున్నాయని ఆరోపించారు. బాబ్రీ మసీదు, ట్రిపుల్ తలాఖ్ కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన తప్పుపట్టారు. ప్రభుత్వ ఒత్తిడి మేరకే న్యాయ వ్యవస్థ పనిచేస్తోందని విమర్శించారు. భారత రాజ్యాంగం మైనార్టీలకు ఇచ్చిన హక్కులను బహిరంగంగా ఉల్లంఘించేలా కోర్టు తీర్పులు ఉంటున్నాయని ఆక్షేపించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించినంత వరకే సుప్రీంకోర్టును 'సుప్రీం'అని పిలవాలని తేల్చిచెప్పారు. అలా పరిరక్షించలేకపోతే 'సుప్రీం'అని పిలిపించుకొనే అర్హత ఆ కోర్టుకు ఉండదని పేర్కొన్నారు. మదానీ తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడారు. భారత్‌లో ముస్లింల పట్ల ప్రజల వైఖరిని వెల్లడించారు. ముస్లింలకు దేశ జనాభాలో 10 శాతం మంది మద్దతిస్తున్నారని, 30 శాతం మంది వ్యతిరేకిస్తున్నారని, 60 శాతం మంది నిశ్శబ్దంగా ఉండిపోతున్నారని చెప్పారు. ఇలా నిశ్శబ్దంగా ఉంటున్న 60 శాతం మందితో సంబంధాలు బలోపేతం చేసుకోవాలని ముస్లింలకు పిలుపునిచ్చారు. మన సమస్యలను వారికి వివరించాలని అన్నారు. ఒకవేళ ఆ 60 శాతం మంది ముస్లింలకు వ్యతిరేకంగా మారితే మాత్రం దేశంలో అతిపెద్ద ప్రమాదం ముంచుకొస్తుందని చెప్పారు.

ఇతరులకు మంచి చేయడమే జిహాద్

జిహాద్‌కు వక్రభాష్యాలు చెబుతున్నారని, తప్పుడు అర్థాలు తీసుకొస్తున్నారని మదానీ మండిపడ్డారు. ఇందులో మీడియాతోపాటు ప్రభుత్వం బాధ్యత ఉందని ధ్వజమెత్తారు. కుట్రలో భాగంగానే లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, స్పిట్(ఉమ్మి) జిహాద్‌ను తెరపైకి తెచ్చారని విమర్శించారు. జిహాద్‌కు అసలైన అర్థం అది కాదని అన్నారు. జిహాద్ ఎప్పటికీ పరమ పవిత్రమైనదని వెల్లడించారు. ఇతరులకు మంచి చేయడం, వారి జీవితాలను మెరుగుపర్చడమే జిహాద్ అని వివరణ ఇచ్చారు. అణచివేత ఉన్నచోట జిహాద్ కచ్చితంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. మన దేశంలో రాజ్యాంగం ప్రకారం లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థ ఉందని గుర్తుచేశారు. ముస్లింలు రాజ్యాంగానికి విధేయులుగానే ఉంటున్నారని తెలిపారు. పౌరుల హక్కులను కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని ఉద్ఘాటించారు. ఆ పని ప్రభుత్వం చేయకపోతే తదుపరి పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. జాతీయ గీతం వందేమాతరంపైనా మదానీ సంచలన వ్యాఖ్యలు చేశారు. మృతప్రాయంగా మారిన ఓ సమూహం లొంగిపోయిందని అన్నారు. ఎవరైనా వందేమాతరం అని అంటే ఆ సమూహం ఆ గీతం పాడుతోందని ఆక్షేపించారు. తాము సజీవంగా ఉన్న సమూహమని, ఎలాంటి పరిణామాలైనా సరే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నట్లు తేల్చిచెప్పారు.

కొత్త జిన్నాలు పుట్టుకొస్తున్నారు: బీజేపీ

మహమూద్ మదానీ వ్యాఖ్యలపై మధ్యప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే రామేశ్వర్ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ముస్లింలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొడుతున్నారని, రాజ్యాంగబద్ధమైన సంస్థలను సవాలు చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో కొత్త జిన్నాలు పుట్టుకొస్తున్నారని విమర్శించారు. మదానీ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని, అతడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించడం మానుకోవాలని, ఇప్పటికైనా హద్దుల్లో ఉండాలని మదానీని హెచ్చరించారు. దేశంలో మదానీ లాంటి వ్యక్తులే ఉగ్రవాదులను, జిహాదీలను, రేపిస్టులను ఉత్పత్తి చేస్తున్నారని, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్, ఉమ్మి జిహాద్‌కు మద్దతిస్తున్నారని రామేశ్వర్ శర్మ దుయ్యబట్టారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తిచేసి, అమాయకులను హత్యచేస్తే శిక్షించకుండా బిర్యానీలు పెట్టి మర్యాదలు చేయాలా? అని ప్రశ్నించారు. ముస్లింల పిల్లలు బాగా చదువుకొని డాక్టర్లయితే గౌరవిస్తామని అన్నారు. కానీ, డాక్టర్లుగా మారి బాంబులు విసిరితే అవే బాంబుల్లో కాలిపోతారని హెచ్చరించారు.

కేసుల లిస్టింగ్ కోసం లిఖితపూర్వకంగా కోరాల్సిందే

- నోటిమాటగా చెప్పే విధానం ఇకపై ఉండదు
- సర్క్యులర్ జారీ చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో విచారణ చేపట్టాల్సిన కేసులను క్రమబద్ధం చేయడానికి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చర్యలు ప్రారంభించారు. అత్యవసరంగా విచారణ జరపాల్సిన అవసరం ఉన్న కేసుల గురించి సంబంధిత న్యాయవాదులు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు సర్క్యులర్ జారీ చేసింది. ఈ నిబంధన డిసెంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందన్నారు. నోటిమాటగా చెప్పే విధానం ఇక ఉండదని పేర్కొన్నారు. అసాధారణమైన సందర్భాల్లో నోటిమాటగా అభ్యర్థించవచ్చని వెల్లడించారు. సర్క్యులర్‌ప్రకారం చూస్తే.. కొత్త కేసులు ధర్మాసనం ఎదుట ఆటోమేటిక్‌గా లిస్టింగ్ అవుతాయి. లాయర్లు ప్రత్యేకంగా సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదు. వ్యక్తుల స్వేచ్ఛ, వెంటనే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన కేసుల్లో రెండు పని దినాల్లోనే విచారణ చేపడతారు. ముందస్తు బెయిల్, మరణశిక్ష, హెబియస్ కార్పస్, కూల్చివేత తదితర కేసుల విచారణ కోసం షెడ్యూల్డ్ తేదీ దాకా వేచి చూడాల్సిన అవసరం లేదు. ఉదయం 10 నుంచి 10.30 గంటల మధ్య అభ్యర్థించవచ్చు. ఇతర కేసుల లిస్టింగ్ విషయంలో సీనియర్ లాయర్లు లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వాల్సిందే. జూనియర్ లాయర్లకు మినహాయింపు ఉంటుంది.

శ్రీలంకలో దిత్వా విధ్వంసం

- 153 మంది మృతి.. 191 మంది గల్లంతు
- దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం

శనివారం కొలంబోలో వీధులను ముంచెత్తిన వరద

కొలంబో: శ్రీలంకలో దిత్వా తుపాను తీవ్ర విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. గురువారం నుంచి సంభవించిన తుపాను సంబంధిత ఘటనల్లో కనీసం 153 మంది మృతి చెందగా మరో 191 మంది జాడ తెలియకుండా పోయారు. దిత్వా తీవ్రత కారణంగా పలు ప్రావిన్స్‌లలో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనలతో జనం కకావికలయ్యారు. దేశంలోని 35 శాతం ప్రాంతానికి శుక్రవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు అంచనా. శ్రీలంక ప్రజలను ఆదుకునేందుకు భారత ప్రభుత్వం శనివారం 21 టన్నుల అత్యవసర ఆహారాన్ని పంపించింది. శుక్రవారం మొదటి విడతగా ఆరుటన్నుల అత్యవసర ఆహారం, వస్తువులను పంపిన విషయం తెల్సిందే. దేశంలోని 25 జిల్లాలకు చెందిన 7.75 లక్షల మందిపై దిత్వా ప్రభావం చూపింది. బాధితుల కోసం 798 సహాయక కేంద్రాలను తెరిచినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పరిస్థితుల్లో దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తూ శనివారం ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దీంతో, జిల్లా అధికారులకు రూ.5 కోట్ల వరకు సహాయక పనుల కోసం వెచ్చించే అధికారం లభిస్తుంది. పన్నాలా ప్రాంతంలోని వృద్ధుల సంరక్షణ కేంద్రంలో ఉన్న 25 మంది వరదల్లో కొట్టుకుపోయారు. వీరిలో 14 మందిని పోలీసులు రక్షించారు. కలవోయా ప్రాంతంలో ఓ బస్సులో చిక్కుకుపోయిన 68 మందిని కొన్ని గంటలపాటు ప్రయత్నించి కాపాడామని సైన్యం తెలిపింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు అంటున్నారు. సెంట్రల్ ప్రావిన్స్‌లోని చాలా ప్రాంతాలతో బయటి సంబంధాలు తెగిపోయాయి. రహదారులు ధ్వంసం కాగా, విద్యుత్ వ్యవస్థ స్తంభించింది. మొబైల్ ఫోన్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. నదులు పొంగిప్రవహిస్తుండగా జలాశయాలు నిండుకుండల్లా మారాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. సహాయక చర్యల కోసం శ్రీలంక ప్రభుత్వం ఆర్మీని రంగంలోకి దించింది. ఆగని వర్షాలు, వరదల కారణంగా సహాయక చర్యలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. అడ్డంకుల మధ్యనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం సిబ్బంది శ్రమిస్తున్నారని ప్రభుత్వం పేర్కొంది.

నేనున్నానంటూ.. భారత్ సాయం

శ్రీలంక ప్రజలకు సాయంగా నిలిచేందుకు శనివారం భారత ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆపరేషన్ సాగర్ బంధులో భాగంగా శనివారం వైమానిక దళానికి చెందిన రవాణా విమానం సీ–130, ఐఎల్–76 ద్వారా పారామిలటరీ సిబ్బందిని, 21 టన్నుల టెంట్లు, టార్పలిన్లు, దుప్పట్లు, ఇతర ఆహార సామగ్రిని పంపించింది. ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన 80 మంది సిబ్బందితోపాటు సహాయక చర్యల కోసం ఐఎన్ఎస్ విక్రాంత్ ద్వారా సాయం అందించేందుకు రెండు చేతక్ హెలికాప్టర్లను కూడా పంపింది. మరింత సాయంతో విశాఖ నుంచి బయలుదేరిన ఐఎన్ఎస్ సుకన్య త్వరలోనే శ్రీలంకకు చేరుకుంటుందని అధికారులు తెలిపారు. శుక్ర, శనివారాల్లో కలిపి శ్రీలంకకు మొత్తం 27 టన్నుల అత్యవసర సాయం పంపామని కేంద్రం తెలిపింది. భారత్‌తోపాటు అమెరికా ప్రభుత్వం 2 లక్షల డాలర్ల అత్యవసర సాయం, మాల్దీవుల ప్రభుత్వం 50 వేల డాలర్లపాటు 25 వేల క్యాన్ల టునా చేపలను శ్రీలంకకు అందజేస్తామని ప్రకటించాయి.

రిజర్వేషన్లపై నిరసన తెలుపుతున్న బోడోల్యాండ్ వర్సిటీ విద్యార్థులు

బోడోల్యాండ్ సెక్రటేరియట్‌లో విద్యార్థుల విధ్వంసానికి సాక్ష్యం

6 కులాలకు ఎస్టీ హోదా

- అసోం అసెంబ్లీలో నివేదిక
- భగ్గుమన్న గిరిజన విద్యార్థులు
- బోడోలాండ్ మండలికి నిప్పు

గువాహటి/కోక్రాజార్: అసోంలో కులాల కుంపటి రాజుకుంటోంది. ఆరు ప్రధాన కులాలకు ఎస్టీ హోదా కల్పించాలన్న ప్రతిపాదనపై ఏర్పాటైన మంత్రుల బృందం తమ మధ్యంతర నివేదికను శనివారం అసెంబ్లీకి సమర్పించింది. గిరిజన మంత్రి రానిజ్ పెగు నివేదికలు ప్రవేశపెట్టారు. అహోం, చుటియా, మోరాన్, మతక్, కోచ్–రాజ్‌భోంగ్సి, తేయాకు గిరిజనులు (ఆదివాసీలు) ఈ జాబితాలో ఉన్నారు. వీరు ఎప్పటినుంచో ఎస్టీ హోదా డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత గిరిజన సమూహాలకు ఎలాంటి నష్టమూ కలగకుండా వీరికి కూడా ఆ ప్రయోజనాలు కల్పించడంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్టు మంత్రి పెగు సభకు వివరించారు. అందుకు సంబంధించిన వివరాలు, గణాంకాలతో పాటు తలపెట్టిన మార్పుచేర్పులు తదితరాలను మంత్రి సభ ముందుంచారు. ఆరు బోర కులాలకు ఎస్టీ హోదాపై మంత్రుల బృందం సమర్పించిన మధ్యంతర నివేదికపై అసోం గిరిజన విద్యార్థి లోకం మండిపడింది. బోడోలాండ్ ప్రాదేశిక మండలి భవనానికి నిప్పు పెట్టి నిరసన తెలిపింది. వర్సిటీ నుంచి 6 కి.మీ. దూరంలోని బోడోలాండ్ ప్రాదేశిక మండలి దాకా స్టూడెంట్స్ మార్చి చేశారు. బారికేడ్లను బద్దలు కొట్టుకుని లోనికి ప్రవేశించారు. ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు. దాంతో అదనపు పోలీసు బలగాలని రప్పించి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. ఆందోళనల్లో ఆల్ బోడో స్టూడెంట్స్ యూనియన్, పలు ఇతర అనుబంధ గిరిజన యూనియన్లు నిరసనలు, ధర్నాలు, ర్యాలీలో పాల్గొని హోరెత్తించాయి. వీరంతా ఇదే అంశంపై గురువారం కూడా రోడ్డెక్కాయి.

2047 నాటికి సూపర్ పవర్ ఇండియా

ఇస్రో మాజీ చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడి

డెహ్రాడూన్: 2047 నాటికి మన దేశం సూపర్ పవర్‌గా మారడం ఖాయమని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) మాజీ చైర్మన్ ఎస్.సోమనాథ్ స్పష్టంచేశారు. అంతిరక్ష సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్ ఇతర దేశాలకు ఎగుమతి చేయనుందని చెప్పారు. ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో ఏబీవీపీ సదస్సులో ఎస్.సోమనాథ్ మాట్లాడారు. విశ్వాసం, వాస్తవం తరహాలో సైన్స్, ఆధ్యాత్మికత కలిసి ఉండాలని పేర్కొన్నారు. మన దేశం శరవేగంగా ముందుకు దూసుకెళ్తోందని, ప్రజల్లో నూతన విశ్వాసం ఏర్పడుతోందని తెలిపారు. ప్రజాస్వామ్య స్థిరత్వానికి భారత్ మూలస్తంభమని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయని వెల్లడించారు. మన దేశ జనాభాలో 25 శాతం మంది యువతే కావడం మనకు సానుకూల అంశమని తెలియజేశారు. రాబోయే 25 ఏళ్లపాటు ఇదే పరిస్థితి ఉంటుందని, మనకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దార్శనికతను ఎస్.సోమనాథ్ ప్రశంసించారు. అణు ఇంధన రంగంలోకి ప్రైవేట్ సంస్థలకు ప్రవేశం కల్పించడం గొప్ప విషయమని చెప్పారు.

సాగర్ నీటి మట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 581.20 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 15,334 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2100 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ 42.1600 టీఎంసీలు ఉంది.

హంసలదీవి బీచ్ మూసివేత

కోడూరు: తుపాను ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా మారడంతో హంసలదీవి బీచ్ గేట్లను రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజర్ శ్రీసాయి శనివారం తెలిపారు.

న్యూస్‌రీల్

లైంగిక దాడులపై అవగాహన

తాడేపల్లి రూరల్ : ఉండవల్లి మండల ప్రాథమిక పరిషత్ స్కూలులో శనివారం గుడ్‌షెపర్డ్ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో బాలికలపై లైంగిక దాడులు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిస్టర్ విద్య మాట్లాడుతూ బాలికలపై లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు చిన్నారులు బాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక నరకయాతన పడుతున్నారన్నారు. బాలికలపై లైంగిక దాడులను నిరోధించేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది పోతురాజు, అనూష, నాగమణి, అనిల్ కుమార్, బాబు జగజ్జీవన్‌రావు పాల్గొన్నారు.

వీవీఐపీలు, వీఐపీలు ప్రయాణించే మార్గంలో విస్తృత తనిఖీలు

తాడేపల్లి రూరల్ : ప్రకాశం బ్యారేజ్, ఉండవల్లి సెంటర్ సీడ్ యాక్సెస్ రోడ్‌లో వీవీఐపీలు పర్యటిస్తుండడంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు శనివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని కల్వర్టులు, ముళ్ల పొదలు, ఇతర పైపులైన్లు, చెక్ పోస్టులతో పాటు ఇతర బ్రిడ్జిల వద్ద బాంబ్ స్క్వాడ్, ఇతర బృందాలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఏఆర్ ఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో వీవీఐపీలు, వీఐపీలు నివాసం ఉంటున్నారని, వారి భద్రత దృష్ట్యా మొత్తం 40 మంది సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌జీ డీఎస్పీ రామకృష్ణ, జిల్లా భద్రతా విభాగం ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఎస్‌జీ ఆర్ఐలు నరేష్, శంకర్ పాల్గొన్నారు.

మంచికల్లు పోలేరమ్మ తిరునాళ్ల ప్రారంభం

మంచికల్లు(రెంటచింతల): పలనాటి కోనసీమగా పేరొందిన మంచికల్లు గ్రామదేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల ప్రారంభమైనట్లు కారంపూడి వెంకటాచార్యులు శనివారం తెలిపారు. తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం కుంకుమ బండ్లు, శనివారం దీనబండారంతో ఈ వేడుకలు ముగుస్తాయని వెల్లడించారు. మార్గశిర ఏకాదశి మొదలు బహుళపాఢ్యమి వరకు ప్రతి ఏటా ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

వైద్య విద్యలో మంగళగిరి విద్యార్థి ప్రతిభ

మంగళగిరి టౌన్: డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఫలితాల్లో మంగళగిరి విద్యార్థి ప్రతిభ చాటి రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచారు. మంగళగిరిలోని సాయినగర్‌కు చెందిన పాపన జితేంద్ర ఆర్థోపెడిక్ విభాగంలో 800 మార్కులకు 568 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఏలూరు జిల్లా ఆశ్రమ వైద్య కళాశాలలో జితేంద్ర వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ చేబ్రోలు శ్రీనివాసరావు, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి జితేంద్రను అభినందించారు. తమ కుమారుడు కష్టపడి చదివి పీజీ ఫలితాల్లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందని జితేంద్ర తల్లిదండ్రులు శివరామ్ ప్రసాద్, ధనలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు.

కుట్టు.. కనికట్టు !

'మిషన్' ఫెయిల్

- కుట్టు శిక్షణ అంతా ఆర్భాటమే..
- శిక్షణ ముగిసి మూడు నెలలు అవుతున్నా మహిళలకు ఇవ్వని కుట్టు మిషన్లు
- ధ్రువీకరణ పత్రాలూ ఇవ్వని వైనం
- పెదవి విరుస్తున్న మహిళలు

ప్రత్తిపాడు సచివాలయంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ (ఫైల్)

ప్రత్తిపాడు: మహిళలు ఇంటి దగ్గరే స్వయం ఉపాధి పొందాలి.. ఆర్థికంగా వృద్ధి చెందాలి అంటూ చంద్రబాబు సర్కారు మాటలు నీటి మీద రాతలేనని తేలిపోతోంది. మాటల పసే గానీ చేతల పస లేదని స్పష్టమవుతోంది. అందుకు సాక్ష్యమే మహిళలకు ఇచ్చిన ఉచిత కుట్టు శిక్షణ. జిల్లాలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 16 కుట్టు శిక్షణ కేంద్రాలను కొద్ది నెలల కిందట ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో వివిధ వర్గాలకు చెందిన మొత్తం 1972 మంది మహిళలు మూడు నెలల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ పొందేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకు తొమ్మిది కేంద్రాల్లో శిక్షణ కూడా పూర్తయింది. ఇంకా మంగళగిరిలో రెండు, గుంటూరులో ఐదు కేంద్రాల్లో ప్రస్తుతం కొనసాగుతోంది. తొమ్మిది కేంద్రాల్లో శిక్షణ పూర్తయి ఇప్పటికి దాదాపుగా రెండు, మూడు నెలలు గడుస్తోంది. వీరికి మిషన్ కుట్టడం, డిజైన్ ఆధారిత కటింగ్‌పై తర్ఫీదునిచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వందల మంది మహిళలకు కనీసం ధ్రువీకరణ పత్రాలు కూడా ఇచ్చిన దాఖలాలు లేవు.

జాడే లేని మిషన్లు

శిక్షణకు హాజరైన మహిళల్లో 75 శాతం హాజరు ఉన్నవారికి పూర్తయిన తరువాత ప్రభుత్వమే కుట్టు మిషన్లు ఇస్తుందని ప్రకటించారు. డిజిటల్ విధానంలో ప్రతిరోజూ హాజరు కూడా నమోదు చేశారు. వీరంతా ఇప్పుడు ధ్రువపత్రాలు, కుట్టు మిషన్లు కోసం ఎదురు చూస్తున్నారు. తద్వారా ఇంటి వద్దనే ఉంటూ మహిళలు టైలరింగ్ ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఇవే మాటలను శిక్షణ కేంద్రాల ఆరంభం రోజున అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడంతో మహిళల్లో ఆశలు రేకెత్తాయి.

కుట్టు నేర్చుకుంటున్న మహిళలు (ఫైల్)

కానీ ఇప్పుడు ఆ ఊసే లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. అంతేకాకుండా అర్హత ఉన్నవారికి బ్యాంకుల ద్వారా కూడా రుణాలు ఇప్పిస్తామని అధికారులు చెప్పడం, అదీ కూడా ఆచరణకు దూరంగా ఉండటం విమర్శలకు దారి తీస్తోంది.

ఫ్యాషన్ టెక్నాలజీ ట్రైనింగ్ ఎక్కడ ?

ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన కేంద్రంలో 127 మంది మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఇందులో పరీక్షలు పెట్టి ఎంపికైన వారికి నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలోని శిక్షకులను ఇక్కడకు

శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పిలిపించి శిక్షణ ఇప్పిస్తామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చెప్పారు. ఇంట్లోనే కూర్చుని నెలకు రూ. 30–40 వేలు సంపాదించుకునే మార్గం చూపిస్తానంటూ ఆయన హామీ ఇచ్చారు. నేడు అవన్నీ మాటలకే పరిమితమవ్వడంతో మహిళలు పెదవి విరుస్తున్నారు.

త్వరలో కుట్టు మిషన్ల పంపిణీ

జిల్లాలో ఇంకా కొన్ని కేంద్రాల్లో శిక్షణ నడుస్తోంది. ఇప్పటికే కొన్నిచోట్ల పూర్తి అయింది. శిక్షణ పొందిన వారిలో 75 శాతం హాజరు ఉన్న వారికి త్వరలోనే ప్రభుత్వం కుట్టు మిషన్లు అందిస్తుంది. సర్టిఫికెట్లు కూడా అందిస్తాం.

– మయూరి

(బీసీ సంక్షేమ శాఖ అధికారి, గుంటూరు జిల్లా)

మట్టి.. కొల్లగొట్టి ..!

- రాజధానిలో అధికారుల నిద్రావస్థ
- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు
- రాత్రీ పగలు తేడా లేకుండా వందలాది లారీలు, ట్రాక్టర్లు తరలింపు
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ట్రాక్టర్ మట్టి రూ. 1500
- లారీ మట్టి రూ. 7 వేల నుంచి 15 వేలు
- ఇటుక బట్టీలకు తరలింపు

కొండవీటి వాగు వద్ద మట్టి లోడ్ చేసుకుంటున్న ట్రాక్టర్

తాడేపల్లి రూరల్ : ప్రభుత్వం రాజధాని పనుల్ని ముమ్మరం చేసింది. ఈ నేపథ్యంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అధికారులు నిర్లక్ష్యం వల్ల ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసే సమయంలో వచ్చే మట్టిని విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది అధికారులతో కలసి అక్రమార్కులు అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారు. రాజధానిలో కొండవీటి వాగు వరదను నియంత్రించేందుకు ప్రభుత్వం పలుచోట్ల వెడల్పుతో పాటు రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టింది. మరికొన్ని చోట్ల డ్రెయిన్లు, పైప్‌లైన్లు వేసే సమయంలో ఐదు నుంచి పది అడుగుల దాకా తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమయంలో వచ్చిన మట్టిని సదరు కాంట్రాక్టర్ నిబంధనల ప్రకారం అక్కడి నుంచి తొలగించాలి. ఇదే అదునుగా చేసుకుని ఇతర ప్రాంతాల్లో చెరువ కట్టలను, రోడ్లను సైతం రాత్రీ పగలు తేడా లేకుండా తవ్వేస్తున్నారు.

సిండి'కేట్లు'గా దోపిడీ

లారీ ఓనర్లు సిండికేట్ అయ్యారు. మట్టి రవాణా ముసుగులో చెరువు కట్టలు, కొండవీటి వాగు మట్టిని యథేచ్ఛగా తోలుకుంటున్నారు. పైపు లైను దగ్గరకు ప్రైవేటు జేసీబీలు తీసుకువెళ్లి ట్రాక్టర్ లోడింగ్‌కు రూ. 400, లారీ మట్టికి రూ. 1000 ఇస్తున్నారు. ఈ మట్టిని అమ్ముకోవడానికి అనుమతులు ఉన్నాయి. ఈ ముసుగులో కొండవీటి వాగు నుంచి వచ్చే బంక మట్టిని రాత్రి సమయంలో తోలుతున్నారు. 220 మిషన్లు ఏర్పాటు చేసి అక్కడున్న వాచ్‌మేన్‌కు పదో పరకో అప్పజెప్పి వందల లారీల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. చిర్రావూరు, రామ

ట్రాక్టర్‌లో తరలిస్తున్న మట్టి

చంద్రాపురంలతో పాటు కొల్లూరు ఇటుక బట్టీలకు తోలుతున్నట్లు లారీ డ్రైవర్లు తెలిపారు. ఈ మట్టి తవ్వకాలపై గతంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటూ పోలీసులకు ఫిర్యాదు కూడా చేసుకున్నారు. ప్రస్తుతం వీరంతా సిండికేట్‌గా ఏర్పడ్డారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు కొండవీటి వాగు మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అటు వైపు కనీసం పోలీసులు గానీ, సీఆర్‌డీఏ అధికారులు గానీ కన్నెత్తి చూడడం లేదు. కొంతమంది అధికారపార్టీ అండదండలతో లారీలు కొని మరీ ఈ వ్యాపారాన్ని నిర్వహించడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు మేల్కొని మట్టి తవ్వకాలలో జాగ్రత్తలు తీసుకుని, బిల్లులు ఇవ్వాలని రాజధాని రైతులు కోరుతున్నారు.

పగలు రెక్కీ.. రాత్రిళ్లు చోరీ

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, చిత్రంలో ఏఎస్పీ, డీఎస్పీ

- ముగ్గురు అంతర్ జిల్లాల పాత నేరస్తులు అరెస్టు
- రూ.12 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు స్వాధీనం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ముగ్గురు పాత నేరస్తులను అరెస్ట్ చేసి, రూ.12 లక్షల విలువైన బంగారం, వెండి సొత్తు, రెండు మొబైల్ ఫోన్లు, మోటారుసైకిల్‌ను మేడికొండూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన ఆమతి వీరయ్య ఇంటిలో ఈ నెల 3న చోరీ జరిగింది. సుమారు 86 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి వస్తువులు, రూ.40 వేలు అపహరణకు గురయ్యాయి. దీనిపై మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ షేక్ నాగూర్‌మీరా సాహెబ్ కేసు నమోదు చేశారు.

ఈ క్రమంలో విజయవాడ వాంబే కాలనీకి చెందిన దేవరకొండ రాంబాబు, చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌కు చెందిన తుపాకుల వెంకటేష్, చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన బొమ్మల విజయ్‌ను అరెస్ట్ చేశారు. నగదు, సొత్తు స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ చెప్పారు.

ముగ్గురికీ నేర చరిత్ర

నేర చరిత్ర ఉన్న ముగ్గురికి జైల్లోనే పరిచయమని ఎస్పీ తెలిపారు. జైలు నుంచి విడుదలయ్యాక నరసరావుపేట పల్నాడు బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌లో ఉంటూ చోరీలకు వ్యూహాలు రూపొందించేవారు. పగలు రెక్కీ చేసి, రాత్రుళ్లు చోరీలకు పాల్పడేవారు. ఆ సొమ్ముతో జల్సాలు చేసేవారు. రాంబాబు, వెంకటేష్‌పై సస్పెక్ట్ షీట్, విజయ్‌పై రౌడీషీట్ ఉందని చెప్పారు.

వెంకటేష్‌పై యాభై కేసులు

రాంబాబు (55)పై తెలంగాణ, ఏపీలో సుమారు 120 వరకు పైగా కేసులు, తుపాకుల వెంకటేష్‌పై కూడా రెండు రాష్ట్రాల్లోనూ 50 ఉన్నాయి. విజయ్‌పై హత్య, దొంగ కరెన్సీతో పాటు ఎనిమిది కేసులున్నాయి. ఇరవై రోజుల్లో ఈ కేసుని ఛేదించిన తుళ్లూరు డీఎస్పీ టి.మురళీకృష్ణ, మేడికొండూరు పీఎస్ సీఐ షేక్ నాగూర్ మీరా సాహెబ్, ఎస్ఐ షేక్ ఖాజీబాబు, హెచ్‌సీ ఎండీ.సాదిక్, పీసీలు షేక్ జాన్‌సైదా, ఎస్.ప్రవీణ్‌కుమార్, ఎం.సురేష్, ఐటీ కోర్ పీసీలు సిల్వెస్టర్, ఉపేంద్రను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో అంతర్జాతీయ సదస్సు

మంగళగిరి టౌన్ : నగర పరిధిలోని ఎయిమ్స్ వైద్యశాలలో రేడియో డయాగ్నసిస్ విభాగం, అనాటమీ విభాగానికి సంబంధించి ఇమేజ్ గైడెడ్ మస్కిలో స్కెలిటల్ ఇంటర్‌వెన్షన్‌లపై కోడరిక్ రెండవ అంతర్జాతీయ సమావేశాన్ని శనివారం ప్రారంభించారు. రేడియాలజీ, అనాటమీ విభాగాలు, మస్క్యులో స్కెలెటల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆసియన్ పసిఫిక్ ఇంటర్నేషనల్ రేడియాలజీ, ఇంటర్వెన్షన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతోందని ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశాన్ని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ అహంతెం శాంతా సింగ్, ప్రొఫెసర్ డాక్టర్ దేశు రామమోహన్‌లు ప్రారంభించారు. సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఏడు దేశాల నుంచి ప్రతినిధులు హాజరు కానున్నట్లు వారు పేర్కొన్నారు. రెండురోజులు జరిగే కార్యక్రమంలో లైవ్ ఇమేజ్ గైడెడ్ ప్రదర్శనలు, కాడవెరికి హ్యాండ్స్ ఆన్ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 100 మందికి పైగా ప్రతినిధులు పాల్గొననున్నారని పేర్కొన్నారు.

సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రతినిధులు

తెగుళ్లు తట్టుకునే రకాలను సాగు చేయాలి

- లాం ఫాం హార్టీకల్చర్ రిసోర్స్ స్టేషన్ హెడ్ సి.వి.రమణ
- ప్రత్తిపాడు, కోయవారిపాలెం, పాతమల్లాయపాలెం గ్రామాల్లో మిర్చి పంట పరిశీలన

ప్రత్తిపాడులో మిర్చి పంటను పరిశీలిస్తున్న రమణ తదితరులు

ప్రత్తిపాడు: తెగుళ్లను తట్టుకునే మిర్చి రకాలను రైతులు సాగు చేసుకోవాలని లాం ఫాం హార్టీకల్చర్ రిసోర్స్ స్టేషన్ హెడ్, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సి.వి.రమణ తెలిపారు. మిర్చి రైతులు తెగుళ్ల బారిన పడుతున్నారని, సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఉద్యాన శాఖ సిబ్బంది పత్తా లేకపోవడంపై శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'ఉద్యానం అధ్వానం' కథనంపై అధికారులు స్పందించారు. ఉద్యాన శాఖ డీడీ బి.రవీంద్రబాబు నేతృత్వంలో అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ సి.వి. రమణ, వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రిన్సిపల్ సైంటిస్ట్ సాంబశివరావు, ఏవో షేక్ సుగుణా బేగం మండలంలోని కోయవారిపాలెం, ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం గ్రామాల్లో పర్యటించి, మిర్చి పంట పొలాలను పరిశీలించారు. తెగుళ్ల, తెల్లదోమ ఉధృతి, బొబ్బర ప్రభావాన్ని గమనించారు. రైతులతో మాట్లాడారు. సాగు చేసిన విత్తన రకం, నివారణకు మందుల పిచికారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు.

సాక్షి ఎఫెక్ట్

- తెల్లదోమ నివారణకు పెగాసస్ ఎకరాకు 250 గ్రాములు, సెఫీనా 280 గ్రాములు, ల్యానో 200 ఎంఎల్, ఎస్ఎల్ఆర్ 525 – 350 ఎంఎల్ రకాల్లో ఏదో ఒక మందును పిచికారీ చేయాలి.
- తామర పురుగు నివారణకు ఎక్స్‌పోనస్ ఎకరాకు 34 మి.లీ, గ్రేషియాహ 160 మి.లీ, సిమోడిస్ 240 మి.లీ, రోగర్ 500 మి.లీ, మూవెన్‌టో 200 మి.లీ చొప్పున ఏదో ఒక రకాన్ని పిచికారీ చేసుకోవాలి.

రైతులు బతికేదెట్టా ?

శాస్త్రవేత్తలు, అధికారుల బృందం ఎదుట మిర్చి, పత్తి రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. తాము బతికేదెట్టా ? అంటూ వాపోయారు. నష్టాలొస్తున్నా నాలుగేళ్లుగా నెట్టుకొస్తున్నామని, వరుసగా ఐదో ఏడాది కూడా మిర్చి చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వాపోయారు. ఏటా నవంబరు నుంచి డిసెంబర్ మధ్యలో పైరుపై దెబ్బ మీద దెబ్బ పడుతోందని తెలిపారు. ఇప్పటికే పూర్తిగా అప్పుల పాలయ్యామని, ఈ ఏడాది కూడా నష్టం తప్పదని వాపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి కూడా పూర్తిగా దెబ్బతిందని, ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదంటూ ఆందోళన తెలిపారు.

వైభవంగా స్వరలయ 'తెనాలి ఉత్సవ్'

- అలరించిన జానపద ప్రదర్శనలు
- తెనాలి వైభవంపై నృత్యరూపకం
- ప్రముఖులకు పురస్కారాల ప్రదానం

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో రెండురోజుల 'స్వరలయ తెనాలి ఉత్సవ్' శనివారం తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జానపద కళల ప్రదర్శనతో ఘనంగా ఆరంభమైంది. తొలుత తోలుబొమ్మలాటతో ఆరంభించి, ఆరాధ్యుల వెంకటసుబ్బమ్మ చెక్కభజన, గిరిజన గురుకుల విద్యార్థినులచే కోలాట ప్రదర్శన జరిగాయి. ప్రముఖ నృత్యగురువు నిర్మలా రమేష్ శిష్య బృందం ప్రదర్శించిన తెనాలి ఉత్సవ గీతం, తెనాలి వైభవంపై నృత్యరూపకం అభినందనలు అందుకున్నాయి. స్వరలయ తెనాలి ఉత్సవ్ లోగోను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. కళలను, సంస్కృతిని పరిపోషించేవారే చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. తెలుగును రాజభాషగా చేసిన శ్రీకృష్ణదేవరాయలు, భోజరాజు, రాజరాజనరేంద్రుడు ఇందుకు నిదర్శనమన్నారు. సంక్షేమం, అభివృద్ధితోపాటు తెలుగును, మన సంస్కృతిని కొనసాగించాలన్న విషయాన్ని నేటి పాలకులు గుర్తుంచుకోవాలని చెప్పారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంతరించి పోతున్న కళలను ఆదరించాల్సిన ఆవశ్యకతను కార్యక్రమాలతో చాటుతున్న స్వరలయ సంస్థను అభినందించారు. దైవాల సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించిన సభలో వరల్డ్ తెలుగు ఫెడరేషన్ (చెన్నై) సెక్రటరీ జనరల్ కె.శ్రీలక్ష్మీమోహనరావు, స్టేట్‌బ్యాంక్ ఏజీఎం వీవీ జగదీష్‌కుమార్, మండల తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణ, శ్రీకనకదుర్గ దేవస్థానం పాలకమండలి సభ్యుడు తోటకూర వెంకట రమణారావు మాట్లాడారు. సభలో వివిధ రంగాల్లోని ప్రముఖులు నిర్మలా రమేష్, కాటూరి వెంకటేశ్వరరావు, అక్కల రామకృష్ణ, యు.ధర్మారావు, దీపాల సత్యనారాయణ, కనపర్తి బాబూరావు, టీవీఎస్ శాస్త్రి, కొల్లి రామాంజనేయ ప్రసాద్, టీఎస్ఆర్ బ్రహ్మచార్యులు, పద్మజా ప్రభాకర్, బెజ్జంకి నాగమణి, మేకతోటి ప్రభాకర్, జి.రాజశేఖర్, అబ్దుల్ రజాక్‌కు తెనాలి ఉత్సవ్ పురస్కారాలను ప్రదానం చేశారు. స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు పర్యవేక్షించారు.

జ్యోతి ప్రజ్వలనలో మండలి బుద్ధప్రసాద్, బొప్పరాజు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మీమోహన్‌రావు, వీవీ జగదీష్‌కుమార్, తోటకూర వెంకట రమణారావు, సాయి లక్కరాజు

గిరిజన గురుకుల విద్యార్థినుల కోలాట ప్రదర్శన

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 800 గరిష్ఠం : రూ. 1,200

మోడల్ ధర రూ. 1,000

క్లుప్తంగా

టైపు, షార్ట్‌హ్యాండ్ పరీక్షలకు పాత విధానాన్నే కొనసాగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో జరగనున్న టైపు, షార్ట్‌హ్యాండ్ పరీక్షల నిర్వహణలో పాత విధానాన్నే కొనసాగించాలని ఏపీ టెక్నికల్ కమర్షియల్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీవీఎస్ ప్రకాష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆరు నెలలకోసారి టైపు, షార్ట్ హ్యాండ్ పరీక్షలను రెండు రోజుల పాటు నిర్వహించే విధానం ఏళ్ల తరబడి అమలు చేస్తుండగా, జనవరి 2026 బ్యాచ్ నుంచి ఆయా పరీక్షలకు ఒక్కో రోజు చొప్పున నిర్వహించే విధంగా నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆర్థిక సహాయ, సహకారాలు లేకపోయినా సాంకేతిక విద్యలో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ, స్వయం ఉపాధి, జీవనాధారంగా రాష్ట్రవ్యాప్తంగా 400 మందికి పైగా టైప్ ఇనిస్టిట్యూట్ సంస్థలు మనుగడ సాగిస్తున్నారని తెలిపారు. టైపు, షార్ట్‌హ్యాండ్ పరీక్షల నిర్వహణకు ఒక్క రోజు చొప్పున కేటాయించడం వలన కొంత మందికే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుందని, ఫలితంగా విద్యార్థులు నష్టపోయే ప్రమాదముందన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, టైపు ఇనిస్టిట్యూట్ నిర్వాహకుల పై ఒత్తిడి పెరుగుతుందని, విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని పాత విధానంలోనే రెండేసి రోజుల చొప్పున కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

గూడ్స్‌రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ గూడ్స్‌రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చీరాల రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్.కొండయ్య తెలిపిన వివరాల మేరకు సుమారు.. 50 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి రైల్వేస్టేషన్‌లోని నాలుగో నంబర్ ప్లాట్‌ఫాంపైకి వెళ్లేందుకు పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వెళుతున్న గూడ్స్‌రైలు అతడిని ఢీకొట్టడంతో మృత్యువాత పడినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రతిభ దివ్యం.. పోరు ఉత్కంఠం

- ఎన్టీఆర్ స్టేడియంలో ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడాపోటీలు
- ప్రారంభించిన డీఆర్‌ఓ ఖాజావలి

ఉత్కంఠగా త్రిచక్ర వాహన పోటీలు

ఉత్సాహంగా పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు

బాలుర పరుగు పందెం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): దివ్యాంగుల ప్రతిభాపాటవాలు సమాజానికే ఆదర్శమని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో దివ్యాంగులకు క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీలను డీఆర్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు విభిన్న అంశాల్లో ప్రతిభ కలిగి ఉంటారన్నారు. ఎందరో దివ్యాంగులు ప్రపంచంలోనే అత్యంత ప్రతిభావంతులుగా, మోటివేటర్లుగా ఉన్నారని చెప్పారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులుగా బ్రహ్మాండంగా రాణిస్తున్నారని చెప్పారు. దివ్యాంగుల్లో ప్రతిభకు కొదవలేదని వారిలో ఉన్న సృజనాత్మకతను మరింతగా వెలికి తీసి పదును పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగ క్రీడాకారులు క్రీడల్లో అభివృద్ధి చెంది జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఇన్‌చార్జి దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకుల డి.దుర్గా భాయి మాట్లాడుతూ డిసెంబర్ మూడో తేదీన దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. క్రీడా పోటీల్లోనూ, దివ్యాంగుల దినోత్సవంలోనూ పాల్గొనే దివ్యాంగ ఉద్యోగులకు ఆన్‌డ్యూటీగా పరిగణించడం జరుగుతుందన్నారు. వివిధ అంశాల్లో జరిగిన క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగాయి. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ నజీమా, విభిన్న ప్రతిభావంతుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా లయోలా వజ్రోత్సవాలు

లయోలా డైమండ్ జూబ్లీ సావనీర్‌ను విడుదల చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

గుంటూరు రూరల్: విద్యద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందని, అటువంటి విద్యను అందిస్తున్న లయోలా స్కూల్స్ సమాజాభివృద్ధికి తమదైన ముద్రను వేస్తున్నాయని కేంద్ర సహాయ శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో లయోలా డైమండ్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ 75 ఏళ్ళ లయోలా విద్యాప్రస్థానంలో ఎందరో ఐఏఎస్‌లను, ఐపీఎస్‌లను, సమాజ సేవకులను, కార్పొరేట్ దిగ్గజాలను అందించిందన్నారు. ఎమ్మెల్యే బి.రామాంజనేయులు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అందించటంలో లయోలా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. విద్య, క్రీడలు, సాంకేతిక నైపుణ్యం అన్ని రంగాల్లో విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అందించిన లయోలా అభినందనీయమన్నారు. లయోలా డైమండ్ జూబ్లీ వేడుకల సావనీర్‌ను విడుదల చేశారు. పూర్వ ప్రిన్సిపల్స్, యాజమాన్యాన్ని సన్మానించారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఏఎంజీ ఇండియా సంస్థ చైర్మన్ వి.ఎమ్.హెషకుమార్‌రెడ్డి, పాఠశాల సుపీరియర్ డాక్టర్ నవనీత్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పి.ఆంథోని, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ సహాయరాజ్ మార్క్స్, మోస్ట్ రెవరెండ్ డాక్టర్ భాగ్యయ్య, రెవరెండ్ ఫాదర్ డాక్టర్ కెన స్టానిస్‌లాయిస్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో 1.62 లక్షల ఎకరాల్లో వరి సాగు

మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొరిటెపాడు: ఖరీఫ్ (2025) పంట సమయంలో జిల్లాలో 1,62,883 ఎకరాల్లో వరి పంట సాగు అవుతుందని జిల్లా వ్యవసాయాధికారిణి ముక్కపాటి పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం తెనాలి, కొల్లిపర, పొన్నూరు, దుగ్గిరాల, చేబ్రోలు, కాకుమాను, పట్టిచెరుకూరు, తాడేపల్లి, మంగళగిరి, తాడికొండ మండలాలలో వరి కోతలు మొదలైనట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటిదాకా 15,360 ఎకరాల్లో వరి పంట కోతలు పూర్తవగా, నరసరి 35,740 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయ్యినట్లు అంచనా అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ధాన్యం సేకరణకై జిల్లాలోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం గ్రేడ్ ఎ రకం క్వింటాలకు రూ.2,389ల మద్దతు ధర ప్రకటించిందని, ఇప్పటిదాకా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 1,447 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని అన్నారు. దిత్వా తుఫాన్ దృష్ట్యా జిల్లాకు భారీ వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో వరి కోసిన రైతులు ధాన్యాన్ని జాగ్రత్త చేసుకోవాలన్నారు. ఎత్తయిన ప్రాంతాల్లో కనీస జాగ్రత్తలతో నిల్వ చేసుకోవాలని లేదా కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని రైతులను కోరారు. అధిక తేమలో కోసిన ధాన్యం అరబెట్టినచో, ఆ ధాన్యం అకాల వర్షాలకు తడవకుండా టార్పాలిన్‌లతో జాగ్రత్త చేసుకోవాలని అన్నారు. దిత్వా తుఫాన్ వర్ష సూచన దృష్ట్యా వరి కోతలను నాలుగైదు రోజులు వాయిదా వేయాలని రైతులను కోరారు. పంట పొలాల్లో దారులు చేసుకుని వర్షపు నీరు త్వరగా పారుదలయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 14 మందికి జరిమానా

గుంటూరు లీగల్: గుంటూరు ఈస్ట్, వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు శనివారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి మహమ్మద్ గౌస్ 14 మందికి జరిమానా విధించారు. కొద్ది సమయం కోర్టు ప్రాంగణం శుభ్రం చేయాలని సూచించారు. ఆల్కహాల్ సేవించిన పర్సంటేజ్‌ని బట్టి ఆయా వ్యక్తులకు రూ. 5వేలు, రూ. 7వేలు న్యాయమూర్తి జరిమానా విధించారు.

ధాన్యం తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవద్దు

జిల్లా జేడీఏ పద్మావతి

తెనాలి: ఖరీఫ్–2025 ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు ఎం.పద్మావతి శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రూరల్ మండలంలోని హాఫ్‌పేట, కొలకలూరు, పెదరావూరు రైతు సేవాకేంద్రాల్లో ధాన్యం కొనుగోలును పరిశీలించారు. గ్రామంలో వరి కోతలు ఏ మేరకు జరిగింది, ధాన్యంలో తేమ శాతం ధ్రువీకరణ, కొనుగోలు షెడ్యూలు వంటి అంశాలను, కొనుగోలు కేంద్రం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరణ జరగాలని మార్గనిర్దేశం చేశారు. ధాన్యం ఆరబోసిన ప్రదేశాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. దళారులకు తక్కువ ధరకు ధాన్యం అమ్మకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరలకు అమ్ముకోవాలని సూచించారు. రానున్న రెండు రోజుల్లో మోస్తరు వర్ష సూచన ఉన్నందున పంట కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. తెనాలి సబ్ డివిజన్ ఇన్‌ఛార్జి ఏడీఏ ఆర్.విజయ బాబు, విస్తరణ అధికారి మురళి, వీఏఏలు నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు సొంత వాహనాల్లో ధాన్యం రవాణా చేసుకోవచ్చు

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

తూములూరులో అధికారులు, రైతులతో మాట్లాడుతున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

కొల్లిపర: జిల్లా నుంచి ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాల నుంచి జీపీఎస్ అనుసంధానం లేకుండానే వారి సొంత వాహనాల ద్వారా కూడా మిల్లుల వద్దకు ధాన్యం తరలించుకోవచ్చని వెలుసుబాటును ప్రభుత్వం కల్పించిందని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ రైతులతో అన్నారు. మండల పరిధిలోని హనుమానపాలెం, తూములూరు, దివిలూరు గ్రామాల్లో రోడ్ల వెంట ఆరబోసిన ధాన్యం రాశులను శనివారం తహసీల్దార్ జి.సిద్ధార్థతో కలసి ఆయన పరిశీలించి, కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రెండు రోజుల్లో దిత్వా తుఫాన్ ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉంటూ వరి నూర్పిడులను వేగవంతం చేయాలన్నారు. ఇటువంటి సమయంలో రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో జీపీఎస్‌తో సంబంధం లేకుండా రైతులు తమ సొంత ట్రాక్టర్లు లేకపోతే ఇతర వాహనాల ద్వారా వారి ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకొని, కేటాయించిన మిల్లర్ల వద్దకు వారే నేరుగా రవాణా చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జేసీ వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవ్, ఏఓ శ్రీనివాసరెడ్డి, రైతులు అవుతు సుధాకర్‌రెడ్డి, ఎ.శివారెడ్డి, అడపా నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంఎల్‌సీ కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, పక్కన ఏపీపీ మురళీకృష్ణ

గుంటూరు మెడికల్: జాతీయ హైవేల మీద యాక్సిడెంట్ బారిన పడిన వాళ్లకు జాతీయ హైవే అథారిటీ ద్వారా రూ.లక్షన్నర వరకు క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా వైద్యశాల, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు జెండర్ బేస్డ్ వెల్‌నెస్, మెడికో లీగల్ కేసులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నేషనల్ హైవేలపై ప్రమాదాలకు గురయ్యేవారు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా లబ్ధి పొందవచ్చని చెప్పారు. అడిషన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) పి.మురళీకష్ణ మాట్లాడుతూ ఆడపిల్లలపై హింస నివారించవలసిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. మెడికో లీగల్ కేసుల విషయంలో వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హింసకులోనైన అనాధ చిన్నారులను, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని పునరావాస కేంద్రాలకు తరలించాలని వెల్లడించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఇ.అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ సుజాత, డాక్టర్ ప్రియాంక, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, వాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసిన త్రీ టౌన్ పోలీసులు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమృతలూరుకు చెందిన శ్రీనివాసరావు(37) పోలీస్ కంట్రోల్ రూమ్ పరిధిలో హోంగార్డుగా పట్టణంలో పనిచేస్తున్నాడు. ఈనెల 24న విధులు ముగించుకొని ఇంటికి వెళుతూ బైక్ మీద నుంచి పడి గాయపడ్డాడు. ప్రాథమిక చికిత్సతో ఉపశమనం పొందిన శ్రీనివాసరావుకు శుక్రవారం రాత్రి వాంతులు కావడంతో కుటుంబ సభ్యులు అతనిని తెనాలి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలబావిలో యువకుడి మృతదేహం

- అనుమానాస్పద కేసుగా నమోదు
- హత్యేనని ఆరోపిస్తున్న బంధువులు

ఆనంద్ (ఫైల్)

ఆనంద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వీరేంద్ర

తాడేపల్లి రూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెం పెనుమాక రోడ్డు శివారులో పెనుమాక టిడ్కో గృహాలకు వెళ్లే మార్గంలో ఓ నేలబావిలో మృతదేహం ఉన్నట్లు బంధువులు గుర్తించి తాడేపల్లి పోలీసులకు శనివారం సమాచారం ఇచ్చారు. వివిధ వర్గాల నుంచి సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి కొత్తపేటకు చెందిన శంకర్, వీరకుమారి దంపతుల రెండవ కుమారుడు పిన్నిక ఆనంద్ (24) చదువు అనంతరం ఫొటోగ్రఫీ చేస్తు హైదరాబాద్‌లో నివాసముంటూ ఖాళీ సమయాల్లో ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 26వ తేదీ నాయనమ్మ చనిపోవడంతో అంత్యక్రియలకు వచ్చాడు. అంత్యక్రియల అనంతరం 27వ తేదీ ఉదయం అన్నయ్య, మరో స్నేహితుడితో కలసి వెళ్లి మద్యం సేవించి సాయంత్రం 4 గంటల సమయంలో అన్నదమ్ములిద్దరూ ఇంటికి చేరుకున్నారు. అనంతరం ఆనంద్ ద్విచక్రవాహనంపై ఇంట్లోనుంచి బయటకు వెళ్లాడు. ఆ రాత్రి ఇంటికిరాలేదు. 28వ తేదీ మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తన కుమారుడు కనిపించడం లేదంటూ శంకర్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేయకుండానే బంధువులు చుట్టుపక్కలప్రాంతాల్లో వెతుకుతుండగా యర్రబాలెంకు చెందిన ఓ వ్యక్తి డొంకరోడ్డులో మీ అబ్బాయి ద్విచక్రవాహనం ఉందని తెలియజేయడంతో అక్కడకు వెళ్లి పరిశీలించగా పంటపొలంలో పాడైపోయిన బావిలో ఆనంద్ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి బావిలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి శరీరంలో కంటి కింద, తల వెనుక భాగంలో దెబ్బలు ఉన్నాయని, హత్యచేసి ఉంటారని బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు మాత్రం అనుమానాస్పద కేసు అని, పోస్టుమార్టం రిపోర్టు వస్తే తప్ప పూర్తి వివరాలు తెలియవని చెబుతున్నారు. పెనుమాకలో ఓ యువతిని ఆనంద్ ప్రేమించినట్లు వదంతులు వినిపిస్తున్నాయి. ఆనంద్‌ను హత్యచేశారా? ఆత్మహత్య చేసుకున్నాడా అనేది పోలీసులు నిర్ధారించాల్సి ఉంది.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

- గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, అగతవరప్పాడు, రెడ్డిపాలెం, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్స్ అ/కొ. సంప్ర॥ జనసైతన్య ప్లాట్స్ మా ప్రత్యేకత. 9492770739
- గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్ర॥ 9948778855

FLAT FOR SALE

- అమరావతి రోడ్డు KFC దగ్గర, 1200Sft, W/F కొత్త అపార్ట్‌మెంట్, 5వ ఫ్లోర్ 50లక్షలు, అమ్మబడును. 9080807472 (1% కమీషన్ తీసుకొనబడును)
- Sathya Classic Apartment, Flat No: 101, East Facing, 3 BHK (1345SF), 6/19 Brodipeta, Guntur ✆ 9742258945, 9440434223
- Lakshmi Apartments, 860sft, Ground Floor,Flat No.7, Commercial Purpose Flat for Sale, Opp Nuha Hospital, Old Bank Road, Kothapet, Guntur,AP. Ph:7662898989
- 2BHK FLAT(113 SFT) FOR SALE. F.NO.101 VASANTH KUNGH APT 2ND LANE NAVABHARAT NAGAR,GUNTUR.PH:9440797994.
- 1650 Sft East Facing 3 BHK Apartment All Facilities Chandramouli Nagar. Phone: 7989324772

HOUSE FOR SALE

- తెనాలి దగ్గర అంగలకుదురులో 80అ॥ రోడ్డు, 2వ బిట్, 113 చ॥గ॥ ఇల్లు 25లక్షలు మాత్రమే ప్లాన్ అప్రూవల్, లోన్ సౌకర్యం. సంప్ర॥ 97046 99997

OLD BUILDINGS

- పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగలగొట్టబడును. పాత కలప, కిటికీలు పాత ఐరన్ కొనబడును. సంప్ర॥ 97032 90782, 9700442419

PLOT FOR SALE

- గుంటూరు మిర్చి యార్డ్ దగ్గర సుబ్బారెడ్డి నగర్ లో వెంకటేశ్వర కోల్డ్ స్టోరేజ్ వెనుక తూర్పు 74చ॥గ॥ ఇళ్ళ మధ్యలో అమ్మకము.అల్లా రఖా సంప్ర ✆ 9908054955.

SERVICES

AGRII BUSINESS

- Lab (Cross Breed) Male Dog సంవత్సరం వయస్సు కలది ఉంది. పెంచుకునే ఆసక్తి గల వారికి ఉచితంగా ఇవ్వబడును.నూతక్కి ✆ 9885081746

BUSINESS OFFER

- గుంటూరు జీటి రోడ్డులో బాగా రన్నింగ్‌లో ఉన్న పేరొందిన ఫ్రాంచైజ్ రెస్టారెంట్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 76709 89630

BOREWELLS

- విజయ బోర్‌వెల్స్: 4-1/2, 6-1/2, 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. గుంటూరు, సంప్ర॥ 9866222717, 9848183887

WANTED

- గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు మెస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 25,000/- నుండి 30,000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: 5సంవత్సరములపైన కాలేజి మెస్‌లో పనిచేసిన అనుభవం కలిగి ఉండవలెను. వయస్సు: 30సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ : 8978480435
- గుంటూరు వాసవి క్లాత్ మార్కెట్ దగ్గరలో షాపులో పనిచేయుటకు వర్కర్స్ స్త్రీలు/ పురుషులు కావలెను. 25సం॥లు. సంప్ర॥ 9989929196
- గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, క్లాసు ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు: 22సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయి ఉండాలి సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429
- పిడుగురాళ్ళ, వినుకొండ, మాచర్ల, గురజాల డెలివరీ బాయ్స్ అండ్ గుంటూరులో లేడి టెలికాలర్స్ కావలెను. మంచి శాలరీ. సంప్ర॥ 8340855728, 7730997214
- గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/- నుండి 15,000 - వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: ఏదీ డిగ్రీ, 55 wpm typing speed, M.S Office Skills వయస్సు: 22సంవత్సర ములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. 8978480429
- Wanted Male Store Keepers Qualification Any Degree. Need System Knowledge. Salary Upto: 15,000/-. Contact: 8978480435
- గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు పురుషులు కావలెను. జీతము: 10,000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ 8978480435
- చిలకలూరిపేట పరిధిలోని రియల్‌ఎస్టేట్ కంపెనీలో వర్క్ చేయుటకు యువతీ యువకులు కావలెను, ఆకర్షణీయమైన జీతం. 7097972927, 7032609961
- గుంటూరులో ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మేనేజర్, అకౌంటెంట్, ఫీల్డ్, సూపర్‌వైజర్ అండ్ అసిస్టెంట్స్ కావలెను. మేల్ అండ్ ఫిమేల్. 9177999199, 9063999499
- Wanted primary lady principal, Vice Principal, AO, Incharge, English, Maths, Science and Mother Teachers, Apple Techno School, Krishna Babu Nagar, Gujjanagundla, Guntur. Contact: Phone: 6301036083
- అరండల్‌పేట 8/1లోని ఫ్రూట్ జ్యూస్ షాప్‌లో పనిచేయుటకు అనుభవం గల స్త్రీ / పురుషులు కావలెను. సంప్రదించండి. 9618936240
- కావలెను. గుంటూరు సిటీ, కొత్తపేట, మెడికల్ ఏజెన్సీ నందు 10th / Intermediate అర్హత కలిగిన ఆఫీస్ బాయ్స్ కావలెను. సంప్ర: 99499 44577
- గుంటూరు అంకిరెడ్డిపాలెంలో రోడ్డు ప్రక్కనే 150 గజాల స్థలం అమ్మకమునకు కలదు. తక్షణమే ఇల్లు నిర్మించుకోవచ్చు. 9390011971, 9396242802
- గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 15000+3000. సం॥ 9121469383
- తెనాలిలోని సన్‌షైన్‌కార్‌కేర్ నందు అనుభవం గల కంప్యూటర్ ఆపరేటర్, మేనేజర్, కార్ వాషింగ్ చేయుటకు సర్వీసింగ్ బాయ్స్, అనుభవం గల మెకానిక్ వర్కర్స్ తెనాలి పరిసర ప్రాంతాల వారు కావలెను. 9985982838
- రామకృష్ణ గ్రూప్ (AP No-1), VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీ16-18వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 9603203355, 8247500574.
- రామకృష్ణ గ్రూప్ (AP No-1), HYD, VJA, Delhiకు టెలీకాలర్స్, కస్టమర్‌కేర్, అన్ని రకాల ఆఫీస్ స్టాఫ్ (స్త్రీ/పు) కావలెను. భో+వ+జీతం. ఇంటర్వ్యూ: VJA. ✆ 9502501122, 9676901122
- విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం:20-25,000/- భో+వసతి+ఫ్రీ ట్రైనింగ్. ✆ 99660 44671
- Paparao High School, K.Uppalapadu, Prakasam(dt). Wanted High School telugu Teacher & Primary Hindi Teacher & PET (Male & Female), Female Wardens. Free Boarding & Lodging. Salary Negotiable. Cont.7019326579,9392182210
- ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఇంట్లో వుండి వంట చేయుట కొరకు, పెద్దవారిని చూసుకొనుటకు లేడీస్ కావలెను. వివరాలకు సంప్ర. 93916 95903
- బ్యాంకు అనుబంధ సంస్థకు రిటైర్డ్, గృహిణులు, రియల్ ఎస్టేట్, మార్కెటింగ్, టీచర్స్, RMP డాక్టర్స్ కావలెను. Q: 10th / ఇంటర్ / డిగ్రీ. ✆ 70134 81406
- మంగళగిరి DGP Office సమీపంలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ: 18,000/- PF&ESI కటింగ్ పోను, 10th, Age 45 లోపు. ✆ 88014 97437, 97034 65118
- ప్రముఖ వ్యాపార సంస్థలో పనిచేయుటకు స్త్రీ, పురుషులు (వయస్సు పరిమితి లేదు) కావలెను. జీతం మరియు ఇన్సెంటివ్ ఇవ్వబడును. ఆఫీసు లక్ష్మీపురం, గుంటూరు. ✆ 94927 94759
- గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రి దగ్గరలో కన్‌స్ట్రక్షన్ సైట్‌కు సె॥ గార్డ్స్ 4 గురు కావలెను. 12 గం॥ డ్యూటీ. అర్హత: 9th, మంచి జీతం. ✆ 93911 11702
- విజయవాడలో A/C Rental Events కంపెనీకి డ్రైవింగ్ తెలిసిన హెల్పర్స్, A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం: 20-25,000/- భో + వసతి + ఫ్రీ ట్రైనింగ్. ✆ 76808 06109, 99660 44671
- వంట మాస్టర్లు భార్యభర్తలు వెంటనే కావలెను. వసతి సౌకర్యం కలదు. వరంగల్ సిటీ లోని ప్రైవేటు మెడికల్ కాలేజిలో వంట చేయుటకు సంప్ర: 9390809999, 9849235255.
- తిరుపతిలోని ఆర్యవైశ్య ఓల్డేజ్ హోమ్ నందు లేడీ వంటమనిషి మరియు లేడీ పేషెంట్ కేర్ కావలెను, జీతం: 10 వేలు, భోజనం + వసతి సౌకర్యం కలదు. ✆ 9491523201
- త్రివేణి హోంకేర్. హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K-20K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీస్, డి.నెం.54-15-4బి, క్రింది అంతస్తు, లక్ష్మీ అవెన్యూ, శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీ, రింగ్ రోడ్డు, విజయవాడ - 520008. ఆంధ్రప్రదేశ్. ఫోన్ :8331011695. ఇ-మెయిల్ : armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది & సమయం: తేది.17.12.2025, మ॥ 2.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసే వరకు ప్రతి 5 నిముషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది : 17.12.2025, మ॥ 12.00 గం.ల లోపు రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును మెస్సర్స్ పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/ NEFT ద్వారా తేది: 17.12.2025, మ॥ 12.00 గం.లలోగా పొందుపరచి జమ చేయాలి.

బుణగ్రహీత / హామీదారులు & బ్రాంచ్ వివరములు	ఆస్తి వివరములు	రిజర్వు ధర (రూ.లలో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
ఎఆర్ఎమ్ బ్రాంచ్, విజయవాడ మెస్సర్స్ లక్ష్మీ వినాయక ట్రేడర్స్, ప్రొప్రైయిటర్ : శ్రీ సాంబ కోటేశ్వరరావు, తండ్రి : రమణ రావు బకాయి మొత్తం : రూ.4,95,82,686.80 పై + వడ్డీ + ఇతర ఖర్చులు	[illegible]	రూ. 447.00 లక్షలు	రూ. 44.70 లక్షలు

CERSAI Id : 400093329797

ఆస్తి తనిఖీ తేది & సమయం: తేది.15.12.2025, ఉ॥ 11.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు

"https://baanknet.com/eauction-psb" హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848/8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది : 27-11-2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

సమస్యలపై సీఎంకు వినతి

మంగళగిరి టౌన్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి గ్రీవెన్స్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని, కేజీబీవీ టైప్–4 కింద పనిచేసే మోడల్ స్కూల్ హాస్టల్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వేతనాలు సకాలంలో అందక పలు విభాగా కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదర్శ పాఠశాల వసతి గృహ ఉద్యోగుల వేతనాలు కూడా విడుదల చేయాలని సీఎం చంద్రబాబును కోరినట్లు పేర్కొన్నారు.

మెగా జాబ్ మేళా

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రభుత్వం ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. 10 కంపెనీల ప్రతినిధులు హాజరై 260 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. నియామక పత్రాలను అందజేశారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ అవకాశాన్ని ఉపయోగించుకుని మంచి భవిష్యత్తు కోసం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలన్నారు. నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ విజయలక్ష్మి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలు అవసరం

మంగళగిరి టౌన్: ప్రతి ఒక్కరు మానవతా విలువలను పెంచుకోవాలని జమాతే ఇస్లామి హింద్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పొరుగు వారి హక్కులు ఉద్యమం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గౌతమ బుద్ధ రోడ్‌లో ర్యాలీ నిర్వహించారు.

మెరుగైన సేవలే బ్యాంక్ లక్ష్యం

మంగళగిరి టౌన్: ఖాతాదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించడమే తమ లక్ష్యమని కెనరా బ్యాంక్ ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధిలోని నిడమర్రు గ్రామంలో శనివారం నూతన శాఖ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. జీరో బ్యాలెన్స్ ఖాతాను పొందవచ్చునని పేర్కొన్నారు. ఇతర బ్యాంకులతో పోల్చుకుంటే తక్కువ వడ్డీరేటుకే రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. జనరల్ మేనేజర్ విజయలక్ష్మి, బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్, ఏజీఎం రాజ్‌కుమార్‌పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

తాడేపల్లి రూరల్ : ఉండవల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన సాయాన్ని చెక్కు రూపంలో శనివారం అందజేశారు. ఉండవల్లి గ్రామానికి చెందిన సింగంశెట్టి వెంకట శిమ్మకు రూ. 1.50 లక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాసరి కృష్ణ, వంగా నరేంద్ర, గాదె బసివిరెడ్డి, ప్రశాంత్, యర్రంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఐడీసీ బోర్డు సమావేశం

తాడేపల్లి రూరల్ : ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఐడీసీ) బోర్డు సమావేశం శనివారం తాడేపల్లి ఏపీఐడీసీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పడిన నాటి నుంచి 792 కంపెనీలకు రూ. 344 కోట్ల రుణం అందించామని పేర్కొన్నారు. విశాఖకు వేదికగా కుదిరిన పారిశ్రామిక ఒప్పందాలు ఏపీ భవిష్యత్తును సువర్ణమయం చేస్తాయని తెలిపారు. లోన్లు చెల్లించని కంపెనీలకు రికవరీ నోటీసులు అందజేసినట్లు పేర్కొన్నారు. బోర్డు సమావేశంలో కార్పొరేషన్ స్థితిగతులపై, భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎండీ రఘునాథ్, డైరెక్టర్లు మల్‌హోత్రా, బాలభారతి, రాజారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నీ గుంతలే.. వెళ్లాలంటే చింతలే!

- అధ్వానంగా ఫిరంగిపురం – సత్తెనపల్లి రోడ్డు
- తక్కెళ్లపాడు వరకు ప్రమాదకరంగా రహదారి
- కనీసం పట్టించుకోని పాలకులు, అధికారులు

దెబ్బతిన్న మార్జిన్ రహదారి

గుంతలమయంగా మారిన రోడ్డు

ఫిరంగిపురం: ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వెళ్లే దారిలో తక్కెళ్లపాడు వరకు ఉన్న రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. పెద్ద గుంతలు ఏర్పడటంతోపాటు పలుచోట్ల కంకర రాళ్లు బయటకు రావడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు పది కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రతి రోజు ద్విచక్రవాహనాలపై ప్రజలు ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. బస్సు సౌకర్యం నామమాత్రంగా ఉండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తుంటారు. గతుకుల రోడ్డుపై ప్రయాణించాలంటే ఎక్కడ కిందపడి ప్రమాదాలు సంభవిస్తాయోనని వారు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో కొన్నిచోట్ల ఉన్న గుంతలు సరిగా కన్పించక పడి తీవ్రంగా గాయాలపాలైన వారు ఉన్నారు.

పట్టించుకోని అధికారులు

మూడేళ్ల కిందట ఈ రోడ్డుకు కొద్దిపాటి మరమ్మతులు నిర్వహించారు. ప్రస్తుతం పూర్తిగా రోడ్డు దెబ్బతింది. అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సృజనాత్మకత పెంచేలా బాలోత్సవం

ప్రతిజ్ఞ చేస్తున్న బాలలు

మంగళగిరి టౌన్: బాలల్లో సృజనాత్మకత పెంచేవిధంగా బాలోత్సవం ఉంటుందని రోటరీ డిస్ట్రిక్ చైర్ క్లబ్ అడ్మినిస్ట్రేషన్ అన్నే రత్నప్రభాకర్ పేర్కొన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని అరవింద్ మోడల్ స్కూల్‌లో శనివారం మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం మూడవ పిల్లల పండుగ ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నప్రభాకర్ మాట్లాడుతూ బాలల వ్యక్తిత్వ వికాసం సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అమరావతి బాలోత్సవ కన్వీనర్ మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 ప్రాంతాల్లో కార్యక్రమం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ర్యాంకుల కోసం బాలలపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. రానున్న 15 సంవత్సరాల్లో బాలలు ఆటలు కూడా మర్చిపోయే పరిస్థితి ఉందన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని బాలలకు సూచించారు. డ్రగ్ రహిత సమాజాన్ని నిర్మించాలంటూ బాలలచే ప్రతిజ్ఞ చేయించారు. జానపద, శాస్త్రీయ నృత్యాలు, విచిత్ర వేషధారణ, దేశభక్తి గీతాలాపనలు, లఘు నాటికలు తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మంగళగిరి అమరావతి బాలోత్సవం కమిటీ ఉపాధ్యక్షుడు మోహనరావు, గౌరవ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, కార్యదర్శి రాజశేఖర్, గౌరవ సలహాదారులు వల్లభనేని వాణి, కోశాధికారి సుబ్బారెడ్డి, గౌరవ సలహాదారు వెంకటేశ్వరరావు, సభ్యులు ఐజాక్ న్యూటన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

దుగ్గిరాల: ప్రజల సౌకర్యార్థ సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. శనివారం దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలోని దెయ్యాలపేటనందు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులు రూ. 5 లక్షలతో ఈ రోడ్డు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాణిక్యం, ఎంపీటీసీ రోజ మరియమ్మ, ఈవో శరత్ బాబు తదితరులు పాల్గోన్నారు.

రైతుల శ్రమను దోచుకుంటున్న దళారులు

ఆరబెట్టిన ధాన్యం రాశిని పరిశీలిస్తున్న సంఘం నాయకులు

దుగ్గిరాల: ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక దళారుల చేతుల్లో చిక్కి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కౌలు రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకర్ అన్నారు. శనివారం దుగ్గిరాల మండలం పేరకలపూడి, చినపాలెం, పెదపాలెం, రేవేంద్రపాడు గ్రామాలలో కౌలు రైతు సంఘం ప్రతినిధులు పర్యటించి అన్నదాతల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మద్దతు ధర కల్పించాలని కోరారు. తుపాను ప్రభావంతో నిల్వ చేసుకోవడానికి గోదాములు లేక కల్లాల్లోనే 75 కిలోల బస్తాను రూ. 1,250–1,300 లోపు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పండిందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు మాట్లాడుతూ కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శులు యెగేశ్వర రావు, వై.బ్రహ్మేశ్వర రావు, పాములు, రాంబాబు, వెంకటరావు, శ్రీనివాస రావు, గణేష్, యాకోబు, వెంకట రమణ, అరుణ, పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ఇక అంతే

రాజధానిలోని దాదాపు 10 గ్రామాలకు రహదారి అయిన యర్రబాలెం–కృష్ణాయపాలెం ప్రమాదకరంగా మారింది. యర్రబాలెం చెరువు వద్ద మురుగునీటిని మళ్లించేందుకు పైపులతో కల్వర్టు ఏర్పాటు చేశారు. ఆ పైపులైన్ పగిలి తారురోడ్డు కుంగి రంధ్రం ఏర్పడింది. దానిలో చెత్తాచెదారం వేయడంతో అది కనిపించడం లేదు. ఇక్కడ మలుపు ఉండడంతో గుంత ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– తాడేపల్లి రూరల్

ప్రమాదకరంగా పిచ్చి మొక్కలు

గుంటూరు – కర్నూలు రాష్ట్ర రహదారికి ఇరువైపులా మండలంలోని అమీనాబాద్ – పొనుగుపాడు మధ్య ఇరువైపులా పిచ్చిమొక్కలు, కంప ఏపుగా పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ సమయంలో పశువులు, గొర్రెలు, పందులు వంటి ఆకస్మాత్తుగా రోడ్డు మీదకు వస్తున్నాయి. ప్రమాదాల్లో పలువురికి తీవ్రగాయాలు కాగా.. చికిత్స పొందుతూ మృతి చెందినవారు కూడా ఉన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– ఫిరంగిపురం

అడ్వంచర్ క్యాంప్‌నకు విద్యార్థి ఎంపిక

కార్తికేయ శ్రీరామ్

మంగళగిరి టౌన్: జాతీయ స్థాయిలో ప్రతి ఏడాది జరిగే అడ్వంచర్ క్యాంప్‌నకు మంగళగిరికి చెందిన విద్యార్థి ఎంపికైనట్లు నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జె. నిర్మలా జ్యోతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ... బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్న సీహెచ్ కార్తికేయ శ్రీరామ్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరపున ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. క్యాంపునకు వర్సిటీ తరపున పదిమంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారని తెలిపారు. ఈ క్యాంపులను భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ ప్రతి సంవత్సరం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల కోసం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగా అటల్ బిహారీ వాజ్‌పేయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ కేంద్రాల్లో శిబిరాలు జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్తికేయ శ్రీరామ్‌ను కళాశాల యాజమాన్యం అభినందించింది.

ధాన్యం సేకరణ కేంద్రంలో పరిశీలన

దుగ్గిరాల: ధాన్యం సేకరణ కేంద్రంలో తహసీల్దారు పరిశీలించారు. శనివారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలోని వీరాంజనేయ రైస్ మిల్లులో ధాన్యం కొనుగోలు తీరును తహసీల్దారు ఐ.సునీత పరిశీలించి, రైతుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వీఆర్‌వోలు, వ్యవసాయ సిబ్బంది, జీడీసీఎంఎస్ సిబ్బంది, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.
– మరోవైపు ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు పద్మావతి, ఇన్‌చార్జి ఏడీఏ ఆర్.విజయబాబు తదితరులు పరిశీలించారు. ఈమని గ్రామంలో వరి కోతల వివరాలు, ధాన్యంలో తేమ శాతం, కొనుగోలు షెడ్యూల వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యం సేకరించాలని ఆదేశించామన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

శ్రీ బసవమందిరం భూమి అన్యాక్రాంతం

- శతవసంతాల చరిత్ర కలిగిన మందిరం ఆస్తి
- రూ.2 కోట్ల విలువైన భూమిని లీజుకిచ్చేశారు
- లీజు నుంచి వెనక్కు ఇప్పించండి
- మంత్రి మనోహర్‌కు జంగమ సంక్షేమ సంఘం నేతల వినతి

తెనాలి: దాతలు సత్సంకల్పతో నిర్మించిన శతవసంతాల చరిత్ర కలిగిన పట్టణ నందులపేటలోని శ్రీబసవ మందిరానికి చెందిన రూ.2 కోట్ల విలువైన ఎకరం భూమిని దేవదాయశాఖ లీజు పేరుతో ధారాదత్తం చేసిందని జంగమ సంక్షేమ సంఘ నేతలు ఆరోపించారు. మందిరానికి ఉన్న ఏకైక ఆస్తి అయిన ఆ భూమిని లీజు నుండి తప్పించాలని కోరుతూ శనివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణ నందులపేటలోని వినాయకుడి గుడి రోడ్డులో ఆధ్యాత్మికవేత్త సోము బసవయ్య మరణానంతరం, ఆయన సతీమణి సోము రాజమ్మ 1924లో అక్కడే శ్రీబసవ మందిరం నిర్మించినట్టు తెలిపారు. ఆలయ నిర్వహణకు పట్టణ సరిహద్దుల్లో 6.07 ఎకరాల మాగాణి భూమిని, ఫల పుష్పాల కోసం 40.5 సెంట్ల వినాయక తోటను ఆర్థిక వనరులుగా ఏర్పరచినట్టు చెప్పారు. వాటిపై వచ్చే ఆదాయంతో జంగమ కులస్తులకు పవిత్రమైన కార్తీకమాసంలో బసవ మందిరంలో లింగధారణ, గణర్చన, శివపూజలు, దాతల పేరిట అన్నదానం చేస్తున్నారు. దీనికి సంబంధించి ఒక సెటిల్‌మెంట్ డీడ్‌ను నియమ నిబంధనలతో రాసి, జంగమ కులస్తులను మాత్రమే ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమిస్తున్నట్టు తెలిపారు. బుర్రిపాలెం రోడ్డులో బీసీ కాలనీ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 5.07 ఎకరాలను సేకరించింది. నూతనంగా నిర్మించిన ఓంకారేశ్వర ఆలయం సమీపాన గల మిగిలిన ఎకరా భూమిని దేవదాయశాఖ 11 ఏళ్లకు లీజుకిచ్చినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. లీజు రద్దుచేయకపోతే మందిర నిర్వహణ సహా తమ సంఘీయుల కార్యకలాపాలు ఆగిపోతాయనీ, భూమి గట్టుపై గల బసవయ్య, రాజమ్మల సమాధులను కూడా చెరిపేస్తారన్న ఆందోళనను వ్యక్తంచేశారు. మంత్రిని కలిసినవారిలో రాష్ట్ర నవ్యాంధ్ర జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుల్ను యూఎంవీ నాగలింగం, తెనాలి డివిజన్ అధ్యక్షులు కేవీఎస్ నాగలింగం, కార్యదర్శి కె.చంద్ర శేఖర లింగం, సంయుక్త కార్యదర్శి పి.రాజేష్‌కుమార్, టి.జయశ్రీ, సోము లక్ష్మణ, సిద్దుల సాయినాథ్, ప్రత్తిపాటి శ్రీనివాస్, సీహెచ్ కోటేశ్వరరావు ఉన్నారు.

ఫైపులైన్ పనులు వేగవంతం

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె: తాగునీరు, లీకుల సమస్యలకు పరిష్కారం చూపుతూ పట్టణంలో పైపులైన్ పనులు వేగంగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పైపులైన్ పనులతో చిన్నపాటి అసౌకర్యానికి గురైనా ప్రజలు సహకరించాలని కోరారు. తొలివిడతగా పెదకూరగాయల మార్కెట్ నుంచి చంద్రమౌళి పార్కు వరకు పైపులైన్ ఏర్పాటు పనులు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు తాగునీటికి అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎజెండాలోని 21 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్లు ప్రశాంత్‌కుమార్, టీకేవీ గుప్త, కమిషనర్ సాంబశివరావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కులమత భేదాలు చూపొద్దు

కర్లపాలెం: కులమతాల భేదాలు చూపవద్దని, ప్రజలందరూ సమానమేనని బాపట్ల ఆర్డీవో గ్లోరియా తెలిపారు. మండల పరిధిలోని నర్రావారిపాలెం పంచాయతీ ఎస్టీ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవ సభలో ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా కుల వివక్షకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. అందరూ తమ పిల్లలను చదివించుకోవాలని సూచించారు. ఆధార్, రేషన్ కార్డులు లేనివారు వెంటనే అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇళ్ల స్థలాలు లేనివారిని గుర్తించి స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురైనప్పుడు చట్టాలు వినియోగించుకుని రక్షణ పొందాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాకీర్ పాషా, ఎంపీడీవో శ్రీనివాసరావు, సీఐ హరికృష్ణ, ఎస్ఐ రవీంద్ర, తదితర అధికారులు పాల్గొన్నారు.

రెండు బుట్టల విధానంతో మేలు

డీపీవో నాగసాయికుమార్

తెనాలి రూరల్: రెండు బుట్టల విధానంతో మేలని, ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్ సూచించారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రజలకు శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ తడి–పొడి చెత్త వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉన్నప్పుడే పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని, ఆరోగ్యకర వాతావరణం ఉంటుందని చెప్పారు. అంగలకుదురులో 15 రోజుల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత మెరుగుపడాలని, పచ్చదనం పెరగాలని, ఇందుకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామంలో రోడ్డు ప్రక్కల చెత్తను పరిశీలించారు. చెత్త రోడ్డు వెంబడి వేయకుండా ప్రజలను నిరంతరం చైతన్య పరచాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యుపీసీ)లో వర్మీ కంపోస్టు తయారీకి, నాడెప్ గుంతలు నింపడానికి సూచనలు చేశారు. పొడి చెత్తను గురువారం విక్రయించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ అనసూయ, క్లాప్ మిత్రలు, సీఆర్‌పీలు, గ్రీన్ అంబాసిడర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ల బైండోవర్

తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ సర్కిల్ పరిధిలోని సుమారు 25 మబంది రౌడీ షీటర్లను పోలీసులు బైండోవర్ చేశారు. సీఐ సాంబశివరావు, సిబ్బంది శనివారం రాత్రి రౌడీ షీటర్లను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఎదుట హాజరుపరిచారు. ఇకపై ఎటువంటి నేరాలకుల్పడినా, ప్రమేయం ఉందని తెలిసినా బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినట్టేనని, జైలుకు వెళతారని తహసీల్దార్ హెచ్చరించారు. ప్రవర్తనను మార్చుకోవాలని సూచించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు వి. దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను ఆయన ప్రారంభించి, మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు గత 361 రోజులగా దీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. న్యాయం జరిగే వరకు దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సీఐటీయూ నాయకుడు వెంకటయ్య, యూనియన్ నాయకులు కె.స్టీవెన్, నాగేశ్వర రావు, అంకయ్య, ఆశీర్వాదం పాల్గొన్నారు.

వీనులవిందుగా గానామృతం

శ్రీ వెంకటేశ్వరస్వామికి గానామృతం చేస్తున్న భక్తులు

తెనాలిటౌన్: శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర స్వామి గానామృతం తెనాలిలో వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామికి విశేష పూజలను నిర్వహించారు. పట్టణానికి చెందిన శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీరావుపేటలో కోట బద్రీనాథ్ గుప్తా ఖాళీస్థలంలో శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృతం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ నేతృత్వంలో బృంద సభ్యులు, మహిళా భక్తులు శ్రీవెంకటేశ్వరస్వామి పాటలను ఆలపించారు. తెనాలి డాల్ మిల్లర్స్ అసోసియేషన్‌ప్రధాన కార్యదర్శి తటవర్తి సూర్యనారాయణ, కోట బద్రీనాథ్ గుప్తా స్వామివారికి పూజలు జరిపారు. ట్రస్టు నిర్వాహకులు ఆర్‌వీ కిరణ్ కుమార్ స్వామి వారి శేష వస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. 22వ తేదీ శనివారం ప్రారంభమైన శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృతం ఏడు శనివారాలు జరుగుతుందని చెప్పారు. భక్తులందరూ విశేషంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్, జంజం రామారావు, గుడివాడ బాలకృష్ణ, కోట బద్రీనాథ్ గుప్తా, రొంపిచర్ల సురేష్, మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్, కాలేపల్లి రాజశేఖర్, కోట రవిశంకర్, సంకీర్తన బందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన బృందం సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైల్వే గేట్ల పరిశీలన

వేమూరు: రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ పెరిగిపోవడంతో రైల్వే అధికారులు నియంత్రణకు తలలు పట్టుకుంటున్నారు. రైల్వే డివిజనల్ అధికారులు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సాధించారు. రైల్వే గేట్లకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలుపై కసరత్తులు చేస్తున్నారు. వేమూరు నియోజక వర్గంలోని పలు రైల్వే గేట్లను రైల్వే అధికారులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం కోసం రూ.200 కోట్లు కేటాయించినట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో రైల్వే డిప్యూటీ డీఈ, సుదర్శన, చుందూరు, వేమూరు తహసీల్దారులు నాగరాజు, సుశీల, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.డబ

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

తిరుపతి జిల్లాలో ఆరుగురిపై పీడీ యాక్ట్

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లాలో గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయిస్తున్న ఆరుగురిపై పోలీసులు ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. శ్రీకాళహస్తికి చెందిన కరణి సాయికుమార్ అలియాస్ స్పార్కిల్ సాయి(22), చెరుకుర్తి వంశీ(24), పైపూరి వేణుగోపాల్(45), పరంధాం అలియాస్ పరంధామయ్య(58), తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మావతిపురంలో నివాసం ఉంటున్న సాడు హరి(28), తడకు చెందిన వల్లూరు మురళి అలియాస్ నక్క మురళి (31)పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. వీరిలో కొందరిపై గంజాయి, డ్రగ్స్, మరికొందరిపై ఎర్రచందనం, ప్రమాదకర బాంబ్ విస్ఫోటన పదార్థాల విక్రయాలకు సంబంధించిన కేసులు ఉన్నాయని చెప్పారు. తిరుపతిని డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎస్పీ ప్రకటించారు.

'తిరుమల నెయ్యి' కేసులో మరో 11 మంది నిందితులు

తిరుమల: టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేశారనే ఆరోపణలపై నమోదైన కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరో 11 మందిని నిందితుల జాబితాలో చేర్చింది. మొదట 15 మందిని నిందితులుగా పేర్కొన్న సిట్, అనంతరం మరో 9 మందిని చేర్చింది. తాజాగా నెల్లూరు ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన మెమోలో మరో 11 మందిని నిందితులుగా పేర్కొంది. దీంతో మొత్తం నిందితుల సంఖ్య 35కు చేరింది. టీటీడీ మాజీ జీఎంలు జగదీశ్వరరెడ్డి, మురళీకృష్ణ, ఎస్వీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈవో పోలేపల్లి వెంకట నటేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ ముద్దు వెంకట అనిల్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ పల్లె ఈశ్వర్‌రెడ్డి, టెక్నికల్ ప్లాంట్ ఇన్‌స్పెక్షన్ విభాగానికి చెందిన జయరాజ్‌రావుతోపాటు మల్ల మహేందర్, డాక్టర్ వెంకట సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ బత్తుల సురేంద్రనాథ్‌లను కొత్తగా నిందితులుగా పేర్కొంది.

నేడు కూడా జోగి సోదరుల విచారణ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): నకిలీ మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి రాములను ఆదివారం ఐదో రోజు కూడా పోలీసులు విచారించనున్నారు. తొలుత వారిని నాలుగు రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శనివారంతో కస్టడీ ముగిసింది. అనంతరం వారిద్దరికీ వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా జైలుకు తరలించారు. కానీ కస్టడీకి తీసుకుని నెల్లూరు జైలు నుంచి విజయవాడకు తరలించడంలో ఒక రోజంతా వృథా అయిందని, కస్టడీ పొడిగించాలని కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టు ఒకరోజు కస్టడీ పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఆదివారం కూడా పోలీసులు వారిని కస్టడీకి తీసుకుని విచారించనున్నారు.

నకిలీ మద్యం కేసులో 26వ నిందితునికి రిమాండ్

కోర్టు నుంచి వస్తున్న జగన్‌మోహన్‌రావు

ములకలచెరువు: అన్నమయ్య జిల్లా ములకలచెరువు వద్ద నకిలీ మద్యం తయారీ కేసులో ఏ–26వ నిందితునిగా ఉన్న ఎం.జగన్ మోహన్‌రావుకు తంబళ్లపల్లె జేసీజే కోర్టు న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ శనివారం రిమాండ్ విధించారు. విజయవాడ జైలులో ఉన్న జగన్‌మోహన్‌రావును ఎక్సైజ్ పోలీసులు పీటీ వారెంట్‌పై తంబళ్లపల్లె కోర్టులో హాజరు పరిచారు. 14 రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించడంతో ఆయన్ను మదనపల్లె సబ్ జైలుకు తరలించారు.

అమరావతి రైతుల సమస్యలపై దృష్టి

మంత్రులు పెమ్మసాని, నారాయణ

కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి నారాయణ

తాడికొండ: అమరావతి రాజధాని ప్రాంతంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరంపెమ్మసాని మాట్లాడుతూ అమరావతిలో రైతులు తెలిపిన వాస్తు, ప్లానింగ్, రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారంపై దిశానిర్దేశం చేశామన్నారు. 38,000 మంది హెల్త్ కార్డులు పొందగా, 10,000 మంది ఇప్పటికే వీటిని వినియోగించుకున్నట్లు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ గ్రామ కంఠాలలో అనాయం జరిగిందని కొందరు చెప్పారని, నెలలోపు ఆ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఈ సమావేశంలో తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, కలెక్టర్ తమీం అన్సారియా, జాయింట్ కలెక్టర్ శ్రీవాత్సవ, రాజధాని అమరావతి జేఏసీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ పరిశ్రమల తిరుగుబాటు

రాయల్టీ, జీఎస్టీ బాదుడుతో చంద్రబాబు సర్కారుపై నిరసన గళం

బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వేమవరం జంక్షన్ వద్ద లైట్‌పోల్‌ను విరిచేసిన నిరసనకారులు

సాక్షి ప్రతినిధి, బాపట్ల/బల్లికురవ/మార్టూరు: రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం మైనింగ్‌పై విచ్చలవిడిగా పన్నులు వసూలుచేయడాన్ని నిరసిస్తూ.. శనివారం బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వేమవరం జంక్షన్‌లోని ఏఎంఆర్ చెక్‌పోస్టు వద్ద గ్రానైట్ పరిశ్రమల యజమానులు, కార్మికులు పెద్దఎత్తున నిరసనకు దిగారు. ఆగ్రహంతో చెక్‌పోస్టు కంటైనర్ బాక్స్‌ను బద్దలుకొట్టారు. కంప్యూటర్లు, ఇతర సామగ్రితోపాటు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు. అయితే, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంత నియోజకవర్గం అద్దంకి నుంచే గ్రానైట్ పరిశ్రమల యజమానులు, కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనకు శ్రీకారం చుట్టారు. అలాగే, ఆందోళనలో పాల్గొన్న వారిలో 90 శాతం అధికార టీడీపీకి చెందిన వారే ఉన్నారు. ఇక మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో.. మల్లాయిపాలెం, వేమవరం, ఉప్పుమాగులూరు, కొనెదన, గంగపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాల పరిధిలోని 500 పరిశ్రమల నుంచి పలువురు యజమానులతోపాటు వేలాది మంది కార్మికులు జంక్షన్‌కు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం రాయల్టీ, జీఎస్టీ అంటూ పన్నుల పేరుతో దోపిడీకి పాల్పడుతోందంటూ తీవ్రంగా నిరసించారు. చంద్రబాబు సర్కారు తీరును దుమ్మెత్తిపోశారు. ప్రభుత్వం దుర్మార్గంగా పన్నులు వేసి గ్రానైట్ వ్యాపారాన్ని కుదేలు చేసిందని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఒక కట్టర్‌కు రూ.27 వేలు టాక్స్ వసూలు చేస్తే.. చంద్రబాబు ప్రభుత్వం దుర్మార్గంగా కట్టర్‌కు రూ.35 వేల రాయల్టీతోపాటు రూ.5 వేల జీఎస్టీ వసూలుచేస్తోందన్నారు. ఇదికాక.. కట్టర్‌కు మరో రూ.35 వేలు కప్పం కింద వసూలు చేస్తున్నారన్నారు. వసూలు బాధ్యతలు ఏఎంఆర్‌కు అప్పజెప్పడంతో వారు చెక్‌పోస్టులు పెట్టి దోపిడీకి పాల్పడుతున్నారని పరిశ్రమల యజమానులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంత మొత్తంలో పన్నులు, ఇతరత్రా చెల్లించి వ్యాపారం చేయలేమన్నారు. కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టిన పరిశ్రమలు మూతపడే పరిస్థితి నెలకొందని, అదే జరిగితే తాము నష్టపోవడమే కాక యుపీ, ఎంపీ, ఒడిశా, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి పొట్టచేతబట్టుకుని వచ్చిన కార్మికులు రోడ్డునపడతారని పరిశ్రమల యజమానులు చెబుతున్నారు. ప్రభుత్వం పన్నుల పేరుతో దోపిడీకి పాల్పడుతోందని యజమానులుతోపాటు కార్మికులూ మండిపడుతున్నారు. తక్షణం ప్రభుత్వం అధికంగా విధించిన పన్నులు ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రానైట్ సంఘ ప్రతినిధులకు డీఎస్పీ హెచ్చరిక

అనంతరం మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి బాపట్ల డీఎస్పీ గోగినేని రామాంజనేయులు ఇరువర్గాలతో సమావేశమయ్యారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే గ్రానైట్ అసోసియేషన్ సభ్యులపై, ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్రిక్తంగా మారిన ఆందోళన..

ఇదిలా ఉంటే.. యజమానులతోపాటు వేలాది మంది కార్మికులు వేమవరం జంక్షన్‌కు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఒక్కసారిగా ఆందోళనకారులు అక్కడే వున్న ఏఎంఆర్ చెక్‌పోస్టు కంటైనర్ బాక్స్ వద్దకు వెళ్లి దానిని కూలదోశారు. బాక్స్‌లో వున్న కంప్యూటర్ సెట్, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. చెక్‌పోస్ట్ లైటింగ్ పోల్‌ను నేలమట్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వేమవరం చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. దీంతో.. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో నిరసనకారులు ఆందోళన విరమించారు. ప్రభుత్వం విధించిన పన్నుల భారానికి వ్యతిరేకంగా గ్రానైట్ పరిశ్రమల యజమానులు, కార్మికులు నాలుగు రోజుల క్రితం మార్టూరు జాతీయ రహదారిపై జొన్నతాళి గ్రామం వద్ద నిరసన తెలిపారు.

ప్రపంచస్థాయి రాజధాని పేరుతో చంద్రబాబు దగా

- కమీషన్ల కోసమే అడ్డగోలు భూదోపిడీ
- మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫైర్

సాక్షి, అమరావతి: ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణం పేరుతో సీఎం చంద్రబాబు రైతులను దగా చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల క్రితమే 34 వేల ఎకరాల భూములిచ్చిన రైతులకు ఇప్పటివరకు ఎందుకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వలేదని నిలదీశారు. నాడు రైతులను త్యాగధనులంటూ కీర్తించిన బాబు.. ఇప్పుడు వారికి అపాయింట్‌మెంటూ ఇవ్వడం లేదని మండిపడ్డారు. రాజధాని కోసం ప్రభుత్వ భూములు కలుపుకుని తొలిదశలో సుమారు 53 వేల ఎకరాలు సేకరించిన చంద్రబాబు.. కేవలం కమీషన్లు, కాంట్రాక్టర్ల కోసమే ఇప్పుడు రెండో విడతలో మరో 20 వేల ఎకరాలు సేకరణకు సిద్ధపడుతున్నారని తప్పుపట్టారు. నాడు రాజధాని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అంటూ గొప్పలు చెప్పి... నేడు అప్పు కోసం ప్రపంచమంతా తిరుగుతున్న చంద్రబాబే అమరావతికి అసలైన విలన్ అని స్పష్టం చేశారు.

రైతుల రిటర్నబుల్ ప్లాట్లు ఎక్కడ?

'తొలిదశలో భూములిచ్చి అమరావతి రైతులకు అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లు ఇస్తామని నమ్మబలికిన చంద్రబాబు ఇప్పుడు నిండా ముంచారు. ఆ ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో చూపించాలి. తమకు ఇస్తామన్న కౌలు గురించి అడిగితే ప్రభుత్వం మాట్లాడడం లేదు. ఇది దుర్మార్గం కాదా? గ్లోబల్ సిటీ అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కమీషన్లు, కాంట్రాక్టర్ల కోసమే మరో విడత భూ దోపిడీకి కుట్రపన్నారు. మొన్నటివరకు రాజధానికి భూములిచ్చిన రైతులు త్యాగధనులని, వారిచ్చిన భూముల్లో పదేళ్లలో అద్భుత రాజధాని కట్టి చూపిస్తామని చెప్పిన సీఎం ఇప్పుడు ఇచ్చిన భూముల్లో రాజధాని సాధ్యం కాదని, చిన్న మున్సిపాలిటీగానే మిగిలిపోతోందని చెబుతున్నారు. ఆయనది నాలుకా, తాటి మట్టా?' అని అంబటి ప్రశ్నించారు.

చంద్రబాబు పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

'సీఎం చంద్రబాబు పాలనలో వ్యవస్థలన్నీ నాశనమైపోయాయి. చంద్రబాబు పాదం పెట్టడంతోనే అమరావతితోపాటు రాష్ట్రమంతా భూములు ధరలు కుప్పకూలిపోయాయి. రియల్ ఎస్టేట్ సర్వనాశనం అయిపోయింది. రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు దెబ్బతినిపోతున్నారు. అమరావతి సెల్ఫ్‌ఫైనాన్స్ నగరం అని చంద్రబాబు అబద్ధాలు వల్లెవేస్తున్నారు. రాజధాని నిర్మాణానికి అప్పుల కోసం ప్రపంచమంతా చంద్రబాబు తిరుగుతున్నారు. ఈ అప్పులన్నీ దోచుకునేందుకు పన్నాగం పన్నుతున్నారు' అని ధ్వజమెత్తారు.

పవన్ కామెడీ

అనంతరం విలేకరుల అడిగిన ప్రశ్నలపై అంబటి స్పందిస్తూ 'కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ప్రాధాన్యం లేదు. ఆయన పర్యటనలో అపరిచిత వ్యక్తి వచ్చాడని ఫిర్యాదు చేస్తున్నారు. పవన్‌కు సెక్యూరిటీ ఇవ్వాల్సింది ఎవరు? ఆయన కోసం అభిమాని వచ్చినా పవన్ భయపడుతున్నారు. ప్రచారం కోసం ఆయన కామెడీ చేస్తున్నారు. ఒక డీఎస్పీని అవినీతిపరుడని పవన్ అంటే ప్రభుత్వం ఆ డీఎస్పీకి అవార్డు ఇచ్చింది. ఇదీ కూటమి ప్రభుత్వంలో పవన్ పరిస్థితి' అని అంబటి ఎద్దేవా చేశారు.

దోపిడీ లక్ష్యంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

- కన్వీనర్ కోటా సీట్లు 50 శాతానికి పరిమితం చేయడం దుర్మార్గం
- రూ.వేల కోట్ల ప్రభుత్వ సంపదను దోచుకోవడమే లక్ష్యంగా పీపీపీ విధానం
- వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి ఆగ్రహం

సాక్షి, అమరావతి: వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ సంపదను దోచుకోవడమే లక్ష్యంగా పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్ (పీపీపీ) పేరుతో 10 కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించిందని వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. ఆయన శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల ముందు మేం అధికారంలోకి వస్తే కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లన్నీ కన్వీనర్ కోటాలోనే భర్తీ చేస్తామని చంద్రబాబు, లోకేశ్, ఇతర కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు కన్వీనర్ కోటా సీట్లను 50 శాతానికే పరిమితం చేయడం దుర్మార్గం. మిగతా 50 శాతం సీట్లను, బీ, సీ కేటగిరీల్లో మేనేజ్‌మెంట్‌తోపాటు ఎన్‌ఆర్‌ఐ కోటా కింద భర్తీ చేసేలా కేబినెట్‌లో తీర్మానించడం విద్యార్థులను దగా చేయడమే.' అని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు.

రెండేళ్లు పైసా ఖర్చు పెట్టకుండానే..

'50 ఎకరాలున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీని రూ.5 వేలకే లీజుకిస్తున్నారంటే దారుణం కాక ఇంకేమిటి? ఈ రోజు మార్కెట్‌లో కేజీ టమాటా రూ.100కి కొనాల్సి వస్తోంది. కానీ మెడికల్ కాలేజీలను ఎకరా లీజు వంద రూపాయలకే కట్టబెట్టేస్తున్నారు. ఇది కాకుండా రెండేళ్లపాటు ప్రభుత్వ బోధనాస్పత్రులను ఉపయోగించుకోవచ్చట. అక్కడ పని చేసే సిబ్బందికి కూడా ప్రభుత్వమే జీతాలు ఇస్తుందని చెబుతున్నారు. అంటే, టెండర్ దక్కించుకున్న వారు డాక్టర్లు, ఇతర సిబ్బందితో సహా రెండేళ్లపాటు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా మెడికల్ కాలేజీలను నిర్వహించుకునేలా ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేస్తున్నారు. ఇది కచ్చితంగా ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెచ్చరించినట్లుగా దోచుకో.. తినుకో.. పంచుకో (డీపీటీ) విధానమే. 70 శాతం రోగులకు ఉచితంగా, 30 శాతం రోగులకు పేమెంట్‌తో వైద్యం చేస్తామని చెబుతున్నారు. మరి ఈ 70 శాతం, 30 శాతం పరిధిలోకి ఏ రోగులు వస్తారు? దాన్ని ఎవరు చూస్తారు? అసలు 70 శాతం కోటా నిండిపోయిందని ఎవరు పర్యవేక్షిస్తారు? పేదలను మోసం చేసే కుట్ర ఇది. మెడికల్ కాలేజీలు లీజుకు పొందిన కుటుంబాలు తరతరాలుగా సంపాదన పొందే విధంగా పీపీపీ విధానం తీసుకొచ్చారు' అని గోపిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రెండేళ్లలో రాష్ట్రం 2,450 మెడికల్ సీట్లు కోల్పోయింది

'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను అద్భుతంగా నిర్మించింది. పేదలకు అత్యాధునిక వసతులతో ఉచిత వైద్యం అందించాలని వైఎస్ జగన్ ఎంతో శ్రమపడి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెస్తే... వాటిని చంద్రబాబు కమీషన్ల కోసం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని నిర్ణయించడం దుర్మార్గం. చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రం రెండేళ్లలో 2,450 మెడికల్ సీట్లను కోల్పోయింది. వైద్య విద్యను అభ్యసించేందుకు మన పిల్లలు పరాయి దేశాలకు వెళ్లాల్సిన దుస్థితికి చంద్రబాబే కారణం' అని గోపిరెడ్డి ధ్వజమెత్తారు.

వెంకటేశ్వర శర్మతో వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదు

వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ ప్రతినిధులు గవాస్కర్, సాయిరాం స్పష్టీకరణ

మీడియాతో గవాస్కర్, సీహెచ్.సాయిరాం

సాక్షి, అమరావతి: న్యాయవాది కోటంరాజు వెంకటేశ్వరశర్మపై కేసు నమోదైతే, వెంటనే ఆయన్ను మా పార్టీకి చెందిన వాడిగా చెబుతూ.. ఎల్లో మీడియాలో, టీడీపీ అనుకూల సోషల్ మీడియాలోనూ అదే పనిగా దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా లీగల్ సెల్ కో–ఆర్డినేటర్ ఒ.గవాస్కర్, అధ్యక్షుడు సీహెచ్.సాయిరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరశర్మకు వైఎస్సార్‌సీపీతో కాని, పార్టీ లీగల్ సెల్‌తో కానీ ఏవిధమైన సంబంధం లేదని, ఆయన తమ పార్టీలో ఎప్పుడూ క్రియాశీలకంగా లేరని స్పష్టం చేశారు. టీడీపీకి నేతలు వైఎస్సార్‌సీపీతోపాటు మాజీ సీఎం వైఎస్ జగన్‌ని నిందిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం వారు మీడియాతో మాట్లాడారు. కనీసం వాస్తవాలు కూడా తెలుసుకోకుండా, పత్రికలు దుష్ప్రచారం చేయడం సబబు కాదన్నారు. 'ఇదే వెంకటేశ్వరశర్మ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో అంటకాగారు. ఆ ఫోటోలను ని చూస్తే వెంకటేశ్వరశర్మ టీడీపీకి చెందిన వారు అనుకోవచ్చు కదా. లేకపోతే పల్లా శ్రీనివాసరావుతో ఆయనకు ఉన్న సంబంధం ఏమిటి? దీనికి టీడీపీ ఏం సమాధానం చెబుతుంది? ఇవన్నీ చూస్తుంటే వెంకటేశ్వరశర్మ టీడీపీ లీగల్‌సెల్ సభ్యుడా? అని నిలదీశారు. ఎల్లోమీడియా ఇలాంటి దుష్ప్రచారాన్ని మానుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరించారు.

పోలీసులపై దాడికి తెగబడిన నిందితులు

- పోతిరెడ్డిపాళెంలో పెంచలయ్య హత్య కేసు నిందితులను చుట్టుముట్టిన పోలీసులు
- కత్తులతో దాడి చేసిన ఓ నిందితుడు

పోలీస్ కాల్పుల్లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు జేమ్స్

కోవూరు: సీపీఎం నాయకుడు కొట్టివిడి పెంచలయ్యను హత్య చేసిన గంజాయి బ్యాచ్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో.. వారు కత్తులతో దాడికి దిగడంతో.. పోలీసులు మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలోని షుగర్ ఫ్యాక్టరీ వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. స్కూటీపై ఇంటికి వెళ్తున్న సీపీఎం నాయకుడు పెంచలయ్యను శుక్రవారం సాయంత్రం దాదాపు 10 మంది దుండగులు దారుణంగా హత్య చేశారు. దీంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు కోవూరు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్నారని సమాచారం రావడంతో పోలీసులు శనివారం తెల్లవారుజామున ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. నిందితుల్లో ఒకడైన జేమ్స్.. కత్తులతో దాడి చేశాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ చేతికి, భుజంపై తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు గాల్లోకి ఒక రౌండ్ కాల్పులు జరిపి.. నిందితులను హెచ్చరించారు. అయినా వారు ఎదురు దాడి చేస్తుండడంతో.. జేమ్స్ మోకాలిపై పోలీసులు రెండు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో కుప్పకూలిన జేమ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. మిగతా నిందితులు ఫ్యాక్టరీ వెనుక ప్రాంతంలోని పొదల్లోకి పారిపోయారు. గాయపడిన పోలీస్‌ను, నిందితుడిని నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. నిందితులను వీలైనంత త్వరగా అదుపులోకి తీసుకుంటామని నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు చెప్పారు.

గంజాయి డాన్.. టీడీపీ మహిళ

నెల్లూరు రూరల్ అడ్డాగా నెలకు రూ.కోట్లలో అక్రమ వ్యాపారం

లేడీ డాన్ అరవ కామాక్షి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న సీపీఎం నేత, నెల్లూరులో గంజాయి వ్యతిరేక ఉద్యమకారుడు పెంచలయ్య దారుణ హత్య వెనుక టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్య అనుచరుల పాత్ర బయటపడింది. గంజాయి బ్యాచ్ ఘాతుకంతో.. ఎమ్మెల్యే అరాచక శక్తులను పెంచి పోషిస్తున్నారన్న ఆరోపణలకు బలం చేకూరుతోంది. కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు ప్రాంత వాసి పెంచలయ్య హత్య కేసులో టీడీపీకి చెందిన అరవ కామాక్షి, ఆమె తమ్ముడు జేమ్స్, వారి అనుచరులను పోలీసులు నిందితులుగా గుర్తించారు. ప్రధాన నిందితులకు అత్యంత సన్నిహితంగా ఉండే టీడీపీ చోటా నేత పాత్రపైనా అనుమానం ఉండటంతో పోలీసులు విచారణ సాగిస్తున్నారు. గతంలోనూ ఇతడిపై అనేక ఆరోపణలున్నట్లు తెలుస్తోంది. కామాక్షి, జేమ్స్‌తో పాటు పెంచలయ్య హత్య కేసులోని మరో ఇద్దరిపైనా సస్పెక్ట్ షీట్లు ఉన్నట్లు సమాచారం.

బోడిగాడితోట నుంచి గంజాయి రాణిగా..

అరవ కామాక్షి, జేమ్స్ టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అండదండలతో నేర సామ్రాజ్యాన్ని విస్తరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నెల్లూరులోని బోడిగాడితోటకు చెందిన కామాక్షి అధికార పార్టీ ర్యాలీలు, సభలకు ప్రజలను తీసుకెళ్తూ ఆ పార్టీ నేతలకు దగ్గరయ్యారు. శ్రీధర్‌రెడ్డి దన్నుతో గంజాయి విక్రేత స్థాయినుంచి డాన్‌గా ఎదిగిందని చెబుతున్నారు. దీంతో ఆమె అరాచకాలకు అడ్డు లేకుండాపోయింది. నెలకు రూ.50 లక్షల మామూళ్లు ముట్టజెబుతూ అక్రమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించినట్లు ప్రచారం జరుగుతోంది. నెల్లూరు రూరల్ కల్లూరుపల్లిలో పాత వస్తువుల కొనుగోలు దుకాణం నిర్వహిస్తున్న ఆమె తన వద్దకు వచ్చేవారి ద్వారా గంజాయి అమ్మిస్తోందన్న ఆరోపణలున్నాయి. నేర చరితులకు ఆశ్రయమిస్తూ, చోరీలకు పాల్పడేవారితో అసాంఘిక కార్యకలాపాలు చేయిస్తున్నట్లు తెలిసింది. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతోంది. బ్యాచ్‌లను నడుపుతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పుడు పెంచలయ్య దారుణ హత్యతో కామాక్షి నేర ప్రవృత్తి వెల్లడైంది. కోటంరెడ్డి వైఎస్సార్‌సీపీలో ఉండగా ఆరోపణలు రావడంతో పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆయన్ను పక్కనపెట్టారు. కానీ, అలాంటి వ్యక్తిని చేరదీసి చంద్రబాబు టికెట్టిచ్చారనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జీవిత ఖైదీ శ్రీకాంత్ పెరోల్ విషయంలోనూ కోటంరెడ్డి ప్రమేయం బయటపడగా, దానిపై ఆయన రకరకాల విన్యాసాలు చేశారు. ఇప్పుడు గంజాయి డాన్ అరవ కామాక్షి సైతం ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితమనే విషయం బయటపడింది. దీంతో వీరి గంజాయి దందా వెనుక కూడా శ్రీధర్‌రెడ్డి పాత్ర ఉందనే ప్రచారం సాగుతోంది. కామాక్షి తన అనుచరులతో కలిసి.. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

హత్య కేసులో 14 మంది పాత్ర

ఈ హత్య కేసులో 14 మంది పాత్ర ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో పెంచలయ్యను 9 మంది వెంటాడి కత్తులతో పొడిచి చంపారు. వాహనంపై పిల్లలు ఉన్నారని కూడా చూడలేదు. హత్యలో మరో ఐదుగురి పాత్ర కూడా ఉన్నట్లు అనుమానిస్తూ పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చంద్రబాబు పాలనలో గంజాయి, డ్రగ్స్ డెన్‌గా ఆంధ్ర

- పెంచలయ్య హత్యే ఇందుకు నిదర్శనం
- అధికార పార్టీ అండతో చెలరేగిపోతున్న మాఫియా
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): చంద్రబాబు పాలనలో ఏపీ గంజాయి, డ్రగ్స్ డెన్‌గా మారిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో కాకాణి మాట్లాడారు. అధికార పార్టీ నేతల అండతో గంజాయి, డ్రగ్స్ మాఫియా చెలరేగిపోతోందని, నెల్లూరు రూరల్ నియోజకవర్గమైతే గంజాయి సామ్రాజ్యంగా మారిందని ఆక్షేపించారు. పెంచలయ్య హత్యే ఇందుకు నిదర్శనమని చెప్పారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అండతోనే అరవ కామాక్షి, జేమ్స్ ఈ హత్యకు తెగబడ్డారని, అయినా కోటంరెడ్డి మొసలి కన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో నకిలీ మద్యం, గంజాయి, డ్రగ్స్ సహా ప్రతి దందా వెనుక టీడీపీ నేతలే ఉన్నారని విమర్శించారు. గంజాయి వ్యతిరేక ప్రజాఉద్యమకారుడు పెంచలయ్య హత్యకు ప్రభుత్వంతోపాటు పోలీసులు బాధ్యత వహించాలన్నారు. గంజాయి, డ్రగ్స్, నకిలీ మద్యం ఏ వ్యాపారం చూసినా.. మూలాలన్నీ.. టీడీపీలోనే ఉన్నాయని కాకాణి ఆరోపించారు.

అధికార పార్టీ అండతోనే అరాచకాలు

అధికార పార్టీ అండదండలతోనే గంజాయి, డ్రగ్స్, ముఠాలు చెలరేగిపోతున్నారన్నారు. నెల్లూరు జిల్లాలో గంజాయి మీద అవగాహన కల్పించడంతోపాటు గంజాయి అమ్మకాల మీద పోరాటం చేస్తున్న పెంచలయ్యను గంజాయి ముఠా హత్య చేసే స్థాయికి వెళ్లిందంటే.. ఇక్కడ ఏ స్థాయిలో వ్యాపారం జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. పెంచలయ్యను హత్య చేసిన వాళ్లు టీడీపీతో అంటకాగుతున్న వాళ్లే అని, వారు టీడీపీ కార్యకర్తలేనన్నారు. హత్యకు పురిగొల్పిన అరవ కామాక్షి, ఏ1 జేమ్స్ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అనుచరులేనని, ఆయన అండతోనే వీళ్లు ఈ దురాగతానికి పాల్పడ్డారని విమర్శించారు. పెంచలయ్య హత్యకు కారకుడైన కోటంరెడ్డే ఘటనను ఖండిస్తున్నానని మొసలికన్నీరు కారుస్తున్నారని ధ్వజమెత్తారు. అధికార పార్టీ అవినీతిని ప్రశ్నిస్తే వెంకటాచలంలో గోపాల్ అనే గిరిజనుడి ఇంటికెళ్లి గొంతుకోశారని, ఆ కేసులో ఆరుగురు నిందితులు టీడీపీ వారేనని చెప్పారని, కేవలం ముగ్గురినే అరెస్టు చేశారన్నారు. మిగిలిన ప్రధాన సూత్రధారులు, పాత్రధారులు ఇష్టారాజ్యంగా తిరుగుతున్నారని, వాళ్లు గోపాల్ ఇంటి ముందుకి వెళ్లి వ్యంగ్యంగా మాట్లాడుతూ ధైర్యంగా తిరుగుతున్నారని కాకాణి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ బలహీనపడిందని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతల మీద ఒక్క కేసు ఉన్నా రౌడీషీట్, పీడీ యాక్టు ఓపెన్ చేస్తున్నారని, టీడీపీ నేతలపై మాత్రం చర్యలు ఉండవని కాకాణి దుయ్యబట్టారు.

ఒంటరిగా పోటీ చేస్తే సత్తా తెలిసేది

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ధ్వజం
- మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగానే మీకు స్థానం
- తెలంగాణను నిందించడంపై క్షమాపణలు చెప్పాలని డిమాండ్

జడ్చర్ల (తెలంగాణ): '2019 ఎన్నికల్లో పోటీ చేసి గెలువలేక పోయావు. 2024 ఎన్నికల్లో సింగిల్‌గా పోటీ చేసి ఉంటే సత్తా తెలిసి ఉండేది. చంద్రబాబుతో పొత్తు పెట్టుకుని గట్టెక్కావు. మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగానే నీకు స్థానం ఉంది. లేకుంటే ఎక్కడ ఉండేవాడివి?' అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం ఆయన జడ్చర్లలో మీడియాతో మాట్లాడారు. సామాన్యుడైన తనకే మరో పదేళ్ల తర్వాత సీఎం కావాలన్న కోరిక ఉందని, అలాంటిది 15 ఏళ్ల తర్వాత 70 ఏళ్ల వయస్సులో పవన్ సీఎం అయ్యి చేసేదేముంటుందని ఎద్దేవా చేశారు. తమ ప్రాంతాన్ని తిడుతూ.. హైదరాబాద్‌లో ఎందుకు ఆస్తులు కొనుగోలు చేస్తున్నావంటూ మండిపడ్డారు. 'పవన్ కూడా హైదరాబాద్‌లో ఆస్తులు కొన్నాడట కదా.. ఏపీ డిప్యూటీ సీఎంగా ఉంటున్న పవన్‌కు ఇక్కడేం పని?' అంటూ నిలదీశారు. ఏపీపై నిజంగా ప్రేమ ఉంటే ఇక్కడి ఆస్తులు అమ్మేసుకుని విజయవాడలోనే ఉంటూ ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు. ఇటీవల పవన్ నటించిన ఓ ఫ్లాప్ సినిమాను నిర్మాత బాగుకోరి.. రూ.800 టికెట్ పెట్టి చూశామని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి సీఎం కావాలని ఓ అభిమానిగా చెబుతున్నానని, మిగతా అభిమానులు కూడా అదే కోరుకుంటున్నారని తెలిపారు. మీ కుటుంబంలో రామ్‌చరణ్, అల్లు అర్జున్ తెలంగాణ అమ్మాయిలనే పెళ్లి చేసుకున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ నరదిష్టి పెట్టడంతోనే కోనసీమలో కొబ్బరి చెట్లు మాడిపోయాయన్న వ్యాఖ్యలను పవన్ వెంటనే వెనక్కు తీసుకుని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

“అనవసర ఆలోచనలు మానసిక శక్తిని బలహీన పరుస్తాయి. దీని నుంచి బయటపడే మార్గం... హీట్ మ్యాప్. రాత్రి పడుకునే ముందు ఉదయం లేచినప్పటి నుంచి అప్పటి వరకు మనకు వచ్చిన ఆలోచనలను (గుర్తున్నంత వరకు) పేపర్‌పై రాసుకోవాలి. అనవసర ఆలోచనలకు రెడ్‌మార్క్, సానుకూల ఆలోచనలకు గ్రీన్ మార్క్ వేయాలి. ఏ రోజుకు ఆరోజు రెడ్, గ్రీన్ మార్క్‌లను పరిశీలించుకోవాలి. తద్వారా మరుసటి రోజు ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండవచ్చు.”

● పర్యావరణ హిత

ఆకుపచ్చని ఉద్యమం

మనసు ఉంటే మార్గం ఉంటుంది. ఎడారిలాంటి చోట కూడ పచ్చని తోటై పలకరిస్తుంది. మహిళల సారథ్యంలోని ‘వనమాలి గార్డెనింగ్ గ్రూప్’ వాట్సాప్ వేదికగా విశాఖపట్టణంలో మిద్దెతోటల ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. వనమాలి గార్డెనింగ్ గ్రూప్‌లో మూడువేలమంది మహిళలు ఉన్నారు. అంతరించిపోతున్న అరుదైన సంప్రదాయ మొక్కలకు జీవం పోస్తున్నారు. గ్రీన్‌డ్రైవ్స్ నిర్వహిస్తూ రహదారుల పక్కన మొక్కలు నాటుతున్నారు...

‘పై కప్పు ఇస్తారా...పచ్చగా మార్చేస్తాం, మాకు ఎటు వంటి ఫీజులు కట్టాల్సిన అవసరం లేదు. మీ ఇంటి మిద్దె చూపిస్తే చాలు మీకు కావాల్సిన ఆకు కూరలు, కూరగాయలు పండించే మార్గాల్ని చూపుతాం’ అంటున్నారు వనమాలి గార్డెనింగ్ గ్రూపుల నిర్వాహకులు అరుణ అరవల, సరితా మల్ల, జ్యోతి నాదెళ్ల. విశాఖపట్టణంలోని మురళీ నగర్‌కు చెందిన అరుణ అనే మహిళకు వచ్చిన ఆలోచన మూడువేల మంది మహిళల్లో చైతన్యాన్ని తెచ్చింది. ఆకు పచ్చని ఉద్యమానికి వేదికగా నిలిచింది.

అవసరాలు తీరేలా.... పర్యావరణానికి మేలు జరిగేలా...

వనమాలి గార్డెనింగ్ గ్రూపులో సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్, మన కూరగాయల తోట అనే రెండు గార్డెనింగ్ గ్రూపులు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఈ గ్రూపులో నగర వ్యాప్తంగా మూడువేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. వంట గది వ్యర్థాల నుంచి మొక్కలకు అవసరమైన కంపోస్టు ఎరువును తయారు చేసుకుంటున్నారు. దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అంతరిస్తున్న ఆకుకూరలకు జీవం

అంతరిస్తున్న సాంప్రదాయ ఆకు కూరలు, కాయగూరల పునరుద్ధరణకు ‘వనమాలి గార్డెనింగ్’ వ్యవస్థాపకురాలు ఎ.అరుణ కృషి చేస్తున్నారు. కొండపిండి ఆకు, నల్లేరు, గలిజేరు, పొన్నగంటి కూర వంటి ఆకు కూరలతోపాటు, చెమ్మ చిక్కుడు, ముళ్ల వంకాయలు, ఇతర రాష్ట్రాలకు చెందిన క్లోవ్ బీన్స్, ఫ్యాషన్ ఫ్రూట్, వింగ్డ్ బీన్స్, ఎయిర్ పొటాటో, గుడ్డు వంగ (ఎగ్ బ్రింజాల్), ఎరుపు బర్బాటీ, ఎరుపు తోటకూర, ఎరుపు చిక్కుడు, ఎరుపు బెండ, రెడ్ ముల్లంగి, ఎరుపు బచ్చలి కూరలు, సీమ చింత... మొదలైన వాటిని తన ఇంటి మిద్దెపై పండిస్తున్నారు అరుణ. వీటితో పాటు వైజయంతి మాల, వాటర్ యాపిల్, నోనీ ఫ్రూట్, బిలంబి ఉసిరి, పొట్టి పొట్ల కాయలు, పాన్ మత్తా, మింట్ తులసి, పాండవబత్తి, దాల్చిన చెక్క, అంజీర్, మల్బరీ ఫ్రూట్స్ వంటి అరుదైన మొక్కలు ఉన్నాయి. వీటిని సంబంధించిన విత్తనాలు, నార్లు పంపిణీ చేస్తున్నారు.

వనమాలి సమావేశాలు

వనమాలి పరిధిలో పదిహేను ఏరియా గ్రూపులు ఉన్నాయి. ప్రతి గ్రూపులో వంద నుంచి రెండు వందల మంది సభ్యులు ఉన్నారు. ప్రతి ఏరియాకి ఇద్దరు ఇంచార్జ్‌లు ఉంటారు. వీరు ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసి ఆ ప్రాంత సభ్యులకు అవసరమైన సలహాలు అందిస్తారు. విత్తనాలు, కొమ్మలు, మొక్కలు, నారు ఇచ్చి పుచ్చుకుంటారు. సీనియర్ గార్డెనర్స్ సూచనలు తీసుకుంటారు, కొత్త ఐడియాలు నేర్చుకుంటారు. నెలకోసారి గ్రీన్ డ్రైవ్స్ నిర్వహించి రహదారుల పక్కన పార్క్‌లో మొక్కలు నాటుతున్నారు.

– వి.ఆర్. కళిరెడ్డి, సాక్షి, మురళీనగర్, విశాఖపట్నం

కమ్యూనిటీ గార్డెనింగ్

‘బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్’ కాన్సెప్ట్‌లో భాగంగా పనికిరాని వస్తువుల్లో నుంచి మొక్కల పెంపకానికి ఉపయోగపడేవాటిని ఎంచుకుంటారు వనమాలి గ్రూప్ సభ్యులు. పాత వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్ బాటిల్స్, బకెట్‌లు, టబ్స్‌లో మొక్కలు పెంచుతారు. కమ్యూనిటీ గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి అపార్ట్‌మెంట్ నివాసితుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది వనమాలి గార్డెనింగ్ గ్రూప్. ఈ కార్యక్రమాలలో భాగంగా కూరగాయల మొక్కలు, విత్తనాలు పంచుతారు.

తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచేలా...

ఇరవై ఏళ్ల క్రితం మిద్దె తోట ఆలోచన వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు మా మేడ మీద 500 కుండీల్లో మొక్కలు పెంచుతున్నాను. తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచే టెక్నిక్‌ను తెలుసుకుని అమలు చేస్తున్నాను. మేడ పాడవకుండానే తోటను సృష్టించవచ్చు. మా గార్డెనింగ్ గ్రూప్ ద్వారా కొత్త రకాల మొక్కలు, విత్తనాలు పరిచయమయ్యాయి. కేరళ, తమిళనాడు, వాయువ్య రాష్ట్రాల నుంచి వచ్చే అరుదైన కూరగాయలు కూడా మా మేడపై పండిస్తున్నాను. గ్రీన్ క్లైమేట్ ఎం.రత్నం సహకారం అందిస్తున్నారు.

– అరుణ అరవల

కొత్త తరానికి చెప్పాలి!

● రేపు వరల్డ్ ఎయిడ్స్ డే

మొదట్లో అభివృద్ధి చెందిన సంపన్న దేశాల్లో మాత్రమే విస్తరించిన ఎయిడ్స్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తమయ్యింది. ఆ సంపన్న దేశాల్లోని మత్తు ఇంజెక్షన్ల సంస్కృతి, హోమో సెక్సువల్ ధోరణులతో ఇలా జరిగింది. ఇవేవీ లేని మనలాంటి దేశాల్లో దీని విస్తృతి మొదట్లో దాదాపుగా లేనేలేదు. కానీ తర్వాత్తర్వాత ఇది మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలతో పాటు... పేద దేశాల్లో కూడా విపరీతంగా వ్యాపించిందని తేలింది. ఈ వ్యాధిపై మొదట్లో ఉన్నంత బజ్ ఇప్పుడు లేకపోవడంతో చాపకింది నీరులా ఇది వ్యాపిస్తోంది. అందుకే మరోసారి ఈ వ్యాధి గురించి మాట్లాడాల్సిన సమయం ఇది. ఈ సందర్భంగా ఎయిడ్స్‌వ్యాధి విషయంలో సమాజంలో చైతన్యం తేవడం కోసం ఏం చేయాలో, అలాగే అనుసరించాల్సిన మార్గాలేమిటన్నది నిపుణులైన డాక్టర్లు సూచిస్తున్న అంశాలివి.

ఎయిడ్స్ వ్యాప్తిని అరికట్టడానికి వేర్వేరు దేశాల్లో వేర్వేరు అంశాలు అడ్డంకులుగా నిలుస్తున్నాయి. హోమో సెక్సువాలిటీకి సామాజిక ఆమోదం లేనిచోట్ల, ఇంజెక్షన్ డ్రగ్స్ వాడకం నేరంగా ఉన్న దేశాల్లో వారు తీవ్రమైన వివక్షకు లోనవుతుండటంతో తమ గుర్తింపులను దాచుకోడానికి చేసే ప్రయత్నంలో వారికి చికిత్స అందడం లేదు. దాంతో ఈ తాజా ధోరణులతో హెచ్.ఐ.వి. వ్యాప్తి తీరు మారుతున్నది. సెక్స్ వర్కర్స్, హోమోసెక్సువల్స్, డ్రగ్స్ ఇంజెక్షన్లు తీసుకునేవారూ, ట్రాన్స్ జెండర్ వ్యక్తులు, ఖైదీల వంటి సమూహాలలో ఈ వైరస్ తీవ్రమైన వేగంతో వ్యాపిస్తోంది. ఇక ఆఫ్రికాలాంటి వెనకబడిన దేశాల్లో అవగాహన లేమితో ఈ వ్యాధి విస్తృతంగా వ్యాప్తిచెందుతోంది. ప్రస్తుతం కొత్తగా సోకుతున్న హెచ్.ఐ.వి. ఇన్ఫెక్షన్లలో ఆఫ్రికాలో 25 శాతం, మిగతా ప్రపంచంలో 80 శాతం ప్రజల్లో ఎయిడ్స్ అన్నది పైన పేర్కొన్న హోమో సెక్సువల్, ట్రాన్స్‌జెండర్, డ్రగ్స్ బాధితులు, ఖైదీల వంటి రిస్క్ గ్రూపులలోనే ఎక్కువ. భారత దేశంలోనూ మిగతా జనాభాతో పోలిస్తే ఇలాంటి సమూహాల్లోనే హెచ్.ఐ.వి. వ్యాప్తి సాధారణ జనాభా కంటే 15–17 రెట్లు ఎక్కువ.

డాక్టర్ యనమదల మురళీకృష్ణ, ఎండి, ఎయిడ్స్ వ్యాధి నిపుణులు, కాకినాడ

భారతదేశం, తెలుగు రాష్ట్రాల పరిస్థితి

జాతీయ ఎయిడ్స్ నివారణ సంస్థ 2023 అంచనాల ప్రకారం, భారతదేశంలో 25 లక్షల 44 వేల మంది హెచ్‌ఐవితో జీవిస్తున్నారు. 15–49 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారిలో ప్రతి వెయ్యి మందిలో ఇద్దరిలో (0.20%) హెచ్.ఐ.వి. వ్యాపించింది. మహారాష్ట్రలో అత్యధికంగా 3.90 లక్షల మంది హెచ్‌ఐవి తో జీవిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో 3 లక్షల 14 వేల మంది. తెలంగాణలో 1 లక్షా 58 వేల మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 15–49 ఏళ్ల మధ్య వయసు వారిలో హెచ్‌ఐవి సోకినవారు జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ ఉన్నారు. అంటే ప్రతి వెయ్యిలో ఆరుగురు పైగా (0.62%); తెలంగాణలో ప్రతి వెయ్యికి దాదాపు ఐదుగురు (0.47%) ఉన్నారు. 2019లో ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అత్యధిక ఎయిడ్స్ మరణాలు నమోదయ్యాయి. అంటే ఇక్కడ 11,430 మంది చనిపోయారు. 2010తో పోల్చినప్పుడు 2023లో కొత్త ఇన్ఫెక్షన్లలో అత్యధిక తగ్గుదల ఆంధ్రప్రదేశ్‌లోనే కావడం (తగ్గుదల శాతం 76.19%) కొంత ఊరట.

2025లో హెచ్.ఐ.వి. మళ్లీ పెచ్చరిల్లడానికి ఇవీ కారణాలు...

ఈ ఏడాది 2025లో ప్రపంచవ్యాప్తంగా సంభవించిన అనేక చారిత్రక పరిణామాల వల్ల హెచ్.ఐ.వి. కార్యక్రమాలకు నిధుల సంక్షోభం ఎదురైంది. ఈ ఏడాది అమెరికా ప్రభుత్వం 430 కోట్ల డాలర్ల నిధుల కేటాయింపును ఆకస్మికంగా, ఏకపక్షంగా నిలిపివేయడం వల్ల... దిగువ ఆదాయ, అలాగే మధ్యస్థ ఆదాయ దేశాల్లో హెచ్‌ఐవి / ఎయిడ్స్ సేవలకు తీవ్రమైన అంతరాయం కలిగింది. అంతర్జాతీయ సంస్థ యుఎన్ ఎయిడ్స్ అంచనా ప్రకారం ఈ నిధులు శాశ్వతంగా నిలిచిపోతే 2029 నాటికి అదనంగా మరో 60 లక్షల కొత్త హెచ్‌ఐవి కొత్తకేసులు వచ్చే అవకాశముంది. ప్రపంచవ్యాప్తంగా 40 లక్షల మంది ఎయిడ్స్ సంబంధిత జబ్బులతో మరణించే ప్రమాదం ఉంది.



అంతేకాదు... హెచ్.ఐ.వి. రిస్క్ ఉన్న ప్రత్యేక సమూహాలకు చికిత్స అందిస్తూ ఎయిడ్స్‌పై పోరాడే వారిని నేరస్తులుగా చూసే దేశాల సంఖ్య పెరిగింది. పురుష స్వలింగ సంబంధాలు, ట్రాన్స్ జెండర్‌లకు సామాజిక ఆమోదం లేకపోవడం, డ్రగ్స్ వాడకాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తూ కొన్ని దేశాల్లో కొత్తగా చేసిన కఠిన చట్టాల కారణంగా వారు తమ వ్యాధిని దాచుకోవడం, చికిత్స కోసం ముందుకు రాకపోవడంతో ఎయిడ్స్ సంక్షోభం మరింత ముదిరే ప్రమాదం ఉంది. దీనివల్ల ఈ వ్యాధి పీడితులకు ఆరోగ్య, వైద్య సేవలు అందించడమూ కష్టసాధ్యమవుతుంది.



కొత్త ఆవిష్కరణలతో పరిస్థితి కొంత ఆశాజనకం

లెనాకపావిర్, కాబోటెగ్రావిర్ వంటి దీర్ఘకాలం పనిచేసే కొత్త ఇంజెక్షన్ మందులతో హెచ్.ఐ.వి. నివారణలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావచ్చు. ఏడాదిలో కేవలం రెండు సార్లు ఇంజెక్షన్లు తీసుకోవడంతోనే హెచ్‌ఐవి నివారణ సాధ్యమవుతుంది. దీంతో ప్రస్తుతం అత్యధిక కొత్త ఇన్ఫెక్షన్స్ వెలుగు చూస్తున్న రిస్క్ గ్రూపుల్లో నివారణ సులభతరమవుతుంది. అయితే వాటి ధరలు ప్రస్తుతం కాస్త ఎక్కువగా ఉన్నందున ఆ ధరలు తగ్గించి ప్రతి దేశంలోని ఆ సమూహాలకు ఈ ఇంజెక్షన్లను అందుబాటులోకి తేవడం అత్యవసరం.

ఇదీ ఈ ఏడాది (2025) ప్రపంచ ఎయిడ్స్ డే నినాదం

‘సంక్షోభాన్ని అధిగమిస్తూ... కొత్త మార్గంలో పయనిస్తూ’ అన్నది (ఓవర్‌కమింగ్ డిజ్రప్షన్ – ట్రాన్స్‌ఫార్మింగ్ ద ఎయిడ్స్ రెస్పాన్స్) ఈ ఏడాది నినాదం. అంతర్జాతీయ వితరణ సంస్థలు తగినన్ని నిధులను ఇవ్వడం, ఈ వ్యాధి నివారణ కోసం కృషి చేస్తున్న కమ్యూనిటీలు కలిసి పనిచేయడం, మానవ సహజమైన లైంగిక ప్రవృత్తులను సానుభూతితో అర్థం చేసుకోవడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా మానవులందరి హక్కులను పరిరక్షించడం, దేశాల నాయకత్వాలు నిబద్ధతతో వ్యవహరించడం, ఈ వ్యాధి తాలూకు మందులను అందరికీ అందుబాటులోకి తేవడం వంటి చర్యలతో ఈ వ్యాధిని వీలైనంతగా నివారించవచ్చు. అలాగే యౌవన ప్రాంగణంలోకి ఇప్పుడిప్పుడే ప్రవేశిస్తున్న కొత్త తరాల వారికి ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ... అందుబాటులో ఉన్న అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా సురక్షిత శృంగారం, కండోమ్ వాడకం గురించి విస్తృత ప్రచారం చేస్తే ఈ వ్యాధిని దాదాపుగా పూర్తిగా తుదముట్టించినంతగా నివారించవచ్చునన్నది ప్రముఖమైన వైద్య నిపుణులందరి మాట.

● రోల్‌మోడల్

లక్షల కట్నం అవసరం లేదు... మంచి మనసు చాలు!

ఎంత ఎక్కువ కట్నం తీసుకుంటే అంత గొప్ప అనుకునే రోజులు ఇవి. ఇలాంటి రోజుల్లో ఒక అరుదైన వరుడు అవదేష్ రాణా. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌కు చెందిన 26 సంవత్సరాల అవదేష్ రాణా 31 లక్షల కట్నాన్ని వద్దన్నాడు. రాణా నిర్ణయానికి సామాజిక మాధ్యమాల్లో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

వివాహ వేడుకలో కట్నం డబ్బులు తన ముందు పెట్టిన వెంటనే...

‘కట్నం పేరుతో లక్షలు తీసుకునే హక్కు నాకు లేదు. ఇది వధువు తండ్రి కష్టపడి సంపాదించిన డబ్బు’ అన్నాడు రాణా.

అక్కడి జనాలు ఆశ్చర్యపోయారు. అయితే ఎవరూ ఏమీ మాట్లాడలేదు. ఎవరికి వారు మనసులో రాణాను ప్రశంసించారేమో!

‘లక్షల డబ్బు చేతికి వస్తే కాదంటారా! ఎందుకు ఇలా చేశారు?’ అని అడిగిన ప్రశ్నకు రాణా ఇచ్చిన జవాబు ఇది...

‘వరకట్న వ్యవస్థకు నేను వ్యతిరేకం కాబట్టి డబ్బు తిరిగి ఇచ్చాను. ఏ తండ్రి కూడా తన కూతురు వివాహం కోసం అప్పులు చేసి ఇబ్బంది పడకూడదు. వరకట్న వ్యవస్థ అనేది అంతం కావాలి’ ‘రాణాలాంటి ఏ కొద్దిమంది ఉన్నా వరకట్న వ్యవస్థ కనుమరుగైపోతుంది’ అని నెటిజనులు ప్రశంసల వర్షం కురిపించారు.

● టచింగ్ స్టోరీ

సలాం ముంబై పోలీస్

ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ (సీఎస్‌ఎంటీ) ప్రాంతం నుంచి ఆరునెలల క్రితం నాలుగేళ్ల బాలిక ఆరోహి తప్పిపోయింది. ‘తప్పిపోయింది ఎవరి అమ్మాయో కాదు మా అమ్మాయే’ అనుకున్న ముంబై పోలీసులు అసాధారణ అంకితభావాన్ని ప్రదర్శించారు. రాత్రనక, పగలనక కష్టపడి ఎట్టకేలకు ఆ పాపను భద్రంగా తల్లిదండ్రుల దగ్గరికి చేర్చారు.

సోషల్ మీడియా వేదికగా ముంబై పోలీసులను ప్రశంసించారు పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా.

షోలాపూర్‌కు చెందిన ఆరోహి తండ్రి వైద్యచికిత్స కోసం వారి కుటుంబం ముంబైకి వచ్చింది. ఆ తరువాత పాప కనిపించకుండా పోయింది.

ముంబై పోలీసులు వందలాది సీసీటీవి కెమెరాలను తనిఖీ చేయడం నుంచి ఎన్నో రాష్ట్రాలలో, ఎన్నో నగరాలలో పోస్టర్లు అంటించడం వరకు ఎన్నో చేశారు. ఈ భారీ శోధన అపరేషన్‌లో భాగంగా పోలీసులు ఆరోహి ఫొటోను జేబులో పెట్టుకొని తిరిగేవారు. వారణాసిలోని ఒక జర్నలిస్ట్ పోలీసులు అంటించిన పోస్టర్‌లను చూసి స్థానిక అనాథాశ్రమంలో మరాఠీ మాట్లాడే ఒక పాపను గుర్తు తెచ్చుకున్నాడు.

‘యస్...ఆ పాపే ఈ పాప’ అని నిర్ధారణ చేసుకున్న తర్వాత పోలీసుల దగ్గరికి పరుగెత్తుకు వెళ్లాడు. కథ సుఖాంతం అయింది. ఇంతకీ ఆ పాప ఎలా తప్పిపోయింది?

తప్పిపోలేదు...కిడ్నాప్‌కు గురైంది. కారణం ఏమిటో తెలియదుగానీ కిడ్నాపర్ ఆరోహిని వారణాసి రైల్వేస్టేషన్ సమీపంలో వదిలేశాడు. అక్కడ ఏడుస్తూ కనిపించిన ఆరోహిని స్థానికులు ‘కాశీ’ అనే అనాథాశ్రమంలో చేర్చారు. వీడియో కాల్ ద్వారా ఆరోహిని గుర్తించిన ముంబై పోలీసులు, వారణాసికి వెళ్లి ఆ పాపను ముంబైకు తీసుకువచ్చి భద్రంగా తల్లిదండ్రులకు అప్పజెప్పారు.

హెల్త్

పిల్లల్లో పేగుజారిందా?

కొంతమంది పిల్లలు మల విసర్జన చేయిస్తున్నప్పుడు పేగు కిందికి జారి, బయటకు వస్తుంది. ఇలా జరగడాన్ని వైద్యపరిభాషలో ‘రెక్టల్ ప్రొలాప్స్’ అంటారు. ఇలా జరిగినప్పుడు పిల్లలకేమీ బాధగా అనిపించదు గానీ... అది చూశాక చాలామంది తల్లిదండ్రులు ఆందోళన పడుతుంటారు. ఎందుకలా జరుగుతుందో, దానికి చికిత్స ఏమిటనే అంశాల గురించి తెలుసుకుందాం.

మలద్వారానికి సంబంధించిన లోపలి పొరల్లో కొన్నిగానీ లేదా అన్ని పొరలు గానీ చొచ్చుకుని బయటకు రావడం వల్ల ఈ పరిణామం చోటు చేసుకుంటుంది. పిల్లల విషయానికి వస్తే ఆడపిల్లలూ, మగపిల్లల్లోనూ ఇలా జరగడమన్నది సాధారణం. కానీ పెద్దవారిలో మాత్రం ఇది మహిళల్లోనే ఎక్కువ.

పిల్లల్లో ఈ సమస్యకు కారణాలు : ఈ సమస్యకు స్పష్టమైన / నిర్దిష్టమైన కారణాలేమీ కనబడవుగానీ... అనేక పరిశీలనల తర్వాత ఈ కింది సమస్యలున్న పిల్లల్లో ఈ పరిణామం ఎక్కువగా కనిపిస్తుంటుందని తేలింది. ● మలబద్ధకమన్నది ఓ ముఖ్యమైన కారణం కావచ్చు. అంటే... ముక్కి ముక్కి చాలా సేపు మల విసర్జన చేయాల్సివచ్చే పిల్లల్లో ఈ సమస్య కనిపించడానికి అవకాశాలెక్కువ. అలాగే డయేరియాతో విరేచనాలయ్యే పిల్లల్లోనూ రెక్టల్ ప్రొలాప్స్ కనిపించవచ్చు ● పోషకాహార లోపం, కడుపులో నులిపురుగులు ఉండటం ● నిమోనియా, కోరింత దగ్గుతో బాధపడే పిల్లల్లో ● నరాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముఖ్యంగా వెన్నుపూస వంటి ఇతర సమస్యలున్న చిన్నారుల్లో ● సిస్టిక్ ఫైబ్రోసిస్ వంటి సమస్య వల్ల కూడా రెక్టల్ ప్రొలాప్స్ వచ్చే అవకాశం ఉంది ● కొన్ని సందర్భాల్లో రెక్టల్ పాలిప్ అనే సమస్య కూడా ఈ విధంగానే బయటపడుతుంది.

చికిత్స... ● చాలామంది పిల్లల్లో చాలావరకు ఈ సమస్య దానంతట అదే తగ్గిపోతుంది ● ఇలాంటి పిల్లలకు మలబద్ధకం లేకుండా జాగ్రత్త తీసుకోవాలి ● పీచుపదార్థాలు ఎక్కువగా ఉండటంతో పాటు నీరు ఎక్కువగా తాగించడం, అలాగే నీటి మోతాదు ఎక్కువగా ఉండే సొరకాయ, దోస వంటి కూరగాయలు ఎక్కువ తినిపించడం, నీటి మోతదులు ఎక్కువగా ఉండే పుచ్చకాయ, కీర వంటివి ఆహారంలో ఇవ్వడం ● మరీ ఎక్కువగా అవసరమున్న చిన్నారులు కొందరికి స్టూల్ సాఫ్ట్‌నర్స్ అంటే... ఉదాహరణకు లాక్టులోజ్, పాలీ ఇథిలీన్ గ్లైకాల్ (పీఈజీ) వంటివి వాడటం. పిల్లల్లో మలవిసర్జన చాలా సాఫీగా జరిగేట్టు చూడటం ● నులిపురుగులు పడిపోవడానికి, బాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్ పోవడానికి చికిత్స అందించడం ● కొన్ని సందర్భాల్లో ‘మాన్యువల్ రిడక్షన్’ అనే ప్రక్రియ అవలంబించడం. (దాని ద్వారా చాలావరకు మంచి ఫలితం ఉంటుంది) ● మరికొన్ని సందర్భాల్లో మలద్వారంలో కొన్ని ఇంజెక్షన్స్ ఇవ్వాల్సి రావడం.

డాక్టర్ శివనారాయణ రెడ్డి, సీనియర్ పీడియాట్రీషియన్ & నియోనేటాలజిస్ట్

సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే... ● పది శాతం మందిలో వాళ్లు పెద్దయ్యాక సమస్య మళ్లీ మళ్లీ తిరగబెట్టడానికి అవకాశాలు ఉన్నాయి ● కొద్దిమందిలో ఈ సమస్య క్లిష్టంగా మారుతుంటుంది. ఉదాహరణకు అల్సర్, దానిపై గాయం అవ్వడం వల్ల సమస్య మరింత తీవ్రతరమైతే ప్రత్యేకమైన చికిత్స అందించాల్సి ఉంటుంది.

చివరగా... ఈ ఆరోగ్య సమస్య గురించి పెద్దగా ఆందోళన అక్కర్లేదు. సాధారణంగా ఈ సమస్య దానంతట అదే తగ్గిపోవడానికి అవకాశాలు ఎక్కువ. పిల్లల్లో ఈ సమస్య తీవ్రత గనక ఎక్కువగా ఉంటే ఒకసారి చిన్నపిల్లల డాక్టర్‌కు చూపించి, తగిన సూచనలు / అవసరాన్ని బట్టి చికిత్స తీసుకోవాలి.

హైదరాబాద్‌లో సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్

ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్ లీగ్ (ఐఎస్‌ఆర్‌ఎల్) పోటీలకు హైదరాబాద్ వేదిక అవుతోంది. డిసెంబర్ 6 గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో ఐఎస్‌ఆర్‌ఎల్ రౌండ్ 2 రేసింగ్ నిర్వహిస్తారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఐఎస్‌ఆర్‌ఎల్ వ్యవస్థాపకులు, నిర్వాహకులు అయిన ఇషాన్ లోఖండే తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలి ఫ్రాంచైజీ బేస్డ్ రేసింగ్ లీగ్ అయిన సూపర్ క్రాస్ రేసింగ్ తెలంగాణలో జరగడం ఇదే మొదటిసారి. బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ కూడా దీనికి హాజరు కానుండటం విశేషం. ఐఎస్‌ఆర్‌ఎల్ నిర్వహణకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, తెలంగాణ రైజింగ్ 2047లో భాగంగా తాము ప్రోత్సహిస్తున్న వివిధ క్రీడా, పర్యాటక కార్యక్రమాల్లో భాగంగా దీనిని నిర్వహిస్తామని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పలు అంతర్జాతీయ రేసర్లు పాల్గొంటున్న ఈ ఈవెంట్‌కు ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది. ఆసక్తి గల అభిమానులు బుక్ మై షో ద్వారా టికెట్లు కొనుగోలు చేయవచ్చు. ఐఎస్‌ఆర్‌ఎల్ ఫైనల్ రేసు డిసెంబర్ 21న కోల్‌కతాలో జరుగుతుంది.

యువ భారత్ విజృంభణ

17-0 గోల్స్ తేడాతో ఒమన్‌పై జయభేరి

చెన్నై: పురుషుల జూనియర్ ప్రపంచకప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు జోరు సాగుతోంది. తొలి మ్యాచ్‌లో చిలీపై ఘనవిజయం సాధించిన యంగ్ ఇండియా... రెండో మ్యాచ్‌లో ఒమన్‌పై విజయ ఢంకా మోగించింది. పూల్ 'బి'లో భాగంగా శనివారం జరిగిన పోరులో ఆతిథ్య భారత జట్టు 17–0 గోల్స్ తేడాతో ఒమన్‌ను మట్టికరిపించింది. భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (29వ, 32వ, 50వ, 58వ నిమిషాల్లో) నాలుగు గోల్స్‌తో విజృంభించగా... అర్ష్‌దీప్ సింగ్ (4, 33, 40వ నిమిషాల్లో), మన్‌మీత్ (17, 26, 36వ నిమిషాల్లో) 'హ్యాట్రిక్' గోల్స్ చేశారు. అజీత్ యాదవ్ (34, 47వ నిమిషాల్లో), గుర్‌జ్యోత్ సింగ్ (39, 45వ నిమిషాల్లో) రెండేసి గోల్స్ సాధించగా... లువాన్ (43వ నిమిషంలో), అన్‌మోల్ ఎక్కా (29వ నిమిషంలో), శారదానంద్ తివారి (55వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం కనబర్చిన భారత్... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయింది. తొలి క్వార్టర్‌లో ఒక్క గోల్‌తో సరిపెట్టుకున్న యంగ్‌ఇండియా ఆ తర్వాత గోల్స్ వర్షం కురిపించింది. ఇతర మ్యాచ్‌ల్లో ఫ్రాన్స్ 11–1 తేడాతో కొరియాపై, ఆస్ట్రేలియా 5–3 తేడాతో బంగ్లాదేశ్‌పై, స్విట్జర్లాండ్ 3–2 తేడాతో చిలీపై, జర్మనీ 7–0తో కెనడాపై, దక్షిణాఫ్రికా 2–1తో ఐర్లాండ్‌పై, మలేసియాపై 5–1 ఆస్ట్రియాపై, నెదర్లాండ్స్ 5–3 గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌పై విజయాలు సాధించాయి. తదుపరి పోరులో మంగళవారం స్విట్జర్లాండ్‌తో భారత్ తలపడనుంది.

ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

పుల్లెల గాయత్రి - ట్రెసా జాలీ కూడా ● సయ్యద్ మోడి బ్యాడ్మింటన్ టోర్నీ

గాయత్రి

లక్నో: సయ్యద్ మోడి అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో మాజీ చాంపియన్ కిడాంబి శ్రీకాంత్ తుదిపోరుకు అర్హత సాధించాడు. 2016లో ఇక్కడ విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ టాప్ స్టార్ మరోసారి టైటిల్ వేటలో నిలిచాడు. శనివారం జరిగిన సెమీఫైనల్లో 32 ఏళ్ల సీనియర్ షట్లర్ శ్రీకాంత్ 21–15, 19–21, 21–13తో మిథున్ మంజునాథ్‌ను ఓడించాడు. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత అయిన తెలుగుతేజంకు గతంలో మిథున్ చేతిలో కీలకమైన మ్యాచ్‌ల్లో పరాజయాలు ఎదురయ్యాయి. మాజీ ప్రపంచ నంబర్‌వన్ శ్రీకాంత్‌ను అంతర్జాతీయ సర్క్యూట్‌లో సింగపూర్ ఓపెన్ (2022లో), థాయ్‌లాండ్ మాస్టర్స్ (2024లో) మిథున్ కంగుతినిపించాడు.

డబుల్స్‌లో గాయత్రి జోడీ జోరు

మరో వైపు డిఫెండింగ్ మహిళల డబుల్స్ చాంపియన్స్ పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ టైటిల్ నిలబెట్టుకునేందుకు అడుగు దూరంలో ఉంది. గతేడాది విజేతగా నిలిచిన ప్రపంచ 14వ ర్యాంక్ జోడీ వరుసగా రెండో సీజన్‌లోనూ ఫైనల్ చేరింది. శనివారం మహిళల డబుల్స్ సెమీఫైనల్లో తెలంగాణ ద్వయం 21–11, 21–15తో మలేసియాకు చెందిన ఒంగ్ జిన్ యి–కార్మెన్ టింగ్‌లను ఓడించింది. అయితే మహిళల సింగిల్స్‌లో మాత్రం భారత పోరాటం ముగిసింది. ఉన్నతి హుడా, తన్వీ శర్మలిద్దరు వరుస గేముల్లోనే ప్రత్యర్థుల చేతుల్లో చిత్తయ్యారు. ఉన్నతి 15–21, 10–21తో టర్కీ షట్లర్ నెస్లీహాన్ అరిన్ ధాటికి చేతులెత్తేసింది. నజోమి ఒకుహరను కంగుతినిపించి అందర్నీ ఆకర్షించిన తన్వీ శర్మ 17–21, 16–21తో జపాన్‌కు చెందిన హిన అకెచి చేతిలో పరాజయం పాలైంది. నేడు జరిగే మహిళల డబుల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ ట్రెసా–గాయత్రి జంట కహొ ఒసావా–మయ్ తనాబె (జపాన్) జోడీతో తలపడుతుంది. పురుషుల సింగిల్స్ తుదిపోరులో ఐదో సీడ్ శ్రీకాంత్... హాంకాంగ్‌కు చెందిన జాసన్ గునవన్‌ను ఎదుర్కొంటాడు.

వన్డే సమరానికి సై

నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి పోరు

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో అనూహ్యంగా చిత్తయిన తర్వాత ఇప్పుడు సొంతగడ్డపై మరో ఫార్మాట్‌లో పరువు నిలబెట్టుకునేందుకు భారత్ బరిలోకి దిగుతోంది. గత రెండేళ్లలో నిలకడగా రాణిస్తూ వరుస విజయాలు సాధించిన వన్డేల్లో అదే ఆధిపత్యాన్ని కొనసాగించాలని టీమిండియా పట్టుదలగా ఉంది. టెస్టు జట్టుతో పోలిస్తే కెప్టెన్‌గా రాహుల్ రావడం సహా పలు మార్పులతో భారత్ సిద్ధం కాగా...చాలా కాలం తర్వాత భారత గడ్డపై ఆడుతున్న విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలపైనే అందరి దృష్టీ నిలిచింది. మరో వైపు వన్డేల్లో ఇటీవల పెద్దగా రాణించలేకపోయినా... టెస్టు సిరీస్ విజయం ఇచ్చిన ఉత్సాహంతో సఫారీ జట్టు మరో సంచలనాన్ని ఆశిస్తోంది. కెప్టెన్‌గా తెంబా బవుమా మరోసారి టీమ్‌ను విజయం దిశగా నడిపించాలని ఆశిస్తున్నాడు.

కోహ్లి, రోహిత్‌లపై అందరి దృష్టి

- అధిక్యం కోసం టీమిండియా
- జోరు కొనసాగించేందుకు సఫారీలు
- మ.గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లలో ప్రసారం

రోహిత్

కోహ్లి

రాహుల్

రాంచీ: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) కారణంగా టెస్టు మ్యాచ్‌లకు, వచ్చే ఏడాది ఆరంభంలో ప్రపంచ కప్ జరగనున్న నేపథ్యంలో టి20లపై ప్రస్తుతం అన్ని జట్లూ ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. ఇలాంటి నేపథ్యంలో వన్డే మ్యాచ్‌ల ప్రాధాన్యత తాజా సీజన్‌లో కాస్త తగ్గినట్లు కనిపించింది. అయితే భారత గడ్డపై జరిగే ఎలాంటి అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌పైనైనా ఉండే ఆసక్తి వేరు. ఈ నేపథ్యంలో మరో వన్డే సిరీస్‌కు రంగం సిద్ధమైంది. భారత్, దక్షిణాఫ్రికా మధ్య మూడు మ్యాచ్‌ల పోరులో భాగంగా నేడు తొలి వన్డే జరుగుతుంది. గత రెండు దశాబ్దాల్లో ఇరు జట్ల మధ్య 10 వన్డే సిరీస్‌లు జరగ్గా...చెరో ఐదు సిరీస్‌లు గెలిచి భారత్, దక్షిణాఫ్రికా సమంగా ఉన్నాయి.

జైస్వాల్, రుతురాజ్‌కు చాన్స్...

దాదాపు నెల రోజుల క్రితం భారత జట్టు సిడ్నీలో తమ చివరి వన్డే ఆడింది. నాటి టీమ్‌తో పోలిస్తే రెండు తప్పనిసరి మార్పులు జట్టులో చోటు చేసుకున్నాయి. తొలి టెస్టులో గాయపడి ఆటకు దూరమైన గిల్ స్థానంలో ఓపెనర్‌గా యశస్వి జైస్వాల్ రానున్నాడు. గిల్ గైర్హాజరులో రాహుల్ నాయకత్వ బాధ్యతలు చేపట్టాడు. మరో వైపు గాయంతోనే ఆటనుంచి తప్పుకున్న మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ స్థానంలో రుతురాజ్‌కు చోటు ఖాయమైంది. అయితే ఎప్పటిలాగే రోహిత్, కోహ్లిల గురించి మరో సారి చర్చ సాగుతోంది. 2027 వరల్డ్ కప్‌లో ఆడాలని పట్టుదలగా ఉన్న వీరిద్దరు ఎలాంటి అవకాశం వదులుకోరాదని భావిస్తున్నారు. సిడ్నీలో రోహిత్ సెంచరీలతో చెలరేగగా, కోహ్లి కూడా 74 పరుగులతో సత్తా చాటాడు. ఈ నేపథ్యంలో వీరి ఫామ్ గురించి ఎలాంటి ఆందోళన లేదు. అభిమానుల కోణంలో చూస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో వీరు ఆఖరిసారిగా భారత గడ్డపై ఆడారు. ఇప్పుడు మైదానంలోకి దిగి సత్తా చాటాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. జట్టులో ముగ్గురు ఆల్‌రౌండర్లు ఉండాలని టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది కాబట్టి నితీశ్ రెడ్డికి అవకాశం దక్కవచ్చు. మరో ముగ్గురు రెగ్యులర్ పేసర్లు హర్షిత్, ప్రసిధ్, అర్ష్‌దీప్ ఆడే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా సిరీస్‌తో చాన్స్ లభించని రవీంద్ర జడేజా మరోసారి తన స్థాయిని ప్రదర్శించాలని భావిస్తున్నాడు. పంత్‌కు తుది జట్టులో చోటు కష్టమే.

మాథ్యూ బ్రీట్‌కీ జోరు కొనసాగేనా...

చాలా కాలం తర్వాత దక్షిణాఫ్రికా వన్డేల్లో పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. టాప్ పేసర్ రబాడ గాయంనుంచి పూర్తిగా కోలుకోలేదు కాబట్టి ఇక్కడా ఆడటం సందేహంగానే అనిపిస్తోంది. అయితే టెస్టుల్లో చెలరేగిన యాన్సెన్‌తో పాటు బర్గర్, ఎన్‌గిడి రూపంలో పదునైన పేసర్లు టీమ్‌లో ఉన్నారు. కేశవ్ మహరాజ్ స్పిన్ బాధ్యతలు నిర్వర్తిస్తాడు. సీనియర్ ప్లేయర్ డి కాక్‌తో పాటు ఐపీఎల్ స్టార్ బ్రెవిస్, మార్క్‌రమ్‌లపై ప్రధానంగా జట్టు బ్యాటింగ్ ఆధారపడి ఉంది. మూడో స్థానంలో కెప్టెన్ బవుమా కీలక ఆటగాడు. అయితే ఇటీవల అందరికంటే ఎక్కువ గుర్తింపు తెచ్చుకున్న ప్లేయర్ మాథ్యూ బ్రీట్‌కీ. తన తొలి ఐదు వన్డేల్లోనే ఒక సెంచరీ, నాలుగు అర్ధ సెంచరీలు సాధించిన ప్లేయర్‌గా అందరి దృష్టిలో పడిన బ్రీట్‌కీ భారత గడ్డపై ఎలా ఆడతాడో చూడాలి.

బవుమా

పిచ్, వాతావరణం

అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌కు సమానంగా అనుకూలించే సాధారణ వికెట్. గతంలో జరిగిన ఐదు వన్డేల్లో ఒకే ఒక్కసారి స్కోరు 300 దాటింది కాబట్టి పరుగుల వరద పారించే మైదానం మాత్రం కాదు. వాతావరణం అనుకూలంగా ఉంది. వర్షసూచన లేదు. మంచు ప్రభావం లేకపోతే టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రాహుల్ (కెప్టెన్), రోహిత్, జైస్వాల్, కోహ్లి, రుతురాజ్, సుందర్, జడేజా, నితీశ్ రెడ్డి, హర్షిత్, అర్ష్‌దీప్, ప్రసిధ్.

దక్షిణాఫ్రికా: బవుమా (కెప్టెన్), మార్క్‌రమ్, డి కాక్, బ్రీట్‌కీ, బ్రెవిస్, హెర్మన్, యాన్సెన్, బాష్, మహరాజ్, బర్గర్, ఎన్‌గిడి.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

పెద్ది ఫైట్

ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నాడు పెద్ది. అదిరిపోయే లెవల్లో ఫైట్ చేస్తున్నాడు. ఈ యాక్షన్‌ను విజువల్‌గా చూడాలంటే వచ్చే ఏడాది మార్చి వరకు ఆగాల్సిందే. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీస్పోర్ట్స్ పీరియాడికల్ రూరల్ యాక్షన్ మూవీ 'పెద్ది'. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా సిద్ధం చేయించిన భారీ సెట్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ జరుగుతోంది. రామ్‌చరణ్, ఇతర ఫైటర్లతో పాటు ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ కూడా పాల్గొంటున్నారు. బాలీవుడ్ స్టార్ విక్కీ కౌశల్ తండ్రి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ 'దంగల్' ఫేమ్ షామ్ కౌశల్ ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను పర్యవేక్షిస్తుండగా, నవకాంత్ స్టంట్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ''ప్రతి ఫైట్ సీక్వెన్స్‌ను ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో, ఉత్కంఠ భరితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు బుచ్చిబాబు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఫైట్ సీక్వెన్స్ ఓ హైలైట్‌గా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

● రామ్‌చరణ్

సోగ్గాడుకి స్వర్ణోత్సవం



'సోగ్గాడు' సినిమా స్వర్ణోత్సవానికి సన్నాహాలు మొదలయ్యాయి. శోభన్‌బాబు, జయచిత్ర, జయసుధ హీరో హీరోయిన్లుగా నటించిన బ్లాక్‌బస్టర్ మూవీ 'సోగ్గాడు'. కె. బాపయ్య దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై డి. రామానాయుడు నిర్మించిన ఈ చిత్రం 1975 డిసెంబరు 19న విడుదలైంది. ఈ ఏడాది డిసెంబరు 19కి ఈ సినిమా యాభై ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. సురేష్ ప్రొడక్షన్స్, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి సంయుక్తంగా శ్రేయాస్ మీడియా సౌజన్యంతో డిసెంబర్ 19న హైదరాబాద్‌లో 'సోగ్గాడు' సినిమా స్వర్ణోత్సవాన్ని నిర్వహించనున్నాయి. ఈ సినిమా స్వర్ణోత్సవ పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో డి. సురేష్‌బాబు మాట్లాడుతూ– ''సురేష్ ప్రొడక్షన్స్‌ను స్థాపించి రెండు, మూడు సినిమాలు నిర్మించిన తర్వాత 'సోగ్గాడు' చిత్రం తీయగా, ఇండస్ట్రీ బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది'' అన్నారు. రచయిత పరుచూరి గోపాలకృష్ణ, సీనియర్ దర్శకుడు కె. మురళీమోహనరావు, దర్శకుడు ఎ. కోదండ రామిరెడ్డి, నిర్మాత రాశీ మూవీస్ నరసింహారావు పాల్గొని, శోభన్‌బాబుతో తమకు ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సమావేశంలో శోభన్‌బాబు మేనల్లుడు, ప్రముఖ బిల్డర్ గద్దె నవీన్, మాజీ ఎమ్మెల్యే జేష్ట రమేశ్‌బాబు, అఖిల భారత శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ సుధాకర్ బాబు, కన్వీనర్ సాయి కామరాజు, పూడి శ్రీనివాస్, బి. బాలసుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్ రావు, వీరప్రసాద్, విజయ్ కుర్రా రాంబాబు, తెలంగాణ శోభన్‌బాబు ఫ్యాన్స్ కూడా పాల్గొన్నారు.

కెరీర్ పట్ల సంతృప్తిగా ఉన్నాను

– ఆది పినిశెట్టి

''చిత్ర పరిశ్రమలో దాదాపు 20 ఏళ్ల ప్రయాణం నాది. ఇన్నేళ్ల కెరీర్‌లో ఎన్నో వైవిధ్యమైన సినిమాలు చేశాను. ఫలానా పాత్రలు మాత్రమే చేయాలని ఆలోచించను. ప్రతి పాత్ర డ్రీమ్ రోల్‌లానే భావించి చేశాను. ఆ కోవలోనే 'అఖండ 2: తాండవం'లో మంత్ర తంత్రాల చుట్టూ తిరిగే పాత్రని తొలిసారి చేశాను. ఇన్నేళ్ల నా కెరీర్ పట్ల చాలా సంతృప్తిగా ఉన్నాను'' అని ఆది పినిశెట్టి తెలిపారు. బాలకృష్ణ, సంయుక్త జంటగా నటించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ చిత్రంలో ప్రతి నాయకుడి పాత్రలో నటించిన ఆది పినిశెట్టి పంచుకున్న విశేషాలు.

● బోయపాటి శ్రీనుగారితో తొలిసారి నేను 'సరైనోడు' చిత్రంలో వైరం ధనుష్ అనే పాత్రలో నటించాను. నేను కథ వినకుండా ఒప్పుకున్న మొదటి చిత్రం 'అఖండ 2'. బోయపాటిగారిపై నమ్మకంతోనే ఒప్పుకున్నా. అయితే బాలకృష్ణగారికి ప్రతి నాయకుడిగా సరిపోతానా? అని అడిగాను. పర్‌ఫెక్ట్‌గా ఉంటారని ఆయన చెప్పడంతో ఓకే అన్నాను. సెట్‌కి వెళ్లిన తర్వాతే ఆ వాతావరణం, కథ గురించి తెలిసింది. బోయపాటిగారు నా పాత్రని వివరించిన తర్వాత కన్ఫ్యూజ్ అయ్యాను. మంత్ర తంత్రాల చుట్టూ తిరిగే పాత్రలు నేను చేయలేదు. 'అఖండ 2'లో ఈ పాత్ర చేయడం నాకు కొత్త. అందుకే ప్రేక్షకుల స్పందన కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను.

● బాలయ్యగారి గురించి బయట చాలా వింటుంటాం. కానీ, సెట్‌లో ఆయన ఉంటే పాజిటివ్ వైబ్స్ కనిపిస్తాయి. మా నాన్నగారితో (దర్శకుడు రవిరాజా పినిశెట్టి) వర్క్ ఎక్స్‌పీరియన్స్‌ని కూడా నాతో పంచుకున్నారు. 'అఖండ' కంటే 'అఖండ 2: తాండవం'లో హై మూమెంట్స్ ఎక్కువగా ఉంటాయి. బాలయ్య యాక్షన్, బోయపాటి మేకింగ్, తమన్ మ్యూజిక్, ఎలివేషన్స్‌ని చూస్తే పదివేల వాట్స్ కరెంట్ షాక్ కొట్టినట్టుగా ఉంటుంది. ● భారీ బడ్జెట్‌తో 'అఖండ 2' సినిమాను నిర్మించడం మామూలు విషయం కాదు. రామ్ ఆచంట, గోపీ ఆచంట ఎవరికీ ఎప్పుడూ పారితోషికం విషయంలో ఆలస్యం చేయలేదు. ప్రస్తుతం తమిళ, తెలుగు భాషల్లో 'థండర్' అనే స్పోర్ట్స్ డ్రామా మూవీ చేస్తున్నాను. అలాగే 'మరకతమణి' చిత్రానికి సీక్వెల్ చేస్తున్నాను. కార్తీతో కలిసి 'మార్షల్' అనే మూవీలో నటిస్తున్నాను.

కథ కంటే స్క్రీన్ ప్లేని నమ్ముతాను

– సందీప్ రాజ్

''నేను కథ కంటే స్క్రీన్‌ప్లేని నమ్ముతాను. కథను కాపీ కొట్టగలరేమో కానీ స్క్రీన్‌ప్లేని కాపీ కొట్టలేరు. కోటిన్నరతో చేసిన 'కలర్ ఫోటో' సినిమా జాతీయ అవార్డు అందుకుంది. 'మోగ్లీ' విషయంలోనూ నాకు ఇచ్చిన బడ్జెట్‌లోనే ఎంత గొప్పగా తీయగలను అన్నది చూసుకున్నాను. ఉన్న పేరుని చెడగొట్టుకోవద్దని అనుకున్న బడ్జెట్‌లోనే ఈ సినిమాని అద్భుతంగా తీశానని అనుకుంటున్నాను'' అని డైరెక్టర్ సందీప్ రాజ్ తెలిపారు. రోషన్ కనకాల, సాక్షి సాగర్ మడోల్కర్ జంటగా నటించిన చిత్రం 'మోగ్లీ 2025'. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 12న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చిత్రదర్శకుడు సందీప్ రాజ్ విలేకరులతో మాట్లాడుతూ– ''దర్శకుడిగా నా తొలి చిత్రం 'కలర్ ఫోటో' తర్వాత ఓ స్టార్ హీరోతో సినిమా తీయాలని కథ రాసుకున్నా. అయితే ఆయన బిజీగా ఉండటంతో ఆ ప్రాజెక్ట్ ఆలస్యమవుతోందని 'మోగ్లీ 2025' తీశాను. జంగ్లీ బుక్‌లోని మోగ్లీకి మా మోగ్లీకి సంబంధం ఉండదు. యూత్, ఫ్యామిలీ, మాస్... ఇలా అందర్నీ మెప్పిస్తుంది. క్లైమాక్స్‌లో ఓ బలమైన ఫిలాసఫీని చూపించా. 'బబుల్‌గమ్' సినిమా చూశాక నా కథకి రోషన్ సరిపోతాడనిపించింది. ఈ మూవీ కోసం తను చాలా కష్టపడ్డాడు. డెఫ్ అండ్ డంబ్ పాత్రని సాక్షి అద్భుతంగా పోషించారు. మా చిత్రంలో బండి సరోజ్‌గారి పాత్రను చూసి అంతా షాక్ అవుతారు. 'మోగ్లీ' ఔట్‌పుట్‌పై విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్‌గార్లు సంతృప్తిగా ఉన్నారు. నటుడు కావాలనే నా ఆకాంక్షను ఇప్పుడు నెరవేర్చుకుంటున్నాను. నా దర్శకత్వంలో నేను నటించడం కంటే ఇతర డైరెక్టర్స్ సినిమాల్లో చేయడం ఇష్టం. నటుడిగా రెండు సినిమాలు చేస్తున్నాను. దర్శకుడిగా–నటుడిగా 'ఎ.ఐ.ఆర్' వెబ్ సిరీస్ 2 ఉంటుంది'' అని చెప్పారు.

టాక్సిక్ లవ్‌స్టోరీ

● నవీన్, కుసుమ

నవీన్, కుసుమ చందక జంటగా సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో మాదాల వెంకట కృష్ణప్రసాద్ నిర్మించిన చిత్రం 'లవ్ డేస్'. 'ఏ టాక్సిక్ లవ్ స్టోరీ' అనేది ఉపశీర్షిక. త్వరలో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ లాంచ్ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ– ''గీతాంజలి, తొలి ప్రేమ, అందాల రాక్షసి'లాంటి అద్భుతమైన ప్రేమకథల్లా 'లవ్ డేస్' చిత్రం నిలిచిపోతుంది'' అని చెప్పారు. ''ఈ సినిమాలో ప్రతి ఒక్కరి పాత్ర బాగుంటుంది'' అని సురేష్ లంకలపల్లి పేర్కొన్నారు. ''సురేష్ లంకలపల్లి అంకితభావం నచ్చడంతో నేను నిర్మించనున్న నాలుగో సినిమాలో ఆయనే హీరో'' అని చెప్పారు మాదాల వెంకట కృష్ణప్రసాద్. ఈ చిత్రానికి సహ నిర్మాత: రియాజ్, సంగీతం: వెంగీ.

క్రికెట్... కామెడీ

● సుధీర్, దివ్య భారతి

'సుడిగాలి' సుధీర్, దివ్య భారతి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'జీవోఏటీ'. క్రికెట్ నేపథ్యంలో వినోద ప్రధానంగా సాగే ఈ సినిమాను మొగుళ్ళ చంద్రశేఖర్ నిర్మించారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. అయితే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మాత్రం ప్రముఖ సంగీతదర్శకుడు మణిశర్మ అందించనున్నారు. ఈ విషయాన్ని చిత్రనిర్మాత శనివారం అధికారికంగా తెలిపారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

బేసికల్లీ మిడిల్ క్లాసికల్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3' ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.

ప్రేక్షకులకు ఏదైనా ఫార్ములా నచ్చితే ఇక అదే పద్ధతిలో తీసి, దానిని క్యాష్ చేసుకోవాలనుకుంటారు నిర్మాతలు. అంతేకాదు... ఒకవేళ ఆ ప్రయత్నంలో కూడా విఫలమైతే ఎలాగైనా దానికి వివాదం అనే మసాలా జోడించి మరీ ప్రయత్నిస్తారు. ఆ నేపథ్యంలో ఇటీవల ప్రైమ్ వీడియో వేదికగా రిలీజ్ అయిన సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3'. మరి... ఈ సిరీస్ ఎలా ఉందో ఓసారి చూద్దాం. 'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌లో ఇది మూడో భాగం. ప్రతి సిరీస్ కాన్సెప్ట్ ఒకటే... ఇంటెలిజెన్స్ విభాగంలో పని చేస్తున్న శ్రీకాంత్ తివారీ తన కుటుంబానికి కూడా తెలియకుండా ఫ్యామిలీ మ్యాన్‌గా వ్యవహరిస్తూ దేశానికొస్తున్న ముప్పును తన టీమ్‌తో ఎదుర్కొంటూ ఉంటాడు. యాక్షన్ థ్రిల్లర్ ఇష్టపడే వాళ్ళకు ఇదో అద్భుతమైన సిరీస్. ముందు రెండు సిరీస్‌లకు భిన్నంగా కాస్త ప్రత్యేకంగా చేయాలన్న తపనతో దర్శకులు రాజ్, కృష్ణ మూడో భాగానికి కాస్త తడబడ్డారనే చెప్పాలి. నార్త్ ఈస్ట్‌లో చైనా ఆగడాలను ఆటకట్టించడానికి లోకల్ నాయకులతో నాగాల్యాండ్‌లో భారతదేశం ఓ పెద్ద సమావేశం నిర్వహిస్తుంది. ఆ సమావేశం జరుగుతున్న సమయంలోనే ఓ బాంబ్ బ్లాస్ట్ అవుతుంది. ఇక అక్కడి నుండి దీని విచారణతో సిరీస్ ఆరంభమవుతుంది. బాంబ్ బ్లాస్ట్‌కు, శ్రీకాంత్‌కు నేరుగా సంబంధం లేకపోయినా తరువాత కనెక్ట్ చేసిన పాయింట్ పెద్దగా అనిపించదు. అంతే కాకుండా ఈ సిరీస్‌లో శ్రీకాంత్ తివారీ తన ఐడెంటిటీ కుటుంబ సభ్యులకు తెలియజేస్తూ తన ఆపరేషన్‌లో వాళ్ళనూ ఇన్వాల్వ్ చేస్తాడు. అలాగే స్వయంగా దేశ ప్రధానమంత్రి కూడా ఈ ఆపరేషన్ పై ప్రత్యేకమైన శ్రద్ధ చూపడమనేది కాస్త పేలవంగా అనిపిస్తుంది. అందులోనూ ఈ ప్రధానమంత్రి పాత్ర పై కూడా పెద్ద ఎత్తున వివాదాలు చెలరేగాయి. అయితే ఇన్ని లోటుపాట్లు ఉన్నా సిరీస్‌లో అక్కడక్కడా కొన్ని థ్రిల్లింగ్ సన్నివేశాల చిత్రీకరణ అలరిస్తుంది. ఇక తమ నటనా చాతుర్యంతో మనోజ్ బాజ్‌పాయ్, షరీబ్, ప్రియమణి ఆకట్టుకున్నారనే చెప్పాలి. ఎప్పుడూ లేనంతగా ఈ సిరీస్‌కి భారీ స్థాయిలో ప్రమోషన్లు నిర్వహించారు. ఏది ఏమైనప్పటికీ కంటెంట్ సరైనదైతే కటౌట్ లేకున్నా బొమ్మని ప్రేక్షకులు చూస్తారు అన్న విషయం ఎప్పటికి తెలుస్తుందో సదరు నిర్మాతలకు. ముందు రెండు సిరీస్‌లకన్నా ఈసారి ఫ్యామిలీ మ్యాన్ కాస్త నిరాశపరిచాడనే చెప్పాలి.

– హరికృష్ణ ఇంటూరు

వధువు కావలెను

మాదిగ/M.Tech / Govt. ఇంజినీర్ / HAL / 90,000/-PM / 5'8"ఎత్తు /30 సం॥ల వెల్ సెటిల్డ్ వరునికి వధువు కావలెను. Ph: 8790016395 [HA-16158]

SC మాల/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C. Govt. Asst. మేనేజర్/జెన్ కో / 90000/-PM/5'10"ఎత్తు/29సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16158]

క్రిస్టియన్ మాల/ 27 / 5'10" / B.Tech, NIT / సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ / 40 Lakhs PA / అందమైన వరుడికి తగిన వధువు కావలెను. Ph: 8919759359 [HA-16158]

BC/2nd మ్యారేజ్/38y/ బిజినెస్ / 40,000/-PM / పిల్లలు ఉన్న వరునికి తగిన సాంప్రదాయ వధువు కావలెను. సంప్ర : 8330926446 [H-783681]

రెడ్డి / 45 సం॥, సెకండ్ మ్యాచ్, ఇద్దరు పిల్లలు ఉన్న అబ్బాయికి అమ్మాయి కావలెను. కులప్రసక్తి లేదు. మంత్లీ ఇన్ కమ్ 50K బిజినెస్. డైరెక్ట్: 9441037896 [A-SCA25010289]

28Yrs, 5'8" Boy Having Own Building Software Engineer Monthly Salary: 1.5 Lakhs Wanted Girl Caste No Bar. Cont : 8125107976 [H-801304]

వరుడు కావలెను



రెడ్డి/విడో/కుల, మత అనే భేదము లేకుండా అన్ని వయస్సుల వారికి సంబంధాలు మా వద్ద కలవు. A: 45, Degree/Govt. Job, స్థిర ఆస్తి గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK). Ph: 9063558878 [H-801304]

రెడ్డి/2nd (కుల-ఆస్తి పట్టింపు లేదు) 31Y, Q: Pharmacy/Own Business & Property's గల వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం) OK. అన్ని వయస్సుల వారికి 1st/2వ సంబంధాలు కలవు. Ph: 9573002847 [H-801304]

రెడ్డి/విడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/Q: Degree. Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం అయినా OK) Ph: 8074131208 [H-801304]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D. V. Koti Reddy, 690, Road No : 3, Banjara Hills (TV - 9, Opp: Colony) (Near The Leela Hotel) Hyderabad. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5 PM. www.avinashreddy.com + 91 98480 11818 , + 91 93933 11818

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 28, 5' 7", SWE, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Ireland, BE, MS, 30, 5' 11", Lead Consultant, 80 K, 6 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, BE, 31, 5' 7", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 25, 5' 8", SWE, 27 L P/A, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 2", SWE, 250 K, 10 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 27, 5' 6", Amazon, SWE, H1, USA, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 27, 6', Sr. SWE, 400 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 6', SWE, TCS, 9 L P/A, 7 Crores, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 30, 5' 10", Doctor, 70 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE (BITS), MS, 32, 6', Risk Analyst, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 29, 5' 4", SWE, 25 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (BITS), MS, 28, 5' 8", SWE, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 31, 5' 4", Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MBBS, MD, 34, 5' 2", Doctor, Rich, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

యాదవ/48y / Govt.Job / VRS / 70PM / డైరీ ఫామ్ / 20ఎ 4 Lax PM ఓన్ హౌస్, ల్యాండ్ కోట్ల ప్రాపర్టీ గల పూర్తి ఫ్యామిలీ కోల్పోయిన వధువు కు FC/BC/ఇల్లరికం, పిల్లలు ఉన్నా ఓకే. 6309480414 [H-801304]

మాల/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్ /బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 70,000/-PM/ 5'6" ఎత్తు/30 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6304751169 [HA-16158]

మాదిగ/ B.Tech / SWE / 90,000/-PM / 5'4"ఎత్తు / 26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 6304751169 [HA-16158]

మాల/ MBBS / Govt. డాక్టర్/ 80,000/-PM / 5'6"ఎత్తు/30 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 8790016395 [HA-16158]

SC మాల & క్రిస్టియన్/B.Tech/C.Govt. Asst.మేనేజర్/కెనరా బ్యాంక్/55000/-PM/ 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093, 9515755529 [HA-16158]

మాల క్రిస్టియన్ & హిందూ/లేట్ మ్యాచ్ /MBBS, PG/Govt.మెడికల్ ఆఫీసర్/1 Lakh. PM/5'5"ఎత్తు/35 సం॥ల అందమైన వధువుకి డాక్టర్ వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16158]

రెడ్డి/59Y/5'4"/ V. ఫెయిర్, సొంత ఇల్లు, రెంట్స్, రిటైర్డ్-పెన్షనర్, 10 ఎకరాల పొలం ఆస్తి కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. Ph: 8096535147 [HA-16158]

రెడ్డి/విడో/35y డిగ్రీ 10 ఎకరాల పొలం సొంత ఇల్లు కలిగి పిల్లలు లేని వధువుకు వరుడు కావలెను (ఆస్తి కుల పట్టింపు లేదు) మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. 7729002402 [HA-16158]

కమ్మ/కుల పట్టింపు లేదు/ఏజ్ : 50 yrs/ 2nd Macth/5'4"/ ఫెయిర్/ Govt జాబ్ 90K (PM)/ ప్రాపర్టీ గల వధువుకి ఇల్లరికం వరుడు కావలెను. # 9581120134 [H-783681]

రెడ్డి/కుల పట్టింపు లేదు/రెండవ పెళ్లి/50Y/విడో/సొంత ఇల్లులు/రెంట్స్/పిల్లలు లేరు/సొంత ప్రాపర్టీ /ఎలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్). 7799083500, 7386660643 [H-783681]

రెండో పెళ్లి/విడో/50y/ గుంటూరు/లెక్చరర్/ Own House (రెంట్స్), Well సెటిల్డ్ పిల్లలు లేని బాదరబందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను (సపోర్ట్ ఉండును) Ph: 8519803423 [H-783681]

OC/49y/విడో/5'3"/Govt.లెక్చరర్/80,000/ - Rs. సొంత ఇల్లు/కోచింగ్ సెంటర్ 1,00,000/ ఆస్తి, కుల పట్టింపు లేని వధువుకి వరుడు కావలెను. పిల్లలు లేరు. సంప్ర : 7569246407 [H-783681]

రాజులు/50y/ విడో/M.Com/ బ్యాంక్ మేనేజర్ / Own School/55Acres Land/3 Lac Income/ కోట్ల ప్రాపర్టీ గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 6304494883 [H-821221]

మాల: (సెకండ్ మ్యారేజ్) B.Tech, MBA/ 5'5/28Y/V.Fair/10Cr/నెలకు 1 లక్ష జీతంతో జాబ్ చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్)గా సం.ప్ర. 92485 37764 [M-127]

వేదికలు

కాకతీయ మ్యారేజస్ వారి అన్ని బ్రాంచెస్ లో పేదలకు ఫీజు లేకుండా అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9391 999 999 / 917 789 7788 [H-821108]

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహవేదిక మాత్రమే. ప్రకటన దారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

జగన్ హయాంలో.. 99.9 శాతం స్కూళ్లలో ఇంటర్నెట్

జాతీయ సగటు 78.5 శాతం కన్నా అధికం

2018-19 బాబు హయాంలో కేవలం 41.8 శాతం

దేశంలో పిల్లలు-2025 నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి : వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 99.9 శాతం పాఠశాలల్లో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు 'దేశంలో పిల్లలు-2025' నివేదికలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వశాఖ వెల్లడించింది. 2018-19 నాటికి చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కేవలం 41.8 శాతం స్కూళ్లలోనే ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే, జగన్ ప్రభుత్వ హయాంలో 2022-23 నాటికి ఈ రేటు 99.9 శాతానికి చేరినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జాతీయ స్థాయిలో 78.5 శాతం స్కూళ్లలోనే ఇంటర్నెట్ సౌకర్యం ఉంటే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ సగటును మించి (99.9 శాతం) నమోదు కావడం గమనార్హం. వైఎస్.జగన్ హయాంలో స్కూళ్లలో మన బడి, నాడు-నేడు కార్యక్రమం ద్వారా సకల సదుపాయాలను కల్పించిన విషయం తెలిసిందే.

రాష్ట్ర పాఠశాలల్లో ఇంటర్నెట్ గణాంకాలు (శాతంలో)

ఆర్థిక సంవత్సరం	ఇంటర్నెట్ సౌకర్యం
2016-17	38.1
2017-18	38.1
2018-19	41.8
2019-20	57.9
2020-21	60.2
2021-22	78.8
2022-23	99.9

గుంటూరు జీజీహెచ్‌లో సౌరబ్ గౌర్ ఆకస్మిక తనిఖీలు

సాధారణ రోగిలా ప్రవేశించి, పరీక్షలు చేయించుకున్న ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి

ఆస్పత్రిలో 3 గంటలకు పైగా తనిఖీలు.. వైద్యులకు పలు ఆదేశాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్ శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అయితే ఆయన అధికారికంగా వెళ్లకుండా ఓ సాధారణ వ్యక్తిలా ఆస్పత్రికి వెళ్లి, ఓపీ తీసుకుని, వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకున్నారు. డీఎంఈ డాక్టర్ రఘునందన్ నుంచి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణకు సమాచారం రావడంతో వైద్యులకు విషయం తెలిసింది. కాగా, సౌరబ్ గౌర్ ఆస్పత్రిలో 3 గంటలకు పైగా తనిఖీలు చేసి, పలు సమస్యలను గుర్తించారు. మందుల నిల్వ, రికార్డులు, కంప్యూటర్‌లో నమోదు తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల అనంతరం ఆస్పత్రిలో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. ఓపీ క్యూఆర్ కోడ్ గైడెన్స్ సరిగా లేదని, రోగికి త్వరగా వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఓపీ తీసుకునే సమయం నుంచి వైద్యుడి వద్దకు వెళ్లే సమయం తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒక్కో వైద్యుడు ఎంత మంది రోగులను పరీక్షించారనే విషయాలను.. ప్రతి వైద్యుడి పనితీరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

ఓపీ విభాగంలో తనిఖీలు చేస్తున్న ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్‌గౌర్, పక్కన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, డిప్యూటీ కలెక్టర్ చిన్నం సుధారాణి

పాఠాలు వినాలంటే నది దాటాల్సిందే..

సమస్య పరిష్కారాన్ని కోరుతూ విద్యార్థుల వినూత్న నిరసన

వరదయ్యపాళెం: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండలంలోని మూడు గ్రామాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలంటే అరుణానదిని దాటాల్సిన దయనీయ పరిస్థితి. ఈ సమస్యపై తాజాగా మండలంలోని రామగిరి, అడవికండ్రిగ, కాలంజేరి గ్రామాలకు చెందిన 70 మంది విద్యార్థులు నీళ్లలో నడుస్తూ ప్రభుత్వానికి వినూత్న నిరసన తెలిపారు. 'రాజానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే.. వానైనా, ఎండైనా-ఇసుకలోనూ, రాళ్ల మధ్య ఈ నదిని దాటక తప్పదు. మాకు వంతెన కట్టించి న్యాయం చేయండి' అంటూ మంత్రి లోకేశ్‌కు విన్నవించారు. ఈ నిరసన స్థానిక సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అరుణానదిపైన వంతెన లేకపోవడంతో ఈ గ్రామాల ప్రజలు సైతం రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతుండడం గమనార్హం.

అరుణానది వద్ద నిరసన తెలుపుతున్న పాఠశాల విద్యార్థులు

చంద్రబాబు ప్రభుత్వంలో దళితులపై వేధింపులు పెరిగాయి

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్) : రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దళితులు, దళిత అధికారులపై వేధింపులు అధికమయ్యాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ ఆరోపించారు. శనివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. దళితుడైన డీజీ పీవీ సునీల్‌కుమార్‌పై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. రఘురామకృష్ణరాజు చేస్తోన్న ఆరోపణలు పరిగణనలోకి తీసుకొని ఉన్నతాధికారికి పోస్టింగ్ ఇవ్వకుండా వేధించడం సరైన విధానం కాదన్నారు.

డిసెంబర్ 5న మెగా టీచర్ పేరెంట్స్ డే

సాక్షి, అమరావతి : డిసెంబర్ 5వ తేదీన అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో మెగా టీచర్ పేరెంట్స్ డే-3 నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు శనివారం పలు సూచనలు చేస్తూ నిర్వహణ ప్రణాళికను విడుదల చేసింది. ఆహ్వాన పత్రాలతో తల్లిదండ్రులకు స్వాగతం పలకాలని, ప్రోగ్రెస్ కార్డులను ప్రదర్శించాలని తెలిపింది. ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించాల్సిన టైం టు టైం కార్యక్రమాల షెడ్యూలు పొందుపరిచింది. హాజరైన తల్లిదండ్రులందరికీ మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేయాలని, మొత్తం కార్యక్రమాన్ని వీడియో రికార్డు చేయాలని తెలిపింది. అయితే, ఈ తంతు నుండి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

నెక్ట్స్ ఇప్పట్లో లేనట్లే

సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తున్న ఎన్‌ఎంసీ

- విద్యార్థులు, విద్యాసంస్థల అభిప్రాయ సేకరణ
- 2024 నుంచి ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్‌లో నెక్ట్స్ నిర్వహిస్తామని 2023లో ప్రకటన
- దీనిలో అర్హత సాధించిన వారికి పీజీలో ప్రవేశం
- పలు కారణాలతో వాయిదా వేస్తున్న ఎన్‌ఎంసీ

సాక్షి, అమరావతి: వైద్యవిద్యలో ప్రమాణాల పెంపులో భాగంగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) రూపొందించిన నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ (నెక్ట్స్) అమలు ఇప్పట్లో ఉండబోదని తెలుస్తోంది. వచ్చే మూడు, నాలుగేళ్లలో నెక్ట్స్ ఉండదని నేషనల్ మీడియా తాజాగా రిపోర్ట్ చేసింది. వైద్యవిద్యలో ప్రమాణాలు పెంచే చర్యల్లో భాగంగా ఎంబీబీఎస్ తుది సంవత్సర విద్యార్థులకు నెక్ట్స్ నిర్వహించాలని ఎన్‌ఎంసీ నిర్ణయించింది. రెండుదశల్లో నెక్ట్స్ ఉంటుందని 2023లో ప్రకటించడమే కాకుండా, నిర్వహణకు కార్యాచరణ కూడా ప్రకటించింది. వైద్య విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి మాక్ టెస్ట్ నిర్వహణకు అప్పట్లో దరఖాస్తులు ఆహ్వానించారు. 2024 నుంచి నెక్ట్స్ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. దీంతో అప్పట్లో విద్యార్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ క్రమంలో మాక్ టెస్ట్ నిర్వహించకుండానే నెక్ట్స్ అమలును ఎన్‌ఎంసీ వాయిదా వేసింది. గతేడాది దాని ఊసే లేకుండాపోయింది. ఇదిలా ఉండగా ఇటీవల ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) ప్రతినిధులతో భేటీ సందర్భంగా నెక్ట్స్ అమలుపై ఎన్‌ఎంసీ చైర్మన్ డాక్టర్ అభిజత్ శేత్ పలు అంశాలను వెల్లడించినట్టు తెలిసింది.

గతంలో ప్రకటించిన కార్యాచరణ ఇలా

నెక్స్‌ట్ రెండుదశల్లో ఉంటుంది. మొదటిదశ పరీక్షను మూడురోజులు నిర్వహించనున్నట్టు ఎన్‌ఎంసీ ప్రతిపాదించింది. పూర్తిగా మల్టిపుల్ చాయిస్ క్వశ్చన్స్ (ఎంసీక్యూ) విధానంలో స్టెప్-1లో మెడిసిన్ అలైడ్ సబ్జెక్ట్స్, సర్జరీ అలైడ్ సబ్జెక్ట్స్, ఓబీజీ, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ.. ఈ ఆరు సబ్జెక్ట్‌ల్లో రోజుకు రెండు సబ్జెక్ట్‌ల చొప్పున రోజు విడిచి రోజు నిర్వహిస్తారు. మెడిసిన్ అలైడ్ సబ్జెక్ట్స్, సర్జరీ అలైడ్ సబ్జెక్ట్స్, ఓబీజీ ఈ మూడు పేపర్లలో 120 చొప్పున ప్రశ్నలకు మూడుగంటల సమయం, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ పేపర్లలో 60 చొప్పున ప్రశ్నలకు గంటన్నర సమయం కాలవ్యవధితో పరీక్షలు నిర్వహిస్తారు. స్టెప్-1 అనంతరం ఆరోగ్య విశ్వవిద్యాలయాలు నిర్వహించే ప్రాక్టికల్స్‌లో ఉత్తీర్ణులవ్వాలి. వీరికి హౌస్‌సర్జన్ చేయడానికి అర్హత ఉంటుంది. హౌస్‌సర్జన్ అనంతరం స్టెప్-2 పరీక్ష ఉంటుంది. కాంప్రహెన్సివ్ ప్రాక్టికల్/క్లినికల్ ఎగ్జామినేషన్ విధానంలో స్టెప్-2 నిర్వహిస్తారు. స్టెప్-1 లోని ఆరు సబ్జెక్టలతో పాటు ఆర్థోపెడిక్స్, ఫిజికల్ మెడిసిన్ రీహాబిలిటేషన్ (పీఎంఆర్)లో ఎవల్యూషన్ మెథడ్‌లో క్లినికల్ ప్రాక్టికల్స్ ఉంటాయి.

సాధ్యాసాధ్యాలు అంచనా వేశాకే..

ప్రస్తుతమున్న విధానంలో దేశంలో ఎంబీబీఎస్ విద్యార్థులు యూనివర్సిటీలు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాక పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ పీజీలో అర్హత సాధించాలి. విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు మనదేశంలో రిజిస్ట్రేషన్ కోసం ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్‌ఎంజీఈ) పాసవ్వాలి. అనంతరం దేశీయ ఎంబీబీఎస్ గ్రాడ్యుయేట్‌ల మాదిరిగానే పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్ పీజీలో అర్హత సాధించాలి. ఇవేవి లేకుండా ఎంబీబీఎస్ ఉత్తీర్ణత, మెడికల్ ప్రాక్టీస్‌కు లైసెన్స్, రిజిస్ట్రేషన్‌కు, పీజీ మెడికల్ సీటులో ప్రవేశాలకు నెక్ట్స్ అర్హతే ప్రామాణికమని ఎన్‌ఎంసీ ప్రకటించింది. విదేశాల్లో ఎంబీబీఎస్ చదివిన వారికి ఈ పరీక్ష ద్వారానే గుర్తింపు ఉంటుందని స్పష్టం చేసింది. నెక్ట్స్ విద్యార్థులు, విద్యాసంస్థల్లో గందరగోళాన్ని నివారించడానికి దేశం మొత్తం మాక్ టెస్ట్‌లను నిర్వహించాలని ఎన్‌ఎంసీ యోచిస్తోంది. అంతేకాకుండా సాధ్యాసాధ్యాలను అంచనా వేయడానికి అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. వీటి ఫలితాలను మూల్యాంకనం చేసిన తర్వాతే నెక్ట్స్ అమలుపై తుది నిర్ణయానికి రానున్నారు.

అనంత్ కుటుంబమంతా అన్నల్లోనే..

- ముంబైలో మావోయిస్టుల డెన్‌కీపర్లుగా పని
- తర్వాతి కాలంలో లొంగుబాటు
- అనంత్ మాత్రం ఎంఎంసీ జోన్ ప్రతినిధిగా తాజాగా పోలీసులకు లొంగుబాటు

కథలాపూర్ మండలం చింతకుంటలో అనంత్ ఇల్లు

కోరుట్ల/కథలాపూర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పశ్చిమ డివిజన్‌లోని కథలాపూర్ మండలంలో మారుమూల గ్రామం చింతకుంట.. ఇదినక్సల్ ప్రభావిత గ్రామం. ఈ గ్రామానికి చెందిన దంపతులు మ్యాకల సాయబు, గంగలక్ష్మిలకు ఇద్దరు కుమారులు, ముగ్గురు ఆడపిల్లలు. ఇద్దరు కుమారుల్లో మొదటివాడే ఎంఎంసీ ప్రతినిధి మ్యాకల అనంత్ అలియాస్ వినోద్ అలియాస్ వికాస్. సాయబు కుటుంబం మొత్తం మావోయిస్టుల సానుభూతి పరులుగా గుర్తింపు పొందారు.

బీడీ.. నేత కార్మిక సంఘం నేపథ్యం

సాయబు, గంగలక్ష్మి దంపతులు ఉపాధి కోసం 1970లో ముంబైకి వలస వెళ్లినట్లు సమాచారం. అక్కడ వీరు బీడీ, నేత కార్మిక సంఘం నాయకులుగా చలామణి అయినట్లు తెలిసింది. ఆ సమయంలో వీరికి కమ్యూనిస్టులతో సంబంధాలు ఏర్పడ్డాయి. మళ్లీ 1980-90 దశకంలో ముంబై నుంచి తమ స్వగ్రామం చింతకుంటకు వచ్చి చిన్నన్న దళంతో వీరు సంబంధాలు కొనసాగించినట్లు సమాచారం. 1990-95లో నక్సలైట్లపై పోలీసుల నిర్బంధం తీవ్రం కావటంతో సాయబు కుటుంబం మళ్లీ ముంబైకి వలస వెళ్లింది. అక్కడ వీరు మావోయిస్టుల డెన్ కీపర్‌గా చాలా ఏళ్లు పని చేసినట్లు సమాచారం. 2002లో కరీంనగర్ ఎస్పీగా ప్రవీణ్‌కుమార్ ఉన్నప్పుడు సాయబు, గంగలక్ష్మితో పాటు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు లొంగిపోయారు. దీనికి ముందుగానే అనంత్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. 2019లో సాయబు అనారోగ్యంతో చనిపోగా గంగలక్ష్మి (68) ప్రస్తుతం ఒంటరిగా ఉంటోంది.

ఇప్పుడైనా సాయం అందించాలి..

చిన్నవయసులోనే అన్నల్లోకి వెళ్లిన నా కొడుకు ఎక్కడున్నాడో ఇన్నాళ్లు మాకు తెలియలేదు. ఇప్పుడు లొంగిపోవడంతో సంతోషంగా ఉంది. మాకు పునరావాసం సరిగా ఇవ్వలేదు. ఇప్పుడైనా అందించాలి.

– గంగలక్ష్మి, అనంత్ తల్లి

పదో తరగతిలోనే..

ముంబైలోనే పుట్టి పెరిగిన మ్యాకల అనంత్ అక్కడే హిందీ మీడియంలో పదో తరగతి చదువుతున్న సమయంలో తల్లిదండ్రుల ప్రభావంతో 15 ఏళ్ల వయసులోనే మావోయిస్టుల్లోకి వెళ్లిపోయినట్లు సమాచారం. అప్పటినుంచి మావోయిస్టుల్లో వికాస్, వినోద్, నవజ్యోత్ వంటి పేర్లతో వివిధ హోదాల్లో కొనసాగిన అనంత్ ప్రస్తుతం ఎంఎంసీ జోన్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాడు. శుక్రవారం రాత్రి మహారాష్ట్రలోని గోండియా జిల్లా దారేక్ష పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు.

ఉలిక్కిపడ్డ చింతకుంట

ఎంఎంసీ మావోయిస్టు ప్రతినిధి అనంత్ కథలాపూర్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన వాడని తెలియడంతో అంతా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

సహచర అధికారిపైనే దౌర్జన్యమా?

మా ఆదేశాలకు విరుద్ధంగా బాధ్యతలు తీసుకుంటారా?

- ఆ స్థానంలో ఉన్న అధికారిపై దౌర్జన్యం చేస్తారా?
- ఈ మొత్తం వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం
- ఈ చర్యలు సర్వీసు నిబంధనలకు విరుద్ధం
- దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతాం
- సుమోటో ప్రతివాదులుగా కలెక్టర్, ఎస్పీ తదితరులు
- పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయండి
- హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు
- జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ నియామకంపై వివాదం

సాక్షి, అమరావతి: సహచర ప్రభుత్వాధికారిపట్ల మరో అధికారి దురుసుగా, దౌర్జన్యంగా వ్యవహరించడాన్ని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. తామిచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా మజ్జి కృష్ణారావు జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ (జెడ్‌ఎస్‌డబ్ల్యూఓ)గా బాధ్యతలు చేపట్టేందుకు ప్రయత్నించడమే కాక, ఆ స్థానంలో ఉన్న మరో అధికారి కేవీఎస్ ప్రసాదరావుపట్ల దౌర్జన్యపూరితంగా వ్యవహరించడంపై మండిపడింది. ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని తేల్చిచెప్పింది. ఈ చర్యలు ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని స్పష్టంచేసింది. ఈ 21వ శతాబ్దంలో, ప్రజాస్వామ్య పాలన వ్యవస్థలో అధికారుల దౌర్జన్యపూరిత, అరాచక ప్రవర్తనను సహించేదిలేదని తేల్చిచెప్పింది. ఈ మొత్తం వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని వెల్లడించింది. ఈ వ్యాజ్యంలో విజయనగరం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను సుమోటో ప్రతివాదులుగా చేర్చింది. తదుపరి ఉత్తర్వులు జారీచేసే వరకు జెడ్‌ఎస్‌డబ్ల్యూఓగా కేవీఎస్ ప్రసాదరావు కొనసాగేలా చూడాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శి, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్‌లను హైకోర్టు ఆదేశించింది. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించిన ఒరిజినల్ రికార్డులను తమ ముందుంచాలని సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్‌ను ఆదేశించింది. అలాగే, ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న మజ్జి శ్రీనివాసరావును ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబరు 2కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. చట్టం దృష్టిలో విజయనగరం జెడ్‌ఎస్‌డబ్ల్యూఓగా ప్రసాదరావే కొనసాగుతున్నారని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది.

అక్కడ సైనిక వెల్ఫేర్ ఆఫీసర్‌గా నేనే ఉంటా..

విజయనగరం జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మజ్జి కృష్ణారావును తూర్పుగోదావరి జిల్లా, కాకినాడకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కేవీఎస్ ప్రసాదరావును నియమించారు. అయితే, కృష్ణారావు కాకినాడలో రిపోర్ట్ చేయలేదు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారిగా బాధ్యతలు కూడా చేపట్టలేదు. ఈ వ్యవహారంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జోక్యం చేసుకున్నారు. దీంతో.. కృష్ణారావును విజయనగరంలోనే కొనసాగించాలంటూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఈ ప్రొసీడింగ్స్‌ను సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ అమలుచేయడం లేదంటూ మజ్జి కృష్ణారావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. హోంశాఖ ముఖ్య కార్యదర్శి జారీచేసిన ప్రొసీడింగ్స్ అమలుకు చర్యలు తీసుకోవాలని సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



20 మందితో ప్రసాదరావును బయటకు తోసేసిన కృష్ణారావు..

ఈ ఉత్తర్వులను సవాలుచేస్తూ విజయనగరం జెడ్‌ఎస్‌డబ్ల్యూఓగా నియమితులైన కేవీఎస్ ప్రసాదరావు ఈనెల 26న ధర్మాసనం ముందు అత్యవసరంగా అప్పీల్ దాఖలుచేశారు. కృష్ణారావు తనను ప్రతివాదిగా చేర్చకుండానే పిటిషన్ దాఖలుచేసి, తనకు తెలియకుండానే తనకు వ్యతిరేకంగా ఉత్తర్వులు పొందారని ప్రసాదరావు ధర్మాసనానికి నివేదించారు. ఈ అప్పీల్‌పై ఈనెల 27న విచారణ జరిపిన జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం, ఈ మొత్తం వ్యవహారంలో యథాతథస్థితి కొనసాగించాలంటూ ప్రభుత్వ న్యాయవాది, ప్రసాదరావు, కృష్ణారావు తరపు న్యాయవాదుల సమక్షంలో ఉత్తర్వులు జారీచేసింది. ఇదే సమయంలో కృష్ణారావు దౌర్జన్యపూరితంగా 20 మందితో కలిసి ప్రసాదరావు ఛాంబర్‌కు వెళ్లి అతన్ని సీటు నుంచి లేపి బలవంతంగా బయటకు తోసేసిన విషయం కూడా ధర్మాసనం దృష్టికి వచ్చింది. ఈ ఘటనపై ప్రసాదరావు పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు అతని తరపు న్యాయవాది వివరించారు.

కృష్ణారావు చర్యలు నిబంధనలకు విరుద్ధం..

ప్రసాదరావు అప్పీల్‌పై ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. విజయనగరం జెడ్‌ఎస్‌డబ్ల్యూఓగా కృష్ణారావు 27వ తేదీ మధ్యాహ్నమే బాధ్యతలు స్వీకరించారని ప్రభుత్వ న్యాయవాది ఈ సందర్భంగా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. డైరెక్టర్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ మేర జెడ్‌ఎస్‌డబ్ల్యూఓగా బాధ్యతలు తీసుకున్నారని కృష్ణారావు తరపు న్యాయవాది వివరించారు. ఆ ప్రొసీడింగ్స్‌ను ఇప్పటివరకు తనకు అందచేయలేదని, అందువల్ల తనను విజయనగరం జెడ్‌ఎస్‌డబ్ల్యూఓగా రిలీవ్ చేయడమన్న ప్రశ్నే తలెత్తదని ప్రసాదరావు న్యాయవాది జయంతి ఎస్‌సీ. శేఖర్ వివరించారు. నిబంధనల ప్రకారం ఎవరైనా అధికారి ఓ స్థానం నుంచి మరో స్థానానికి బదిలీ అయినప్పుడు అతన్ని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుందని.. అయితే ప్రస్తుత కేసులో అలాంటి విధానాన్ని అనుసరించలేదని ప్రభుత్వ న్యాయవాది అంగీకరించారు. స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం కృష్ణారావు నడుచుకోలేదని వివరించారు. దీంతో.. కృష్ణారావు తీరును ధర్మాసనం తీవ్రంగా పరిగణించి ఈ మొత్తం వ్యవహారంపై లోతుగా విచారణ జరపాలని నిర్ణయించింది.

క్లుప్తంగా...

రన్‌వేపై నిలిచిన ఇండిగో విమానం

రేణిగుంట: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు బయలుదేరిన ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. పైలెట్లు అప్రమత్తమై విమానాన్ని రన్‌వేపైనే నిలిపివేశారు. 6ఈ473 ఇండిగో విమానం హైదరాబాద్ నుంచి రేణిగుంటకు శనివారం ఉదయం 11.05కి వచ్చింది. తిరిగి 12.05 నిమిషాలకు హైదరాబాద్‌కు వెళ్లాల్సి ఉంది. సాంకేతిక సమస్య రావడంతో 179 మంది ప్రయాణికులను దించేశారు. దీంతో వారంతా సాయంత్రం వరకు విమానాశ్రయంలోనే వేచి ఉన్నారు. మరమ్మతులు పూర్తికాకపోవడంతో అధికారులు ఇండిగోకు చెందిన వేరే విమానాల్లో వారిని హైదరాబాద్‌కు పంపించారు.

టీవీ ఆఫ్ చేయకపోవడంతో చెలరేగిన మంటలు

యర్రగొండపాలెం: టీవీ ఆఫ్ చేయకుండా ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లడంతో ఆ టీవీ కాలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం ఎన్‌జీవోస్ కాలనీలో శనివారం జరిగింది. గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ ఎలకా సత్యనారాయణ ఇంట్లో ఓ కుటుంబం అద్దెకు ఉంటోంది. నెల క్రితం టీవీ ఆఫ్ చేయకుండా ఆ కుటుంబం ఊరికి వెళ్లింది. దీంతో టీవీ బాగా వేడెక్కి పగిలి పోయింది. వెంటనే మంటలు చెలరేగి కిటికీల నుంచి పొగవచ్చింది. దీంతో ఇంటి యజమాని అగ్ని మాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. ఫైర్ ఆఫీసర్ డి.మాల్యాద్రి తన సిబ్బందితో ఘటనా స్థలికి వచ్చి ఇంటి తాళాలు పగులకొట్టి మంటలను అదుపు చేశారు. పొగతోపాటు మంటలు విస్తరించి ఉంటే ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలి ఉండేదని, దీంతో మరింత నష్టం జరిగేదని మాల్యాద్రి తెలిపారు. టీవీతోపాటు షోకేస్‌లో ఉన్న పలు వస్తువులు కాలిపోయాయని, ఇంట్లో ఉన్న వస్తువులకు పొగకమ్ముకుందని, దీంతో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా వేశారు.

వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ మెంబర్‌గా పొన్నపురెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్‌ఈసీ) మెంబర్‌గా జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

కన్వీనర్ కోటా వెబ్ ఆప్షన్ల నమోదుకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: 2025–26 మెడికల్ పీజీ కన్వీనర్ కోటా ప్రవేశాలకు అభ్యర్థుల వెబ్ ఆప్షన్ల నమోదుకు ఆరోగ్య విశ్వవిద్యాలయం శనివారం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి డిసెంబర్ 3వ తేదీ ఉదయం 11 గంటలలోపు అభ్యర్థులు ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

తాడికొండలో 'సర్వే' అలజడి

- అడ్డుకున్న రైతులు.. వెనక్కి మళ్లిన బృందం
- ఇదంతా రెండో విడత భూ సమీకరణలో భాగమేనని విమర్శలు

సర్వే బృందాన్ని వెనక్కి పంపిస్తున్న రైతులు

తాడికొండ: రాజధాని నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో సర్వే పేరుతో ఓ బృందం వివరాలు సేకరిస్తుండడం తీవ్ర కలకలం రేపింది. రైతులు ఈ బృందాన్ని అడ్డుకున్నారు. 'పాపులేషన్ కౌన్సిల్ కన్సల్టింగ్ లిమిటెడ్' పేరుతో 10 మందికి పైగా యువతీ, యువకులు గ్రామంలో వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. మీ కూలీ ఎంత? ఏమేం ప నులు చేస్తారు? ఎంత వస్తుంది? వ్యవసాయం చేస్తారా లేక ఏం చేస్తారు? అంటూ బహుళ ప్రశ్నలు వేస్తుండటంతో రైతులు అనుమానంతో వారిని అడ్డుకున్నారు. రెండో విడత భూ సమీకరణ ప్రకటన నేపథ్యంలోనే ఈ సర్వే చేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీ కార్యాలయం ఎక్కడ?' అని అడిగితే 'ఢిల్లీ కేంద్రంగా మా కార్యాలయం పనిచేస్తుంది. మేము ఉద్యోగులం' అని సర్వే చేస్తున్న వ్యక్తులు చెప్పారు. గ్రామంలో తిరగడానికి ఎవరి అనుమతి తీసుకున్నారని అడుగగా, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ అనుమతి తీసుకున్నామని చెప్పారు. అయితే పలువురు కార్యదర్శిని ఫోన్ ద్వారా సంప్రదించగా, 'అనుమతి అడిగిన మాట వాస్తవమేకానీ, లిఖిత పూర్వకంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు' అని తెలిపారు. ప్రజల తీవ్ర వ్యతిరేకతతో చివరికి సర్వే బృందం వెనుదిరిగింది. సర్వేల పేరుతో వ్యక్తిగత డేటా కూడా అడుగుతున్నారని, ఊరు పేరు లేకుండా ఇలా వచ్చే సర్వే సంస్థలను నిలువరించాలని పలువురు కోరుతున్నారు.

ఆరోగ్యం అంధకారంలోకి.. చదువులు పాతాళంలోకి..

ప్రభుత్వ పాఠశాలల్ని గాలికొదిలేసిన చంద్రబాబు సర్కారు

- పాఠశాలల్లో నిలిచిపోయిన వైద్య పరీక్షలు
- జూలైలో పీటీఎం టెస్టుల పేరుతో హడావుడి
- తర్వాత పట్టించుకోని ప్రభుత్వం
- అస్వస్థతలతో విద్యార్థుల మరణాలు
- గత ప్రభుత్వంలో ప్రతినెలా 45 లక్షల మందికి వైద్య పరీక్షలు
- అప్పట్లో హెల్త్ కార్డులతో ఎప్పటికప్పుడు ఆరోగ్య పర్యవేక్షణ

వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రతినెలా ప్రభుత్వాస్పత్రి, విలేజ్ క్లినిక్‌ల సిబ్బంది ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసేవారు. రక్త పరీక్షలు చేసి విద్యార్థుల్లో ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే గుర్తించి వారి తల్లిదండ్రులను అప్రమత్తం చేసేవారు. రక్తహీనత ఉంటే ఐరన్ మాత్రలు ఇచ్చి జాగ్రత్తలు సూచించేవారు. బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. విద్యార్థులకు ఆరోగ్య కార్డులు ఇచ్చి ప్రతినెలా ఆరోగ్య పరీక్షల్లో వచ్చిన ఫలితాలను వాటిలో నమోదు చేసేవారు. ఫలితంగా పిల్లల ఆరోగ్యం మెరుగుపడేది. ఇలా ప్రతి నెలా దాదాపు 45 లక్షల మంది విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇచ్చింది. చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో పరిస్థితి తారుమారైంది.

సాక్షి, అమరావతి: 'ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్' అంటూ గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వం సర్కారీ విద్యను పూర్తిగా నీరుగార్చడంతోపాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికొదిలేసింది. పాలకుల నిర్లక్ష్యానికి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య 45 లక్షల నుంచి 34 లక్షలకు తగ్గిపోయింది. వైఎస్ జగన్ ప్రభుత్వంలో విద్యార్థులకు ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు చేసి అందించిన ఆరోగ్య కార్డులు సైతం ఇప్పుడు కనిపించకుండా పోయాయి. గతేడాది మెగా పీటీఎం పేరుతో రూ.కోట్లు ఖర్చు చేసిన సర్కారు ఒక్కరోజే వైద్య పరీక్షలు అంటూ హడావుడి చేసింది. ఆ తర్వాత ఆ ఆలోచనే చేయడం మానేసింది. విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ సైతం తన బాధ్యత కాదని వదిలేసింది.

34 లక్షల మంది పిల్లల ఆరోగ్యంపై నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూలై నెలలో మెగా పేరెంట్–టీచర్స్ సమావేశం నిర్వహించింది. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించామంటోంది. 96 శాతం మంది పిల్లలకు పరీక్షలు చేయించినట్టు ప్రకటించి.. వివరాలను హోలిస్టిక్ మార్కుల లిస్టుకు అనుసంధానం చేసినట్టు చెబుతోంది. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో 98 శాతం మందికి, ఎయిడెడ్ పాఠశాలల్లో 97.07 శాతం, ప్రైవేటు పాఠశాలల్లో 89 శాతం పూర్తిచేసినట్టు ప్రకటించింది. జూలై తర్వాత మళ్లీ పరిస్థితి ఏమిటనేది పట్టించుకున్న పాపానపోలేదు. గత ప్రభుత్వంలో ప్రతినెలా పరీక్షలు చేసి తల్లిదండ్రులను అప్రమత్తం చేయడంతో పాటు అవసరమైన రక్త పరీక్షలు చేసి రిపోర్టులు ఇచ్చేవారు. అలాగే కంటి పరీక్షలు చేసి అద్దాలు కూడా అందించారు. ప్రస్తుతం ఈ విధానం పూర్తిగా నీరుగారిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఇంటర్మీడియట్ వరకు 34 లక్షల మంది విద్యార్థులున్నా వారి ఆరోగ్య పరిస్థితి ఏంటో అర్థంగాని పరిస్థితి నెలకొంది. ఇక సంక్షేమ వసతి గృహాల్లో పిల్లల మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి.

అస్వస్థతలతో మరణాలు

చంద్రబాబు ప్రభుత్వంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందనడానికి ఎన్నో ఘటనలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది కాలంలో రాష్ట్రంలోని పాఠశాలలు, హాస్టళ్లలో అస్వస్థతకు గురైన విద్యార్థులు వందల్లో ఉన్నారు. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 14 మంది, సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఒకరు, పాడేరు ఐటీడీఏ పరిధిలో ఏడుగురు మృతి చెందారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ప్రాణాలు కోల్పోయిన పిల్లల సంఖ్య 22 మంది కంటే ఎక్కువేనని అంచనా. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో 184 మంది విద్యార్థులు పచ్చకామెర్ల బారిన పడ్డారు. వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ పరిధిలోని డుంబ్రిగూడ మండలం జామిగూడ గిరిజన బాలికల హాస్టల్‌లో కలుషిత ఆహారంతో 60 మంది ఆస్పత్రి పాలయ్యారు. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఒక ప్రైవేట్ ట్రస్ట్ హాస్టల్‌లో కలుషిత ఆహారం తిని ముగ్గురు గిరిజన విద్యార్థులు మరణించారు. 70 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు.

అవాంఛనీయ ఘటనలెన్నో..

కొన్ని పాఠశాలల్లో బాలికలకు పాఠశాలలు, హాస్టళ్లలోనే అబార్షన్లు అయిన ఘటనలు కూడా వెలుగు చూశాయి. కొన్ని కాన్పులు సైతం జరిగాయి. కడప గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో ఉంటూ స్థానిక కళాశాలలో ఒకేషనల్ చదువుతున్న 17 ఏళ్ల బాలిక 9 నెలల గర్భంతో ఉన్నా సిబ్బంది గుర్తించలేని పరిస్థితి. గతేడాది డిసెంబర్‌లో గుంటూరు సాంఘిక సంక్షేమ హాస్టల్ ఉంటున్న ఫార్మసీ విద్యార్థిని ఆడబిడ్డను హాస్టల్‌లోనే ప్రసవించింది. అప్పట్లో జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. గతేడాది డిసెంబర్‌లోనే ఏలూరు జిల్లాలో ఇంటర్ చదువుతున్న మైనర్ బాలిక హాస్టల్‌లోనే ఓ బిడ్డకు జన్మనిచ్చే వరకు ఆమె శరీరంలో వస్తున్న మార్పులను సిబ్బంది గమనించలేదు. ప్రతినెలా వైద్య పరీక్షలు చేసి ఉంటే ఇలాంటి ఘటనలను ముందుగానే గుర్తించే ఆస్కారం ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఇంతమంది పిల్లల తల్లిదండ్రులకు తీరని వేదనకు గురి చేస్తోంది.

కరెంట్ లేదని పిల్లల్ని ఆకలితో మాడ్చేశారు

- అల్లూరి జిల్లా గొలుగొండ కేజీబీవీలో దారుణం
- తీవ్ర ఇబ్బందులు పడిన 240 మంది విద్యార్థినులు

వసతి గృహంలో విచారణ చేస్తున్న ఎంఈవో

గొలుగొండ: అల్లూరి సీతారామరాజు జిల్లా గొలుగొండ కస్తూర్బా బాలికల వసతిగృహంలో విద్యార్థులు ఆకలితో అలమటించారు. శుక్రవారం రాత్రి 10 గంటల వరకు భోజనం పెట్టకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం తెలిసిన విద్యార్థినుల తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను ప్రశ్నించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వసతి గృహంలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 240 మంది చదువుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ముందుగానే ప్రకటించారు. మధ్యాహ్నం భోజనం అనంతరం వసతి గృహం సిబ్బంది ఈ సమస్యను పట్టించుకోలేదు. శుక్రవారం రాత్రి 8 గంటలైనా కరెంట్ రాకపోయినా సిబ్బంది పట్టించుకోలేదు. కరెంట్ వస్తుందని రాత్రి 10 గంటల వరకూ వేచి చూశారు. విద్యార్థులు ఆకలి కేకలు వేయడంతో అప్పటికప్పుడు చేతి పంపుబోరుల నుంచి నీరు తెచ్చి అన్నం వండి వడ్డించారు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు శనివారం వసతిగృహానికి వచ్చి సిబ్బందిని నిలదీశారు. జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా బాలికల సంరక్షణ అధికారి జమీమా, ఎంఈవో సత్యనారాయణ కస్తూర్బా బాలికల వసతిగృహాన్ని సందర్శించి, సమాచారాన్ని సేకరించారు. అనంతరం డీఈవో, సమగ్ర శిక్షణ అధికారులకు తెలియజేశారు. దీనిపై మంగళవారం పూర్తి విచారణ చేపడతామని విలేకరులకు ఎంఈవో చెప్పారు.

ఆర్టీసీలో అడ్డగోలుగా శిక్షణ కాంట్రాక్టు

- ఉద్యోగుల పిల్లలకు ప్రైవేటు కోచింగ్ సెంటర్ ద్వారా శిక్షణ
- ఆ ఖర్చంతా భరించేది ఉద్యోగులే..

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ఉపాధి కల్పన కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు కాంట్రాక్టు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. తమ పిల్లల శిక్షణ ఖర్చు ఉద్యోగులే భరిస్తున్నప్పటికీ ఆర్టీసీ యాజమాన్యం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయటాన్ని ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

అస్మదీయ సంస్థపై ఆపేక్ష...

హైదరాబాద్ అమీర్‌పేటలోని మైత్రీవనం కాంప్లెక్స్‌లో వివిధ ఉపాధి కల్పన కోర్సుల్లో శిక్షణ అందించే సంస్థలున్నాయి. అయితే అక్కడున్న హెచ్‌ఎస్‌బీఎఫ్ అనే శిక్షణ సంస్థపై రవాణా శాఖ అపార ప్రేమను కనపరచింది. ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు ఆ సంస్థ శిక్షణ ఇచ్చేందుకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోచింగ్ సెంటర్ సీఈవో వెలగపూడి రామకృష్ణ పేరును ప్రస్తావిస్తూ మరీ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. అవి కూడా సాధారణ ఉపాధి కల్పనా కోర్సులే కావడం గమనార్హం. కోర్ బ్యాంకింగ్, డిజిటల్ బ్యాంకింగ్, సేల్స్ ప్రాసెస్, స్మార్ట్ బ్యాంకింగ్, సాఫ్ట్ స్కిల్స్ లాంటి సాధారణ ఉపాధి కల్పనా కోర్సులే అందిస్తుంది. విజయవాడ, విశాఖ, తిరుపతిలో నెల రోజులపాటు అందించే శిక్షణకు రూ.25 వేలతోపాటు 18 శాతం జీఎస్టీని ఫీజుగా నిర్ణయించారు. ఆ ఫీజును ఆర్టీసీ ఉద్యోగులే చెల్లించాలి. ఆర్టీసీలో దాదాపు 50 వేలమంది ఉద్యోగులు ఉన్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.25 వేలు ఫీజు అంటే హెచ్‌ఎస్‌బీఎఫ్ కోచింగ్ సెంటర్‌కు భారీగా ప్రయోజనం కలగనుందని స్పష్టమవుతోంది.

ఆర్టీసీకి శిక్షణ సంస్థలున్నా..

ఉద్యోగుల పిల్లలకు ఉపాధి కల్పన కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలనుకుంటే ఆర్టీసీకి చెందిన ట్రైనింగ్ సెంటర్లే అందుబాటులో ఉన్నాయి. వివిధ వృత్తి నిపుణులను రప్పించి వారితో ఆర్టీసీ శిక్షణ ఇప్పించవచ్చని ఉద్యోగ సంఘాల నేతలు సూచిస్తున్నారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తదితర అధికారిక సంస్థల భాగస్వామ్యంతో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ప్రదానం చేయవచ్చని చెబుతున్నారు. తాము గతంలో ఈమేరకు వినతిపత్రాలు అందించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. దీనికి విరుద్ధంగా ఓ ప్రైవేటు సంస్థలో శిక్షణ తీసుకోవాలని ఆర్టీసీ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడం ఏమిటని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌ఎస్‌బీఎఫ్ సంస్థను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారన్నది రవాణా శాఖ తన ఉత్తర్వుల్లో వెల్లడించ లేదు. కేవలం ప్రభుత్వ పెద్దలకు అస్మదీయుడు కాబట్టి అడ్డగోలుగా ఎంపిక చేశారని స్పష్టమవుతోంది. హెచ్‌ఎస్‌బీఎఫ్ సంస్థకు అడ్డగోలుగా లబ్ధి కలిగించేందుకు రవాణా శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిందని ఉద్యోగ సంఘాలు విమర్శిస్తున్నాయి.

పునర్విభజనపై కేంద్రం కసరత్తు

సార్వత్రిక ఎన్నికల్లోపు పూర్తి చేయడంపై హోంశాఖ ఉన్నతాధికారుల చర్చలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రెండు రోజుల క్రితం ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. ఈ అంశంపై కార్యదర్శుల స్థాయిలో సుదీర్ఘ చర్చలు జరిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోపు నియోజకవర్గాల సంఖ్యను పెంచే అంశంపై చర్చించారు. తొలుత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అనంతరం అసెంబ్లీ నియోజకవర్గాల విభజన చేస్తామని 2023లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. అయితే, తాజాగా రెండూ కలిపి ఒకేసారి చేయాలనే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనపై దక్షిణాది రాష్ట్రాల అభ్యంతరాల నేపథ్యంలో మరోసారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు కేంద్రం సిద్ధమైనట్లు సమాచారం.

జన గణన తరువాతే..

ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు లాంటి అంశాలపైనా చర్చలు జరిగినట్లు సమాచారం. జనాభా నియంత్రణతో నియోజకవర్గాల పునర్విభజనలో తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముందుగా జనాభా లెక్కలను పూర్తి చేసి తర్వాతే పునర్విభజన చేపట్టాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటివరకు నాలుగు సార్లు పునర్విభజన..

పదేళ్లకు ఒకసారి జరిగే జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని రాజ్యాంగం నిర్దేశిస్తోంది. ఇప్పటివరకు దేశంలో 1952, 1962, 1972, 2002 సంవత్సరాల్లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. నియోజకవర్గాల పునర్విభజన పార్లమెంటు చేసే చట్టం ఆధారంగా జరుగుతుంది. ఆ చట్టం కింద లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు ఒక సంఘాన్ని నియమిస్తారు. దీనికి శాశ్వత ప్రతిపత్తి ఉండదు. పునర్విభజన ముగియగానే రద్దవుతుంది.

సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రారంభం

జెండా ఊపి లాంచీని పారంభిస్తున్న మాన్వి

నాగార్జునసాగర్: సాగర్ నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం శనివారం ప్రారంభమైంది. తెలంగాణ టూరిజం వాటర్ ఫ్లీట్ జనరల్ మేనేజర్ మాన్వీ శనివారం సాగర్ నుంచి శ్రీశైలం వెళ్లే లాంచీని సాగర్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవంబర్ 22వ తేదీ నుంచి లాంచీ ప్రయాణం ప్రారంభం కావాల్సి ఉన్నా.. పర్యాటకులు తగినన్ని టికెట్లు కొనుగోలు చేయకపోవడంతో వాయిదా వేశామన్నారు. సాగర్ నుంచి శ్రీశైలం వన్‌వే ప్రయాణం పెద్దలకు రూ.2,000, అయిదేళ్ల నుంచి 10 ఏళ్ల పిల్లలకు రూ.1,600గా నిర్ణయించామని, శ్రీశైలం నుంచి సాగర్‌కు (వన్‌వే)ఇవే రేట్లు వర్తిస్తాయని తెలిపారు. సాగర్–శ్రీశైలం–సాగర్ రిటర్న్ టూర్ (రాత్రి బసతో) పెద్దలకు రూ.3,200, పిల్లలకు రూ.2,600 టికెట్ ధర నిర్ణయించినట్లు వివరించారు. ప్రయాణికుల సౌకర్యార్థం మధ్యాహ్న భోజనం లాంచీలోనే అందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి శనివారం టికెట్ల బుకింగ్ ఆధారంగా లాంచీ సేవలను అందిస్తామని వెల్లడించారు. సోమవారం నుంచి శుక్రవారం మధ్య 100 మందికి పైగా టికెట్లు బుక్ చేసుకుంటే ప్రత్యేక లాంచీ సర్వీసును కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 9 గంటలకు లాంచీ సాగర్ నుంచి ప్రారంభమై సాయంత్రం 4.30 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో https://tgtdc.in వెబ్‌సైట్ ద్వారా టికెట్ బుక్ చేసుకోవచ్చని అధికారులు సూచించారు. వివరాలకు హైదరాబాద్ బషీర్‌బాగ్ సెంట్రల్ రిజర్వేషన్ సెంటర్‌కి 9848540371, నాగార్జునసాగర్ లాంచీ యూనిట్‌కి 7997951023 నంబరు ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

శ్రీనివాస ఫార్మ్స్ అధినేత చిట్టూరి జగపతిరావు మృతి

సాక్షి, హైదరాబాద్: నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ వ్యవస్థాపకుడు, శ్రీనివాస ఫార్మ్స్ అధినేత చిట్టూరి జగపతిరావు మృతిచెందారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. జగపతిరావు 6 వేల కోళ్లతో ఫార్మ్స్ ప్రారంభించి దేశానికి ప్రొటీన్ సెక్యూరిటీని అందించారని, 142.8 బిలియన్ గుడ్లను ఉత్పత్తి చేయడం, ఆరు మిలియన్లకుపైగా ఉద్యోగాలను సృష్టించారని తెలిపారు. ఇంటర్నేషనల్ ఎగ్ కమిషన్ (ఐఈసీ) ద్వారా 'ఇంటర్నేషనల్ ఎగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ 2023'అవార్డును అందుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు పొందిన మొదటి ఆసియన్‌గా జగపతిరావు నిలిచారని వెల్లడించారు. పౌల్ట్రీ లెజెండ్ వంటి ప్రతిష్టాత్మక అవార్డు సాధించి దేశ పౌల్ట్రీ రంగానికి గర్వకారణంగా నిలిచారని 'ఎక్స్'వేదికగా పేర్కొన్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడతాం

- కర్ణాటక సీఎం సిద్ధు, డిప్యూటీ సీఎం డీకే ఐక్యతారాగం
- అల్పాహార భేటీ తర్వాత ఇద్దరూ మీడియా ముందుకు
- తమ మధ్య విభేదాలు లేవు.. కలిసి సాగుతామని వెల్లడి
- కొన్ని అనివార్య పరిస్థితులపై మేం చర్చించాం..
- రేపటి నుంచి గందరగోళాలు ఉండవన్న సిద్ధు
- ఒకట్రెండు రోజుల్లో సీఎం మా ఇంటికి భోజనానికి..
- పార్టీ పెద్దలు పిలిస్తే కచ్చితంగా ఢిల్లీకి వెళ్తాం..: డీకే
- సమావేశం అనంతరం ఢిల్లీలో ఖర్గే-రాహుల్ చర్చలు
- నేడు సోనియాతో సంప్రదించాక తుది నిర్ణయం?
- సీఎం, కేపీసీసీ చీఫ్ పదవులపై మాట్లాడేందుకు సిద్ధు, డీకేకు పిలుపు!

అల్పాహార భేటీలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

సాక్షి, బెంగళూరు: ''అధికార మార్పిడి విషయంలో అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటాం. మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు. గతంలో కలిసి పనిచేశాం. ఇప్పుడు, ఇకముందు కూడా కలిసి పనిచేస్తాం'' అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తేల్చిచెప్పారు. కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి మార్పుపై రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ వివాదానికి తెరదించే ప్రయత్నం చేశారు. బెంగళూరులోని సీఎం అధికారిక నివాసం కావేరిలో అల్పాహార భేటీ అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు. తాము భేటీ కావడానికి కారణమైన అనివార్య పరిస్థితులపై చర్చించామని.. నెల రోజుల నుంచి ఉన్న సందిగ్ధతకు తెరదించేందుకే ఈ భేటీ జరిగిందని, రేపటి నుంచి ఎలాంటి గందరగోళాలు ఉండవని సీఎం సిద్ధు పేర్కొన్నారు. హైకమాండ్ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉండాలనే అంగీకారానికి వచ్చామని తెలిపారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైతే పనిచేశామో, భవిష్యత్తులోనూ అలాగే పనిచేస్తామన్నారు. తమ మధ్య విభేదాలు లేవని, ఉండబోవని, ఏదో ఉన్నదని జరిగిన ప్రచారం అంతా మీడియా సృష్టే అని తప్పుబట్టారు. కొందరు ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లింది మంత్రి పదవుల కోసం లాబీయింగ్ చేసేందుకని అన్నారు. ''కేసీ వేణుగోపాల్ నాకు ఫోన్ చేసి డీకేను అల్పాహార భేటీకి పిలవమని చెప్పారు. డీకేకు కూడా ఆయన ఫోన్ చేశారు. మీరే మా ఇంటికి భోజనానికి రావాలని డీకే నన్ను ఆహ్వానించారు. తొలుత మీరే అల్పాహార భేటీకి రావాలని అడిగాను. మాకు 2028 అసెంబ్లీ ఎన్నికలు, స్థానిక ఎన్నికలు ఎంతో ముఖ్యం. వాటిపై చర్చించాం. డిసెంబర్ 8న అసెంబ్లీ శీతాకాల సమావేశాలు మొదలవుతాయి. ప్రతిపక్షాలను దీటుగా ఎదుర్కొనే వ్యూహాలపై మాట్లాడుకున్నాం. అవాస్తవాలు, అబద్ధాలు, ఆరోపణలు బీజేపీ, జేడీఎస్‌కు అలవాటే. వాటిని సమర్థంగా ఎదుర్కొంటాం. బీజేపీ అవిశ్వాస తీర్మానం పెడుతుందని పత్రికల్లో చూస్తున్నా. అసెంబ్లీలో మా బలం 140, ప్రతిపక్షాలు రెండూ కలిసినా వారి బలం 82 దాటదు. అవిశ్వాసానికి అవకాశమే లేదు'' అని సీఎం సిద్ధు వివరించారు.

సీఎం ప్రతి మాటకు నా మద్దతు..

సీఎం చెప్పిన ప్రతి మాటకు మద్దతు పలుకుతున్నానని, నాయకత్వం విషయంలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని, పార్టీ పెద్దలు తమను పిలిస్తే ఢిల్లీకి వెళ్తామని డీకే అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం సిద్ధుతో కలిసి పనిచేస్తానని తెలిపారు. ఇంతకాలం పార్టీ పెద్దలు తనను వేచి ఉండాలని సూచించారని, ఇంకొంతకాలం వేచి ఉండడానికి కూడా సిద్ధమేనని అన్నారు. ఒకట్రెండు రోజుల్లో సీఎం తమ ఇంటికి భోజనానికి వస్తారని పేర్కొన్నారు. ''రాజకీయంగా మా ఇద్దరిదీ ఒకే తీర్మానం. గతంలో అధిష్టానం ఏ నిర్ణయించిందో దాని ప్రకారం మేమంతా వెళ్తున్నాం. భవిష్యత్తులోనూ వెళ్తాం. మధ్యలో ఎవరూ జోక్యం చేసుకోవద్దు. మాకు వర్గాలు లేవు. మాది కాంగ్రెస్ పార్టీ వర్గం. సిద్ధరామయ్య 2013లో సీఎం అయినప్పుడు నాకు ఆర్నెల్లు మంత్రి పదవి దక్కలేదు. అప్పుడు ఒక్క మాట మాట్లాడలేదు. మేమంతా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలం. అందరిని కలుపుకొని వెళ్లే బాధ్యత మాపై ఉంది'' అని చెప్పారు. ''పార్టీని, ప్రతి ఎమ్మెల్యేను ఎలా బలోపేతం చేయాలనేదానిపై ఇద్దరం కలిసి పనిచేస్తాం. ప్రస్తుతం జాతీయ స్థాయిలో పార్టీ కష్టాల్లో ఉంది. ఇలాంటప్పుడు కర్ణాటక ఎంతో కీలకం. రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే మా లక్ష్యం'' అని డీకే వివరించారు. అఖిలపక్షాన్ని తీసుకెళ్లే విషయంపై సీఎంతో చర్చించినట్లు డీకే చెప్పారు. సిద్ధుతో అల్పాహార భేటీ తర్వాత తమ సమీప బంధువు, మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ వర్ధంతి కార్యక్రమంలో డీకే పాల్గొన్నారు. అనంతరం భూవరాహస్వామి దేవస్థానానికి వెళ్లారు.

ఆస్పత్రికి సీఎం సిద్ధరామయ్య

డీకేతో అల్పాహార భేటీ అనంతరం సిద్ధరామయ్య బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి వెళ్లారు. ఆయన రెండు వారాలుగా తీరిక లేని రాజకీయాల్లో తలమునకలై ఉన్నారు. 77 ఏళ్ల సిద్ధుకు వైద్యులు పలు పరీక్షలు చేశారు. ఇవి సాధారణ వైద్య పరీక్షలేనని తెలిసింది.

ప్రత్యేక గదిలో సీఎం, డిప్యూటీ సీఎం చర్చలు

అధిష్టానం సూచనలతో శనివారం ఉదయం 9.30కు డీకే శివకుమార్ సీఎం సిద్ధు అధికారిక నివాసం కావేరికి అల్పాహార భేటీకి వెళ్లారు. డీకేను సీఎం సాదరంగా స్వాగతించి లోపలకు తీసుకెళ్లారు. ఇద్దరు ప్రత్యేక గదిలో చర్చించుకున్నారు. డీకేకు సీఎం సిద్ధు ఇడ్లీ, సాంబార్, దోస, ఉప్మా వడ్డించారు. భేటీలో సీఎం న్యాయ సలహాదారు, ఎమ్మెల్యే ఏఎస్ పొన్నణ్ణ తప్ప మరి ఏ ఎమ్మెల్యే, మంత్రి కనిపించలేదు. అరగంట పాటు జరిగిన సమావేశంలో ఢిల్లీలో 2023లో జరిగిన ఒప్పందం, నాయకత్వ మార్పు, మంత్రివర్గ విస్తరణ తదితర అంశాలు చర్చించినట్లు తెలిసింది. ఇప్పటివరకు జరిగిన పరిణామాలు, హై కమాండ్ నిర్ణయం, సూచనలపైనా ఇద్దరు నాయకులు మాట్లాడుకున్నట్లు సమాచారం.

నేడు సోనియా సమక్షంలో తుది నిర్ణయం

శివాజీనగర: కర్ణాటక ప్రభుత్వంలో నెలకొన్న సీఎం పదవి పంచాయితీపై ఢిల్లీలో కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా చర్చిస్తోంది. అగ్రనేత రాహుల్‌గాంధీ శనివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి 2గంటల పాటు సమావేశమయ్యారు. ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే, ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ కూడా ఇందులో పాల్గొన్నారు. బెంగళూరులో సీఎం, డిప్యూటీ సీఎం అల్పాహార భేటీ తర్వాత ఇది జరగడం గమనార్హం. సిద్ధు–డీకే భేటీ, తదుపరి పరిణామాల గురించి ఖర్గే–రాహుల్ చర్చించారు. సీఎం మార్పు, తర్వాత తలెత్తే పరిణామాలు వీరిద్దరి మధ్య ప్రస్తావనకు వచ్చాయి. ఆదివారం ఖర్గే, రాహుల్ మరోసారి సమావేశమై అగ్రనేత సోనియాగాంధీతో చర్చించి, తుది నిర్ణయానికి వస్తారని తెలిసింది. సోనియా సమక్షంలో జరిగే సమావేశం సీఎం పీఠం వివాదాన్ని తేల్చనుందని చెబుతున్నారు. సిద్ధు, డీకే ఇద్దరిని ఢిల్లీకి పిలిపించి మాట్లాడాక సీఎం పదవితో పాటు, కేపీసీసీ అధ్యక్ష పదవిపైనా నిర్ణయానికి వచ్చే అవకాశం ఉందని సమాచారం.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

పీఎస్ హెచ్ఎంల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రైమరీ స్కూల్ హెచ్ఎంల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణను చేపట్టినట్లు ఏపీపీఎస్ హెచ్ఎం ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ శనివారం తెలిపారు. ఆదివారం నుంచి డిసెంబర్ 15 వరకు జిల్లాల్లో చైతన్య సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కారం కోసం జిల్లా బాడీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పీఎస్ హెచ్ఎంల సమస్యలపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేయగా..వాటిని విద్యాశాఖ డైరెక్టరేట్‌కు పంపుతున్నట్లు సమాధానం వచ్చిందని తెలిపారు. పీఎస్ హెచ్ఎంలకు జాబ్ చార్ట్ విడుదల చేయాలని, వారి సబ్జెక్టుల్లోనే బోధనకు అవకాశం కల్పించాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాటం

అఖిల భారత విద్యార్థి సమాఖ్య

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): వైద్య విద్యను ప్రభుత్వపరంగా నడిపిస్తామని యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేశ్ నిలబెట్టుకోవాలని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపేవరకు పోరాటం చేస్తామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్)రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.వలరాజు, బందెల నాసర్‌జీ స్పష్టం చేశారు. విజయవాడలో వీరు శనివారం విలేకరులతో మాట్లాడారు. జీవో 77ను రద్దు చేస్తామని, అందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తామని, మూసివేసిన పాఠశాలలను తెరిపిస్తామని, మెడికల్ విద్యను ప్రభుత్వ పరంగా నడిపిస్తామని పాదయాత్ర సమయంలో లోకేశ్ ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. మెడికల్ కాలేజీలపై పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రైవేటీకరణ ఆపకపోతే తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

విహంగాల విడిదిల్లు.. నేలపట్టు

- పక్షుల కేంద్రంలో విదేశీ విహంగాల సందడి
- కడప చెట్లపై గూళ్లు కట్టుకుని గుడ్లు పెట్టే పనిలో పక్షులు

నేలపట్టు వాటికి విడిదికి పట్టు. ఏటా కార్తీక మాసంలో వస్తాయి.. వైశాఖంలో తిరిగి వెళతాయి. ఖండాలు దాటి ఇక్కడికి రావడానికి అలసిపోయినా ఈ ప్రాంతానికి చేరుకోగానే ఇక్కడి వాతావరణం, ఆవాసం చూసి, అవన్నీ మర్చిపోతాయి. ఇక్కడ సంతానోత్పత్తికి అనువుగా ఉండడంతో ఏళ్లుగా వస్తున్నాయి. ఈ ఏడాదీ వలస విహంగాలు పక్షుల రక్షిత కేంద్రంలో సందడి చేస్తున్నాయి.

పక్షుల కేంద్రంలో విడిది చేస్తున్న గూడబాతులు

దొరవారిసత్రం: ఖండాంతరాలు దాటి వేల కిలోమీటర్లు ప్రయాణించి తిరుపతి జిల్లా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రానికి విచ్చేసే విదేశీ శీతకాల వలస విహంగాలు కేంద్రం పరిధిలోని నేరేడు, మారేడు, అత్తిగుంట చెరువుల్లోని కడప చెట్లపై గుడ్లు పెట్టి పిల్లలను పొదిగి విడిది చేస్తూ సమీపంలోని పులికాట్ సరస్సులో **చేపలను** వేటాడి జీవనం **సాగిస్తాయి.** ప్రస్తుతం వేల సంఖ్య**లో నత్త**గుళ్లకొంగలు, గూడ**బాతు**లు, తెల్లకంకణా**యిలు** వందల సంఖ్య**లో** స్వాతికొంగలు, నీ**టి** కాకులు, తెడ్డుము**క్కు** కొంగలు, నైట్ హెరన్ తదితర విదేశీ పక్షులు విడిది చేస్తున్నాయి. ఇక్కడకు విచ్చేసి**న** వలస విహంగాలు **ఆడ,** మగ పక్షులు స్నేహం **కుదు**ర్చుకుని కడప **చెట్లపై** పుల్లలతో గూళ్లు **కట్టుకునే పనిలో** కొన్ని నిమగ్నమై **ఉండగా తొలుత విచ్చే**సిన నత్తగుల్లకొంగలు మాత్రం గుడ్లు పెట్టే పనిలో ఉన్నాయి. వీటిని వీక్షించేందుకు పక్షి ప్రేమికులు, సందర్శకులు రాక ఇప్పటికే మొదలైంది. వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది సందర్శ**కులు,** పాఠశాల **విద్యార్థులు** పోటీ పడి **విహంగాలను** తిలకి**స్తున్నా**రు. ప్రస్తుతం **పక్షు**ల కేంద్రంలో **గూ**డబాతులు(పెలికాన్స్) 1,350 పైగా, నత్తగుళ్లకొంగలు(ఓపెన్ బిల్ స్టార్క్స్) 2,500, నీటికా**కులు**(కార్మోరెం**ట్స్**) 1,130, తెల్ల**కంకణా**యిలు(వైట్ **ఐబీస్)** 1,450, తెడ్డు**ముక్కు కొం**గలు (స్పూన్ **బిల్స్) 110, స్వాతి**కొంగలు 500, పదుల సంఖ్యలో పాముమెడ పక్షులు(డాటర్స్), బాతు జాతికి చెందిన పలు రకాల పక్షుల పదుల సంఖ్యలో విడిది చేస్తున్నాయి. ప్రస్తుతం పక్షుల కేంద్రంలో 7 వేలకు పైగా వివిధ రకాల పక్షులు 2,874 గూళ్లలో విడిది చేస్తున్నట్లు స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు తెలిపారు.

విహంగాల రాక.. వ్యవసాయ సూచిక..

పక్షుల కేంద్రానికి వలస విహంగాల రాక మొదలైతే ఇక్కడ వర్షాలు కురవడం మొదలవుతుందని రైతుల నమ్మకం. రైతులు చెబుతున్న ప్రకారం కార్తిక మాసంలో పక్షులు విచ్చేసి, జత కట్టి గూళ్లు కట్టుకుంటాయి. మార్గశిరంలో గుడ్లు పెట్టి పుష్య మాసంలో పిల్లలను పొదిగి మాగ, పాల్గుణ, చైత్ర మాసాల్లో పెంచి పెద్దవి చేస్తాయి. వైశాఖంలో ఆయా దేశాలకు వెళ్లిపోతాయి. ఇదే తరహాలో ఈ ప్రాంతంలో కార్తీక మాసంతో వరి సాగు పనులు మొదలై విహంగాల సంతానం అభివృద్ధి పూర్తి అయ్యా సరికి కోతలు పూర్తవుతాయి.

పుల్లలు సేకరించే పనిలో గూడ బాతు

చిన్నారుల కోసం..

కేంద్రానికి విచ్చేసే చిన్నారులను ఆకట్టుకునేలా పక్షుల కేంద్రం మార్గం మధ్యలో జింకల పార్కు, పంజరంలో విదేశీ చిలుకలను ఉంచారు. ఇవి పిల్లలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే పిల్లల ఆట పాటల కోసం పార్కును అభివృద్ధి పరిచారు. విద్యార్థులకు విజ్ఞానం పెంపొందిచేలా పర్యాటవరణ కేంద్రం, విదేశీ వలస విహంగాల జీవన శైలి చిత్రాలు ఏర్పాటు చేశారు.

రైతులకు పరోక్షంగా..ప్రత్యక్షంగా..

పక్షుల కేంద్రంలో విడిది చేసే విహంగాలు కేంద్రం చుట్టు పక్కల గ్రామాల్లోని రైతులకు పరోక్షంగా, ప్రత్యక్షంగా ఎంతగానో మేలు చేస్తున్నాయి. వీటి రాకమొదలైతే ఈ ప్రాంతంలో వర్షాలు కురుస్తాయి. దీంతో విహంగాలను దేవతాపక్షులుగా రైతులు పిలుస్తారు. ముఖ్యంగా నేలపట్టు పక్షుల కేంద్రంలో చెరువుల్లో విడిది చేయడంతో అవి వేసే రెట్ట చెరువు నీటిలో కలుస్తుంది. ఆ నీటినే నేలపట్టు, మైలాంగం గ్రామాల్లోని రైతులు పంటలకు సాగుకు వినియోగిస్తారు. ఈ నీటిలో గంధకం, పొటాష్ వంటి పదార్థాలు పుష్కలంగా ఉండడంతో రైతులు వేసిన పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వచ్చేందుకు పక్షుల పరోక్షంగా దోహద పడుతున్నాయి. అలాగే దుక్కి దున్నినప్పటి నుంచి పంటలు కోతకు వచ్చే వరకు కేంద్రంలోని విహంగాలు పంటలపై గుంపులు గుంపులుగా వాలిపోయి పంటకు నష్టం కలిగించే క్రిమికీటకాలను ఆహారం తీసుకుని, రైతులకు ప్రత్యక్షంగా మేలు చేస్తున్నాయి.

పక్షుల కేంద్రం ఏర్పడిందిలా..

నేలపట్టు పక్షుల కేంద్రం 458.92 హెక్టార్లులో విస్తరించి ఉంది. 1970లో పక్షి శాస్త్రవేత్త డాక్టర్ సలీంఅలీ కేంద్రాన్ని గుర్తించి పరిశోధించారు. 1976లో పక్షుల రక్షిత కేంద్రంగా గుర్తించడంతో వన్యప్రాణి విభాగం అధికారులు సంరక్షిస్తున్నారు. తొలుత పక్షుల కేంద్రం నెల్లూరు సబ్ డివిజన్ పరిధిలో ఉండేది. 1984–85లో సూళ్లూరుపేట సబ్ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. 30 ఏళ్ల కిందట పక్షుల కేంద్రంలో 36 రకాల విదేశీ పక్షుల వచ్చి విడిది చేసేవి. క్రమేపి పక్షి జాతుల సంఖ్య తగ్గుతూ ప్రస్తుతం సుమారు 16 జాతుల పక్షులు కేంద్రంలో విడిది చేసి సంతానం అభివృద్ధి చేసుకుంటున్నాయి. ప్రతి ఏటా 6 నుంచి 7 వేలు వరకు వివిధ రకాల విదేశీ విహంగాలు ఇక్కడకు విచ్చేసి వాటి వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకుని వెళ్లుతున్నట్లు స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు తెలిపారు.

ఆహారవేటలో వలస విహంగాలు

నత్తగుళ్ల కొంగలు

గూడబాతు

విహంగాలను ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు

పూల ధర ఢమాల్..!

రామభద్రపురం మార్కెట్‌లో పూలు కొనుగోలుచేసేవారి కోసం ఎదురుచూస్తున్న రైతులు

- వారం రోజుల్లో పడిపోయిన బంతి పూల ధరలు
- ఒక కేట్ పూలు రూ.100కు కొనేవారు కరువు
- పెట్టుబడి కూడా రాదంటూ రైతుల ఆందోళన

రామభద్రపురం: నిన్నమొన్నటి వరకు వరుస తుఫాన్లు వివిధ పంటలపై ప్రభావం చూపాయి. అధిక వర్షాలు పంటలకు నష్టం చేకూర్చి రైతుకు కన్నీరుమిగిల్చాయి. పెట్టుబడి పెట్టి ఏదోలా పంటలను కాపాడుకుంటే దిగుబడులు అమాంతం తగ్గాయి. వారం రోజులుగా ధరలు కూడా పతనం కావడంతో పూల రైతులు కుదేలవుతున్నారు. కిందటి వారం వరకు విజయనగరం జిల్లా రామభద్రపురం అంతర రాష్ట్రమార్కెట్‌లో రూ.450 నుంచి రూ.500 పలికిన కేట్ (ట్రే) బంతి పూలధర ఇప్పుడు రూ.100కు పడిపోయింది. ఆ ధరకు కూడా పూలు కొనుగోలు చేసేవారి కోసం రైతులు మార్కెట్‌లో ఎదురుచూడాల్సిన దుస్థితి. పూల రైతు కుదేలవుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. మద్దత ధర కల్పించే మార్గం చూపడంలేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రైతన్నకు కష్టాలు, కన్నీరే మిగులుతాయని నిట్టూర్చుతున్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, అరటి, ఉల్లి వంటి ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదంటూ రైతులు దిగులుచెందుతున్నారు.

పెట్టుబడి కూడా రాదు

ఈ ఏడాది వరుస తుఫాన్ వర్షాలకు బంతి పంట పూర్తిగా పాడయింది. ఉన్నకాడికి మొక్కలను బతికించాం. సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో మొక్కలు పూతకొచ్చాయి. ఇప్పుడు ధర లేదు. రామభద్రపురం మార్కెట్‌లో మూడు కేట్‌లు (ఒక్కో కేట్‌లో సుమారు 1000పూలు) రూ.200కు విక్రయించాను. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడంలేదు.

– తూముల ఈశ్వరమ్మ, పూల రైతు, రామభద్రపురం

కొనుగోలు చేసేవారే లేరు

ఆరుగాలం శ్రమించి వేలకువేలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశాను. మంచి దిగుబడి వచ్చే సమయానికి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదు. ఎంతో కొంతకు అమ్ముదామనుకున్నా కొనేవారు కరువయ్యారు. కార్తీక మాసం పూర్తికావడం, శుభకార్యాలు లేకపోవడంతో బంతిపూలకు డిమాండ్ తగ్గింది. ఖర్చులు అధికం కావడంతో నష్టాలు వస్తున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలి.

– కర్రి లక్ష్మణ, పూలరైతు, రామభద్రపురం

జూకు కొత్త నేస్తాలు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్.. సందర్శకులకు త్వరలో కొత్త అనుభూతిని పంచనుంది. జంతు మార్పిడి విధానంలో భాగంగా జార్ఖండ్ రాష్ట్రం రాంచీలోని భగవాన్ బిర్సా బయోలాజికల్ పార్కు నుంచి శుక్రవారం పలు వన్యప్రాణులు విశాఖకు చేరుకున్నాయి. దీనికి ప్రతిగా విశాఖ జూ నుంచి కొన్ని జంతువులను రాంచీకి పంపించారు. ఈ విషయాన్ని జూ క్యూరేటర్ జి. మంగమ్మ శుక్రవారం తెలిపారు. రాంచీ నుంచి విశాఖకు ఒక జత హిమాలయన్ బేర్, ఐదు జతల స్పాటెడ్ డౌవ్స్, ఒక జత సిల్వర్ పీజియంట్‌తో పాటు ఐదు ఘరియల్స్(2 మగ, 3 ఆడ) ఉన్నాయి. వీటికి బదులుగా విశాఖ జూ నుంచి ఒక జత అడవి కుక్కలు, ఒక ఆడ బెంగాల్ మోనిటర్ లిజర్డ్, ఒక జత నల్ల హంసలు, ఒక జత వైల్డ్ బోర్, ఒక జత బార్న్ ఔల్, ఒక జత గ్రే పెలికాన్, నాలుగు జతలు అలెగ్జాండ్రైన్ పారకీట్‌ను భగవాన్ బిర్సా జూకి తరలించినట్లు క్యూరేటర్ వెల్లడించారు. కొత్తగా వచ్చిన ఈ వన్యప్రాణులన్నీ ఆయా జాతుల సంతతిని పునరుత్పత్తి చేయడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తద్వారా జూలో జంతువుల సంఖ్య వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. రాంచీ నుంచి సుదీర్ఘ ప్రయాణం చేసి వచ్చిన ఈ కొత్త నేస్తాలను ప్రస్తుతం క్వారెంటైన్‌లో ఉంచారు. వైద్యుల పర్యవేక్షణలో నిర్ణీత సమయం ముగిసిన తర్వాత, వీటిని వాటి ఎన్‌క్లోజర్లలోకి విడుదల చేస్తారు. ఆ తర్వాతే సందర్శకులకు వీటిని చూసే అవకాశం కలుగుతుంది.

హిమాలయన్ బ్లాక్ బేర్

సిల్వర్ పీజియంట్స్

స్పాటెడ్ డౌవ్స్

కలువాయి మండలం నెల్లూరు జిల్లాలోనే ఉండాలి

కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన మండల ప్రజలు

కలువాయి(సైదాపురం) : ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న కలువాయి మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్‌కు మారుస్తూ వెలువడిన గెజిట్ వల్ల మండలంలోని ప్రజలు ఆందోళనకు దిగారు. శనివారం కలువాయి మండల ప్రజలు మండల కేంద్రమైన శ్రీ కలువాయమ్మ తల్లి గుడి వద్ద నుంచి తహసీ కార్యాలయం వకు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత బస్టాండ్ సెంటర్లలో మండల ప్రజలు మానవహారం నిర్వహించారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, మండల ప్రజలు పాల్గొన్నారు. కూటమి నాయకులు కూడా ర్యాలీలో పాల్గొన్నారు. కలువాయి మండలంలో ఎక్కవ శాతం ప్రజలు నెల్లూరు జిల్లాలోనే కలువాయి మండలం ఉండాలని , 45 కి.మీ పరిధిలో ఉన్న ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ వదిలి 75 కి.మీ మీటర్లు ఉన్న గూడూరుకు రెవెన్యూ మార్చడం, గూడూర్ విడిజన్ తిరుపతి జిల్లాలో ఉండడం వల్ల జిల్లా కూడా తిరుపతి జిల్లా అవడం వల్ల తిరుపతికి వెళ్లాలంటే 140 కి.మీ దూరం ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. తిరుపతి వద్దు, నెల్లూరు ముద్దు అంటూ ప్ల కార్డులు ప్రదర్శించారు. అనంతరం తహసీల్దార్ కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఎయిమ్స్‌లో అంతర్జాతీయ సదస్సు

మంగళగిరి టౌన్ : మంగళగిరి నగర పరిధిలోని ఎయిమ్స్ వైద్యశాలలో రేడియో డయాగ్నసిస్ విభాగం, అనాటమీ విభాగానికి సంబంధించి ఇమేజ్ గైడెడ్ మస్కిలో స్కెలిటల్ ఇంటర్‌వెన్షన్‌లపై కోడరిక్ 2వ అంతర్జాతీయ సమావేశాన్ని శనివారం ప్రారంభించారు. రేడియాలజీ ,అనాటమీ విభాగాలు, మస్క్యులో స్కెలెటల్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆసియన్ పసిఫిక్ ఇంటర్నేషనల్ రేడియాలజీ, ఇంటర్వెన్షన్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని ప్రతినిధులు తెలిపారు.

సైబర్ నేరం.. రోజుకో రకం

సీనియర్ సిటిజన్లే టార్గెట్‌గా సైబర్ స్కామ్‌లు

డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో లక్షల్లో వసూళ్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సైబర్ నేరాలు రోజుకో రూట్ మారుతున్నాయి. మొన్నమొన్నటి వరకు పార్శిల్ వచ్చిందని, పార్శిల్‌లో మాదక ద్రవ్యాలున్నాయని కస్టమ్స్ పేరుతో ఫోన్లు చేసి భయభ్రాంతులకు గురిచేసి డిజిటల్ అరెస్ట్‌ల పేరుతో దందా చేసి నకిలీ ముఠాలు లక్షలు దండుకున్నాయి. కట్‌చేస్తే.. ఏపీకే ఫైల్స్ అంటూ వాట్సాప్‌ల్లో హానికరమైన లింకులు పంపి ఓపెన్ చేస్తే బ్యాంకు ఖాతా గల్లంతు చేసే ముఠాల బారిన అనేకమంది పడ్డారు. ఇక తాజాగా మరోకొత్త సైబర్ మోసం తెరపైకి వచ్చింది. కార్డ్‌డీల్ పేరుతో డిజిటల్ అరెస్ట్ ఖాతా సర్వం ఖాళీ చేసే ముఠాలు దేశవ్యాప్తంగా చెలరేగిపోతున్నాయి. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అనేక మంది వీటి బారినపడి లక్షలు నష్టపోయారు. దీనికి ప్రధానంగా సీనియర్ సిటిజన్లనే ఎంపిక చేసుకుంటున్నారు. వారినే టార్గెట్ చేసి సులువుగా మాటలతో బెదిరించి నిమిషాల్లో ఖాతాను ఖాళీ చేస్తున్నారు.

కార్డ్‌డీల్ మోసం ఇలా

సైబర్ మోసాల్లో ప్రస్తుతం కార్డ్ డీల్ మోసం ఎక్కువగా జరుగుతుంది. ఇది కొత్త నేర ధానం. దీనిలో సైబర్ నేరగాళ్లు బాధితుడిని వాట్సాప్ వీడియో కాల్ ద్వారా బెదిరించి నకిలీ సుప్రీంకోర్టు డాక్యుమెంట్లు, క్రిమినల్ కేసుల పేరుతో నకిలీ ఎఫ్ఐఆర్ కాపీలు, అరెస్ట్ వారెంట్లు చూపి డబ్బు డిమాండ్ చేస్తారు. దీనికి కంబోడియా దేశంలో ఉన్న ప్రధాన సూత్రధారులు మన దేశంలోని తమ అసోసియేట్స్ ద్వారా కమిషన్లపై బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి నగదును కార్డ్ డీల్ ద్వారా త్వరితగతిన విత్‌డ్రా చేసి మిగిలిన మొత్తాన్ని కంబోడియా ఆపరేటర్లకు బదలాయింపు చేస్తారు. నేరం జరిగిన తరువాత ఎలాంటి ఆధారాలు జరగకుండా జాగ్రత్తపడుతూ ఉంటారు. ఇలాంటి మోసమే భీమవరంలో మొట్టమొదటిసారిగా వెలుగులోకి వచ్చింది.

బాధితులు.. వృద్ధులే : భీమవరం టూటౌన్ పరిధిలో ఓ రిటైర్డ్ ప్రొఫెసర్‌ని బురిడీ కొట్టించిన ఘటనలో 13 మంది అంతర్జాతీయ సైబర్ ముఠాని అరెస్ట్ చేసి రూ.42 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఏలూరులోనూ ఇదే తరహా మోసం గతంలో వెలుగుచూసింది. ఈఏడాది సెప్టెంబర్‌లో ఒక వృద్ధురాలి బ్యాంకు ఖాతా నుంచి రూ.58 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. అనంతరం 7 రాష్ట్రాల్లో పోలీసులు జల్లెడపట్టి 8 మందిని అరెస్టు చేశారు. యూపీకి చెందిన సైబర్ నేరగాళ్లు ఒక బ్యాంకు మేనేజర్, ఒక హెడ్‌కానిస్టేబుల్‌ను ఈ కేసులో అరెస్ట్ చేశారు.

పచ్చటి నల్లమల అందాల మధ్య రైలు ప్రయాణం



మంచు కాదది.. నల్లమలను తాకిన శ్వేతవర్ణపు మేఘాలు

మదిని దోచి 'పట్టా'రు..

అర్జునుడి విల్లు నుంచి సంధించిన బాణమా.. ప్రకృతి మాత నెత్తిన ధరించిన పసిడి ఆభరణమా.. అన్నట్లుగా కను చూపు మేర కనిపించే రైలు మార్గం ఓ వైపు. మేఘాలతో కప్పేసి హిమగిరులను తలపించే ఎత్తైన కొండల అందాలు మరో వైపు.. పుడమి తల్లి పచ్చని కోక కట్టుకుందా అన్నట్లుగా పచ్చని సోయగాలు ఇంకో వైపు.. ఇలా అడుగడుగునా అపురూప దృశ్యాలకు నెలవు నల్లమల. నంద్యాల–గిద్దలూరు నల్లమల మార్గంలో రైలులో ప్రయాణం ప్రయాణికులకు ఓ అద్భుతమైన యాత్రగా గుర్తుండిపోతుంది. నల్లమల పచ్చటి అందాలు, పక్షుల కిలకిలారావాలు, ఆకాశం, నల్లమల కొండలు ఒక్కటిగా కలిసి పోయాయా అన్నట్లు అగుపించే దృశ్యాలు మనసును దోచేస్తాయి. నల్లమలను వీక్షిస్తూ ఎందరో కవుల హృదయాలు స్పందించి అపురూప గేయాలను ఆలపించారు. **– మహానంది**

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పంచారామక్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి హుండీ లెక్కించగా రూ. 32,64,772 ఆదాయం వచ్చింది. శనివారం దేవదాయ శాఖ భీమవరం డివిజన్ అధికారి వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు చేపట్టారు.

శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశ గోవిందా

ద్వారకాతిరుమల: శ్రీనివాసా గోవిందా.. శ్రీ వేంకటేశా గోవిందా.. అంటూ ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్నను వేలాది మంది భక్తులు శనివారం దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి తరలివచ్చారు. ఎటు చూసినా భక్త జనమే కనిపించారు. దర్శనం క్యూలైన్లు అన్నీ భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారి దర్శనానంతరం భక్తులు ఉచిత ప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో ప్రసాద వితరణ క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లు, అనివేటి మండపం, కల్యాణకట్ట, ఇతర విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. అనివేటి మండపంలో పలు భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

భక్తులతో కిక్కిరిసిన దర్శనం క్యూలైన్లు

సంక్రాంతికి సై

- పండగ పోటీకి డేట్ ఫిక్స్ చేసుకున్న సినిమాలు
- బరిలోకి దిగడానికి డేట్ సెట్ చేసుకుంటున్న చిత్రాలు

తెలుగు చిత్ర పరిశ్రమకు అతి పెద్ద పండగ ఏది అంటే సగటు సినిమా ప్రేక్షకుడు సైతం టక్కున సంక్రాంతి అని చెబుతాడు. చిత్రపరిశ్రమకే కాదు... తెలుగు ప్రేక్షకులకు కూడా అత్యంత ముఖ్యమైన పండగ అంటే సంక్రాంతి. ఈ పండగ సమయంలో కుటుంబ సమేతంగా సినిమాలకు వెళ్లి సరదాగా ఎంజాయ్ చేస్తుంటారు ప్రేక్షకులు.
ఈ సమయంలో తమ సినిమాలను రిలీజ్ చేస్తే మంచి వసూళ్లు రాబట్టుకోవచ్చన్నది మేకర్స్ ఆలోచన. సంక్రాంతి సమయంలో దాదాపు అన్ని సినిమాలకు ప్రేక్షకాదరణ ఉంటుంది.
అయినప్పటికీ ఫలానా సినిమా బాగుందనే టాక్ వచ్చిందంటే ఇక బ్లాక్‌బస్టరే. అందుకే సంక్రాంతికి తమ సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు హీరోలు, దర్శకులు, నిర్మాతలు పోటీ పడుతుంటారు. స్టార్ హీరోల దగ్గర నుంచి యువ హీరోల వరకూ సంక్రాంతి బరిలో తమ సినిమాలను నిలిపేందుకు ఉత్సాహం చూపిస్తుంటారు. ఈ కోవలోనే 2026 సంక్రాంతికి టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద రసవత్తర పోరు నెలకొంది. చిరంజీవి, ప్రభాస్, రవితేజ, శర్వానంద్, నవీన్ పొలిశెట్టి చిత్రాలు పండగకి విడుదల కానున్నాయి. మరోవైపు విజయ్, శివ కార్తికేయన్ వంటి తమిళ హీరోలు సైతం తెలుగు హీరోలతో పాటు సంక్రాంతి బరిలో నిలుస్తున్నారు. ఈ సంక్రాంతి బరిలో నిలిచేదెవరు? ప్రేక్షకుల మనసులు గెలిచేది ఎవరు? బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపించే సినిమా ఏది? అనే ఆసక్తి ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో నెలకొంది. ఇక ఈ సంక్రాంతికి సందడి చేయనున్న సినిమాలపై ఓ లుక్కేద్దాం...

ప్రభాస్

రవితేజ

ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్

డబుల్ ఫెస్టివల్

2026 సంక్రాంతికి అందరి హీరోల కంటే ముందుగా కర్చీఫ్ వేశారు చిరంజీవి. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ట్యాగ్‌లైన్. ఈ ఏడాది వెంకటేశ్ హీరోగా 'సంక్రాంతికి వస్తున్నాం' మూవీతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అందుకున్న డైరెక్టర్ అనిల్ రావిపూడి 'మన శంకర వరప్రసాద్‌గారు'కి దర్శకత్వం వహిస్తున్నారు. సినిమా ఆరంభం నుంచే 2026 సంక్రాంతి లక్ష్యంగా షూటింగ్ ప్లాన్ చేసి, శరవేగంగా చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, కేథరిన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరో వెంకటేశ్ ముఖ్యమైన పాత్ర

విజయ్

పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇద్దరు స్టార్ హీరోలైన చిరంజీవి, వెంకటేశ్ కలిసి ఒకే సినిమాలో కనిపించనుండటంతో 'మన శంకర వరప్రసాద్‌గారు'పై ఇటు ఇండస్ట్రీ వర్గాల్లో అటు ప్రేక్షకుల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. ట్రేడ్ వర్గాల్లోనూ మంచి జోష్ నెలకొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'మీసాల పిల్ల...' పాట ఏ స్థాయిలో హిట్ అయిందో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

''బిగ్గెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'మన శంకర వరప్రసాద్‌గారు'. వినోదం, భావోద్వేగాలు, మాస్ ఎలిమెంట్స్ కలగలిపిన ఈ సినిమా సంక్రాంతి పండగ సీజన్‌కు పర్ఫెక్ట్ ట్రీట్. పైగా చిరంజీవి–వెంకటేశ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించనుండటం అభిమానులకు డబుల్ ఫెస్టివల్. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ఈ మూవీ షూటింగ్ జరుగుతోంది'' అని చిత్రబృందం తెలిపింది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా 2026 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్నప్పటికీ తేదీ మాత్రం ఇంకా ఖరారు కాలేదు.

రాజా సాబ్ ఫిక్స్

వరుస పాన్ ఇండియా సినిమాలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ది రాజా సాబ్'. పలుమార్లు విడుదల వాయిదా పడుతూ వచ్చిన ఈ సినిమా ఫైనల్‌గా సంక్రాంతి రేసులో నిలిచింది. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 5న విడుదల కావాల్సి ఉండగా సంక్రాంతికి వాయిదా పడింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి సీజన్‌లోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్నది మేకర్స్ ఆలోచన. అందుకే 'ది రాజా సాబ్'ని జనవరి 9న విడుదల చేయనున్నట్లు టీజీ విశ్వప్రసాద్ ప్రకటించారు. ప్రభాస్‌కి ఉన్న ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

ఆయన సినిమా ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ప్రత్యేకించి 'ది రాజా సాబ్' నుంచి ఇప్పటికే విడుదలైన ప్రభాస్ వింటేజ్ లుక్స్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ మూవీ పోస్టర్స్, టీజర్, గ్లింప్స్‌తో పాటు తాజాగా విడుదలైన పాటకి కూడా అనూహ్యమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. జూలై 29న ఆయన పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన సంజయ్ దత్ ప్రత్యేక పోస్టర్‌కి కూడా మంచి స్పందన వచ్చింది. పైగా ప్రభాస్ నటిస్తున్న తొలి హారర్, కామెడీ మూవీ కావడంతో ఈ మూవీపై ట్రేడ్ వర్గాల్లో, ఇండస్ట్రీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో ఇప్పటికే ఫుల్ క్రేజ్ నెలకొంది. ''మా పీపుల్స్ మీడియా నుంచి వస్తున్న బిగ్గెస్ట్ ఫిల్మ్ 'ది రాజా సాబ్'. ప్రభాస్‌గారిని 'బుజ్జిగాడి' సినిమా స్టైల్‌లో వింటేజ్ లుక్‌లో చూపిస్తున్నాం. 40 నిమిషాల క్లైమాక్స్ ఎపిసోడ్ ఈ మూవీకి హైలైట్‌గా నిలుస్తుంది'' అని చిత్రనిర్మాణ సంస్థ పేర్కొంది.

శివ కార్తికేయన్, శ్రీలీల

ఈ సంక్రాంతికి తెలుగు హీరోల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. పాంచ్ పటాకా అంటూ ఐదుగురు హీరోలు సంక్రాంతి రేసులో నిలవనుండటం ఒక విశేషం అయితే... మరోవైపు విజయ్, శివ కార్తికేయన్ వంటి తమిళ హీరోలు కూడా సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. తెలుగులో సంక్రాంతి ఎంత పెద్ద పండగో... తమిళ్‌లో పొంగల్ కూడా అంత పెద్ద ఫెస్టివల్. అందుకే విజయ్ 'జన నాయగన్', శివ కార్తికేయన్ 'పరాశక్తి' సినిమాలు పొంగల్ బరిలో నిలుస్తున్నాయి. ఈ సినిమాలు ఎలాగూ తెలుగులోనూ విడుదలవుతాయని ప్రత్యేకించి చెప్పక్కర్లేదు.

- తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న చివరి తమిళ చిత్రం 'జన నాయగన్' (తెలుగులో జన నాయకుడు). హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా విజయ్ కెరీర్‌లో 69వ మూవీ. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్ కీలక పాత్రలో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. తమిళ రాజకీయాల్లోకి పూర్తి స్థాయిలోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్ 'జన నాయగన్' తర్వాత సినిమాల నుంచి విరామం తీసుకుంటుండటంతో ఈ సినిమాపై ఇండస్ట్రీ వర్గాల్లో ఫుల్ క్రేజ్ నెలకొంది. "విజయ్ చివరి చిత్రంగా 'జన నాయగన్' రాబోతోంది. విజయ్ చేసిన సేవా కార్యక్రమాలు, సినీ పరిశ్రమలో సాధించిన విజయాలకు చిహ్నంగా ఈ టైటిల్ ఉంటుంది. ఈ మూవీ విజయ్‌కి ఫేర్‌వెల్‌గా ఉండబోతోంది. ఆయన అభిమానులు ఈ సినిమాను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకునేలా ఉంటుంది. అనిరుధ్ సంగీతం ఈ చిత్రానికి ప్లస్ అవుతుంది" అని చిత్రవర్గాలు పేర్కొన్నాయి.
- శివ కార్తికేయన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పరాశక్తి'. 'గురు, ఆకాశమే నీ హద్దురా' చిత్రాల ఫేమ్ సుధ కొంగర దర్శకత్వం వహిస్తున్నారు. రవి మోహన్, అథర్వ, శ్రీలీల ఇతర ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. రెడ్ జెయింట్ మూవీస్ ఉదయనిధి సమర్పణలో ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా తమిళంతో పాటు తెలుగులోనూ జనవరి 14న సంక్రాంతికి విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు టీజర్‌కి మంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'రత్నమాల...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు మేకర్స్. శివ కార్తికేయన్, శ్రీలీలపై చిత్రీకరించిన ఈ మెలోడీకి మంచి స్పందన వచ్చింది.

భర్త మహాశయులకు విజ్ఞప్తి

మాస్ మహారాజా రవితేజ మరోసారి తన ఫ్యాన్స్‌కి, ప్రేక్షకులకు సంక్రాంతి కానుకగా తనదైన శైలిలో వినోదం అందించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. 'నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ, చిత్రలహరి, ఆడవాళ్ళు మీకు జోహార్లు' వంటి చిత్రాలను తెరకెక్కించిన కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకి ఇటీవల 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. అంతేకాదు... ఈ మూవీని 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందకు తీసుకు రానున్నట్లు తెలిపారు. 'నా జీవితంలోని ఇద్దరు ఆడవాళ్లు రెండు ప్రశ్నలు అడిగారు... సమాధానం కోసం చాలా ప్రయత్నించాను. గూగుల్, చాట్ జీపీటీ, జెమినీ, ఏఐ... ఇలా అన్నింటినీ అడిగాను.. బహుశా వాటికి పెళ్లి కాకపోవడం వల్ల ఆన్సర్ చెప్పలేకపోయాయేమో. అనుభవం ఉన్న మగాళ్లని ముఖ్యంగా మొగుళ్లను అడిగాను. ఆశ్చర్యపోయారే తప్పా ఆన్సర్ మాత్రం ఇవ్వలేకపోయారు. అలాంటి ప్రశ్న మిమ్మల్ని ఏ ఆడవాళ్లు అడగకూడదని, పెళ్లయిన వాళ్లకి నాలాంటి పరిస్థితి ఎదురవకూడదని కోరుకుంటూ మీ ఈ రామసత్యనారాయణ చెప్పేది ఏమిటంటే... భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ రవితేజ చెప్పిన డైలాగ్స్ గ్లింప్స్‌లో ఆకట్టుకున్నాయి. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' టైటిల్‌ని బట్టి చూస్తే ఈ సినిమా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని అర్థమవుతోంది. సున్నితమైన అంశాలను తనదైన భావోద్వేగాలతో తెరకెక్కించే కిశోర్ తిరుమల 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'లో భార్య, భర్తల మధ్య జరిగే ఫన్నీ ఇన్సిడెంట్స్‌ను వినోదాత్మకంగా చూపించబోతున్నట్టు తెలుస్తోంది. ''ఔట్ అండ్ ఔట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిశోర్ తిరుమల టచ్‌తో ఈ చిత్రం ఉంటుంది. రవితేజ చాలా రోజుల తర్వాత ఓ ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎంటర్‌టైనర్ చేయడం ప్రేక్షకులకు రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. ఇందులో వినోదంతో పాటు మనసుని హత్తుకునే భావోద్వేగాలు కూడా ఉంటాయి. సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తున్నారు'' అని చిత్రయూనిట్ తెలిపింది.

జనవరి టు జూన్...

'ఆర్ఆర్ఆర్', 'దేవర' వంటి వరుస విజయాల తర్వాత ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. 2024లో పూజా కార్యక్రమాలు జరుపుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ 2025లో ప్రారంభమైంది. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ బాగా బరువు తగ్గడంతో పాటు పూర్తి స్థాయి గడ్డంతో స్టన్నింగ్ లుక్స్‌లో దర్శనమిస్తున్నారు. ఈ చిత్రంలో ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాల కోసమే ఆయన ఈ లుక్‌లోకి మారారనే వార్తలు వినిపించాయి. ఇప్పటివరకు చూడనటువంటి మాస్ లుక్‌లో ఎన్టీఆర్‌ని ప్రెజెంట్ చేయనున్నారట ప్రశాంత్ నీల్. ఈ సినిమాకి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలా ఉంటే... తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 2026 జనవరి 9న సంక్రాంతి కానుకగా ఈ సినిమాని విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమాల్లో తొలుత ప్రకటించిన చిత్రం కూడా ఇదే. అయితే ఆ తర్వాత ఈ చిత్రం సంక్రాంతి బరి నుంచి తప్పుకుంది. 2026 జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో ఈ సినిమా విడుదల కాస్తా జనవరి నుంచి జూన్‌కి మారింది.

మీనాక్షి చౌదరి, నవీన్ పొలిశెట్టి

సంయుక్త, శర్వానంద్, సాక్షి వైద్య

నారీనారీ నడుమ మురారి

హీరో శర్వానంద్ మరోసారి సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. 2017లో 'శతమానం భవతి' సినిమాతో సంక్రాంతి బరిలో నిలిచిన ఆయన ఘన విజయం అందుకున్నారు. ఇప్పుడు 'నారి నారి నడుమ మురారి' చిత్రంతో మరోసారి సంక్రాంతికి ఆడియన్స్ ముందుకొస్తున్నారు శర్వానంద్. శ్రీవిష్ణుతో 'సామజవరగమన' (2023) వంటి విజయవంతమైన సినిమా తెరకెక్కించిన రామ్ అబ్బరాజు 'నారి నారి నడుమ మురారి'కి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో సాక్షీ వైద్య, సంయుక్త హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. షూటింగ్ ఆలస్యం వల్ల ఇప్పటికే పలుమార్లు విడుదల వాయిదా పడిన ఈ చిత్రాన్ని 2026 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''శర్వానంద్ నటిస్తున్న ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'నారి నారి నడుమ మురారి'. ఇప్పటికే విడుదలైన మా మూవీ ఫస్ట్ లుక్, ప్రమోషనల్ పోస్టర్లు బజ్ క్రియేట్ చేశాయి. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి రిలీజైన ఫస్ట్ సింగిల్ 'దర్శనమే...' కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. దీపావళి సందర్భంగా సంప్రదాయ పంచె కట్టుతో ఉన్న శర్వానంద్ లుక్‌ని విడుదల చేయగా అద్భుతమైన స్పందన వచ్చింది. గతంలో 'శతమానం భవతి' సినిమాతో బ్లాక్ బస్టర్ అందించిన శర్వానంద్‌కి సంక్రాంతి లక్కీ సీజన్ అని చెప్పొచ్చు. అందుకే మా 'నారి నారి నడుమ మురారి'తో కుటుంబ ప్రేక్షకులను అలరించడంతో పాటు మరో హిట్‌ని ఆయన తన ఖాతాలో వేసుకుంటారనే నమ్మకం ఉంది. జ్ఞానశేఖర్, యువరాజ్ విజువల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి'' అని చిత్రయూనిట్ తెలిపింది.

అనగనగా ఒక రాజు...

'జాతిరత్నాలు, మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి సినిమాలతో ప్రేక్షకులకు తనదైన శైలిలో వినోదాలు పంచిన నవీన్ పొలిశెట్టి హీరోగా నటిస్తున్న మరో కామెడీ చిత్రం 'అనగనగా ఒక రాజు'. ఈ సినిమా ద్వారా మారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానుంది. 'అనగనగా ఒక రాజు' చిత్రం పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందుతోంది. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతోంది. మిక్కీ జె. మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి 'భీమవరం బల్మా..' అంటూ సాగే మొదటి పాట విడుదల వేడుకని భీమవరంలో ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండగను కాస్త ముందుగానే తీసుకొచ్చినట్టుగా నవీన్ పొలిశెట్టి వేదిక వద్దకు ఎద్దుల బండిపై రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే నవీన్, మీనాక్షి కలిసి 'భీమవరం బల్మా...' పాటకు వేదికపై డ్యాన్స్ చేయడం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పైగా 'భీమవరం బల్మా...' పాటతో నవీన్ పొలిశెట్టి మొదటిసారి గాయకుడిగా మారడం మరింత విశేషం. ''ఒక బైక్ ప్రమాదంలో గాయాలు కావడం వల్ల నేను కొంతకాలం షూటింగ్‌కి దూరమయ్యాను. ఆ సమయంలో ప్రేక్షకులకు ఎలా వినోదం అందించాలని ఆందోళన చెందాను. మీ అందరి ప్రేమ, అభిమానం వల్ల కోలుకొని 'అనగనగా ఒక రాజు' సినిమా షూటింగ్ చేసి, పండగకు మీ ముందుకు రాబోతున్నాను. ఈ సినిమాలో వినోదం, మాస్, కమర్షియల్ సాంగ్స్, అద్భుతమైన ప్రేమ కథ వంటి అంశాలన్నీ ఉంటాయి. మీనాక్షి కామెడీ టైమింగ్ చూసి అందరూ ఆశ్చర్యపోతారు. 'అనగనగా ఒక రాజు' సినిమా ప్రేక్షకులందరికీ కచ్చితంగా నచ్చుతుందని ఆశిస్తున్నాను. జనవరి 14న థియేటర్లలో అందరం హాయిగా నవ్వుకుందాం'' అని నవీన్ పొలిశెట్టి పేర్కొన్నారు.

– దేరంగుల జగన్ మోహన్

కృతీ శెట్టి, కార్తీ

అన్నగారు పోలీసాఫీసర్

కార్తీ హీరోగా నటించిన తాజా తమిళ చిత్రం 'వా వాత్తియార్'. నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కృతీ శెట్టి హీరోయిన్‌గా నటించారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ సినిమా 'అన్నగారు వస్తారు' టైటిల్‌తో తెలుగులో రానుంది. డిసెంబరులో ఈ సినిమా విడుదల కానుంది. ఈ మూవీ తెలుగు టీజర్‌ని డైరెక్టర్ అనిల్ రావిపూడి సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ''టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా ఉంది. కార్తీ, జ్ఞానవేల్ రాజాతో పాటు చిత్రయూనిట్‌కి అభినందనలు'' అని అనిల్ రావిపూడి తెలిపారు. ''యాక్షన్ కామెడీ కథతో రూపొందిన చిత్రం 'అన్నగారు వస్తారు'. ఈ మూవీలో కార్తీ పోలీస్ ఆఫీసర్‌గా కనిపిస్తారు. ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ మూవీ ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

ఐయామ్ ది గేమ్

దుల్కర్ సల్మాన్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఐయామ్ ది గేమ్'. వేఫెరర్ ఫిలిమ్స్ సమర్పణలో నహాస్ హిదాయత్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదలైంది. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో రక్తంతో తడిసిన చేతితో గన్ పట్టుకున్న దుల్కర్ లుక్ ఓ స్టయిలిష్ క్యారెక్టర్‌లో ఈ హీరోని చూడబోతున్నామనే ఫీల్‌ని కలిగించేలా ఉంది. మిస్కిన్, ఆంటోనీ వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోహిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. తెలుగు, మలయాళ, తమిళ, కన్నడ హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

దుల్కర్ సల్మాన్

బిజినెస్ రీల్

మరిన్ని విభాగాల్లో సైయెంట్, సీఎన్‌హెచ్ ఇండస్ట్రియల్ జట్టు

హైదరాబాద్: వివిధ రకాల వాహనాల ప్లాట్‌ఫాంలవ్యాప్తంగా అడ్వాన్స్‌డ్ పర్సెప్షన్, అటోమేషన్ సొల్యూషన్స్‌ని అందించే దిశగా తమ భాగస్వామ్యాన్ని విస్తరించినట్లు సైయెంట్ లిమిటెడ్, సీఎన్‌హెచ్ కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ వెల్లడించాయి. గత రెండున్నరేళ్లుగా వీల్ లోడర్స్‌కి అడ్వాన్స్‌డ్ పర్సెప్షన్ సిస్టమ్ రూపకల్పనలాంటి కీలక ఆవిష్కరణలపై పని చేస్తున్నట్లు వివరించాయి. నిర్మాణ రంగానికి సంబంధించి స్మార్ట్, అటానమస్ మెషినరీల తయారీ దిశగా ఇదొక ముందడుగని సీఎన్‌హెచ్ ప్రెసిడెంట్ హుమాయున్ చిష్తీ తెలిపారు. సీఎన్‌హెచ్ విజన్‌కి తగ్గట్లు ఉత్పత్తులను రూపొందించడంలో విశ్వసనీయ భాగస్వామిగా కలిసి పని చేస్తామని సైయెంట్ ఈడీ సుకమల్ బెనర్జీ పేర్కొన్నారు.

అమృతాంజన్ ఎల్లో బామ్ రీలాంచ్

ముంబై: అమృతాంజన్ హెల్త్‌కేర్ తాజాగా ఎల్లో బామ్‌ను సరికొత్త ప్యాకేజింగ్‌తో ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా గత విధానంలో గాజు బాటిల్‌లో దీన్ని అందిస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎస్. శంభుప్రసాద్ తెలిపారు. ప్రతి బాటిల్‌లో అదనంగా 25 శాతం బామ్ ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి రెండు కొత్త టీవీ ప్రకటనలను రూపొందించినట్లు వివరించారు.

అమెరికాలో భాన్‌జూ మ్యాథ్స్ సెంటర్

హైదరాబాద్: మ్యాథ్స్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం భాన్‌జూ, అమెరికాలోని టెక్సాస్‌లో తమ తొలి మ్యాథ్స్ సెంటర్‌ని ప్రారంభించింది. ప్రస్తుతం ఆన్‌లైన్ ప్రోగ్రాంల ద్వారా అక్కడి విద్యార్థులకు బోధిస్తుండగా, ఇది తొలి ఫిజికల్ సెంటర్ అని సంస్థ సీఈవో నీలకంఠ భాను తెలిపారు. సైన్స్, టెక్నాలజీ, మ్యాథ్స్ కోర్సులకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా తమ కార్యకలాపాల విస్తరణలో భాగంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. భారత్ సహా 16 దేశాల్లో ఇప్పటివరకు 50,000 పైచిలుకు విద్యార్థులకు గణితంలో శిక్షణనిచ్చినట్లు భాను వివరించారు.

క్వాలిజీల్ నుంచి వేలిడ్‌ఆల్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కృత్రిమ మేథ (ఏఐ) విశ్వసనీయత, నైతికతను పరీక్షించేందుకు తోడ్పడే వేలిడ్ ఆల్ట్ ఫ్రేమ్‌వర్క్‌ని ప్రవేశపెట్టినట్లు క్వాలిజీల్ సంస్థ వెల్లడించింది. ఇది అంతర్జాతీయ స్థాయి ఏఐ రిస్క్ మేనేజ్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్, ఐఎస్‌వో/ఐఈసీ 42001 ప్రమాణాలను పాటిస్తుందని వివరించింది. క్యూఈ కాంక్లేవ్ సదస్సు సందర్భంగా వేలిడ్‌ఆల్ట్‌ని ఆవిష్కరించారు. సురక్షితమైన ఏఐ సిస్టమ్‌ల రూపకల్పనలో క్వాలిటీ ఇంజినీరింగ్ ప్రాధాన్యత ప్రధానాంశంగా నిర్వహించిన ఈ సదస్సులో 400 కంపెనీల నుంచి 850 మందిపైగా పరిశ్రమ నిపుణులు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు.

సీబీఐసీ చైర్మన్‌గా వివేక్ చతుర్వేది



న్యూఢిల్లీ: కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) చైర్మన్‌గా ఐఆర్‌ఎస్ అధికారి వివేక్ చతుర్వేది నియమితులయ్యారు. నవంబర్ 28న పదవీ విరమణ చేసిన సంజయ్ కుమార్ అగర్వాల్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఐఆర్‌ఎస్ 1990 బ్యాచ్‌కు చెందిన చతుర్వేది ప్రస్తుతం సీబీఐసీ బోర్డు సభ్యుడిగా పనిచేస్తున్నారు. ''సీబీఐసీ సభ్యుడి గా ఉన్న చతుర్వేదిని అదే బోర్డుకు చైర్మన్‌గా నియమించేందుకు కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది'' అని డీఓపీటీ ఉత్తర్వుల్లో తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-11-2025

విశాఖ	615-00
చిత్తూరు	663-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	625-00
విజయవాడ	650-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	630-00
వరంగల్	632-00
రిటైల్ ధర	6.90

డుకాటీ స్ట్రీట్‌ఫైటర్ వీ2

ప్రారంభ ధర రూ. 17.50 లక్షలు

లగ్జరీ మోటర్‌సైకిల్ బ్రాండ్ డుకాటీ తాజాగా స్ట్రీట్‌ఫైటర్ వీ2ని భారత్‌లో ఆవిష్కరించింది. దీని ధర రూ. 17,50,200 నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో 890 సీసీ వీ2 ఇంజిన్, అధునాతన ఎలక్ట్రానిక్స్, డుకాటీ చాసిస్, సిక్స్ స్పీడ్ ట్రాన్స్‌మిషన్ తదితర ప్రత్యేకతలు ఉన్నాయి. స్ట్రీట్‌ఫైటర్ వీ2, స్ట్రీట్‌ఫైటర్ వీ2 ఎస్ అని రెండు వేరియంట్లలో ఇది లభిస్తుంది. ఇందులో నలుగు రైడింగ్ మోడ్స్ (రేస్, స్పోర్ట్, రోడ్, వెట్) ఉంటాయి. ల్యాప్ టైమర్ ప్రో సెల్ఫ్ టైమింగ్ సిస్టం, క్రూయిజ్ కంట్రోల్, టర్న్ బై టర్న్ నేవిగేటర్, యూఎస్‌బీ పవర్ సాకెట్‌లాంటి యాక్సెసరీలు అందుబాటులో ఉంటాయి.

మార్కెట్లోకి ఐక్యూ 15

డిస్కౌంట్‌తో ప్రారంభ ధర రూ.64,999

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తమ ఫ్లాగ్‌షిప్ ఫోన్ ఐక్యూ 15ని ఆవిష్కరించింది. డిస్కౌంట్లు పోగా ధర రూ. 64,999 నుంచి ప్రారంభమవుతుంది. స్నాప్‌డ్రాగన్ 8 ఎలీట్ జెన్ 5 ప్రాసెసర్, సూపర్‌కంప్యూటింగ్ చిప్ క్యూ3, ఆండ్రాయిడ్ 16, ట్రిపుల్ 50 ఎంపీ కెమెరా సిస్టం, 7000 ఎంఏహెచ్ సిలికాన్ ఎనోడ్ బ్యాటరీ మొదలైన ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. డిసెంబర్ 1 నుంచి అమెజాన్, ఐక్యూ ఈస్టోర్‌లో అమ్మకాలు ప్రారంభమవుతాయి. ఎస్‌బీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్డులపై రూ. 7,000 డిస్కౌంటు, అర్హత కలిగిన కస్టమర్లకు అదనంగా రూ.1,000 కూపన్ డిస్కౌంటు లభిస్తాయి.

నథింగ్ ఫోన్ '3ఎ లైట్'

రూ. 19,999 నుంచి ప్రారంభం

లండన్ ఆధారిత టెక్ కంపెనీ నథింగ్ కొత్తగా తమ ఫోన్ (3ఎ) లైట్ స్మార్ట్‌ఫోన్‌ని భారత్‌లో ప్రవేశపెట్టింది. దీని వాస్తవ ధర రూ. 20,999 కాగా బ్యాంక్ డిస్కౌంట్లు పోగా రూ. 19,999 నుంచి ప్రారంభమవుతుంది. డిసెంబర్ 5 నుంచి ఫ్లిప్‌కార్ట్, విజయ్ సేల్స్, క్రోమా, ఇతరత్రా రిటైల్ ఔట్‌లెట్స్‌లో మూడు రంగుల్లో లభిస్తుంది. ఇందులో 6.77 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే, 50 ఎంపీ మెయిన్ కెమెరా, ట్రూలెన్స్ ఇంజన్ 4.0, మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ప్రో చిప్‌సెట్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర ఫీచర్లు ఉంటాయి. ఆండ్రాయిడ్ 15 ఆధారిత నథింగ్ ఓఎస్ 3.5పై పనిచేస్తుంది. 3 ఏళ్ల వరకు మేజర్ అప్‌డేట్స్, 6 ఏళ్ల వరకు సెక్యూరిటీ ప్యాచెస్ పొందవచ్చు.

ఫుడ్ సర్వీసుల మార్కెట్ @125 బిలియన్ డాలర్లు

- సంఘటిత రంగం రెండు రెట్లు వృద్ధి
- 2030 నాటికి అంచనా
- స్విగ్గీ నివేదిక

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత ఆహార సేవల మార్కెట్ 2030 నాటికి 125 బిలియన్ డాలర్లకు చేరనుంది. అసంఘటిత రంగంతో పోలిస్తే సంఘటిత రంగం రెండు రెట్లు వృద్ధి చెందనుంది. కన్సల్టెన్సీ సంస్థ కియర్నీతో కలిసి ఆన్‌డిమాండ్ కన్వీనియెన్స్ ప్లాట్‌ఫాం స్విగ్గీ విడుదల చేసిన 'హౌ ఇండియా ఈట్స్' వార్షిక నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఫుడ్ సర్వీసుల విభాగం వాటా దాదాపు 1.9 శాతంగా ఉంది. చైనాలో ఇది 5 శాతంగా, బ్రెజిల్‌లో 6 శాతంగా ఉంది. ఈ నేపథ్యంలో దేశీయంగా ఈ విభాగం గణనీయంగా వృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయి. పెరుగుతున్న ఆదాయాలు, డిజిటల్ వినియోగం, సౌకర్యానికి పెరుగుతున్న ప్రాధాన్యం తదితర అంశాలు ఈ సెగ్మెంట్ వృద్ధికి కారణంగా నిలుస్తాయి. అయితే, ఇది విస్తరిస్తున్న తీరు కొంత ఆసక్తికరంగా ఉంది. దేశీ వినియోగదారులు మరింతగా ప్రయోగాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. సగటున ఒక్కో కస్టమర్ నుంచి విభిన్నమైన వంటకాలకు వచ్చే ఆర్డర్లు 20 శాతం పెరగ్గా, రెస్టారెంట్లలో ఇది 30 శాతంగా ఉంది. రాత్రి వేళల్లో ఆలస్యంగా రాత్రి 11 గంటల తర్వాత తిండి. ఇలాంటి వాటిల్లో రాత్రి 11 గంటల తర్వాత పిజ్జాలు, కేకులు, సాఫ్ట్ డ్రింక్‌లతో కూడుకున్న భోజనం ఆర్డర్లు దాదాపు మూడు రెట్లు పెరిగాయి. ఆరోగ్యకరమైన, మెరుగైన మీల్స్ ఆర్డర్ల సంఖ్య మొత్తం ఆర్డర్లలో 2.3 రెట్లు పెరిగింది. ప్రధానంగా ప్రోటీన్‌పై దృష్టి పెడుతూ, క్యాలరీలు, యాడెడ్ చక్కెరను తగ్గించుకునే ధోరణి కనిపిస్తోంది.

నివేదికలో మరిన్ని విశేషాలు..

- ప్రధాన ప్రవంతితో వంటకాలతో పోలిస్తే గోవా, బీహార్ తదితర ప్రాంతాల వంటకాలపై 2–8 రెట్లు ఆసక్తి పెరుగుతోంది.
- కొరియన్, వియత్నాం, మెక్సికన్ వంటకాలు ప్రధాన స్రవంతిలోకి చేరుతున్నాయి. వీటికి సంబంధించిన సూచీలు వరుసగా 17, 6, 3.7 రెట్లు పెరిగాయి. పెరువియా, ఇథియోపియా ఆహారాలపై కూడా ఆసక్తి పెరుగుతోంది.
- గత ఏడేళ్లుగా బోబా టీ, మాచా టీ మొదలైన వాటిని సెర్చ్ చేయడం వరుసగా పెరిగింది.
- పానీయాల విభాగంలో బటర్‌మిల్క్, షర్బత్‌లాంటి వాటికి డిమాండ్ 4–6 రెట్లు అధికంగా ఉంది. దీంతో గ్లోబల్ క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు కూడా దేశీ అభిరుచులకు అనుగుణంగా బెవరేజెస్ వెరైటీలను తయారు చేస్తున్నాయి.

క్విక్ కామర్స్ దన్ను..

'కేవలం దశాబ్దకాలంలోనే పరిశ్రమ వైవిధ్యంగా విస్తరించింది. క్విక్ కామర్స్‌తో స్పీడ్‌పై అంచనాలు పెరిగిపోయాయి. 10 నిమిషాల ఫుడ్ డెలివరీ సర్వీస్ బోల్ట్ ఇప్పుడు మా ప్లాట్‌ఫాంపై వచ్చే ఆర్డర్లలో 10 శాతానికి చేరింది. వినియోగదారులు ఒకవైపు చిరపరిచిత మైన భారతీయ, ఇటాలియన్ వంటకాలను మరింత చౌకగా కోరుకుంటున్నారు. మరోవైపు గతంలో ఎన్నడూ లేనంతగా బోబా టీ, మాచా టీ లాంటి గ్లోబల్ ప్రాపకాలనూ మక్కువ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లు వార్షికంగా సుమారు 17 శాతం వృద్ధి చెందే అవకాశం ఉంది. సంఘటిత ఆహార సేవల విభాగంతో పోలిస్తే ఈ విభాగం 1.5 రెట్లు వృద్ధి చెందవచ్చు' అని స్విగ్గీ ఫుడ్ మార్కెట్‌ప్లేస్ సీఈవో రోహిత్ కపూర్ తెలిపారు.

ఎఫ్‌ఎస్‌టీసీలో అదానీ గ్రూప్‌నకు వాటాలు

రూ. 820 కోట్లతో 72.8% కొనుగోలు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా పైలట్లకు శిక్షణ విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు సంబంధించి ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్‌ఎస్‌టీసీ)లో 72.8 శాతం వాటాలు కొనుగోలు చేస్తోంది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ (ఏడీఎస్‌టీఎల్), దానికి 50 శాతం వాటాలున్న హొరైజన్ ఏరో సొల్యూషన్స్ (హెచ్‌ఏఎస్‌ఎల్) సుమారు రూ. 820 కోట్లు వెచ్చించనున్నాయి. ఎఫ్‌ఎస్‌టీసీకి హైదరాబాద్‌తో పాటు గురుగ్రామ్‌లో సిమ్యులేషన్ సెంటర్లు ఉన్నాయి. హర్యానాలోని భివాని, నార్నౌల్‌లో ఫ్లయింగ్ స్కూల్స్ నిర్వహిస్తోంది. సంస్థ 11 అధునాతన ఫుల్–ఫ్లయిట్ సిమ్యులేటర్లు, 17 ట్రైనింగ్ విమానాలు ఉన్నాయి. కమర్షియల్ పైలట్ లైసెన్సులకు శిక్షణ, ప్రత్యేక నైపుణ్యాల కోర్సులను అందిస్తోంది.

55 కోట్ల లబ్ధిదారులు.. రూ.34 లక్షల కోట్ల రుణాలు

- ప్రధాన మంత్రి ముద్ర యోజన పథకం ద్వారా మంజూరు
- కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడి

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి ముద్ర యోజన(పీఎంఎంవై) పథకం ద్వారా 55 కోట్ల మంది లబ్ధిదారులకు ఎలాంటి తనఖా లేకుండా రూ.34 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు కావాల్సిన రుణాలను అందించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2015, ఏప్రిల్‌లో ప్రధాన మంత్రి ముద్ర యోజన(పీఎంఎంవై) పథకం ప్రారంభించారు. తొలుత ఎలాంటి హామీ లేని సూక్ష్మ రుణాలను రూ.10 లక్షల వరకు అందుతుండేవి. 2024–25 బడ్జెట్‌లో ఈ పరిమితిని రూ.20 లక్షలకు పెంచారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీఐ) నిర్వహించిన 'మీ డబ్బు, మీ హక్కు' సదస్సులో చౌదరి మాట్లాడుతూ.. ''అన్ క్లెయిమ్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు ప్రభుత్వం ఇప్పటికే తగు చర్యలు ప్రారంభించింది. అందులో భాగంగా బ్యాంకు ఖాతాదారులు ఒక్కో ఖాతాకు నలుగురు వరకు నామినీలను నియమించుకునే వీలు కల్పించింది. దీంతో క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశాలు మరింత మెరుగుపడతాయి. ఇలాంటి చర్యలు ఎన్నో చేపట్టనప్పటికీ.., చేయాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి'' అన్నారు. క్లెయిమ్ చేయని డిపాజిట్లను సులభంగా పొందేందుకు అక్టోబర్ 4న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ఆప్కీ పూంజీ, ఆప్కా అధికార్' (మీ డబ్బు, మీ హక్కు) పేరుతో ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా మూడు నెలల పాటు ఈ ప్రచారం నిర్వహించనున్నారు. బీమా పాలసీ క్లెయిమ్స్, బ్యాంక్ డిపాజిట్లు, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ల ఆదాయాలపై సరైన అవగాహన లేకపోవడం లేదా పాత అకౌంటు వివరాల వల్ల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ అన్ క్లెయిమ్డ్ ఆస్తులను ఎలా వెతకాలో సలహాలు ఇస్తారు. రికార్డులు అప్డేట్ చేయడం, క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేయడానికి సహాయం చేస్తారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని ఫైనాన్షియల్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా, కార్పొరేట్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ కింది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీలు ఈ ప్రచార కార్యక్రమానికి సహకరిస్తున్నాయి.

అన్‌క్లెయిమ్డ్ అసెట్స్ కోసం పోర్టల్‌పై కసరత్తు

న్యూఢిల్లీ: క్లెయిమ్ చేయకుండా ఖాతాల్లోనే మిగిలిపోయిన డిపాజిట్లు, పెన్షన్ ఫండ్, షేర్లు, డివిడెండ్లను క్లెయిమ్ చేసుకోవడంలో ప్రజలకు సహాయకరంగా ఉండేలా రిజర్వ్ బ్యాంక్‌తో కలిసి సమగ్ర పోర్టల్‌ను రూపొందించడంపై కసరత్తు చేస్తున్నట్లు ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు తెలిపారు. త్వరలోనే దీన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. అన్‌క్లెయిమ్డ్ అసెట్స్ కోసం ఉద్గాం పేరుతో ఆర్‌బీఐ, మిత్ర పేరిట మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, బీమా భరోసా పేరుతో బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ ఐఆర్‌డీఏఐ వేర్వేరు పోర్టల్స్ నిర్వహిస్తున్నాయి. 'మీ డబ్బు, మీ హక్కు' పేరిట అన్‌క్లెయిమ్డ్ అసెట్స్‌పై అక్టోబర్ 4న కేంద్ర ఆర్థిక మంత్రి దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ, సెబీ, ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్‌ఏ)తో కలిసి ఆర్థిక సేవల విభాగం దీన్ని ప్రారంభించింది. ఇప్పటికే రూ. 1,887 కోట్ల మొత్తాన్ని సిసలైన యజమానులు లేదా వారి నామినీలకు అందజేసినట్లు నాగరాజు వివరించారు. అవగాహన లేకపోవడం లేదా అకౌంట్ వివరాలను అప్‌డేట్ చేయకపోవడం వల్ల చాలా ఖాతాల్లో బీమా పాలసీ క్లెయిమ్‌లు, బ్యాంక్ డిపాజిట్లు, డివిడెండ్లు, షేర్లు, మ్యుచువల్ ఫండ్స్ ద్వారా వచ్చే నిధులు పెద్ద మొత్తంలో ఉండిపోతున్నాయి. వీటిని అన్–క్లెయిమ్డ్ అసెట్స్‌గా పరిగణిస్తున్నారు.

పసిడి ధరను నిర్దేశించే స్థాయికి భారత్

బంగారం మైనింగ్‌పై పరిశ్రమ ధీమా

న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా పసిడి ధరను నిర్దేశించే స్థాయికి భారత్ త్వరలో ఎదుగుతుందని పరిశ్రమ వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి. రాబోయే దశాబ్దకాలంలో భారత పసిడి డిమాండ్‌లో 20 శాతం అవసరాలు దేశీయంగా బంగారం మైనింగ్ ద్వారా తీరుతుందని పేర్కొన్నాయి. 2047 నాటికి వికసిత్ భారత లక్ష్యం దిశగా దేశం ముందుకెళ్తున్న నేపథ్యంలో మైనింగ్ చాలా కీలకంగా ఉంటుందని చాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్వహించిన రత్నాభరణాల సదస్సులో పాల్గొన్న సందర్భంగా వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ రీజనల్ సీఈవో సచిన్ జైన్ చెప్పారు. పసిడి మైనింగ్‌లో ఉద్యోగాలు, విదేశీ పెట్టుబడులు గణనీయంగా వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. దేశీయంగా ప్రస్తుతం చెప్పుకోతగ్గ స్థాయిలో మైనింగ్, గోల్డ్ బ్యాంకింగ్ లేకపోవడం వల్ల వేరే వారు నిర్ణయించిన ధరను భారత్ పాటించాల్సి వస్తోందని, లండన్ ఏఎం, పీఎం బెంచ్‌మార్క్ ధరలపై ఆధారపడాల్సి వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆర్‌బీఐతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థ కూడా పరివర్తన చెందే కొద్దీ ధరలపై కూడా మనం ప్రభావం చూపగలిగే అవకాశం ఉంటుందని జైన్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే రెండు మూడేళ్లలో భారత్ అంతర్జాతీయంగా కీలకమైన జ్యుయలరీ హబ్‌గా ఎదుగుతుందని చెప్పారు.

ఐదేళ్లలో 10 కోట్ల కస్టమర్లు

అపోలో ఫార్మసీ లక్ష్యం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల మంది కస్టమర్ల స్థాయికి చేరుకోవాలని అపోలో ఫార్మసీ లక్ష్యంగా నిర్దేశించుకుంది. రోజుకు రెండు కొత్త స్టోర్స్ ప్రారంభించే ప్రణాళికల్లో ఉంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో తాజాగా ప్రారంభించిన దానితో కలిపి మొత్తం 7,000 స్టోర్స్ మైలురాయిని చేరిన సందర్భంగా సంస్థ సీఈవో పి. జయకుమార్ ఈ విషయాలు వెల్లడించారు. 'ప్రతి రోజూ రెండు కొత్త స్టోర్స్‌ని ప్రారంభించడాన్ని కొనసాగిస్తాం. వచ్చే ఐదేళ్లలో 10 కోట్ల మంది కస్టమర్లకు చేరువవుతాం. తద్వారా అత్యంత నాణ్యమైన ఔషధాలను అందరికి అందుబాటులోకి తెస్తాం' అని ఆయన పేర్కొన్నారు. అపోలో ఫార్మసీని అపోలో హెల్త్‌కో నిర్వహిస్తోంది. తమ పెయిడ్ హెల్త్‌కేర్ లాయల్టీ ప్రోగ్రాం అయిన అపోలో సర్కిల్ సభ్యుల సంఖ్య 1 కోటి దాటిందని కంపెనీ వెల్లడించింది. మరోవైపు, 7 వేల స్టోర్స్ మైలురాయిని చేరడమనేది అసంఖ్యాక కుటుంబాలకు తమపై గల నమ్మకానికి నిదర్శనమని అపోలో హెల్త్‌కో ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభనా కామినేని తెలిపారు. అపోలో ఫార్మసీ ప్రస్తుతం 19,000పైగా పిన్‌కోడ్స్‌వ్యాప్తంగా రోజుకు పది లక్షల ఆర్డర్లు ప్రాసెస్ చేస్తోందని వివరించారు.

హిందుస్తాన్ పవర్‌కి సౌర విద్యుత్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ: సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి భారీ కాంట్రాక్టు దక్కించుకున్నట్లు సమగ్ర విద్యుత్ సేవల సంస్థ హిందుస్తాన్ పవర్ వెల్లడించింది. దీని ప్రకారం 300 ఎండబ్ల్యూపీ సౌర విద్యుత్ సామర్థ్యాన్ని, 300 ఎండబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్‌ఎస్)ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. టారిఫ్ ఆధారిత కాంపిటీటివ్ బిడ్డింగ్ రక్రియ ద్వారా ఈ టెండరును దక్కించుకున్నట్లు సంస్థ తెలిపింది. పునరుత్పాదక విద్యుత్ పోర్ట్‌ఫోలియోను పటిష్టం చేసుకునేందుకు, భారతదేశపు స్వచ్ఛ ఇంధన లక్ష్యాల సాధనలో తన వంతు పాత్ర పోషించేందుకు హిందుస్తాన్ పవర్‌కి ఇది తోడ్పడుతుందని కంపెనీ చైర్మన్ రతుల్ పురి తెలిపారు. ఇటీవలే ఎస్‌జేవీఎన్ నుంచి 100 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు, 200 మెగావాట్‌అవర్ బ్యాటరీ స్టోరేజీ సిస్టం ప్రాజెక్టును దక్కించుకున్నట్లు వివరించారు.

మైండ్‌స్పేస్ రీట్ చేతికి మూడు ప్రాపర్టీలు



న్యూఢిల్లీ: పోర్ట్‌ఫోలియో విస్తరణలో భాగంగా రియల్టీ సంస్థ మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ తాజాగా తమ స్పాన్సర్ కె.రహేజా కార్ప్ నుంచి మూడు కమర్షియల్ ప్రాపర్టీలను కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ. 2,916 కోట్లు వెచ్చించింది. ఇవి ముంబై, పుణెలో ఉన్నాయి. ప్రస్తుతం మైండ్‌స్పేస్ రీట్‌కి హైదరాబాద్, పుణె, ముంబై, చెన్నైలో 38.2 మిలియన్ చ.అ. కమర్షియల్ ప్రాపర్టీలు ఉండగా, మూడు అసెట్స్ కొనుగోలుతో ఇది 39 మిలియన్ చ.అ.కు చేరుతుంది. డీల్‌లో భాగంగా రూ. 1,820 కోట్ల విలువ చేసే యూనిట్లను జారీ చేయడంతో పాటు రూ. 1,100 కోట్ల రుణాలు, ఇతరత్రా చెల్లింపుల భారాన్ని మైండ్‌స్పేస్ రీట్ స్వీకరిస్తుంది. కొనుగోలు చేసిన వాటిలో ప్రమాణ్ ప్రాపర్టీస్, సన్‌డ్యూ రియల్ ఎస్టేట్ ఉన్నాయి.

భారత్ జీడీపీ వృద్ధి 6.6 శాతం

- 2025-26పై ఐఎంఎఫ్ అంచనా
- 2026-27లో 6.3 శాతం ఉండొచ్చు

న్యూయార్క్/వాషింగ్టన్: భారత్ జీడీపీ 2025–26లో 6.6 శాతం వృద్ధి సాధిస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. జీఎస్టీ సంస్కరణలతో అమెరికా విధించిన 50 శాతం టారిఫ్‌ల ప్రభావాన్ని భారత్ అధిగమిస్తుందని తెలిపింది. ''భారత ఆర్థిక వ్యవస్థ మంచి పనితీరును కొనసాగిస్తోంది. 2024–25లో 6.5 శాతం వృద్ధి అనంతరం, 2025–26 క్యూ1లో వాస్తవ జీడీపీ 7.8 శాతానికి విస్తరించింది''అని తాజాగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్న లక్ష్య సాధనకు వీలుగా నిర్మాణాత్మక సంస్కరణలు అవసరమని సూచించింది. అంతర్జాతీయంగా సమస్యలు నెలకొన్నప్పటికీ దేశీయంగా సానుకూల పరిస్థితులతో వృద్ధి బలంగా ఉంటుందని అంచనా వేసింది. అమెరికా 50 శాతం టారిఫ్‌లు మరింత కాలం పాటు కొనసాగుతుతాయని అనుకుంటే అప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ 2025–26లో 6.6 శాతం, తర్వాతి ఆర్థిక సంవత్సరంలో (2026–27) 6.3 శాతానికి తగ్గుతుంది''అని ఐఎంఎఫ్ పేర్కొంది.

సమీప కాలంలో రిస్కులు

ఆర్థిక వృద్ధికి సంబంధించి సమీప కాలంలో రిస్కులు ఉన్నట్టు ఐఎంఎఫ్ తెలిపింది. కొత్త వాణిజ్య ఒప్పందాలను త్వరగా ముగించడం, దేశీయంగా నిర్మాణాత్మక సంస్కరణలను వేగంగా అమలు చేయడం, ప్రైవేటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాలపై వృద్ధి వేగం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. భౌగోళికంగా సమస్యలు మరింత పెరిగితే కఠినతర ఆర్థిక పరిస్థితులకు దారితీయొచ్చని, అధిక ముడి సరుకుల ధరలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, ఎగుమతులు తగ్గడం వంటివి వృద్ధిని కిందకు తీసుకెళ్లే రిస్కులుగా ప్రస్తావించింది. ద్రవ్యోల్బణం చక్కని నియంత్రణలో ఉండడాన్ని గుర్తు చేసింది. ఆర్థిక, కార్పొరేట్ రంగాలు బలంగా ఉండడం, తగినంత నగదు నిల్వలు, వసూలు కాని మొండి రుణాలు కనిష్ట స్థాయికి చేరడాన్ని సానుకూలతలుగా పేర్కొంది.

రాష్ట్రపతి అభినందన

అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌ను గెలుచున్న భారత మహిళల జట్టును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వారి విజయం విశేషాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి తాను సంతకం చేసిన క్రికెట్ బంతితో పాటు ఆటగాళ్లకు మెమెంటోలు అందజేశారు. అనంతరం మహిళా క్రికెటర్ల కోసం ప్రత్యేకంగా రాష్ట్రపతి భవన టూర్‌ను ఏర్పాటు చేశారు. కొలంబోలో గత ఆదివారం జరిగిన ఫైనల్లో నేపాల్‌ను ఓడించి భారత అంధుల జట్టు విశ్వవిజేతగా నిలిచింది.

ఐపీఎల్‌కు డుప్లెసిస్ దూరం

పాకిస్తాన్ సూపర్ లీగ్‌పై దక్షిణాఫ్రికా బ్యాటర్ ఆసక్తి

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా వెటరన్ బ్యాటర్ ఫాఫ్ డుప్లెసిస్ వచ్చే ఐపీఎల్ సీజన్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు తనను త్వరలో జరిగే ఆటగాళ్ల వేలంలో పరిగణించకూడదని సమాచారమిచ్చాడు. విశ్వవ్యాప్త ఆదరణ చూరగొన్న ఐపీఎల్‌తో సఫారీ బ్యాటర్‌ది సుదీర్ఘమైన బంధం. 2012లో చెన్నై సూపర్‌కింగ్స్ (సీఎస్‌కే)తో లీగ్‌లోకి వచ్చిన అతను ఏకబికిన 14 ఏళ్ల పాటు లీగ్‌లో కొనసాగాడు. చెన్నై 2018, 2021లలో విజేతగా నిలిచిన జట్టులోనూ అతను సభ్యుడు. 'వచ్చే సీజన్‌కు అందుబాటులో ఉండను. వేలానికి రాను. ఇన్నేళ్ల అనుబంధమున్న లీగ్ అంటే నాకెంతో ఇష్టం. ఐపీఎల్ అన్నా... ఫ్రాంచైజీలన్నా నాకెంతో గౌరవం. వేల సంఖ్యలో వీక్షించే అభిమానుల మధ్య నేను ఆడిన ప్రతీ మ్యాచ్‌ను ఆస్వాదించాను. నా క్రికెట్ పయనంలో ఐపీఎల్‌ది అత్యంత మేలిమలుపు. ఇందులో ఎలాంటి సందేహం లేదు. అయితే 2026 సీజన్ మాత్రం ఆడను. భవిష్యత్తులో మాత్రం అందుబాటులో ఉంటాను' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశాడు. సీఎస్‌కేతో పాటు తెరమరుగైన రైజింగ్ పుణే సూపర్‌జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్‌కు అతను ప్రాతినిధ్యం వహించాడు. ఈ నాలుగు ఫ్రాంచైజీలతో కలిపి ఓవరాల్‌గా ఇప్పటి వరకు 154 మ్యాచ్‌లాడి 35.09 సగటుతో 4773 పరుగులు చేశాడు.

భారత్ 14-3 కెనడా

- అజ్లాన్ షా కప్ ఫైనల్లో భారత్
- నేడు బెల్జియంతో తుది పోరు

ఇపో (మలేసియా): టోర్నీ ఆసాంతం సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన భారత పురుషుల హాకీ జట్టు... సుల్తాన్ అజ్లాన్ షా కప్ టోర్నమెంట్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 14–3 గోల్స్ తేడాతో కెనడాపై విజయం సాధించింది. జుగ్‌రాజ్ సింగ్ నాలుగు గోల్స్‌తో జట్టు భారీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. మరో మ్యాచ్‌లో బెల్జియం 5–1 గోల్స్ తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. ఆదివారం బెల్జియంతో భారత్ ఫైనల్లో తలపడనుంది. చివరి పోరులో భారత జట్టు అదరగొట్టింది. జుగ్‌రాజ్ సింగ్ (12వ, 26వ, 39వ, 50వ నిమిషాల్లో) నాలుగు గోల్స్‌తో విజృంభించగా... రాజిందర్ (10వ, 24వ నిమిషాల్లో), అమిత్ రొహిదాస్ (15వ, 46వ నిమిషాల్లో), అభిషేక్ (57వ, 59వ నిమిషాల్లో) డబుల్ గోల్స్‌తో ఆకట్టుకున్నారు. నీలకంత శర్మ (4వ నిమిషంలో), దిల్‌ప్రీత్ సింగ్ (25వ నిమిషంలో), సెల్వం కార్తీ (43వ నిమిషంలో), సంజయ్ (56వ నిమిషంలో) తలా ఒక గోల్ చేశారు. కెనడా తరఫున బ్రెండన్ గురాలిక్ (11వ నిమిషంలో), మాథ్యూ సార్మెంటో (35వ నిమిషంలో), సిద్ధు (55వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభమైన నాలుగో నిమిషంలోనే నీలకంత శర్మ గోల్ కొట్టడంతో భారత జట్టు ఆధిక్యంలో నిలిచింది. మంచి ఆరంభం దక్కించుకున్న భారత జట్టు అదే జోరు కొనసాగిస్తూ... తొలి క్వార్టర్ ముగిసే సరికి మరో రెండు గోల్స్ బాదింది. అదే సమయంలో కెనడా జట్టు కూడా బోణీ కొట్టడంతో తొలి క్వార్టర్ ముగిసేసరికి భారత్ 3–1తో ముందంజలో నిలిచింది. సీనియర్లకు విశ్రాంతినిచ్చి యువ ఆటగాళ్లతో బరిలోకి దిగిన టీమిండియా... రెండో క్వార్టర్‌లోనూ జోరు కొనసాగించింది. రాజిందర్, జుగ్‌రాజ్, దిల్‌ప్రీత్ గోల్స్ చేయడంతో రెండో క్వార్టర్ ముగిసే సరికి భారత్ 7–1తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. మూడో క్వార్టర్‌లో కెనడా తరఫున ఒక గోల్ నమోదు కాగా... భారత్ తరఫున జుగ్‌రాజ్ మూడో గోల్ సెల్వం కార్తి ఒక గోల్ చేశారు. ఇక చివరి క్వార్టర్‌లో గోల్స్ వర్షం కురిసింది. భారత జట్టు ఐదు గోల్స్‌తో విరుచుకుపడగా... కెనడా ప్లేయర్ ఒక గోల్ చేశాడు. ఈ టోర్నీలో ఐదు మ్యాచ్‌లాడిన భారత్ 4 విజయాలు, ఒక పరాజయంతో 12 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక రెండో స్థానంలో నిలిచి ఫైనల్ చేరగా... బెల్జియం ఐదు మ్యాచ్‌ల్లో నాలుగింట గెలిచి మరొకటి 'డ్రా' చేసుకొని 13 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో నిలిచి తుదిపోరుకు అర్హత సాధించింది.

గాయాలు, శస్త్ర చికిత్సలు దాటి...

రంజీ ట్రోఫీలో సత్తా చాటుతున్న అభిషేక్ రెడ్డి ● కర్ణాటక నుంచి ఆంధ్ర జట్టుకు మారిన కెరీర్

సాక్షి క్రీడా విభాగం: పదేళ్ల క్రితం అభిషేక్ రెడ్డి 21 ఏళ్ల వయసులో కెరీర్‌లో తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడాడు. కర్ణాటక జట్టు తరఫున అతను అరంగేట్రం చేశాడు. రాబిన్ ఉతప్ప, మయాంక్ అగర్వాల్, మనీశ్ పాండే, కరుణ్ నాయర్‌లాంటి స్టార్ బ్యాటర్లు ఉన్న టీమ్‌లోకి అడుగు పెట్టి మొదటి ఇన్నింగ్స్‌లోనే అర్ధ సెంచరీతో ఆకట్టుకున్నాడు. అతని ఆటను చూసిన వారంతా మంచి భవిష్యత్తు ఉందంటూ ప్రశంసించారు. కానీ దురదృష్టవశాత్తూ దశాబ్దం తర్వాత కూడా అభిషేక్ 25 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లే ఆడగలిగాడు. రెండు పెద్ద గాయాలు అతని కెరీర్‌ను దెబ్బ తీశాయి. ఇటీవల జార్ఖండ్‌పై చేసిన 247 పరుగుల ఇన్నింగ్స్‌తో అభిషేక్ మళ్లీ అందరి దృష్టిలో పడ్డాడు. రెండు శస్త్ర చికిత్సలు, ఎన్నో ఏళ్లు మంచానికి పరిమితం కావడంవంటివి లేకపోతే తాను పెద్ద స్థాయి చేరేవాడినని అతను తన కెరీర్‌ను విశ్లేషించుకున్నాడు. అయితే క్రికెట్ ఆడితే ప్రమాదం అని డాక్టర్లు హెచ్చరించినా... మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టడమే తాను సాధించిన పెద్ద విజయమని అభిషేక్ చెప్పాడు.

కర్ణాటక తరఫున రాణించి...

కర్ణాటక రంజీ ట్రోఫీ గెలిచిన 2014–15 సీజన్‌లో అభిషేక్ భాగంగా ఉన్నాడు. అయితే కెరీర్ మొదలైన తర్వాతి ఏడాదికే 2016లో అభిషేక్ మోకాలికి మైదానంలోనే తీవ్ర గాయమైంది. దాంతో ఆటకు దూరం కావాల్సి వచ్చింది. శస్త్రచికిత్స తర్వాత కోలుకొని దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శన ఇచ్చాడు. ముఖ్యంగా సీకే నాయుడు ట్రోఫీ (అండర్–23)లో వరుసగా నాలుగు సెంచరీలతో అతను చెలరేగాడు. ఫలితంగా కర్ణాటక రంజీ టీమ్‌లో కూడా వరుసగా అవకాశాలు వచ్చాయి.

ఆంధ్రకు మారి...

కర్ణాటకలోని బీదర్‌లో పుట్టిన అభిషేక్ జూనియర్ స్థాయి క్రికెట్ అంతా అదే రాష్ట్రం తరఫున ఆడి ఆ తర్వాత సీనియర్ స్థాయికి ప్రమోట్ అయ్యాడు. అయితే దేశవాళీలో మరింత మెరుగైన అవకాశాల కోసం జట్టు మారాలని అతను భావించాడు. తల్లి ఆంధ్రప్రదేశ్‌కు చెందింది కావడంతో అదే జట్టును అభిషేక్ ఎంచుకున్నాడు. ఆ తర్వాత మరింత మెరుగ్గా ఆడిన అభిషేక్ ఇప్పుడు ఆంధ్ర టీమ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. అయితే ఈ క్రమంలో 2023లో మ్యాచ్‌లో పరుగు తీస్తుండగా గాయపడటం మళ్లీ అతడి కెరీర్‌ను వెనక్కి తోసింది. సర్జరీ సమయంలో క్రికెట్‌ను వదిలేయాలని అనుకున్నాని, అయితే చివరకు మళ్లీ ఆడేందుకు పట్టుదలగా సిద్ధమైనట్లు అతను చెప్పాడు. గాయాలతో కోలుకుంటున్న సమయంలో 'నీ కలల సాధనకు ప్రయత్నించు. అవి కచ్చితంగా నిజమవుతాయి' అని రాసి ఉన్న సచిన్ టెండూల్కర్ పోస్టర్ తనలో ఇన్నేళ్లుగా స్ఫూర్తి నింపుతోందని అభిషేక్ వెల్లడించాడు. ఇప్పుడు 31 ఏళ్ల వయసులో అతను మరోసారి సత్తా చాటి తన కలలను నిజం చేసుకునే ప్రయత్నం చేస్తుండటం విశేషం.

విజేత పాకిస్తాన్

ఫైనల్లో శ్రీలంకపై 6 వికెట్లతో గెలుపు ● ముక్కోణపు టి20 టోర్నమెంట్

రావల్పిండి: సొంతగడ్డపై జరిగిన ముక్కోణపు టి20 టోర్నమెంట్‌లో పాకిస్తాన్ జట్టు విజేతగా నిలిచింది. గ్రూప్ దశలో చక్కటి ప్రదర్శన కనబర్చిన ఆతిథ్య పాకిస్తాన్... ఫైనల్లోనూ అదే జోరు కొనసాగించింది. శనివారం జరిగిన తుదిపోరులో పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసి ట్రోఫీ కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 19.1 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటైంది. కమిల్ మిశ్రా (47 బంతుల్లో 59; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. పాక్ బౌలర్ల ప్రతాపానికి శ్రీలంక బ్యాటర్లు నిలవలేకపోయారు. కమిల్ ఒక్కడే అర్ధశతకం సాధించగా... పాథుమ్ నిశాంక (11), కుశాల్ మెండిస్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. పవన్ రత్నాయకే (8), కుశాల్ పెరెరా (1), కెప్టెన్ దసున్ షనక (2), జనిత్ లియాంగే (0), వణిందు హసరంగ (5) ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. పాకిస్తాన్ కెప్టెన్ షాహీన్ షా అఫ్రిది 3 ఓవర్లలో 18 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... మొహమ్మద్ నవాజ్ 4 ఓవర్లలో 17 పరుగులే ఇచ్చి 3 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అబ్రార్ అహ్మద్‌కు 2 వికెట్లు దక్కాయి. బౌలింగ్‌లో క్రమశిక్షణ కనబర్చిన పాకిస్తాన్ బ్యాటింగ్‌లోనూ ఫర్వాలేదనిపించింది. లక్ష్యం పెద్దది కాకపోవడంతో నిదానంగా ఆడి విజయం సాధించింది. ఛేదనలో పాక్ 18.4 ఓవర్లలో 118 పరుగులు చేసి గెలిచింది. మాజీ కెప్టెన్ బాబర్ ఆజమ్ (34 బంతుల్లో 37 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), సయీమ్ అయూబ్ (33 బంతుల్లో 36; 6 ఫోర్లు), సాహిబ్‌జాదా ఫర్హాన్ (23; 2 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేసి జట్టు విజయానికి సహకరించారు. శ్రీలంక బౌలర్లలో పవన్ రత్నాయకే 2 వికెట్లు పడగొట్టాడు. మొహమ్మద్ నవాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.

హర్భజన్

'ఆఫ్ స్పిన్నర్లు లేరు'

ముంబై: ప్రస్తుత టీమిండియాలో సమర్థమైన ఆఫ్ స్పిన్నర్ లేడని, ఈ లోటే టెస్టుల్లో ఫలితాలపై తీవ్రంగా ప్రభావం చూపుతోందని భారత దిగ్గజ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. వాషింగ్టన్ సుందర్ ఉన్నప్పటికీ అతను స్పిన్ ఆల్‌రౌండరని పేర్కొన్నాడు. మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో అతను మాట్లాడుతూ 'స్పెషలిస్టు రైటార్మ్ ఆఫ్ స్పిన్నర్ అంటూ జట్టులో ఎవరూ లేరు. తమిళనాడు ఆల్‌రౌండర్ సుందర్ ఉన్నా... అతనింకా పూర్తిస్థాయి స్పిన్నర్‌గా బౌలింగ్ అయితే వేయలేదు. 30 నుంచి 35 ఓవర్లు వేయగలిగితేనే అతను రాటుదేలుతాడు. పార్ట్‌టైమ్ బౌలింగ్‌తో ఒరిగేదేమీ ఉండదు. ఈ నేపథ్యంలో ఓ ఆఫ్‌స్పిన్నర్‌గా అతను నిలదొక్కుకునేందుకు చాలా కాలం పట్టొచ్చు' అని అన్నాడు. భారత ఉపఖండంలో స్పిన్ వికెట్లదే కీలకపాత్ర అని అలాంటి పిచ్‌లున్న దేశంలోని జట్టుకు నాణ్యమైన స్పిన్ బౌలర్లు లేకపోవడం ప్రతికూలంగా మారుతుందని అదే ప్రస్తుత ఫలితాలకు కారణమని హర్భజన్ విశ్లేషించాడు.

రెండో టి20లో బంగ్లాదేశ్ విజయం

4 వికెట్ల తేడాతో ఓడిన ఐర్లాండ్

చిట్టోగ్రామ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన బంగ్లాదేశ్ జట్టు... ఐర్లాండ్‌తో రెండో టి20లో విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో పరాజయం పాలైన బంగ్లాదేశ్... రెండో మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 1–1తో సమంచేసింది. శనివారం జరిగిన పోరులో ఆతిథ్య బంగ్లాదేశ్ 4 వికెట్ల తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. టకర్ (32 బంతుల్లో 41; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ (14 బంతుల్లో 29; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), టిమ్ టెక్టర్ (25 బంతుల్లో 38; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహదీ హసన్ మిరాజ్ 25 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... తన్జీమ్ హసన్ షకీబ్, మొహమ్మద్ సైఫుద్దీన్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ 19.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 174 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', కెప్టెన్ లిటన్ దాస్ (37 బంతుల్లో 57; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీతో రాణించగా... పర్వేజ్ హుసేన్ (28 బంతుల్లో 43; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నాడు. ఒక దశలో 138/2తో పటిష్ట స్థితిలో కనిపించిన బంగ్లాదేశ్ ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త ఇబ్బందిపడింది. తన్జిద్ హసన్ (7), తౌహిద్ హృదయ్ (6), నూరుల్ హసన్ (5) విఫలమయ్యారు. దీంతో ఉత్కంఠ రేగినా... ఆఖర్లో సైఫుద్దీన్ (7 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) కీలక పరుగులు చేసి మరో రెండు బంతులు మిగిలుండగా... జట్టును గెలిపించాడు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్, గారెత్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో టి20 మంగళవారం జరగనుంది.

డీపీఎస్ జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలు షురూ

సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ శనివారం ప్రారంభమైంది. కొల్లూరు వేదికగా రెండు రోజుల పాటు జరుగనున్న ఈ చాంపియన్‌షిప్‌లో దేశంలోని 17 రాష్ట్రాలకు చెందిన డీపీఎస్ పాఠశాలల జట్లు పాల్గొంటున్నాయి. కొల్లూరులో ఈ పోటీలు నిర్వహించడం ఇది వరుసగా మూడో ఏడాది అని వైస్ చైర్మన్ భీమ్‌సేన్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ ప్రిన్సిపాల్ వసంత పాల్గొన్నారు. అండర్–10, –13, –15, –17 విభాగాల్లో కాంపౌండ్, రికర్వ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. 200 మంది ఆర్చర్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

టీమ్ చాంప్ హైదరాబాద్ జట్టు

సాక్షి, హైదరాబాద్: అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జట్లు సత్తా చాటాయి. మూడు వేర్వేరు విభాగాల్లో హైదరాబాద్ జట్లు చాంపియన్‌గా నిలిచాయి. మొయినాబాద్ వేదికగా తెలంగాణ టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీ పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు విజయం సాధించగా... రంగారెడ్డి జట్టు రెండో స్థానంలో నిలిచింది. ములుగు జిల్లాకు మూడో స్థానం దక్కింది. మహిళల విభాగంలోనూ హైదరాబాద్ జట్టు రంగారెడ్డిపై గెలుపొందింది. పెద్దపల్లి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. జూనియర్ పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు అగ్రస్థానం దక్కించుకోగా... రంగారెడ్డి జట్టు రెండో స్థానంలో నిలిచింది. జగిత్యాల జిల్లా మూడో స్థానంతో సరిపెట్టుకుంది. జూనియర్ మహిళల విభాగంలో రంగారెడ్డి జట్టు టీమ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా... హైదరాబాద్, నల్లగొండ వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. టీమ్ చాంపియన్‌షిప్ దక్కించుకున్న హైదరాబాద్ జట్లను రాష్ట్ర టీటీ సంఘం కార్యదర్శి నాగేందర్ రెడ్డి అభినందించారు.

భవిష్యత్తు అగమ్య గోచరం

హాంకాంగ్ అపార్టుమెంట్ అగ్ని ప్రమాద బాధితుల వేదన

హాంకాంగ్‌లోని వాంగ్ ఫుక్ కోర్ట్ అపార్టుమెంట్ సముదాయంలో ప్రమాద బాధితులను గుర్తించేందుకు వెళ్తున్న ప్రత్యేక పోలీసు బృందాలు

హాంకాంగ్: హాంకాంగ్‌లోని అపార్టుమెంట్ సముదాయంలో బుధవారం సంభవించిన ఘోర అగ్ని ప్రమాదం 128 మందిని బలి తీసుకుంది. మరో 200 మంది వరకు జాడ తెలియడం లేదు. హాంకాంగ్‌లోని మొత్తం 75 లక్షల జనాభాకు గాను ప్రమాదం జరిగిన శివారు టై పొ టౌన్‌లోనే 3 లక్షల మంది వరకు నివసిస్తున్నారు. 1948 తర్వాత హాంకాంగ్‌లో చోటుచేసుకున్న అతిపెద్ద అగ్ని ప్రమాదమిది. 1980ల్లో నిర్మించిన వాంగ్ ఫుక్ కోర్టు అపార్టుమెంట్ సముదాయంలో 4,600 మంది ఉన్నట్లు అంచనా. తాజా విషాద ఘటనలో 32 అంతస్తులున్న ఈ కాంప్లెక్స్‌లో పైఫ్లోర్‌లలో ఉన్న వారిపై ఎక్కువ ప్రభావం పడింది. మొత్తం 8 అపార్టుమెంట్లకుగాను ఏడు అపార్టుమెంట్లలో దాదాపు 40 గంటలపాటు మంటలు మండుతూనే ఉన్నాయి.

విలియం లి కుటుంబం సురక్షితం

సెప్టెంబర్ నెలలో తమ అపార్టుమెంట్‌లోని 29వ ఫ్లోర్ నుంచి రెండో ఫ్లోర్‌కు మారిన విలియం లి కథ సుఖాంతమనే చెప్పాలి. ఎందుకంటే, ఈ ప్రమాదం నుంచి ఆయన త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఆయన కుటుంబంలోని మిగతా ముగ్గురూ ఆ సమయంలో వేర్వేరు పనులపై బయటే ఉన్నారు. విలియం లి మాత్రం భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందంటున్నారు. పూర్తిగా కాలిపోయిన స్థితిలో ఉన్న అపార్టుమెంట్‌లోకి తిరిగి వెళ్లడం అసాధ్యం, మరి ప్రభుత్వం తమను ఎలా ఆదుకుంటుందన్న ఆలోచన ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది. ప్రమాదం జరిగిన రోజు ఏమైందంటే.. ఆ రోజు సాయంత్రం విలియం లికి సెలవు. బయటకు వెళ్లాలని అనుకుంటుండగా ఎన్నడూ లేంది సాయంత్రం 3 గంటలప్పుడు భార్య నుంచి ఫోన్ వచ్చింది. తమ అపార్టుమెంట్‌ను మంటలు చుట్టుముట్టాయని ఓ స్నేహితురాలు చెబితే ఫోన్ చేశానంది. లి నమ్మలేదు. అంతా బాగానే ఉంది. పొగ లేదు, మంటలూ లేవు ప్రమాదం లేదంటూ బదులిచ్చారు. దాదాపు 8 నిమిషాల తర్వాత ఆయన డోర్ తెరిచి చూశారో లేదో దట్టమైన నల్లటి పొగలు కమ్ముకున్నాయి. అంతా నల్లగా కనిపించింది. అప్పుడు ఆయన ప్రమాదం శంకించారు. హాల్‌లోకి వెళ్లి చూశారు. పొగ తీవ్రతకు తాళలేక తిరిగి తన ఫ్లాట్‌లోకి వచ్చేశారు. ఇక తనకు మృత్యు ఘడియలు దగ్గర పడినట్లేననుకున్నారు. ఆ తర్వాత కారిడార్ గుండా వెళ్లేందుకు యత్నించారు. అక్కడ ఇద్దరు వృద్ధులున్నారు. ఈలోగా ఫైర్ ఫైటర్లు నిచ్చెన అందించడంతో ముందుగా ఇద్దరు వృద్ధులు కిందికి దిగేందుకు సాయం చేశారు. ఆ తర్వాత ఫైర్ ఫైటర్లు పంపిన నిచ్చెనపైకి ఎక్కారు. కిందికి దిగేలోపు మంటలను ఆయనను దహించి వేయకుండా నీళ్లు చిమ్ముతూనే ఉన్నారు. ఎలాగోలా కిందికి చేరుకున్న లి సజీవంగా బయటపడినందుకు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అక్కడే తన కోసం ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్న భార్య, కూతురు, కుమారుడు కనిపించారు. అప్పటికి సాయంత్రం 5 గంటలైంది. 'మాలాంటి వారికి సాయం చేసేందుకు ముందుకు వస్తున్న హాంకాంగ్ ప్రజలకు కృతజ్ఞతలు'అని ఈ కుటుంబం అంటోంది.

మా భవిష్యత్తు ఎలా ఉంటుందో..?

ప్రమాదం జరిగిన రోజు ఉదయం ఉద్యోగానికి వెళ్లిన 70 ఏళ్ల చాన్ తాముండే వాంగ్ ఫుక్ కోర్టు కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. భారీగా వ్యాపిస్తున్న మంటలను దూరం నుంచి చూసి షాకయ్యారు. అలా చూస్తూ ఉండటం మినహా చేయగలిగిందేమీ లేకుండాపోయింది. ఇలాంటి ప్రమాదాన్ని జీవితంలో ఎన్నడూ చూడలేదని ఆమె తెలిపారు. అదృష్టవశాత్తూ ఆమె భర్త ఐఎస్ కాంగ్ ఆ సమయంలో ఇంట్లో లేరు. చాన్, కాంగ్ వేర్వేరు చోట్ల ఉద్యోగాలు చేస్తుంటారు. దాదాపు పదేళ్లుగా ఉంటున్న ఆ ఇల్లు ఇప్పుడు నివాస యోగ్యంగా ఏమాత్రం లేదు. ఇప్పుడిక ఏం చేయడమా అన్న ఆలోచన వారిని వెంటాడుతోంది. ప్రభుత్వం వారిని ప్రస్తుతం ఓ హోటల్‌లో ఉంచింది. 'రెండు రోజులుగా నాకు నిద్రపట్టడం లేదు. ఇప్పుడు మేం ఎక్కడికి వెళ్లాలి. ఏంచేయాలి? ఇవే మమ్మల్ని వేధిస్తున్న ప్రశ్నలు'అని చాన్ అంటున్నారు. 'ప్రభుత్వం అత్యవసర సాయం ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. దాతల నుంచి కూడా వస్తువులు, డబ్బు అందుతూనే ఉన్నాయి. అయితే, భవిష్యత్తు జీవితానికి అవి ఏమాత్రం అక్కరకు వస్తాయనేది తెలీడం లేదు'అని తెలిపారు.

నేడు అఖిలపక్ష సమావేశం

- పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సహకారం కోరనున్న కేంద్రం
- ముఖ్యమైన బిల్లులపై విపక్షాలకు వివరించే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: డిసెంబర్ ఒకటో తేదీ నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న దృష్ట్యా కేంద్రం ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు పార్లమెంట్ అనెక్స్‌లో జరిగే ఈ సమావేశానికి అన్ని పార్టీల పార్లమెంటరీ ఫ్లోర్‌లీడర్లను ఆహ్వానించింది. లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలు సజావుగా సాగేందుకు సహకారం అందించాలని ప్రభుత్వం రాజకీయ పక్షాల నేతలను కోరనుంది. ప్రతిపక్ష పార్టీలు ఉభయ సభల కార్యకలాపాల్లో పూర్తిగా పాల్గొని సహకరించాలని, శక్తివంతమైన పార్లమెంటరీ వ్యవస్థను నిర్మించడంలో సహాయపడాలని కిరణ్ రిజిజు శనివారం విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రారంభమయ్యే సమావేశాలు డిసెంబర్ 19వ తేదీ వరకు కొనసాగుతాయి. సమావేశాల్లో అణుశక్తి, ఉన్నత విద్య, కార్పొరేట్ చట్టం, సెక్యూరిటీల మార్కెట్‌కు సంబంధించిన 10 కీలక బిల్లులను కూడా ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. మరోపక్క తొమ్మిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఓటరు సవరణ ప్రక్రియను తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబడుతోంది. కేంద్రం నిధుల విడుదలలో తమపట్ల వివక్షతో ఉందని తమిళనాడు ప్రభుత్వం విమర్శలు గుప్పిస్తోంది. ఢిల్లీ కాలుష్యంపై కాంగ్రెస్, ఆప్‌లు పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే అఖిలపక్ష సమావేశం కీలకం కానుంది.

బెంగాల్ రాజ్ భవన్ ఇకపై లోక్ భవన్

పేరు మార్పును ప్రకటించిన గవర్నర్ ఆనంద బోస్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ గవర్నర్ కార్యాలయం, నివాసం ఉండే రాజ్ భవన్ పేరును లోక్ భవన్‌గా మార్చుతున్నట్లు శనివారం గవర్నర్ సీవీ ఆనంద బోస్ ప్రకటించారు. 'కేంద్ర హోం శాఖ ఈ నెల 25వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్‌ను అనుసరించి, ఇకపై కోల్‌కతా ఫ్లాగ్‌స్టాఫ్ హౌస్‌లో, డార్జిలింగ్‌లో ఉన్న రాజ్ భవన్‌ల పేరును సవరించి లోక్ భవన్‌గా మార్చబడింది'అని ఆయన ఓ నోటిఫికేషన్‌లో వివరించారు. ఇకపై లోక్ భవన్ గవర్నర్ కార్యాలయంతోపాటు నివాసంగా కొనసాగుతుందన్నారు. ఇది తక్షణమే అమల్లోకి వచ్చిందని ప్రకటించారు. అన్ని అధికారిక ఉత్తరప్రత్యుత్తరాల్లో ఇకపై రాజ్ భవన్ బదులుగా లోక్ భవన్ అని ఉంటుంది. రాజ్ భవన్ గేట్లపై ఉన్న ప్లేట్లతోపాటు వెబ్‌సైట్‌లోనూ ఈ మేరకు పేరు మారుతుందని వివరించారు.

బీజేపీలో చేరిన ఆప్ మాజీ ఎమ్మెల్యే

ఎంసీడీ ఉప ఎన్నిక వేళ పరిణామం

న్యూఢిల్లీ: ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) ఉప ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే రాజేశ్ గుప్తా ఆ పార్టీకి రాజీనామా చేసి శనివారం బీజేపీలో చేరారు. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. వజీపూర్ మాజీ ఎమ్మెల్యే, ఆప్ ఉపాధ్యక్షుడు కూడా అయిన రాజేశ్ గుప్తా.. ఆదివారం ఎంసీడీలోని 12 వార్డులకు పోలింగ్ జరగనుండగా పార్టీ మారడం గమనార్హం. ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ వాడుకుని, వదిలేసే రకమంటూ రాజేశ్ గుప్తా ఆరోపించారు. ఆప్‌కు ఎన్నో సేవలందించిన తనను పట్టించుకోనందునే పార్టీ మారాల్సి వచ్చిందన్నారు. అయితే, అశోక్ విహార్ వార్డు టిక్కెట్‌ను భార్యకు ఇవ్వాలని చేసిన డిమాండ్‌కు తలొగ్గక పోవడంతో రాజేశ్ పార్టీ మారారని ఆప్ ఢిల్లీ అధ్యక్షుడు సౌరభ్ భరద్వాజ్ చెప్పారు. ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం తెల్సిందే. తాజా, ఉప ఎన్నికలు ఆ పార్టీకి గట్టి పరీక్షగా మారాయి.

బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా తేజస్వీ

పట్నా: బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష మహాగట్ బంధన్ నేతగా ఆర్జేడీకి చెందిన తేజస్వీ యాదవ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు శనివారం జరిగిన సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని ఆర్జేడీ ఎమ్మెల్యే భాయి వీరేంద్ర మీడియాకు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా సీఎం నితీశ్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే నూతన అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులపాటు కొనసాగుతాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికార ఎన్డీయే ఘన విజయం సాధించడం తెల్సిందే. ఈ ఎన్నికల్లో సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవ్‌ను మహాగట్ బంధన్ ప్రకటించింది.

ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న ప్రపంచ రాజకీయాలు

విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్య

కోల్‌కతా: ప్రపంచ రాజకీయాలు ఆర్థిక వ్యవస్థలను శాసించే స్థాయికి చేరుకున్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ వ్యాఖ్యానించారు. కలకత్తా-ఐఐఎం ఆయనకు శనివారం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మంత్రి జై శంకర్ మాట్లాడారు. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న తీవ్ర అనిశ్చిత పరిస్థితుల్లో మన దేశం అవసరాలకు అనుగుణంగా సరఫరా వనరులను నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అగ్రరాజ్యం అమెరికా దేశాల ప్రాతిపదికన విధానాలను మార్చుకుంటూ పోతోందని చెప్పారు. అదే సమయంలో భారత ప్రభుత్వం కూడా స్వావలంబన, ఆత్మ నిర్భరత సాధన దిశగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు, సమగ్ర వాణిజ్య ఒప్పందం కోసం వేర్వేరుగా అమెరికాతో భారత ప్రభుత్వం సమాంతర చర్చలను కొనసాగిస్తోందని వివరించారు. చైనా మాత్రం ఎప్పటి మాదిరిగానే తనకంటూ రూపొందించుకున్న నియమాల ఆధారంగా ముందుకు వెళుతోందన్నారు.

ఇండోనేసియాలో వరదలు..

279కు చేరిన మరణాలు

అగమ్: ఇండోనేసియాలో గతవారం సంభవించిన భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగి పడన ఘటనల్లో మృతుల సంఖ్య 279కి చేరుకుంది. సహాయక పునరావాస చర్యలతోపాటు గల్లంతైన మరో 174 మంది జాడ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మరణాల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. శనివారం ఒక్కరోజే నార్త్ సుమత్రలో 31 మృతదేహాలు బయటపడినట్లు తెలిపారు. వెస్ట్ సుమత్రలోని అగమ్ జిల్లాలో కొండచరియల కింద సమాధి అయిన మూడు గ్రామాల్లో సుమారు 80 మంది జాడ తెలియాల్సి ఉందన్నారు.

వ్యక్తిత్వానికి ఆభరణం నిజాయతీ

ఎల్లవేళలా నిజాయతీ, క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి

- న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవాలి
- న్యాయ విద్యార్థులకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ పిలుపు

సోనీపట్: మనుషులు ఎల్లవేళలా నిజాయతీకి, క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నిజాయతీ అనేది మనిషి వ్యక్తిత్వానికి విలువైన ఆభరణం లాంటిదని చెప్పారు. అంతేకాకుండా న్యాయం, ఖ్యాతిని కాపాడుతుందని అన్నారు. న్యాయ శాస్త్రం అభ్యసిస్తున్న విద్యార్థులు నిజాయతీని తమ జీవితాల్లో అంతర్భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. హరియాణా రాష్ట్రం సోనీపట్‌లోని ఓ.పి.జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో న్యాయ వ్యవస్థ స్వతంత్రపై శనివారం జరిగిన అంతర్జాతీయ సదస్సులో జస్టిస్ సూర్యకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయ శాస్త్రంపై చర్చల కోసం న్యాయాభ్యాస మండపాన్ని ప్రారంభించారు. అలాగే ఇంటర్నేషనల్ మూటింగ్ అకాడమీ ఫర్ అడ్వొకసీ, నెగోషియేషన్, డిస్ప్యూట్ అడ్జుడికేషన్, అర్బిట్రేసన్, రిసొల్యూ సన్ (ఇమాన్‌దార్)కు శ్రీకారం చుట్టారు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎంపీ, యూనివర్సిటీ చాన్సలర్ నవీన్ జిందాల్, పలువురు న్యాయనిపుణులు, న్యాయవాదులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగిస్తూ.. నిజాయతీ ప్రాముఖ్యతను వివరించారు. ఎవరూ చూడనప్పుడు మనం ఏం చేస్తామో అదే నిజాయతీ, చుట్టూ ఉన్న అందరూ చూస్తుండగా చేసేది సాహసం అని పేర్కొన్నారు. నిజాయతీ అనే ఒక్క పదానికి నైతికంగా ఎంతో విలువ ఉందన్నారు.

సత్యం, జ్ఞానం పరస్పరం పోటీ పడాలి

నేడు టెక్నాలజీ యుగంలో డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోల బెడద పెరిగిపోయిందని జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని అన్నారు. ప్రతిరోజూ దేశంలో ఏదో ఒకచోట డిజిటల్ అరెస్టులు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో సత్యం, జ్ఞానం పరస్పరం పోటీ పడాలని ఉద్ఘాటించారు. నీతి నిజాయతీ అనేవి కేవలం మాటల్లో చెప్పుకొనే ఆదర్శాలు కాదని, మనిషి మనగడకు అవి ముఖ్య సాధనాలు అని స్పష్టంచేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నిజాయతీని వదులుకోవద్దని న్యాయ విద్యార్థులకు సూచించారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుకోవాలని అన్నారు. రాజ్యాంగ పరిషత్‌లోని 15 మంది మహిళా సభ్యులలో ఒకరైన దుర్గాబాయి దేశ్‌ముఖ్ చెప్పిన మాటలను జస్టిస్ సూర్యకాంత్ గుర్తుచేశారు. స్వతంత్రంగా ఉన్నట్లు న్యాయ వ్యవస్థ భావించాలని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థ ఇతరుల ఒత్తిళ్లు, ప్రలోభాకలు లొంగకుండా స్వతంత్రంగా పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని తేల్చిచెప్పారు. కాలం మారుతున్నప్పటికీ న్యాయ వ్యవస్థ ప్రజల విశ్వాసం కోల్పోవద్దని పేర్కొన్నారు.

వలస బోధనల వల్లే గాంధీజీ అలా చెప్పారు

భారతీయుల్లో ఐక్యత లోపించిందనడంపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్య

నాగ్‌పూర్: బ్రిటిష్ పాలనకు ముందు భారతీయుల్లో ఐక్యత లోపించిందంటూ మహాత్మా గాంధీ చేసిన పరిశీలన వెనుక వలస బోధనల ప్రభావం ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. 'బ్రిటిషర్లు ఇక్కడికి రావడానికి ముందు భారతీయులు ఐక్యంగా లేరంటూ గాంధీజీ 'హింద్ స్వరాజ్'పుస్తకంలో రాశారు. అయితే, అది తప్పు. బ్రిటిషర్ల విద్యాబోధనల వల్లే ఆయన అలా భావించి ఉంటారు'అని భాగవత్ అన్నారు. శనివారం నాగ్‌పూర్‌లో జాతీయ పుస్తక ప్రదర్శన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భాగవత్ మాట్లాడారు. 1908లో గాంధీజీ హిందీలో రాసిన ఈ పుస్తకం 1909లో ఇంగ్లిష్‌లోకి తర్జుమా అయింది. ఒక పాఠకుడు, వార్తా పత్రిక ఎడిటర్ మధ్య జరిగే సంభాషణ మాదిరిగా ఆ పుస్తకం ఉంటుంది. 'భారత్‌లో 'రాష్ట్ర' భావన పురాతనమైనది. స్వచ్ఛమైనది. విదేశీయుల పాలనలో ఉన్నప్పుడు కూడా ఇది ఉంది. పాశ్చాత్య దేశాల జాతి అనే ఆలోచనకు పూర్తిగా విరుద్ధమైనది. భారతీయులు ఎవరితోనూ వాదనలకు దిగరు. వివాదాలకు దూరంగా ఉంటారు. వివాదం మన స్వభావంలోనే లేదు. సోదరభావాన్ని పెంపొందించడం మన సంప్రదాయం'అని స్పష్టం చేశారు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో సంఘర్షణతో కూడిన పరిస్థితుల్లో అభివృద్ధి చెందాయన్నారు. ఇతర దేశాల్లో మితిమీరిన జాతీయతా భావం వల్లే రెండు ప్రపంచ యుద్ధాలు సంభవించాయన్నారు. అందుకే జాతీయతావాదంతో కొందరు భయపడే పరిస్థితి ఏర్పడింది. 'భారతీయుల దృష్టిలో జాతీయతా భావం పాశ్చాత్యదేశాల్లో మాదిరిగా అహంకారం ఫలితంగా వచ్చింది కాదు, ఇది ప్రజల మధ్య ఉన్న లోతైన అంతర్గత అనుబంధం వల్ల, ప్రకృతితో సహజీవనం వల్ల ఉద్భవించింది'అని మోహన్ భాగవత్ వివరించారు. 'మనందరం భరతమాత బిడ్డలం, సోదరులం. ఇందులో మతం, ప్రాంతం, భాష, సంప్రదాయం, అలవాట్లకు స్థానం లేదు. భిన్నత్వంలోనూ ఐక్యంగా ఉంటూ మన మాతృభూమి సంస్కృతిని చాటుతున్నాం'అని ఆయన వివరించారు.

గాజాలో మరణాలు.. 70 వేలు పైనే..!

డెయిర్ అల్-బలాహ్: ఇజ్రాయెల్- హమాస్ మధ్య జరుగుతున్న పోరు కారణంగా గాజాలో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య 70 వేలు మించిపోయిందని శనివారం గాజా ఆరోగ్య విభాగం తెలిపింది. అక్టోబర్ 10వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత సైతం మరణాలు నమోదైనట్లు వెల్లడించింది. ఒప్పందం ఉల్లంఘన ఫలితంగా జరిగిన కాల్పుల్లో కొందరు చనిపోగా, శిథిలాల నుంచి బయటపడిన కొన్ని మృతదేహాలు ఉన్నాయంది. మొత్తం మరణాలు ఇప్పుడు 70,100కు చేరుకున్నాయంది. 2023 అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాలపై హమాస్ సారథ్యంలో ఇస్లామిక్ గ్రూపులు మెరుపుదాడులు జరిపినప్పటి నుంచి పోరు తీవ్రమైన విషయం తెల్సిందే.

ఇమ్రాన్ సజీవంగా ఉన్నట్లు సాక్ష్యం చూపండి

పాక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ ప్రధాని కుమారుడు

లాహోర్: పాకిస్తాన్ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్ ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్(73) అడియాలా జైలులో సజీవంగానే ఉన్నట్లు చెబుతున్న ప్రభుత్వం, అందుకు తగిన సాక్ష్యాలను చూపాలని ఆయన కుమారుడు కాసిమ్ ఖాన్ డిమాండ్ చేశారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇమ్రాన్ రెండేళ్లుగా జైలులోనే ఉన్నారు. దాదాపు నెల రోజులుగా ఆయన్ను కలుసుకునేందుకు కుటుంబసభ్యులు, పార్టీ నేతలతోపాటు లాయర్లకు సైతం జైలు అధికారులు అనుమతివ్వడం లేదు. దీంతో, ఇమ్రాన్ ఖాన్ చనిపోయినట్లుగా జరుగుతున్న ప్రచారం నేపథ్యంలో శనివారం కాసిమ్ ఖాన్ ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మా తండ్రిని 845 రోజులుగా జైలులో ఉంచారు. ఆరు వారాలుగా ఆయనతో ఎవరినీ కలవనివ్వకుండా ఒంటరిగా ఉంచారు. ఆయన ఆరోగ్యం గురించి తెలియనివ్వడం లేదు. కోర్టు ఉత్తర్వులున్నా, ఆయన సోదరీమణులను లోపలికి వెళ్లనివ్వడం లేదు. కనీసం ఫోన్ కాల్‌కూ అవకాశమివ్వడం లేదు. దీంతో, ఆయన పరిస్థితిపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇమ్రాన్ సజీవంగా ఉన్నట్లు చెబుతున్న ప్రభుత్వం అందుకు తగిన సాక్ష్యాలను చూపాలి'అని అందులో పేర్కొన్నారు. 'ఆయన భద్రత బాధ్యత పూర్తిగా పాక్ ప్రభుత్వంలోని పెద్దలదే. చట్టపరంగా, నైతికంగా, అంతర్జాతీయంగా కూడా వారే బాధ్యత వహించాలి'అని స్పష్టం చేశారు. ఇమ్రాన్ బరువు బాగా తగ్గిపోయారు. దృష్టి సమస్యలు, విషప్రయోగం జరిగే అవకాశం ఉందంటూ వస్తున్న వార్తలను కాసిమ్ ఖాన్ ప్రస్తావించారు. ఇమ్రాన్ ముగ్గురు సోదరీమణులు, పీటీఐ కార్యకర్తలు ఖైబర్ ప్రావిన్స్ సీఎం సొహైల్ అఫ్రిది సహా అడియాలా జైలు వెలుపలే కొద్ది రోజులుగా మకాం వేశారు. ఇమ్రాన్‌ను కలుసుకునేందుకు కుటుంబసభ్యులకు అనుమతివ్వాలని పీఎం షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఖాన్ సోదరి అలీమా ఖాన్ అడియాలా జైలు సూపరింటెండెంట్‌పై ఇస్లామాబాద్ హైకోర్టులో ధిక్కార పిటిషన్ వేశారు.

శబరిమల యాత్రలో

ఆ రెండుచోట్ల గుండెపోటు ముప్పు!

శబరిమల యాత్రికులకు రెండుచోట్ల గుండెపోటు ముప్పు పొంచి ఉంది! సముద్రమట్టానికి ఎత్తయిన ప్రాంతంలోకి వెళ్తుండడం.. ఉపవాసాలు, డీహైడ్రేషన్, ఆక్సిజన్ లభ్యత తక్కువగా ఉండడం వంటి కారణాలతో ఈ పరిస్థితులు నెలకొంటున్నాయి. స్వయానా కేరళ వైద్య ఆరోగ్య శాఖ చెబుతున్న విషయమిది. పంపా బేస్ నుంచి శబరిమలకు వెళ్లే చిన్నపాదం మార్గంలో అత్యంత కఠినమైనదిగా పిలిచే నీలిమలతోపాటు.. కొండ శిఖరాగ్రంలో ఉండే అప్పాచిమేడు వద్ద భక్తులకు గుండెపోట్లు ఎక్కువగా సంభవిస్తున్నట్లు ఆరోగ్యశాఖ జారీ చేసిన హెచ్చరికల్లో స్పష్టమవుతోంది.

ఏటా నమోదవుతున్న మరణాలు

- నీలిమల అధిరోహణ సమయంలో జరభద్రం
- అప్పాచిమేడులోనూ అప్రమత్తత అవసరం
- దీర్ఘకాలిక వ్యాధులుంటే.. నడకలో వేగం వద్దు
- డీహైడ్రేషన్, ఖాళీ కడుపుతో కొండెక్కడం పెను ప్రమాదం
- ఏటా 20 నుంచి 40 గుండెపోటు మరణాల నమోదు

ప్రతిఏటా పెరుగుతున్న మరణాల సంఖ్య

ప్రతిఏటా నీలిమల, అప్పాచిమేడు ప్రాంతాల్లో గుండెపోటుతో భక్తులు కుప్పకూలిపోతున్న ఉదంతాలు.. మరణాలు నమోదవుతున్నట్లు ట్రావెన్‌కోర్ దేవోస్వం బోర్డు(టీడీబీ), కేరళ వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు క్రైం డేటా రికార్డ్ బ్యూరో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గడిచిన ఏడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. 2017-18 సీజన్‌లో 281 మంది గుండెపోటు బారినపడగా, వారిలో 36 మంది మృతి చెందారు. 2018-19లో 173 గుండెపోటు కేసులు నమోదుకాగా, 24 మంది మరణించారు, 2019-20లో 19, 2022-23లో 24, 2023-24లో మరో 24, 2024-25లో 40 గుండెపోటు మరణాలు నమోదయ్యాయి. 2025-26 సీజన్ ప్రస్తుతం కొనసాగుతుండగా.. ఇప్పటివరకు ఓ మహిళ గుండెపోటు కారణంగా మృతిచెందినట్లు పోలీసు రికార్డులు చెబుతుండగా, 8 మరణాలు నమోదైనట్లు నాలుగు రోజుల క్రితం ఓ జాతీయ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. 2020-22లో మాత్రం కొవిడ్ ఆంక్షల కారణంగా పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించారు. ఆ సీజన్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు.

పత్తనంతిట్ట వద్ద కన్పించిన భక్తుల రద్దీ

అక్కడే ఎందుకు?

సముద్ర మట్టానికి ఎత్తులో ఉండడం, ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉండడం వంటి కారణాలతో నీలిమల, అప్పాచిమేడు ప్రాంతాల్లో గుండెపోట్లు అధికంగా సంభవిస్తున్నాయి. నీలిమల కొండ నిటారుగా, చాలా ఎత్తుగా ఉంటుంది. శబరియాత్రలో పెద్దపాదంలో ముక్కు కొండగా పిలిచే కరిమల కొండ తర్వాత.. చిన్నపాదంలో దాదాపు అదే స్థాయిలోనే నీలిమల ఉంటుంది. నీలిమలను అధిరోహించేందుకు ట్రావెన్‌కోర్ దేవోస్వం బోర్డు ఏర్పాటు చేసిన మెట్లు ఉన్నప్పటికీ భక్తులు ఈ ఒక్క కొండను అధిరోహిస్తే ఇబ్బందులు దూరమవుతాయనే ఉద్దేశంతో నడకలో వేగాన్ని పెంచుతారు. లేదంటే.. ముందు నడిచివెళ్లే తమ బృందంలోని సభ్యులను అందుకోవాలనే ఉద్దేశంతో వడివడిగా నడుస్తారు. దాంతో హార్ట్ బీట్‌లో మార్పులు చోటుచేసుకుంటాయి. సముద్ర మట్టానికి ఎత్తుగా ఉండడంతో ఆక్సిజన్ తగ్గుతుంది. డిమాండ్ పెరగడం.. అందుకు అనుగుణంగా ప్రాణవాయువు అందకపోవడంతో శరీరంలోని ఆక్సిజన్ స్థాయిలు క్రమంగా పడిపోతాయి. హార్ట్‌బీట్‌లో హెచ్చుతగ్గులకు తోడు.. ఆక్సిజన్ స్థాయిలు తగ్గడంతో గుండెకు రక్త సరఫరా నెమ్మదిస్తుంది. ఈ కారణంగా గుండెపోటు వచ్చే ప్రమాదాలుంటాయని వైద్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి రుగ్మతలు, కొలెస్ట్రాల్, ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి నీలిమల అధిరోహించేప్పుడు వేగాన్ని పెంచడం ప్రమాదకరమని చెబుతున్నారు. ఇక అప్పాచిమేడు ప్రాంతంలో కొండ ఎత్తుగా లేకున్నా.. అది శిఖరాగ్రం కావడంతో ఆక్సిజన్ స్థాయిలు పడిపోతాయని వివరిస్తున్నారు. అందుకే కేరళ వైద్య ఆరోగ్య శాఖ ఈ ప్రాంతాల్లో ఆక్సిజన్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ మరణాలు ప్రతిఏటా పెరుగుతూనే ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రధాన కారణాలివే..

- దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారిలో గుండెపోటు సమస్యలను పక్కనపెడితే.. ఆరోగ్యకరంగా ఉన్నవారు కూడా బాధితులుగా మారుతున్నట్లు కేరళ వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. దీనికి కూడా కారణాలున్నాయని వైద్య నిపుణులు అంటున్నారు.
- శబరియాత్ర కోసం భక్తులు రేయింబవళ్లు ప్రయాణంలోనే ఉంటారు. కొన్ని సందర్భాల్లో రాత్రంతా ప్రయాణాలు చేస్తుంటారు. భోజనం కూడా సమయానికి తీసుకోరు. సామూహికంగా వంట చేసుకున్నప్పుడో.. శాకాహార హోటళ్లు అందుబాటులో ఉన్నప్పుడో ఆహారం తీసుకుంటారు. కంటినిండా నిద్ర, కడుపునిండా భోజనం లేకపోవడంతో శరీరం అలసిపోతుందని నిపుణులు చెబుతున్నారు.
- ఇలాంటి వారిలో డీహైడ్రేషన్ పెరుగుతుంది. గ్లూకోజ్ స్థాయిలు, ఎలక్ట్రోలైట్లు తగ్గిపోతాయి. ఫలితంగా గుండెపై ఒత్తిడి పెరుగుతుంది.
- ఈ పరిస్థితుల్లో ఆక్సిజన్ లభ్యత తగ్గితే.. గుండెపోట్లు వచ్చే ప్రమాదం ఉందంటున్నారు.
- చాలామంది భక్తులు పంపా బేస్‌లోని హోటళ్లలో భోజనం చేయగానే.. కొండను అధిరోహించడం చేస్తుంటారని, ఇది కూడా ప్రమాదకరమని నిపుణులు వివరిస్తున్నారు. భోజనం తర్వాత రక్తప్రసరణ ఎక్కువగా జీర్ణాశయం వైపు వెళ్తుందని, ఫలితంగా గుండెపై రెట్టింపు ఒత్తిడి ఉంటుందని పేర్కొంటున్నారు. కడుపు నిండుగా ఉన్నప్పుడు గుండెపోటు సంభవిస్తే.. రిస్క్ ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.
- ఆక్సిజన్ లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లో ట్రెకింగ్ చేసేప్పుడు డీహైడ్రేషన్ సంభవించడం చాలా ప్రమాదకరమని పేర్కొంటున్నారు.

\- సాక్షి డిజిటల్ డెస్క్

వికలాంగుల సంక్షేమం.. రాజ్యాంగ రక్షణలు!!

సమాజంలోని వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం భారత రాజ్యాంగంలో ఎన్నో అధికరణలు పొందుపరిచారు. కానీ వికలాంగుల హక్కుల కోసం నేరుగా ఎలాంటి సూచనలు చేయలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం జాతి, మతం, కులం, లింగ, ప్రాంత వివక్షతలను నిషేధించినప్పటికీ.. వ్యక్తుల శారీరక వైకల్యం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. అయితే రాజ్యాంగాన్ని రూపొందించే సమయంలో అంగ వైకల్య అంశాలను హక్కుల కోణంలో కాకుండా.. సంక్షేమం, సహాయం అందించే కోణంలో పరిశీలించారని భావించడం సమంజసం అంటున్నారు నిపుణులు. డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల సంక్షేమ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ నేపథ్యంలో వికలాంగులకు సంక్షేమ పథకాలు, రాజ్యాంగ రక్షణలపై ప్రత్యేక కథనం...

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ఆర్టికల్ 41 ప్రకారం- నిరుద్యోగం, వృద్ధాప్యం, అనారోగ్యం, అంగవైకల్యం, ఇతర అవాంఛనీయ సమస్యలు ఎదుర్కొంటున్న వారి సంక్షేమం కోసం నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాలని ఆదేశిక సూత్రాల్లో పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా కార్మిక చట్టాలు రూపొందాయి. ఉదాహరణకు కార్మిక రాజ్య బీమా చట్టం ప్రకారం.. పని ప్రదేశాల్లో ప్రమాదాలకు గురైనప్పుడు నష్ట పరిహారం చెల్లించాలి, వైద్య సహాయం అందించాలి. కార్మికుల కోసం ఇలాంటి సాంఘిక భద్రత చట్టాలను చేశారు. నిరుద్యోగులకు, ఉపాధిపరమైన అవకాశాలను అందుకోలేని వారికి సహాయం అందించేందుకు ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టింది. సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ విద్య, శిక్షణ, సదుపాయాల కల్పన పరంగా పలు పథకాలు అమలు చేస్తోంది.

పీడబ్ల్యూడీ చట్టం -1995

భారతదేశంలో వికలాంగుల సంక్షేమం కోసం మొదటిసారిగా పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ (సమాన అవకాశాలు, హక్కుల రక్షణ, సంపూర్ణ ప్రమేయం) చట్టం - 1995 తీసుకొచ్చారు. వికలాంగుల హక్కుల గుర్తింపు దిశగా దీన్ని ఓ మైలురాయిగా చెప్పొచ్చు. విద్య, ఉద్యోగం, బహిరంగ ప్రదేశాల్లో ప్రవేశించడం లాంటి సదుపాయాలను వికలాంగులకు కల్పించిన మొట్టమొదటి సమగ్ర చట్టంగా పీడబ్ల్యూడీ చట్టం - 1995 గుర్తింపు పొందింది. ఈ చట్టంలోని సెక్షన్ 33 ప్రకారం అంగ వైకల్యం ఉన్న వారు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పొందే హక్కును కలిగి ఉంటారు. సెక్షన్ 47 ప్రకారం వైకల్యానికి గురైన తర్వాత కూడా ఉద్యోగంలో కొనసాగవచ్చు. ఈ చట్టం అమల్లోకి రాక ముందు వికలాంగులకు కేవలం సదుపాయాల కల్పన లాంటి పరిమిత, నిరోధిత హక్కులు మాత్రమే ఉండేవి. పర్సన్స్ విత్ డిజేబిలిటీస్ యాక్ట్ -1995 ఈ పరిస్థితిని పూర్తిగా మార్చేసింది. అందులో భాగంగా సెక్షన్ 47 ప్రకారం- సర్వీస్‌లో ఉన్నప్పుడు వైకల్యానికి గురైన అభ్యర్థులను విధుల నుంచి తొలగించకుండా, వారి కేడర్ స్థాయిని తగ్గించకుండా కొనసాగించాలనే నిబంధనలను పొందుపర్చారు. ఒకవేళ వైకల్యం పొందిన అభ్యర్థి అప్పటి వరకు నిర్వహిస్తున్న బాధ్యతలు కొనసాగించలేని పరిస్థితిలో ఉంటే అదే వేతనం, అలవెన్సులతో వేరే ఉద్యోగానికి మార్చాలని చట్టంలో పేర్కొన్నారు. అలాంటి అవకాశం కూడా పొందలేని విధంగా వైకల్యం సంభవిస్తే.. సదరు వ్యక్తికి సరిపడే ఉద్యోగంలో ఖాళీ ఏర్పడే వరకు లేదా పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు అదనపు ఉద్యోగిగా ఉంచి అదే వేతన, సౌకర్యాలు కల్పించాలని చట్టంలో పొందుపర్చారు. వికలాంగులకు ఉపాధి కల్పించే దిశగా ప్రైవేట్ రంగంలోని యాజమాన్యాలకు ప్రోత్సాహకాలు అందించడం; విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర సచివాలయాలు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో వికలాంగులు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు లేకుండా నేరుగా ప్రవేశించేందుకు అనువుగా సౌకర్యాలు కల్పించడం కోసం నిధులు సమకూర్చడం లాంటి మరికొన్ని చర్యలను సామాజిక న్యాయం, సాధికారిక మంత్రిత్వ శాఖ మంత్రిత్వశాఖ చేపడుతోంది.

పీడబ్ల్యూడీ నిర్వచనం ఇలా

పీడబ్ల్యూడీ చట్టంలో 'పర్సన్స్ విత్ డిజేబిలిటీస్' అనే పదానికి సమగ్ర నిర్వచనం ఇచ్చారు. మెడికల్ అథారిటీ సర్టిఫికేషన్ ప్రకారం- ఏదైనా వైకల్యం 40 శాతం కంటే తక్కువ లేకుండా ఉంటే వికలాంగులుగా పరిగణించాలని చట్టంలోని సెక్షన్ 2(టి) పేర్కొంది. అంధత్వం, అల్పదృష్టి, కుష్టు బారిన పడి స్వస్థత పొందిన వారు (leprosy-cured), బధిరత్వం, చాలన వైకల్యం (locomotor disability), మానసిక వైకల్యం (mental retardation), మానసిక రుగ్మత (mental illness) మొదలైనవి అంగవైకల్యం కిందకు వస్తాయి. ఈ చట్టం అమల్లోకి రాకముందు సుప్రీం కోర్టు కూడా వైకల్యం ఉన్న వారి హక్కులను అర్థం చేసుకోవడంలో సవాళ్లు ఎదుర్కొంది. వికలాంగులను ఉద్యోగ అవకాశాలకు పరిగణించడం ద్వారా సమాన్వతపు హక్కు వారికి కూడా కల్పించినట్లయింది. వికలాంగుల ప్రాతినిధ్యం తక్కువగా ఉండే పబ్లిక్ సర్వీసుల్లో వారి ప్రాతినిధ్యం పెరిగేలా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారు. వాస్తవానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(4) ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో సరైన ప్రాతినిధ్యం పొందని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే వీలుంది. ఇది వికలాంగులకు కూడా వర్తిస్తుంది. భారత ప్రభుత్వం 1985లో అంగ వైకల్యం ఉన్న అభ్యర్థుల కోసం ఉద్యోగాలను గుర్తించాలని నిర్ణయించింది. ఈ బాధ్యతను స్టాండింగ్ కమిటీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వికలాంగులకు సరిపడే ఉద్యోగాలను గుర్తించేందుకు ఏర్పాటైన స్టాండింగ్ కమిటీ ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో గ్రూపు ఎ,బి కేటగిరీల్లో 416 కేటగిరీల ఉద్యోగాలను గుర్తించింది. ఆయా ఉద్యోగం పనితీరు (జాబ్ డిస్క్రిప్షన్), దానికి కావలసిన శారీరక నియమ నిబంధనలు ఖరారు చేసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల కోసం పలు సంక్షేమ చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా అర్హులైన వికలాంగులకు ఆసరా పింఛను పథకం కింద నెలకు రూ.1500 జీవనభృతిని అందిస్తోంది.

యూఎన్‌సీఆర్‌పీడీ విస్తృత భావన

ఐక్య రాజ్య సమితి నేతృత్వంలో యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్(యూఎన్‌సీఆర్‌పీడీ) ఏర్పాటైంది. అంగ వైకల్యాన్ని పరిమిత నిర్వచనం నుంచి విస్తృత భావనగా మార్చడంలో మరో ముఖ్యమైన మైలురాయి. యూఎన్‌సీఆర్‌పీడీను భారతదేశం 2007లో ఆమోదించింది. ఈ కన్వెన్షన్‌తో అంగవైకల్యం లేదా వికలాంగులు అనే పదాల భావనలే పూర్తిగా మారిపోయాయి. దీని ప్రకారం - అంగ వైకల్యం అంటే కేవలం వైద్యపరమైన కోణంలోనే చూడటం అనే ధోరణి మారింది. అంటే.. నడవడం, మాట్లాడటం, వినడం, చూడటం లాంటివి చేయలేనివారు మాత్రమే వికలాంగులు కాదు. యూఎన్‌సీఆర్‌పీడీలోని ఆర్టికల్ 1 ప్రకారం- దీర్ఘకాలిక శారీరక వైకల్యం, మానసిక వైకల్యం, మేధోపరమైన వైకల్యం, బుద్ధిమాంద్యం తదితర సమస్యలతో బాధపడుతూ, సామాజికంగా అన్ని కార్యకలాపాల్లో పాలుపంచుకోలేని వారిని కూడా వైకల్యం ఉన్నవారిగా గుర్తించారు. ఈ విధంగా అంగ వైకల్యం భావన పరిధిని విస్తరించారు. విశాల దృక్పథం, సమ్మిళిత ఆలోచనలతో అంగ వైకల్యం నిర్వచనాన్ని మార్పు చేశారు. అంగ వైకల్యం అంటే కేవలం శారీరక వైకల్యమే కాదు ఇతర వైకల్యాలను కూడా పరిగణించాలనే భావనతో డిజేబిలిటీ అనే పదాన్ని విస్తృతం చేశారు. సామాజిక దృక్పథంలో.. వైకల్యం ఉన్న వారి విషయంలో న్యాయపరమైన విధానాలను, సామాజిక వ్యవస్థను సమూలంగా మార్పు చేయాలని యూఎన్‌సీఆర్‌పీడీ సూచించింది. యూఎన్‌సీఆర్‌పీడీ ఆర్టికల్ 23.. వైకల్యంతో బాధపడుతున్న వ్యక్తులకు కుటుంబంతో కలిసి జీవించే హక్కు, సమాజంలో అందరితో కలిసి జీవించే హక్కులను, తనకు సంబంధించిన నిర్ణయాలను స్వయంగా తీసుకునే హక్కులను ఉద్ఘాటించింది. ముఖ్యంగా బుద్ధి మాంద్యం లాంటి మానసిక సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులకు సంబంధించి న్యాయపరమైన సామర్థ్యాలు, హక్కుల గురించి ప్రస్తావించింది. దీనికి సంబంధించి ప్రత్యేక విధానాన్ని కూడా రూపొందించింది. వాస్తవానికి అప్పటి వరకు బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న వారిని నిర్ణయాలు తీసుకోలేని వారిగా పరిగణించేవారు. ఈ క్రమంలో వారి అనుమతి లేకుండానే మానసిక చికిత్స కేంద్రాల్లో చేర్పించడం, ఆ కేంద్రాల్లో అమానవీయ, అత్యంత హానికరమైన చికిత్సలను చేయించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో యూఎన్‌సీఆర్‌పీడీ వికలాంగులకు మరో ముఖ్యమైన హక్కును కల్పించింది. దీని ప్రకారం ఒప్పందాలు చేసుకోవడం, వివాహం, ఆస్తుల వ్యవహారాలకు సంబంధించి నిర్ణయం తీసుకునే హక్కులు వారికి లభించాయి. యూఎన్‌సీఆర్‌పీడీలోని ఆర్టికల్ 3, 6లలో వికలాంగ మహిళల హక్కులను పొందుపర్చారు. దీని ప్రకారం అప్పటి వరకు వికలాంగ మహిళలు తమ కుటుంబంలో, సమాజంలో ఎదుర్కొంటున్న పలు వివక్షలను గుర్తించి వాటి నుంచి విముక్తి పొందే హక్కు కలిగింది. యూఎన్‌సీఆర్‌పీడీ విస్తృత భావన నేపథ్యంలో.. దేశంలో ఇప్పటికే ఉన్న పీడబ్ల్యూడీ చట్టాన్ని మార్చాల్సిన అవసరం ఏర్పడింది. వాస్తవానికి పీడబ్ల్యూడీ చట్టం అనేక వైకల్యాలను విస్మరించింది. వైకల్యం ఉన్న వ్యక్తులు తమకున్న సామర్థ్యాలకు అనుగుణంగా పనిచేయగల అవకాశాలు, వసతులు కల్పించే విధానాలు ఈ చట్టంలో లేవు. ముఖ్యంగా అవివక్ష అనే నిబంధన లేదు. ఇలా కొన్ని అసంపూర్ణ విధానాలతో ఉన్న పీడబ్ల్యూడీ చట్టాన్ని యూఎన్‌సీఆర్‌పీడీకి అనుగుణంగా మార్చాలని, నిబంధనల్లో మార్పులు చేయాలని లేదంటే కొత్త చట్టాన్ని సైతం రూపొందించాలని డిమాండ్లు, అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మారిన దృక్పథం

యూఎన్‌సీఆర్‌పీడీ విస్తృత నిర్వచనం నేపథ్యంలో.. అంగవైకల్యం ఉన్న వ్యక్తుల సంక్షేమం కోసం కొత్త బిల్లు రూపొందించేందుకు 2011 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ కొత్త బిల్లులో అంగవైకల్యం ఉన్న వ్యక్తులకు కల్పించే హక్కులను కేవలం వైద్య సంబంధంగానే చూడకుండా సామాజిక దృక్పథంతో చూసేలా చర్యలు తీసుకుంటున్నారు. తద్వారా వారు సమాజంలో ఎదుర్కొంటున్న వివక్షకు పరిష్కారం చూపేలా కృషి చేస్తున్నారు. వైకల్యాన్ని వైద్యపరమైన కోణంలో చూస్తూ వైద్య సహకారం అవసరమని భావించే దృక్పథం నుంచి.. కొత్తగా సామాజిక కోణాన్ని కూడా స్పృశించడం వికలాంగులకు ఎదురవుతున్న వివక్షను దూరం చేస్తుందని భావించొచ్చు. యూఎన్‌సీఆర్‌పీడీ ఫలితంగా అంగవైకల్యం అనే భావన విషయంలో ఉన్న మార్పు వచ్చింది. వారిని కూడా ఇతరుల మాదిరిగానే చూడటం మొదలైంది. వారి సామర్థ్యాల మేరకు అవకాశాలు కల్పించే విధానం ఆరంభమైంది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పలు పథకాల్లో సైతం ఇది ప్రతిబింబిస్తోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అంగవైకల్యం ఉన్న వారికి కూడా వర్తింపజేయడాన్ని దీనికి ఉదాహరణగా పేర్కొనవచ్చు. న్యాయస్థానాలు కూడా వికలాంగుల హక్కులను పరిరక్షించే విషయంలో యూఎన్‌సీఆర్‌పీడీ భావనలనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఇలా వివిధ రకాల చర్యల ఫలితంగా ఇప్పుడు అంగవైకల్యం ఉన్న వ్యక్తుల హక్కుల పరిధి విస్తృతమైంది!!

గుర్తుంచుకోండి..

- విద్య, ఉద్యోగాలు, సామాజిక, రాజకీయ రంగాల్లో వికలాంగులకు ఎదురవుతున్న వివక్షతను నివారించే లక్ష్యంతో 1992 నుంచి ఏటా డిసెంబర్ 3న అంతర్జాతీయ వికలాంగుల సంక్షేమం దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.
- భారతదేశంలో 2001 నుంచి 2011 మధ్య కాలంలో వికలాంగుల సంఖ్య 22.4 శాతం పెరిగింది.
- 2001లో భారత్‌లో వికలాంగులు 2.19 కోట్లు ఉంటే.. 2011లో ఆ సంఖ్య 2.68 కోట్లకు పెరిగింది. వీరిలో 1.5 కోట్ల మంది పురుషులు కాగా, 1.18 కోట్ల మంది మహిళలు ఉన్నారు.
- పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే ఎక్కువ మంది వికలాంగులు ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 69.4 శాతం మంది వికలాంగులు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 30.6 శాతం మంది ఉన్నారు.
- అంగవికలుర పెరుగుదల రేటు మాత్రం గ్రామాల్లో కంటే పట్టణాల్లో అధికంగా ఉంది.
- 2011 జనాభా లెక్కల ప్రకారం- మొత్తం వికలాంగుల్లో.. 20.3 శాతం మంది చాలన వైకల్యం(మూమెంట్ డెజబిలిటీ)తో, 18.9 శాతం మంది వినికిడి సమస్య(హియరింగ్ ఇంపేయిర్డ్)తో, 18.8 శాతం మంది దృష్టి సమస్య(విజువల్లీ ఇంపేయిర్డ్)తో, 5.6 శాతం మంది బుద్ధిమాంద్యం(మెంటల్లీ చాలెంజ్డ్)తో బాధపడుతున్నారు.
- గతంలో పోలియో కారణంగా ఎక్కువ మంది చాలన వైకల్యం బారిన పడితే.. 2001-2011 మధ్య కాలంలో రోడ్డు, పారిశ్రామిక ప్రమాదాలతో ఎక్కువ మంది చాలన వైకల్యానికి గురవడం గమనార్హం.

ప్రయోగశాల నిర్మాణానికి అనువైన ప్రదేశం?

మెథడాలజీ

- జీవశాస్త్ర బోధన లక్ష్యాలంటే విషయ పరిజ్ఞానం మాత్రమే కాదు. విద్యార్థుల్లో సామర్థ్యాలు, నైపుణ్యాలు, అభిరుచులు పెంపొందించడంతోపాటు సమస్యా పరిష్కారం, ప్రయోగాత్మక వివరణ మొదలైనవి కూడా లక్ష్యాలే. ఇవన్నీ ప్రయోగశాలలోనే సాధ్యమవుతాయి.
- ప్రయోగాలు చేయడం ద్వారా నేర్చుకోవడం సాధ్యమవుతుంది. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రయోగశాలలో ధ్రువీకరించుకోవచ్చు.
- **ఆవశ్యకత:** పరిశీలించేందుకు, పరీక్షించడానికి, మూఢ నమ్మకాలు తొలగించుకొని శాస్త్రీయ దృక్పథం ఏర్పర్చుకోవడం.
- పరిశీలించిన, పరీక్షించిన అంశాలు జీవితాంతం గుర్తుంచుకోవడం.
- అభిరుచులు, ఆసక్తి, కుతూహలం, ఆలోచన పెంపొందించుకోవడం.
- శాస్త్రీయ పద్ధతిలో శిక్షణ.
- ప్రయోగాల్లో ఇబ్బందులు ఎదుర్కోవడం వల్ల నిజ జీవితంలో సమస్యా పరిష్కారం కోసం.
- సహకారం, ఓర్పు, క్రమశిక్షణ, ఆత్మస్థైర్యం, నిర్భయత, నిష్పాక్షికత, వైఖరులు వంటి భావావేశ రంగ లక్ష్యాల సాధన.
- నైపుణ్యాల అభివృద్ధి.
- పరిశీలన అలవాట్ల అభివృద్ధి
- కష్టపడి పనిచేసే తత్వం, పనిపట్ల గౌరవం ఏర్పడటం
- సృజనాత్మకత పెరుగుదల.

ప్రయోగశాల: తరగతిలోని విద్యార్థులు వ్యక్తిగతంగా, సామూహికంగా ప్రయోగాలు చేయడానికి ఉపకరించే ప్రయోగ పరికరాలతో కూడిన పెద్ద గదిని ప్రయోగశాల అంటారు.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

ప్రయోగశాల రూపకల్పనలో పరిగణించే అంశాలు

- విద్యా జాతీయ లక్ష్యాలు - (దేశానికి ఉపయోగపడే ప్రయోగాలు చేయడం).
- పాఠ్యప్రణాళికా రకం
- ప్రయోగాలు చేసే విద్యార్థుల సంఖ్య
- ఒక్కొక్క విద్యార్థికి కనీస స్థలం
- తరగతి స్థాయి
- బోధన లక్ష్యాలు
- పొదుపును పాటించే విధం

ప్రయోగశాల రకాలు: నాలుగు రకాలైన ప్రయోగశాలలుంటాయి.

1. ఉపన్యాస గది - ప్రయోగశాల
2. సర్వప్రయోజన ప్రయోగశాల
3. ఉపన్యాస ప్రయోగశాల
4. సంచార ప్రయోగశాల

1. ఉపన్యాస గది - ప్రయోగశాల

- ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రయోగాలు చేయడానికి పొదుపుతో కూడిన ఈ ప్రయోగశాలను డా॥ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించారు.
- $45' \times 25'$ కొలతలు కలిగి సగం ప్రయోగశాల, సగం తరగతి గది వేరు చేసి ఉంటాయి. 40 మంది తరగతి బోధన వినడానికి, 20 మంది ప్రయోగాలు చేయడానికి సరిపోతుంది.
- గోడలకు వెల్ల వేయడం కంటే పెయింట్ వేసి ఉండాలి.
- ప్రయోగశాల ఫ్లోరింగ్ కొంచెం ఏటవాలుగా ఉండి మూలాలు వంపు తిరిగి ఉండాలి. (దుమ్ము, ధూళి, బూజు నివారించడానికి)
- ప్రయోగశాలకు 2 తలుపులుండాలి.
- $6' \times 4'$ కొలతలో కిటికీలు, తలుపులు బయటకు తెరుచుకునేటట్లు ఉండాలి. కిటికీలకు వైర్‌గేజ్, తెరలు అమర్చాలి.
- $10' \times 4'$ కొలతలతో నల్లబల్ల
- $6 \times 2.5' \times 2.5'$ కొలతలతో ప్రదర్శనా బల్ల (ఉపాధ్యాయుడు ప్రయోగం చేసి చూపించడానికి)
- $3\frac{1}{2}' \times 1\frac{1}{2}' \times 1'$ కొలతలతో విద్యార్థుల బల్ల (ఇది ఇద్దరు విద్యార్థులకు)
- ప్రయోగ బల్లలు 10 ఉండాలి.
- ప్రదర్శన బల్లకు సీసపు పూత పూసి ఉండాలి.
- గోడలకు సింక్‌లుండాలి. వేయి గ్యాలన్ల నీరు నిల్వ చేసే ట్యాంక్ ఉండాలి.
- $6' \times 3\frac{1}{2}' \times 2'$ కొలతలతో విద్యార్థుల ప్రయోగ బల్ల ఉండాలి.

2. సర్వప్రయోజన ప్రయోగశాల

- సామాన్య విజ్ఞాన శాస్త్ర లక్ష్యాలకు అనుగుణంగా అధ్యయనం, అభ్యాసం రెండూ జరిగే విధంగా ఉండే ప్రయోగశాల.
- ప్రత్యేక సబ్జెక్టుల బోధనకు ఇది ఉపయోగపడదు.
- $47' \times 25'$ కొలతలు కలిగి $7' \times 25'$ కొలతలతో సామాన్ల నిల్వ గది వేరు చేసి ఉండాలి.
- 42 మంది విద్యార్థులకు సరిపోతుంది.
- $6 \times 2 \times 2\frac{1}{2}$ విద్యార్థుల బల్ల $4' \times 1\frac{1}{2}' \times 3\frac{1}{2}'$ కొలతలతో ఉపాధ్యాయుని ప్రదర్శన బల్ల ఉంటాయి.
- గోడల మందం $1\frac{1}{2}$ అడుగులు ఉండి అల్మరాలు గోడలోనికి ఉంటాయి.
- సున్నితపు త్రాసు, ప్రమాదకర రసాయనాలు, అక్వేరియాలు 'రిసెస్‌షెల్ఫ్'లలో ఉంచుతారు.

3. ఉపన్యాస ప్రయోగశాల

- యునెస్కో ప్లానింగ్ కమిషన్ సూచనల మేరకు శాస్త్రీయ విద్యా ప్యానెల్ వారు మాధ్యమిక పాఠశాలల కోసం దీన్ని రూపొందించారు.
- ఉపన్యాసం, ప్రయోగం రెండూ ఒకే గదిలో జరుగుతాయి.
- ప్రయోగశాల.. పాఠశాలలో నేల అంతస్తులో ఉండాలి.
- ఒక మూలకు ఉండి ఉత్తర, దక్షిణాభిముఖంగా నిర్మితమై ఉండాలి. (గాలి, వెలుతురు వచ్చే విధంగా)
- జీవశాస్త్ర ప్రయోగశాల బడి తోటకి ఆనుకొని ఉండాలి.
- 825 చ.అ॥ ప్రయోగశాల 42 మంది విద్యార్థులకు సరిపోతుంది.
- 42 మంది కంటే ఎక్కువ ఉంటే 490 చ॥అ కొలతలతో ల్యాబ్ - బి నిర్మించాలి.
- ల్యాబ్ - 'ఎ'లో రసాయన శాస్త్ర ప్రయోగాలు, ల్యాబ్ - 'బి'లో భౌతిక శాస్త్ర, జీవశాస్త్ర ప్రయోగాలు జరగాలి.
- యునెస్కో సూచనల మేరకు నల్లబల్లకు ఆకుపచ్చ లేదా ముదురు గోధుమ రంగు వేయాలి.

4. సంచార ప్రయోగశాల

- NCERT సూచనలతో నిర్మితమైంది. ప్రయోగశాలలు లేని ఒకటి కంటే ఎక్కువ పాఠశాలలకు ఉపయోగపడే ప్రయోగశాల.
- ప్రయోగ పరికరాలతో కూడిన పెద్ద మోటారు వాహనం వివిధ పాఠశాలలకు వెళ్లి ప్రయోగాలు చూపించే వీలుంటుంది.
- ఇందులో ప్రయోగ నైపుణ్యం కలిగిన నిపుణులు ప్రయోగం చేసి చూపెడతారు.

గత డీఎస్సీలలో అడిగిన ప్రశ్నలు

1. డా॥ ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించిన ఉపన్యాస గది ప్రయోగశాల ప్లాన్ ప్రకారం డిమానిస్ట్రేషన్ టేబుల్‌తో కలిపి ప్రాక్టికల్ టేబుళ్ల సంఖ్య? (డీఎస్సీ-2012)
   1) 7 2) 4 3) 5 4) 6
2. 20 మంది విద్యార్థులకు అనువైన ప్రయోగశాల పరిమాణం? (డీఎస్సీ-2006)
   1) $35' \times 15'$ 2) $25' \times 10'$
   3) $20' \times 15'$ 4) $45' \times 25'$
3. జీవశాస్త్రానికి కుటీర పరిశ్రమలతో, సామాజిక, భౌతిక పర్యావరణంతో సహ సంబంధాన్ని కల్పించేది? (డీఎస్సీ-2006)
   1) ప్రయోగశాల సూచికలు
   2) బోధన సూచికలు
   3) జీవశాస్త్ర పాఠ్యపుస్తకం
   4) జీవశాస్త్ర ప్రయోగశాల
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమైక్య పాఠ్య ప్రణాళికను అనుసరించి జీవశాస్త్ర బోధనకు కావాల్సిన అక్వేరియాల సైజులు? (డీఎస్సీ-2004)
   1) $38'' \times 38'' \times 24''$, $44'' \times 32'' \times 20''$
   2) $8'' \times 8'' \times 2''$, $14'' \times 10'' \times 5''$
   3) $28'' \times 28'' \times 14''$, $34'' \times 22'' \times 10''$
   4) $18'' \times 18'' \times 12''$, $24'' \times 12'' \times 5''$
5. యునెస్కో ప్లానింగ్ కమిషన్ నిపుణుల నివేదికను దృష్టిలో ఉంచుకొని శాస్త్రీయ విద్యాప్యానెల్ 1964లో రూపొందించిన సూచనల ప్రకారం మాధ్యమిక పాఠశాలల్లోని ప్రయోగశాలలో ఉపాధ్యాయుడి బల్ల పరిమాణం ఎంత ఉండాలి?
   1) $6' \times 2' \times 2'$ 2) $8' \times 4' \times 4'$
   3) $8' \times 2.6' \times 2.9'$ 4) $6 \times 2.6 \times 2.9$

సమాధానాలు

1) 4; 2) 4; 3) 4; 4) 4; 5) 3.

మాదిరి ప్రశ్నలు

1. శాస్త్రం పట్ల నమ్మకం కలగడానికి విద్యార్థులకు ఎక్కువగా ఉపయోగపడేది?
   1) ఆధ్యాత్మిక ప్రసంగాలు వినడం
   2) గ్రంథాలయాలకు వెళ్లడం
   3) ప్రయోగాలు చేయడం
   4) విజ్ఞాన శాస్త్ర విషయాలు వల్లె వేయడం
2. ఆర్.హెచ్. వైట్‌హౌస్ సూచించిన ప్రయోగశాల రకం?
   1) ఉపన్యాస గది - ప్రయోగశాల
   2) సంచార ప్రయోగశాల
   3) జీవశాస్త్ర ప్రయోగశాల
   4) సర్వ ప్రయోజన ప్రయోగశాల
3. ఉపన్యాస గది - ప్రయోగశాల ఎంతమంది విద్యార్థుల ప్రయోగాచరణకు ఉపకరిస్తుంది?
   1) 40 2) 20 3) 30 4) 10
4. 2 నుంచి 3 శాతం చక్కెర ద్రావణంతో ఫార్మలిన్ కలిపి ప్రయోగశాలలో చల్లడం వల్ల వేటిని నివారించవచ్చు?
   1) దోమలు
   2) ఎలుకలు
   3) బొద్దింకలు
   4) ఈగలు
5. $47' \times 25'$ కొలతలు కలిగిన ప్రయోగశాల ఏ రకమైంది?
   1) సంచార ప్రయోగశాల
   2) ఉపన్యాస గది ప్రయోగశాల
   3) సర్వప్రయోజన ప్రయోగశాల
   4) ఉపన్యాస ప్రయోగశాల
6. ప్రయోగశాల నిర్మాణానికి అనువైన ప్రదేశం?
   1) భవనంపై అంతస్తు
   2) 2వ అంతస్తుపైన
   3) పాఠశాల మధ్య గదిలో
   4) నేల అంతస్తులో ఒక చివర
7. ప్రయోగశాలలో ప్రతి విద్యార్థికి ఉండాల్సిన సగటు స్థలం
   1) 100 చ.అ. 2) 15 చ.అ.
   3) 60 చ.అ. 4) 30 చ.అ.
8. ఉపన్యాస ప్రయోగశాలలో $7' \times 25'$ కొలతలతో ఉండే గది ప్రయోజనం?
   1) ఉపన్యాస గది
   2) ప్రయోగ నిర్వహణ
   3) నిల్వ సన్నాహక గది
   4) ఉపాధ్యాయుడి విశ్రాంతి కోసం
9. ప్రయోగశాల రూపకల్పనలో పరిగణనలోనికి తీసుకోని అంశం?
   1) పొదుపు 2) పాఠ్యప్రణాళిక
   3) ఉపాధ్యాయుని అభీష్టం
   4) తరగతి స్థాయి
10. కింది వాటిలో ప్రయోగశాల కొలతలకు సంబంధించి సరికాని జత?
    i) ఉపన్యాస ప్రయోగశాల - $47' \times 25'$
    ii) సర్వ ప్రయోజన ప్రయోగశాల - $45' \times 25'$
    iii) ఉపన్యాస గది - ప్రయోగశాల - 825 చ.అ.
    iv) సన్నాహక నిల్వ గది - $7' \times 25'$
    1) i, iii 2) i, ii
    3) ii, iii 4) iii, iv
11. కిందివాటిలో ఏ ప్రయోగశాలను యునెస్కో ప్లానింగ్ కమిషన్ సూచనల నుంచి రూపొందించారు?
    1) సంచార ప్రయోగశాల
    2) ఉపన్యాస - గది ప్రయోగశాల
    3) ఉపన్యాస ప్రయోగశాల
    4) సర్వప్రయోజన ప్రయోగశాల
12. సాధారణంగా ప్రయోగశాలలో ఉండే నల్లబల్ల పరిమాణం?
    1) $6' \times 4'$ 2) $10' \times 4'$
    3) $4' \times 8'$ 4) $8' \times 6'$
13. నల్లబల్లకు ముదురు ఆకుపచ్చ రంగు వేయాలనేది వీరి సూచన?
    1) UNICEF
    2) NCERT
    3) SCERT
    4) UNESCO
14. ప్రయోగశాల కిటికీలకు తెరలు బిగించాలి. ఎందుకంటే?
    1) కీటకాలు రాకుండా
    2) ఇతరులు ప్రయోగాలు చూడకుండా
    3) అవసరమైనప్పుడు చీకటి గది చేసేందుకు
    4) విద్యార్థుల్లో ఏకాగ్రత కోసం
15. ప్రమాదకర రసాయనాలు ఉంచడానికి కేటాయించిన ప్రదేశం?
    1) నీటి ట్యాంక్ 2) సన్నాహక గది
    3) రిసెస్ షెల్ఫ్
    4) ఉపాధ్యాయుడి ప్రదర్శన బల్ల

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4; 5) 3; 6) 4; 7) 4; 8) 3; 9) 3; 10) 2; 11) 3; 12) 2; 13) 4; 14) 3; 15) 3.

లిఫ్ట్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?

యాంత్రిక శాస్త్రం

- వస్తువుల స్థితిగతులను అధ్యయనం చేసే శాస్త్రాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు.
- ఈ శాస్త్రానికి పితామహుడు అరిస్టాటిల్.

రేఖీయ చలనం: ఒక వస్తువు సరళరేఖా మార్గంలో ప్రయాణిస్తే దాన్ని రేఖీయ చలనం అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో కదులుతున్న బస్సు, రైలు రేఖీయ చలనాన్ని కలిగి ఉంటాయి.

ప్రాథమిక అంశాలు

దూరం: గమనంలో ఉన్న వస్తువు ప్రయాణించిన మార్గాన్ని దూరం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్

స్థానభ్రంశం: ఒక వస్తువు స్థానం, తుదిస్థానాలను కలిపే సరళరేఖను స్థానభ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెంటీమీటర్, మీటర్

- దూరం అనేది అదిశరాశి. ఎందుకంటే దూరం అనే భౌతిక రాశికి కేవలం పరిమాణం మాత్రమే ఉంటుంది. దిశ ఉండదు.
- స్థానభ్రంశం అనేది సదిశరాశి. ఈ భౌతికరాశికి పరిమాణం, దిశ ఉంటాయి.

దూరం, స్థానభ్రంశాల మధ్య సంబంధాలు

- ఒక వస్తువు వృత్తాకార మార్గంలో ఒక భ్రమణం పూర్తిచేసిన తర్వాత అది ప్రయాణించే దూరం వృత్త పరిధికి సమానం.

$S = 2\pi r$

కానీ స్థానభ్రంశం శూన్యంగా ఉంటుంది.

$\therefore \vec{S} = 0$

- ఎందుకంటే ఈ సందర్భంలో వస్తువు తొలి, తుదిస్థానాలు ఒకదానితో మరొకటి ఏకీభవిస్తాయి.
- ఒకవేళ వస్తువు వృత్తాకార మార్గంలో అర్ధభ్రమణాన్ని పూర్తి చేసిన తర్వాత అది ప్రయాణించే దూరం $S = \pi r$, స్థానభ్రంశం $S = 2r$ వృత్త వ్యాసానికి సమానంగా ఉంటాయి.
- నిట్టనిలువుగా పైకి విసిరిన వస్తువు కొంత ఎత్తుకు వెళ్లి తిరిగి తన యథాస్థానానికి చేరుతుంది. అప్పుడు వస్తువు ప్రయాణించిన దూరం

$S = 2h$; కానీ $\vec{S} = 0$

- ఒక వస్తువు సరళ రేఖా మార్గంలో ప్రయాణిస్తే.. అది ప్రయాణించే దూరం, పొందిన స్థానభ్రంశం పరస్పరం సమానంగా ఉంటాయి.

$S = \vec{S}\ (or)\ \frac{S}{\vec{S}} = 1$

- ఒక వస్తువు క్రమరహిత మార్గంలో చలిస్తే అది ప్రయాణించిన దూరం, స్థానభ్రంశం కంటే ఎక్కువగా ఉంటుంది.

$S > \vec{S}$

గమనంలో ఉన్న వస్తువు వేగంలోని మార్పు రేటును త్వరణం అంటారు. వస్తువుల చలనాన్ని అధ్యయనం చేసి వాటిని వివరించడానికి 16వ శతాబ్దంలో న్యూటన్ మూడు నియమాలను ప్రతిపాదించారు. వీటిని న్యూటన్ గమన నియమాలు అంటారు. వస్తువుల స్థితిగతులను అధ్యయనం చేసే శాస్త్రాన్ని యాంత్రిక శాస్త్రం అంటారు. ఈ శాస్త్రానికి పితామహుడు అరిస్టాటిల్.

∴ ఒక వస్తువు ప్రయాణించిన దూరం పొందిన స్థానభ్రంశానికి సమానంగా లేదా ఎక్కువగా ఉంటుంది. అంతేకానీ వస్తువు ప్రయాణించిన దూరం స్థానభ్రంశం కంటే ఎట్టిపరిస్థితుల్లో తక్కువగా ఉండదు.

వడి: గమనంలో ఉన్న వస్తువు నిర్దేశిత కాలంలో ప్రయాణించిన దూరాన్ని వడి అంటారు. వడి(V) $= \frac{S}{t}$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్ లేదా మీ./సెకన్

వడి అనేది అదిశరాశి

వేగం: గమనంలో ఉన్న ఒక వస్తువు నిర్దేశిత కాలంలో పొందిన స్థానభ్రంశాన్ని వేగం అంటారు.

వేగం$(\vec{V}) = \frac{\vec{S}}{t}$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్ (లేదా) మీ./సెకన్

వేగం అనేది సదిశరాశి

త్వరణం: గమనంలో ఉన్న వస్తువు వేగంలోని మార్పు రేటును త్వరణం అంటారు.

$\bar{a} = \frac{V_2 - V_1}{t_2 - t_1}$

ప్రమాణాలు: సెం.మీ./ సెకన్^{2} (లేదా) మీ./సెకన్^{2}

త్వరణాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు

1. **ధన త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు పెరిగితే దాన్ని ధన త్వరణం అంటారు.
2. **రుణ త్వరణం:** గమనంలో ఉన్న వస్తువు వేగంలో మార్పు రేటు తగ్గితే దాన్ని రుణ త్వరణం అంటారు.

- ఒక వస్తువు విరామస్థితిలో ఉన్నప్పుడు

$(\vec{V} = 0)$ లేదా

సమాన వేగంతో కదులుతున్నప్పుడు



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

$(\vec{V_1} = \vec{V_2} = \vec{V_3} = ...)$

ఆ వస్తువు త్వరణం శూన్యం.

రేఖీయ ద్రవ్యవేగం: గమనంలో ఉన్న వస్తువు ద్రవ్యరాశి, వేగాల లబ్ధాన్ని రేఖీయ ద్రవ్యవేగం అంటారు.

$\vec{P} = M \times V$

ప్రమాణాలు : గ్రామ్.సెం.మీ/సెకన్. లేదా కిలోగ్రామ్. మీటర్/సెకన్

- రేఖీయ ద్రవ్యవేగం సదిశరాశి.

బలం: ఒక వస్తువు స్థితిని మార్చేది లేదా మార్చడానికి ప్రయత్నించేదాన్ని బలం అంటారు.

బలం $(F) = ma$

$m \rightarrow$ ద్రవ్యరాశి

$a \rightarrow$ త్వరణం

ప్రమాణాలు : డైన్, న్యూటన్ (ఇది అంతర్జాతీయ ప్రమాణం)

1 న్యూటన్ = 10^5 డైన్స్

- బలం గురించి న్యూటన్ అధ్యయనం చేసి దాన్ని రెండు రకాలుగా వర్గీకరించారు.

అంతర్గత బలం: ప్రతి వస్తువు లేదా వ్యవస్థ లోపల ఉన్న బలాలను అంతర్గత బలాలు అంటారు. ఈ బలం వల్ల వస్తువు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదని న్యూటన్ ప్రతిపాదించారు.

ఉదా : ఒక బస్సు లోపల ఉన్న ప్రయాణికులు తమ ఎదుటి సీట్లపై బలాలను ప్రయోగించినప్పుడు ఆ బస్సు స్థితిలో ఎలాంటి మార్పు ఉండదు.

బాహ్యబలం: ఒక వస్తువు మరో వస్తువుపై ప్రయోగించే బలాన్ని బాహ్యబలం అంటారు.

- ఈ బలం వల్ల వస్తువు స్థితిలో మార్పు రావచ్చు. లేదా మార్పు రావడానికి ప్రయత్నించవచ్చు.

న్యూటన్ గమన నియమాలు

వస్తువుల చలనాన్ని అధ్యయనం చేసి వాటిని వివరించడానికి 16వ శతాబ్దంలో న్యూటన్ మూడు నియమాలను ప్రతిపాదించారు. వీటిని న్యూటన్ గమన నియమాలు అంటారు.

మొదటి నియమం లేదా జడత్వ నియమం

- బాహ్యబలాన్ని ప్రయోగించనంత వరకూ విరామ స్థితిలో ఉన్న వస్తువు విరామ స్థితిలో, గమనంలో ఉన్న వస్తువు సమవేగంతో రుజు మార్గంలో కదులుతుంది.
- ప్రతి వస్తువుకు సహజసిద్ధంగా ఏర్పడే జడత్వం అనే ధర్మం ఉంటుందని మొదటి నియమం వల్ల తెలుస్తోంది. అందుకే ఈ నియమాన్ని జడత్వ నియమం అంటారు.

జడత్వం: ఒక వస్తువు తనంతట తానుగా తన స్థితిని మార్చుకోలేని అశక్తతను లేదా ధర్మాన్ని జడత్వం అంటారు. ఈ ధర్మం వస్తువుల ద్రవ్యరాశిపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి ద్రవ్యరాశి పెరిగితే జడత్వం కూడా పెరుగుతుంది.

ప్రమాణాలు : గ్రామ్ లేదా కిలోగ్రామ్

జడత్వాన్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **విరామ జడత్వం:** విరామస్థితిలో ఉన్న ఒక వస్తువు తనంతట తానుగా తన విరామ స్థితిని మార్చుకోలేని అశక్తతను విరామ జడత్వం అంటారు.
2. **గమన జడత్వం:** గమనంలో ఉన్న వస్తువు తనంతట తానుగా తన గమన స్థితిని మార్చుకోలేని అశక్తతను గమన జడత్వం అంటారు.

ఉదా : గమనంలో ఉన్న బస్సుకు అకస్మాత్తుగా బ్రేకులువేసి ఆపినప్పుడు దానిలోపల ఉన్న ప్రయాణికులు గమన జడత్వం వల్ల ముందుకు తూలుతారు.

3. **దిశా జడత్వం:** ఒక వస్తువు తనంతట తానుగా తన దిశను మార్చుకోలేని అశక్తతను దిశా జడత్వం అంటారు.

ఉదా॥ రుజుమార్గంలో ప్రయాణిస్తున్న బస్సు మలుపు తిరుగుతున్నప్పుడు అందులోని ప్రయాణికులు జడత్వం వల్ల పక్కకు తూలుతారు.

న్యూటన్ రెండో గమన నియమం

ఒక వస్తువుపై ప్రయోగించిన బలాన్ని లెక్కించడానికి కావలసిన సమీకరణాన్ని న్యూటన్ రెండో నియమం నుంచి పొందవచ్చు.

బలానికి సమీకరణం $F = ma$

- ఒక వస్తువు విరామ స్థితిలో ఉన్నప్పుడు లేదా సమవేగంతో కదులుతున్నప్పుడు దాని త్వరణం శూన్యం. కాబట్టి ఆ వస్తువుపై ఉన్న బలం

$F = ma = m \times 0 = 0\ (a = 0)$

న్యూటన్ మూడో గమన నియమం

చర్యకు సమానమైన వ్యతిరేక ప్రతిచర్య ఉంటుంది. చర్య= – ప్రతిచర్య

చర్య+ ప్రతిచర్య = 0

- ఈ నియమం ప్రకారం చర్య, ప్రతిచర్య అనేవి పరస్పరం సమానంగా ఉండి, వ్యతిరేక దిశలో ఎల్లప్పుడూ జంటగా ఉంటాయి.

ఉదా: రబ్బర్ బంతిని గోడకు విసిరితే, అది గోడపై కలుగజేసే బలాన్ని చర్య అంటారు. ప్రతిచర్యగా గోడ కూడా అంతే బలాన్ని బంతివైపు వ్యతిరేక దిశలో ప్రయోగిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. న్యూటన్ ఎన్నో గమన నియమాన్ని జడత్వ నియమం అంటారు?
   ఎ) మొదటి బి) రెండో
   సి) మూడో డి) పైవన్నీ
2. బైకు, కారు, బస్సుల్లో దేనికి జడత్వ ఎక్కువ?
   ఎ) బైకు బి) కారు
   సి) బస్సు డి) పైవన్నీ
3. గమనంలో ఉన్న వస్తువుకు ఏ భౌతిక రాశి ఉంటుంది?
   ఎ) వేగం
   బి) రేఖీయ ద్రవ్యవేగం
   సి) గతిజ శక్తి
   డి) పైవన్నీ
4. బాంబు విస్ఫోటం, తుపాకీ పని చేయడంలో ఏ నిత్యత్వనియమం ఇమిడి ఉంది?
   ఎ) న్యూటన్ మూడో గమన నియమం
   బి) రేఖీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
   సి) ద్రవ్యరాశి నిత్యత్వ నియమం
   డి) కోణీయ ద్రవ్యవేగ నిత్యత్వ నియమం
5. జడత్వం ప్రమాణం?
   ఎ) గ్రామ్ బి) కిలోగ్రామ్
   సి) పౌండ్ డి) పైవన్నీ
6. అంతర్గత బలం వల్ల గమనంలో ఉన్న వస్తువు వేగం?
   ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
   సి) మారదు
   డి) రెండింతలు అవుతుంది
7. ఏ ప్రక్షిప్త కోణం వద్ద ప్రక్షేపకం గరిష్ట వ్యాప్తిని పొందుతుంది?
   ఎ) 30° బి) 45°
   సి) 90° డి) 120°
8. 'బలం' అంతర్జాతీయ ప్రమాణం?
   ఎ) న్యూటన్ బి) డైన్
   సి) కి.గ్రా., మీ/సె^{2}
   డి) గ్రా., సెం.మీ/సె^{2}
9. కింది వాటిలో అత్యంత గరిష్ట బలం?
   ఎ) అయస్కాంత బలం
   బి) ఘర్షణ బలం
   సి) గురుత్వాకర్షణ బలం
   డి) కేంద్రక బలం
10. ఎక్కువ ప్రాధాన్యం ఉన్న న్యూటన్ గమన నియమం?
    ఎ) మొదటి బి) రెండో
    సి) మూడో డి) పైవన్నీ
11. ప్రక్షేపకం ఏ మార్గంలో ప్రయాణిస్తుంది?
    ఎ) రుజు బి) వృత్తాకార
    సి) పరావలయ డి) దీర్ఘవృత్తాకార
12. న్యూటన్ మూడో గమన నియమం ఆధారంగా పనిచేసేది?
    ఎ) రాకెట్
    బి) క్షిపణి
    సి) యుద్ధ విమానం డి) పైవన్నీ
13. ఒక వస్తువుపై ఎక్కువ బలాన్ని అధిక కాలవ్యవధిలో ప్రయోగిస్తే దానిపై ప్రచోదన ప్రభావం?
    ఎ) పెరుగుతుంది బి) తగ్గుతుంది
    సి) శూన్యం డి) అనంతం
14. లిఫ్ట్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    ఎ) న్యూటన్
    బి) రూథర్‌ఫర్డ్
    సి) పాస్కల్
    డి) ఓటిస్
15. పైకి కదులుతున్న లిఫ్ట్‌లోని వ్యక్తి చర్య, ప్రతిచర్యలు అనేవి?
    ఎ) సమానం
    బి) చర్య ఎక్కువ
    సి) ప్రతిచర్య ఎక్కువ
    డి) ప్రతిచర్య శూన్యం

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) బి; 5) డి; 6) సి; 7) బి; 8) ఎ; 9) డి; 10) బి; 11) సి; 12) డి; 13) బి; 14) డి; 15) సి.

Education is a strong instrument..

BANK EXAMS

GENERAL ENGLISH

MODEL QUESTIONS

Directions (Q. 1- 5): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

A flash of lightning and deafening crash of thunder are enough to make a child scream and a dog **scoot** under the bed, his tail between his legs. Some adults are also frightened, particularly those who have had a close call with nature's fireworks. The child who is frightened by thunder and lightning needs comfort rather than ridicule. The majority of them are calmed by a story or song. Older tots are helped by watching and discussing the flashes and roars provided the parents show no evidence of alarm. The experiments of Benjamin Franklin 200 years ago helped dispel superstitions and primitive ideas about this natural phenomenon. If a church instead of a nearby gambling joint is struck by lightning, the people no longer are amazed that a good rather than a bad place should bear the brunt. They realize the church was struck because its steeple is the highest point in the vicinity. Lightning represents a discharge of atmospheric electricity from one cloud to another or from a cloud to the earth. The best targets here below are projections of some height. This makes the church spire more **vulnerable** than a low building protected by a grove of trees. On the other hand a single tree, shack, fence pole or human being becomes the best target on a prairie, more so when representing the only inlet for a bolt of lightning with in the radius of miles. Stay indoors during a thunderstorm but if caught outside, choose a safe shelter, preferably a large metal building or a dwelling protected against lightning.

1. What should you do during a lightning storm?
   1) play golf and other outdoor games
   2) watch television and engage yourself
   3) if outside choose a safe shelter
   4) stay in water
   5) stay on a hilltop
2. How should you react to a child's fright over lightning?
   1) give strict warning to them
   2) try to shout at them and control the things
   3) try to hide in a secret place
   4) ridicule them
   5) calm them by telling a story
3. What kind of structures does lightning generally strike?
   1) projections of some height
   2) nature's fireworks
   3) gambling joint
   4) a low building protected by a grove of trees
   5) indoors
4. The meaning of **scoot** is
   1) crawl 2) creep
   3) poke 4) hurry 5) haze
5. The synonym of **vulnerable** is
   1) Inclination 2) week
   3) experience 4) susceptible
   5) averse

Directions (Q. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. Earlier homemade rafts dumped their waste into the water _____, but by June the _____ rafts were mostly gone, banned under a new state law.
   1) untreated, unsightly
   2) artfully, dismal 3) openly, few
   4) flagrantly, petty 5) hazy, cloudy
7. We live in a _____ age; everyone thinks that maximizing _____ is the point of life.
   1) ubiquitous, enjoyment
   2) propitious, delight
   3) sporadic, bliss
   4) hedonistic, pleasure
   5) omniscient, plain
8. The___of the Minister's statement cannot be verified by people who have no _____ to official records.
   1) veracity, access
   2) verbosity, entre
   3) ambiguity, admission
   4) validity, contact
   5) opulence, grandeur
9. Catching the earlier train will give us the _____ to do some shopping.
   1) chance 2) luck
   3) possibility 4) occasion
   5) probable
10. David finally found the photographs, after hours spent _____ through drawers.
    1) cavorting
    2) haggling
    3) rummaging
    4) divagating
    5) cajoling

Directions: (Q. 11 - 15): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. The problems of translation <u>are still remain.</u>
    1) are remain 2) will remained
    3) will still remain
    4) are remaining
    5) No Correction required
12. It is ten years since I <u>have begun</u> living here.
    1) begun 2) had begun
    3) began 4) beginning
    5) No Correction required
13. Education is a <u>strong</u> instrument for moldings the character of the young.
    1) striking 2) powerful
    3) potent 4) proven
    5) No Correction required
14. He <u>gave</u> the I.A.S. examination in all seriousness.
    1) appeared 2) took
    3) undertook 4) prepared
    5) No Correction required
15. He has cooked that meal so often he can do it with his <u>eyes closed.</u>
    1) mind blank 2) eyes covered
    3) hands full 4) hands tied
    5) No Correction required

Directions (Q. 16-25): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

16. His interest (1)/ in the study of human behavior (2)/ is indeed (3)/ very large. (4)/ No error (5)
17. The improvement made by changes (1)/ in the system (2)/ was marginal (3)/ and did not warrant the large expenses. (4)/ No error (5)
18. For a few seconds, (1)/ he was totality blinded (2)/ by the powerful lights (3)/ of the oncoming car. (4)/ No error (5)
19. The man who is persistently hesitating (1)/ which of the two things (2)/ he will do first, (3)/ will do either. (4)/ No error (5)
20. The Manager (1)/ gave her his assurance (2)/ that the complaint (3)/ would be discharged. (4)/ No error (5)
21. Everyone felt (1) / that the big (2)/ glittering diamond (3) / was most unique. (4) / No error (5)
22. From all accounts (1) / I learn that (2) / he is the best and honest member (3) / of the new committee. (4) / No error (5)
23. A man entered the tavern (1) / and asked for (2)/ some bread and cheese (3) / with a decided foreign accent. (4) / No error (5)
24. A large scale exchange of nuclear weapons (1) / will produce (2)/ unprecedented amounts of radiation (3) / that can penetrate into the biological tissue. (4) / No error (5)
25. Several prominent figures (1) / involved in the scandal (2) / are required to appear (3) / to the investigation committee. (4) / No error (5)

Directions (Q. 26-30): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The meeting, the first such gathering in Iraq since the overthrow of Saddam Hussein four years ago, was intended to shore up support for the Iraq government.
B) The next one came six hours later.
C) Delegates from neighboring countries and elsewhere did not set a date for a second, higher-level gathering of foreign ministers and agreed only to establish working groups to focus on various issues.
D) When Iraq's chief delegate stood on a podium and ripped into US policy in Iraq
E) Clobbering hopes that the summit would prove an ice-breaker in the two countries chilly relations
F) On that front, it appeared to have been cordial but far from a resounding success.

26. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
27. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
28. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
29. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
30. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 31 - 40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A piece of writing, we have decided, _____ (31) from true forms of visual art in that you cannot respond to the effect of the _____ (32) in a single glance. In reading, the "viewer" has to work at and understanding, for a page of print, _____ (33) at first apprehended by the eye, is fundamentally grasped by the mind _____ (34) the powers of interpretation, reasoning and analysis. But just as your vision can be educated so that _____ (35) respond more intelligently to a work of art, so your powers of interpretation, reasoning and analysis can be _____ (36) so that you respond more efficiently and _____ (37) rapidly to what a writer offers you on a page of print. This process _____ (38) refinement started years ago - when you first learned to read at the age of six or seven. It _____ (39) through elementary and high school and into your late adolescence. And then, possibly, it stopped, though there was _____ (40) much room for improvement.

31. 1) differs 2) vary 3) fluctuate 4) change 5) altered
32. 1) entire 2) whole 3) complete 4) total 5) intact
33. 1) while 2) how ever 3) though 4) still 5) despite
34. 1) during 2) from first 3) though 4) through 5) thorough
35. 1) you are 2) your' s 3) you are 4) your 5) you

Key:

1) 3	2) 5	3) 1	4) 4	5) 4
6) 1	7) 4	8) 1	9) 1	10) 3
11) 3	12) 3	13) 2	14) 2	15) 5
16) 4	17) 5	18) 2	19) 4	20) 4
21) 4	22) 3	23) 2	24) 4	25) 4
26) 4	27) 5	28) 5	29) 1	30) 1
31) 1	32) 2	33) 3	34) 4	35) 5